

నా మనసుకు నచ్చిన
పట్టువస్త్రాల నిలయం
కంచి, ధర్మవరం, ఆరణి,
బనారస్, కొత్తకోట, గద్వాల్,
నారాయణపేట, సేలం,
బెంగుళూరు, పోచంపల్లి,
మైసూరు, వెంకటగిరి
వారి పట్టువస్త్రాలు
మరియు ప్రఖ్యాత మిల్లుల
నాణ్యమైన సరిక్రొత్త రకాలకు నిలయం
శ్రీ కనక
మహాలక్ష్మి సిల్క్స్
జగదాంబ సెంటర్, విశాఖపట్నం.
Creative Circle

న్యూఢిల్లీ లేఖ

డా. జయ్ దుబాషి



ఆఫ్ఘన్ ప్రజలారా! ముందుకు సాగండి!

భారతీయ వామపక్ష వాదులు చాలా తరుచుగా రాజుకన్న ఎక్కువ రాజభక్తిని ప్రదర్శిస్తుంటారు. అఫ్ఘనిస్తాన్ నుంచి రష్యన్ సైన్యాల ఉపసంహరణను · యావత్ ప్రపంచం ఆహ్వానిస్తుండగా మన వామపక్ష మిత్రులు మాత్రం భిన్నంగా ఉన్నారు. అఫ్ఘనిస్తాన్‌కు కొత్తగా అమెరికానుంచి ప్రమాదం ఉన్నదని వ్యాసం తర్వాత వ్యాసం రాస్తున్నారు. సోవియట్ యూనియన్ గనుక అఫ్ఘన్ ప్రభుత్వానికి సహాయాన్ని కొనసాగిస్తే తాను ముజాహిదీన్‌లకు ఆయుధాలు సరఫరా చేస్తానని అధ్యక్షుడు రీగన్ చేసిన సరైన బెదరింపును వీళ్ళు చూపుతున్నారు.

ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ఇటువంటి రచయిత ఇలా రాశారు: రెండు రకాల సహాయాల మధ్య ఆయన (అధ్యక్షుడు రీగన్) ఒక తప్పుడు సమానత్వాన్ని నిర్మింపజూస్తున్నారు. ఏ ఒప్పందాన్నీ ఉల్లంఘించనిదీ సోవియట్, అఫ్ఘన్ ప్రభుత్వాల మధ్య అర్ధ శతాబ్దపు ఒప్పందాల ఫలితంగా రూపొందినదీ అయిన సహాయం ఒకటీ, ఐక్యరాజ్య సమితి అధికారం కింద రూపొందిన జెనీవా ఒడంబడికలను స్పష్టంగా ఉల్లంఘించి, వాటిని చిత్తు కాగితంగా మార్చేదీ అయిన ముజాహిదీన్‌లకు అమెరికన్ సాయం ఒకటీ కాగా ఆయన ఈ రెంటి మధ్య భేదాన్ని విస్మరిస్తున్నారు".

అంటే ఇప్పుడు మనకు అసలు సంగతి తెలిసింది. రష్యన్ సైన్యాలు అఫ్ఘనిస్తాన్‌ను దురాక్రమించినదీ, పది లక్షల మంది అఫ్ఘన్‌లను ఊచకోత కోసినదీ, యాభై లక్షలమందిని కాందిశీకులుగా మార్చినదీ అర్ధ శతాబ్దపు ఒప్పందాల కిందనే అన్నమాట. ఇప్పుడు, తొమ్మిది సంవత్సరాల తర్వాత వారి హృదయాల్లో మంచితనం రేకెత్తి దేశాన్ని కె. జి. బి. మనిషి నజీబుల్లా చేతుల్లో పెట్టి వెళ్ళిపోతున్నారన్న మాట. ఈ వ్యాసం మొత్తం ధోరణి ఏమంటే, సోవియట్ సైన్యాల ఉపసంహరణ ఈ ప్రాంతంలో చాలా అస్థిరతకు దారితీస్తుంది గనుక ఈ ఉపసంహరణ కార్యక్రమాన్ని గందరగోళం చెయ్యడానికి, ఆపడానికి ఎవరూ ప్రయత్నించగూడదు. ఈ రచయిత పేరు పొందిన సీనియర్ పాత్రికేయుడు. ఒక జాతీయ వార్తాపత్రికకు సంపాదకుడుగా ఉండేవాడు.

ఆహ్వానం మీద తాము అఫ్ఘనిస్తాన్‌లోకి వెళ్ళామని రష్యన్ సైన్యాలు చెపుతున్నాయో ఆ ప్రభుత్వం ఒక తప్పుడు ప్రభుత్వం. అది నిజంగానే "సహాయం" కోసం అడిగిందని ఒప్పుకున్నప్పటికీ, అలా అడగవలసిన అవసరం · ఏమీలేదు. కాబూల్‌లోని సాధికార ప్రభుత్వాన్ని కె. జి. బి. మనుషులు కూలదోశారు. తర్వాత సాంప్రదాయక కమ్యూనిస్టు, ఫాసిస్టు పద్ధతిలో సహాయాన్ని అర్థించారు. ప్రస్తుతం అఫ్ఘనిస్తాన్‌లో ప్రభుత్వం అనేదిలేదు. ఎందుకంటే నజీబుల్లా ఎవరికీ

రష్యన్‌లు అఫ్ఘనిస్తాన్‌లో ఉండటనే బాగుండునన్నట్టు, వెళ్ళిపోవడం పట్ల విచారిస్తున్నట్టు ఆయన రాశాడు.


అఫ్ఘనిస్తాన్ విషాదంలో రష్యన్లు నేరస్తులు కారనుకుంటే కనీసం తప్పు చేసిన వాళ్ళని అయినా అనుకోవాలి. ఎందుకంటే · వాళ్ళు అఫ్ఘనిస్తాన్‌లో ఉండవలసిన అవసరమే లేదు. సరిగ్గా వియత్నాంలో అమెరికన్‌లుఉండవలసిన అవసరం ఎలా లేదో ఇదీ అంతే. 50 సంవత్సరాల పాత ఒప్పందం గురించినప్రస్తావన ఒక తప్పుడు ప్రస్తావన. ఎందుకంటే ఏ ప్రభుత్వ

ప్రాతినిధ్యం వహించడు. ఆయన క్రెమ్లిన్‌లోని తన అధిపతులకు మాత్రమే ప్రతినిధి. ఏదో ఒక రోజున తప్పనిసరిగా ఆయనను, ఆయన పూర్వీకులందరిలాగే సమీపంలోని గోడ దగ్గరికి తీసుకువెళ్ళి కాల్చి చంపుతారు. ఇటువంటి మనుషులను క్రెమ్లిన్ ఎప్పటికప్పుడు తన దుర్మార్గాలు కొనసాగించడానికి వాడుకుని సృష్టికర్త దగ్గరికి బట్వాడా చేసేస్తుంది. నజీబుల్లా గనుక అఫ్ఘనిస్తాన్ అధ్యక్షుడయినట్టయితే, నేను చైనా చక్రవర్తినని చెప్పుకోవచ్చు.


జెనీవా ఒప్పందం అది రాసిన కాగితమంత విలువైంది కూడా కాదు. ఎందుకంటే ఆ ఒప్పందానికి దారి తీసిన చర్చలలో అఫ్ఘన్ ప్రజానీకంలోని అత్యధికులు పాల్గొనలేదు. నేనే గనుక అఫ్ఘన్‌నైనట్టయితే ఆ ఒప్పందాన్ని నేను ఎంత మాత్రం గుర్తించను. నేను ఇంతకు ముందే చెప్పినట్టు పది లక్షల మంది అఫ్ఘన్‌లు ప్రాణాలు కోల్పోయారు. 40 లక్షలకు పైగా పాకిస్తాన్‌లో, వేరే చోట్ల కాందిశీకులుగా బతుకుతున్నారు. కాబూల్‌లో మోగుతున్న తుపాకుల శబ్దాన్ని బట్టి చూస్తే, ద్రోహుల్ని ఎక్కడబడితే అక్కడ ఉరితీస్తే పదిమంది అఫ్ఘన్‌లలో తొమ్మిదిమంది సంతోషిస్తారనుకుంటాను. అఫ్ఘనిస్తాన్ జనాభా దాదాపు కోటిన్నర నుంచి రెండు కోట్లకు మించదు. ఖచ్చితమైన జనసంఖ్య ఎవరికీ తెలియదు. మూడో వంతు జనాభానో, పావు జనాభానో దేశం వదిలిపోతే,

(74 వ పేజీ చూడండి)


ఇవిగో వరిసాగులోని మెళుకువలు అందుకో అధిక దిగుబడులు



దమ్ముచేసి చదును చేసిన పొలం



పైపై నాట్లు - పిలకలుమెండు



చిక్కని నాట్లు - చక్కని దిగుబడులు




పొలంలో కలుపు పైరుకు చేటు

వరి నాట్లు ఆలస్యమైతే దిగుబడులు బాగా తగ్గిపోతాయి. సాధ్యమయినంత త్వరగానే నాట్లను పూర్తి చేయండి.

- పొలాన్ని బాగా దమ్ముచేసి చదును చేయండి.
- దమ్ములో భూసార పరీక్షా ఫలితాలను బట్టి లేదా వ్యవసాయశాఖ వారు సిఫార్సు చేసిన నత్రజనిలో మూడవ భాగం. మొత్తం భాస్వరం. పొటాష్‌లను వేయండి.
- జింక్ లోపం వున్న భూములలో ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేయండి. ఇది మూడు పంటల వరకు సరిపోతుంది.
- పొలంలో నాట్లు మొదలు పిలకలు వచ్చి దుబ్బు చేసే వరకు 5 సెంటి మీటర్ల లోతు మించకుండా నీరు వుండేటట్లు చూడండి.
- 21 నుంచి 25 రోజుల వయస్సు (4-6 ఆకులు తొడిగిన) నారు మొక్కలనే నాటండి.
- పైపై నాట్లు-పిలకలు మెండు. 2-3 సెంటి మీటర్ల లోతు మించకుండా నాటండి.
- నాట్లు చిక్కగా వేయండి. అంటే చదరపు మీటరు విస్తీర్ణంలో కనీసం 40 నుంచి 50 వెన్ను వేసే పిలకలు వుండాలి.
- కుదురుకు 1-2 మొక్కలనే నాటండి.
- పొలంలో కలుపు మొక్కలు లేకుండా చూడండి. నాట్లువేసిన మూడు వారాలలోగా ఒకసారి తప్పకుండా కలుపు తీయండి.
- తరచుగా పొలంలో దిగి చీడలు. తెగుళ్ళ తాకిడి లేకుండా జాగ్రత్త వహించండి. ఏవైనా సూచనలు కన్పిస్తే సత్వర సస్యరక్షణ చర్యలు తీసుకోండి.

నాగార్జున యూరియ



NFCL

నాగార్జున ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్

నాగార్జున హిల్స్ హైదరాబాదు – 500 482.

పైరుకు పసిమి-రైతుకు కలిమి

Imageads/NFCL 8388/28

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :

దేశోద్ధారక కాశీనాథుని

నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు : (1938-1972)

26.8.88; 2.9.88

శ్రీ విభవ నామ సం. శ్రావణ శు. చతుర్దశి; బ. సప్తమి

సంపుటము 81 : సంచికలు 1; 2

ముఖ్య సంపాదకుడు :

శివలెంక రాధాకృష్ణ

కార్యవాహక (యాక్టింగ్) సంపాదకుడు :

మతుకుమల్లి మాధవరావు

విడి ప్రతి వెల	రు. 3.00
పోస్టులో 6 నెలల చందా	రు. 87.10
పోస్టులో 12 నెలల చందా	రు. 174.20

ఆంధ్రపత్రిక కార్యాలయము,

గాంధీనగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

ముఖచిత్రం :

విఘ్నేశ్వరుడు

(బాతిక్ చిత్రం : వై. బాలయ్య)

కథలు :

సీరియల్ నవలలు:

వ్యాసాలు, శీర్షికలు :

మనతో మాట

మా పాఠకులు, రచయితలు, రచయిత్రులు, ఏజెంట్లు, ప్రకటన కర్తలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు.

ఈ వినాయక చవితికి ఆంధ్ర సచిత్ర వారపత్రిక ఎనభై ఏళ్ళు పూర్తి చేసుకుని ఎనభై ఒకటవ సంవత్సరంలో అడుగు పెడుతున్నది. ఆ సందర్భంగా ఈ సంచికని మరిన్ని ఎక్కువ పేజీలతో, మరింత ఆకర్షణీయంగా రూపొందించాలని అనుకున్నాము. కానీ తీవ్రమైన న్యూస్ ప్రింట్ సమస్య, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహా కొందరు ప్రకటన కర్తలు తాము చెల్లించ వలసిన బకాయిలని సక్రమంగా, సకాలంలో చెల్లించక పోవటం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక ప్రత్యేక చట్టం ద్వారా ప్రభుత్వ భవనాల లీజ్‌ని రద్దు చేసిన కారణంగా ఆంధ్రపత్రిక హైదరాబాద్ ఎడిషన్ ఉన్న భవనాన్ని కొన్ని సంవత్సరాల ముందుగానే ఖాళీ చేసి, వేరొక భవనంలోకి దానిని మార్చ వలసి రావటం వల్ల ఎదురు చూడని అనేక ఇబ్బందులని ఎదుర్కోవలసి వచ్చింది, ఎన్నో వ్యయ ప్రయాసలకి లోను కావటం జరిగింది. వీటన్నిటి వల్లా పరిస్థితి అస్తవ్యస్తమైన కారణంగా ఈ సంచికని అనుకున్న రీతిలో తీర్చి దిద్దటం సాధ్యం కాలేదు.

అయినప్పటికీ వీలున్నంతలోనే ఈ వినాయక చవితి సంచికని ఆకర్షణీయంగా రూపొందించి సకాలంలో పాఠకులకి అందించే ప్రయత్నం చేసాము. మహిళా పాఠకులకి ఆకర్షణీయంగా ఉపయోగకరంగా ఉండే 'సౌందర్య దీపం' శీర్షికని ఈ సంచికలో ప్రారంభిస్తున్నాము. ప్రఖ్యాత రచయిత శ్రీ చల్లా సుబ్రహ్మణ్యం గారి సతీమణి, ప్రముఖ బ్యూటీషియన్ శ్రీమతి చల్లా ఝాన్సీరాణి గారు ఈ శీర్షికని నిర్వహిస్తున్నారు. సుప్రసిద్ధ హాస్య నటీనటులు శ్రీలక్ష్మి, బ్రహ్మానందం గార్లు చెప్పిన జోకులు పాఠకులని కడుపుబ్బ నవ్విస్తాయి.

'పవిత్ర పాపి' సీరియల్ పాఠకుల కోసం నిర్వహిస్తున్న కొత్త శీర్షిక 'నాకు తెలిసిన నేరం' పై వారం సంచికలో ప్రారంభం అవుతుంది.

ఇంతకుముందు పేర్కొన్న ఇబ్బందుల వల్ల గత కొంత కాలంగా ఆంధ్ర సచిత్ర వార పత్రిక విడుదలలో ఆలస్యం జరుగుతున్నా ఎప్పటి మాదిరి గానే తమ ఆదరాభిమానాలని, సహాయ సహకారాలని అందిస్తున్న మా పాఠకులకు, ఏజెంట్లకు, ప్రకటన కర్తలకు మా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాము. అతి త్వరలోనే ఆంధ్ర సచిత్ర వారపత్రిక సకాలంలో వెలువడగలదని, అందుకు తగిన ప్రయత్నాలు జరుగుతున్నాయని మనవి చేసుకుంటున్నాము.

ఉత్తరాలు

సీరియల్స్

నటి రజని ముఖచిత్రం ముగ్ధమనోహరంగా వుంది. హిందీ టి. వి. సీరియల్ అయిన "తమస్"ను తెలుగులో అందిస్తున్నందుకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు. – పి. రాము. టి. కామేష్, గుంటూరు

★ ★ ★

నటి రజని ముఖచిత్రం ఎంతగానో ఆకర్షించినది. దేశం అంతటా సంచలనాన్ని సృష్టించిన "తమస్" సీరియల్ సూపర్బ్. మొదటిలోనే పాఠకులను ఆకర్షించి ఇక ముందు ముందు ఇంకెంతో ఆకర్షించే "తమస్" అందిస్తున్న డా. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ గారికి నా అభినందనలు.

– యస్. నతీమ్, తస్లీమ్, వహీద్, కదిరి

★ ★ ★

మా అభిమాన రచయిత మల్లాది వెంకట కృష్ణమూర్తి గారి కలం నుండి వెలువడుతున్న "వినాయకరావు పెళ్ళి" వారం వారం మమ్మల్ని నవ్వులతో ముంచెత్తుతున్నది.

– పి. సరోజినీ రాయుడు, యర్రగుంటపల్లి

★ ★ ★

చల్లా సుబ్రహ్మణ్యం గారి సీరియల్ "పవిత్ర పాపి" సూపర్ హిట్ సీరియల్. ఈ సీరియల్ సినిమాగా నిర్మిస్తే సూపర్ బాక్సాఫీస్ హిట్ అవుతుంది. రాకా పాత్రలో "యువరత్న నందమూరి బాలకృష్ణ", దేదీప్యగా రాధ, సీతాదేవిగా ఊర్వశి శారద, డి. జి. పి. కల్యాణ్‌రాంగా రంగనాథ్ ఆయా పాత్రలలో జీవిస్తారు. రచయిత చల్లా సుబ్రహ్మణ్యం గారికి మా ధన్యవాదాలు.

– టి. వెంకట రమణ, కరుణ, కల్పన, కాగజ్‌నగర్


కథలు

ఈసారి పత్రికలో కథలన్నీ చాల బాగున్నాయి. ముఖ్యంగా "కె. తాయారమ్మ" గారు రాసిన "మాష్టారు చచ్చి పోవాలి" కథ ఎంతో బాగుంది. కానీ, ఆఖరున మాష్టారు "బాబు చక్రధారి వెంకూను తీసుకెళ్ళు" అన్న మాటలు వెక్కిరింపుగా అనిపించాయి. "ఆలోచించు" కథ ఇల్లాళ్ళు పడే పాట్లు గూర్చి, భర్త, పిల్లలు అనే మాటలు చాల సహజంగా వర్ణించారు. అలాగే "సారీ నేస్తం" కథ చాల చాల బాగుంది. – పి. కీర్తన, రాజమండ్రి

సర్వసిద్ధి ప్రదాయకుడు వినాయకుడు



సిద్ధి గణపతి
(చిత్రం : వి. పూర్ణానందశర్మ)



ఓం గణాధిపాయనమః
(ఫొటో : కొలపల్లి ఈశ్వరరావు)

భాద్రపద శుక్ల చతుర్థి రోజున వినాయకుణ్ని పూజించడం చాలా ప్రాచీన కాలం నించీ వస్తున్న సంప్రదాయం. గణాలకు అధిపతిగా ఆరోజున వినాయకుడు నియమింప బడ్డాడు. సమస్త మయిన విఘ్నాలకు, చదువులకు, ప్రమథగణాలకు ఆయన అధిదేవుడు. గణపతి శ్వేతాంబరధారి. సర్వ వ్యాపకుడు, శ్వేతశరీరుడు. చతుర్భుజుడు. భక్తుల యెడ ప్రసన్నుడు.

మొట్టమొదట గణపతిని పూజించకుండా ఎవరూ ఏపనినీ మొదలు పెట్టరు. మధ్యాహ్నం వరకు చవితి ఉన్న రోజున గణపతి పూజ ప్రశస్తమయింది. బ్రహ్మ వైవర్త పురాణంలో "గ" అంటే విజ్ఞానము. "ణ" అంటే మోక్షము అని అర్థం చెప్పబడి ఉంది. అందుచేత జ్ఞానానికి మార్గాన్ని చూపేవాడు శ్రీ మహాగణపతి అని దీనివల్ల తెలుస్తోంది. ప్రమథగణాలకు అధిపతి గణపతి. సాక్షాత్తూ పరదైవతం లాగా దేవతలచేత, మానవుల చేత గజాననుడు పూజలు అందుకుంటున్నాడు.

మృణ్మయ మయిన వినాయకుని విగ్రహాన్ని పూజించాలని ధర్మసింధులో చెప్పబడింది. ఆ మూర్తికి షోడశోపచారాలతో ఉండ్రాళ్లను మాత్రమే నైవేద్యంగా పెట్టాలి. 21 రకాలయిన పత్రులను జంటగా ఆకులు ఉండేలాగా (దళం) తీసుకుని "గణాధిపాయ, ఉమాపుత్రాయ, అఘనాశనాయ, వినాయకాయ, ఈశపుత్రాయ, సర్వసిద్ధి ప్రదాయ, ఏకదంతాయ, ఏక వక్త్రాయ మూషక వాహనాయ, కుమార గురవే" అనే వినాయకుని ప్రసిద్ధమయిన దశనామాలతో పూజించాలి. పది ఉండ్రాళ్లను, ఇష్టులకు ప్రసాదంగా పంచిపెట్టి ఒక పది ఉండ్రాళ్లను ప్రసాదంగా స్వీకరించాలి.

భాద్ర పద శుద్ధ చవితిరోజున చంద్రుని చూచిన వారికి నీలాపనిందలు కలిగి కష్టాల పాలవుతారు. ఆ దోషం పోవడానికి.

శ్లో :-సింహః ప్రసేన మవధీత్
సింహోజాంబవతాహతః!
సుకుమారక మారోదీః
తవహ్యేష స్యమంత కః!!

అనే శ్లోకాన్ని యధాశక్తి పఠించడం మంచిదని పురాణోక్తి. సర్వశక్తి మంతుడు సర్వస్వతంత్రుడు అయిన గణపతి ఆరాధన జనాళికి మహత్తర మయిన ఫలితాలను అందిస్తుంది.

వినాయక చవితి పండుగ పిన్నలకి పెద్దలకి ఎంతో సందడి కలిగించే పండుగ. చవితిరోజున వినాయక పూజనంతో పాటు సరస్వతీ దేవిని కూడా పూజిస్తారు. విద్యార్థులందరూ ఎంతో భక్తి శ్రద్ధలతో వినాయకుని దగ్గర తమ పుస్తకాలను ఉంచి—

"గజాననం భూతగణాధిసేవితమ్!
కపిత్థ జంబూ ఫల సార భక్షణమ్!!
ఉమాసుతం లోక వినాశ వారకమ్!
నమామి తం భూత గణాధి నాయకమ్!!

అని స్తుతిస్తారు.


మృద్వికార మయిన గణపతి మూర్తిని పూజానంతరం కొందరు రైతులు తమ తమ గాదెల్లోనూ, పొలాలలోనూ ఉంచుకుంటారు. సర్వ వ్యాపకుడు గజాననుడు, అందువలన సస్యాధి దేవతగా కూడా భావించవచ్చు.

ఉత్తమ మయిన ఫలితాలను పొందడానికి ఉత్తముణ్నే ఆశ్రయించాలి. శ్రీ మహాగణపతి ఉత్తమోత్తముడు.

—ఐలూరి నాగభూషణమ్

మూషిక వాహనుడు
చిత్రం: జె. లక్ష్మీకుమారి





సీరియల్

వినాయకరావు పెళ్లి

మల్లాది వెంకటకృష్ణమూర్తి

జరిగిన కథ– 17: వినాయకరావు, శాస్త్రి పథకం ప్రకారం ఒక నకిలీ డాక్టరు ద్వారా కామేశ్వరరావుకి ఎయిడ్స్ ఉందేమోననే అనుమానాన్ని రమణమూర్తి మనసులో నాటుతారు. కనక మహాలక్ష్మి, ఆదిలక్ష్మి ఇచ్చిన కాఫీ, ఫలహారాల వల్ల కామేశానికి వాంతులు విరేచనాలయితే రమణమూర్తి అనుమానం బలపడుతుంది. ఆదిలక్ష్మి నాదకర్ణి మనసులో కూడ అనుమానాన్ని ప్రవేశ పెట్టి మొత్తానికి పెళ్ళి ప్రసక్తే రాకుండా చేస్తుంది. ఆదిలక్ష్మికి, వినాయకరావుకి పెళ్ళి ఆలోచన ససేమిరా లేదని రమణమూర్తి స్పష్టంగా చెప్పేస్తాడు.

(గత సంచిక తరువాయి)

షణ్ముగరావు వుండే పల్లెటూరు ఆంధ్రదేశంలోని అనేక పల్లెటూళ్ళ లాంటిదే. రేడియోలో, టి. వి.లో వినే వార్తలు, దినపత్రికల్లో వచ్చే వార్తలు తప్ప వాళ్ళకి వార్తలంటూ వేరే ఏం వుండవు. మూడువందల అరవై అయిదు రోజులు ఒకేమాదిరిగా నడుస్తాయి. ఎవరిదయినా పెళ్ళి నిశ్చయం అయినా, నెల తప్పినా, జబ్బున పడ్డా, పనిమీద పట్నం వెళ్ళినా అది ఆ గ్రామానికి సంబంధించినంతవరకు పెద్ద వార్త అవుతుంది.

అలాంటి గ్రామం అయిన ముదునూరులో గుప్పున రాజుకుందో వార్త! అది సుబ్బలక్ష్మి చెవిలో వేసాడు రాములు. మర్నాటినుంచి వాళ్ళ ఊళ్ళో సినిమా షూటింగ్ మొదలవుతోంది!

టూరింగ్‌టాకీస్‌లో సినిమాలు చూసే సుబ్బలక్ష్మికి అందరిలాగే సినిమా షూటింగ్ చూడాలన్న కోరిక చాలా బలంగావుంది. అది తీరబోతున్నందుకు సంతోషంవేసింది.

ఆ రోజు సాయంత్రం లొకేషన్స్‌ని ఫార్మల్‌గా చూసి ఓ. కె. అనుకోడానికి ఆ చిత్ర దర్శకుడు ముదునూరు వచ్చాడు. నలభై కిలోమీటర్ల దూరంలో వున్న జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లోని ఓ హోటల్‌లో వాళ్ళ యూనిట్ మకాం. రోజూ చీకటితో వచ్చి, షూటింగ్ ముగించుకుని రాత్రికి తిరిగి హోటల్‌కి వెళ్ళిపోతారు.

ఆ పల్లెకి రెండు కిలోమీటర్ల దూరంలో వున్న చిన్న కొండపై వున్న కాళికాదేవి ఆలయంలో వరసగా నాలుగు రోజులు షూటింగ్ జరుగుతుంది.

ఆ సినిమా యూనిట్‌కి చెందిన ప్రొడక్షన్ మేనేజర్ ఆ గ్రామంలోని పెద్ద ఎవరా అని వాకబుచేసి, షణ్ముగరావు ఇంటికి వచ్చాడు. తనొచ్చినపని విన్నవించాడు.

"షూటింగ్ అయ్యాక మధ్యాహ్నం ఒకటిన్నర నించి రెండున్నర దాకా నిర్మాత, దర్శకుడు, పెద్ద నటీనటులు భోజనం చేయడానికి డైనింగ్‌టేబిల్ వున్న ఇల్లు అవసరంఅయింది. ఈ గ్రామం మొత్తంలో ఒక్క మీ ఇంట్లోనే అదుందని తెలిసింది. భోజనం కేరియర్స్ మేమే తెచ్చుకుంటాం. మీరు అనుమతిస్తే ఇక్కడే అంతా భోజనాలు చేస్తారు."

ఈజీ ఛెయిర్‌లోని షణ్ముగరావు చుట్ట వెలిగించి చెప్పాడు.

"కూర్చో."

కుర్చీ లేకపోవడంవల్ల నిలబడ్డ ప్రొడక్షన్ మేనేజర్ కిందకూర్చోలేక చెప్పాడు.

"ఫర్వాలేదండి."

"నాగేశ్వరరావు వున్నాడా?" అడిగాడు షణ్ముగరావు.

"లేరండి."

వెంటనే ఆయన మొహంలో అసంతృప్తి కనిపించింది. చుట్టని గుప్పున పీల్చి వదిలి అడిగాడు.

"పోనీ, జగ్గయ్య, జమున వున్నారా?"

"ఇది బడ్జెట్ పిక్చరండి. వాళ్ళెవరూ లేరు."

"కనీసం కృష్ణకుమారి, వాణిశ్రీ అయినా వున్నారా?"

"వాళ్ళు నటించడం మానేసి చాలాకాలం అయిందండి. బ్రహ్మానందం, వేలు,

పొట్టి ప్రసాద్, సుధాకర్, రజని, రాజేంద్రప్రసాద్, కోట శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి వున్నారండి".

"వాళ్ళెవరయ్యా? ఎప్పుడూ పేర్లయినా వినలేదు."

"మీరు చూసిన ఆఖరి సినిమా ఏదండీ?" అడిగాడు ప్రొడక్షన్ మేనేజర్.

"లక్షాధికారి. ఎన్టీఆర్, కృష్ణకుమారి ఏంచేసారయ్యా!"

"రేపు వచ్చాక అందర్నీ పరిచయంచేస్తానండి. ఇంతకీ మీరు వప్పుకున్నట్టేనా?"

"ఊహూ."

వెంటనే ప్రొడక్షన్‌మేనేజర్ చిర్నవ్వు నవ్వాడు. ఈ లోకంలో సినిమావాళ్ళు ఫలానిది ఫలానా టైంకి కావాలంటే దాన్ని 'దొరకలేదు' అనకుండా అమర్చగలిగే శక్తి ఒక్క ప్రొడక్షన్ మేనేజర్‌కేవుంటుంది.

"అదికాదండి. మీరీ గ్రామానికి రాజులాంటివాళ్ళు. మీ ఇంట్లో....."

"అదే. అందుకనే నో అనేది. లేకపోతే ఏంటయ్యా కేరేజీలు మేం తెచ్చుకుంటాం అంటావు. మా ఇంటికి భోజనానికి వచ్చేవాళ్ళు మా ఇంట్లో మేం వండిన భోజనం తినాలి. మా ఇంట్లోనే చేతులుకడుక్కోవాలి. అర్థమయిందా?"

"అర్థమయిందండి. అలాగేనండి."

సుబ్బలక్ష్మి బయటికివచ్చి చెప్పింది.

"నాన్నారు. నేను సినిమా షూటింగ్ చూస్తా!"

"తప్పకుండా నమ్మా. రేపు ఉదయం పదిన్నరకి కారు పంపిస్తాను" చెప్పాడు ప్రొడక్షన్ మేనేజర్.

అతనెళ్ళాక చెప్పింది సుబ్బలక్ష్మి ఉత్సాహంగా

"నాకు శ్రీలక్ష్మంటే ఇష్టం. ఆ అమ్మాయికూడా వస్తోందిట!"

మర్నాడు ఉదయం సుబ్బలక్ష్మి, కామేశ్వరి పట్టుచీరలు కట్టుకుంటే. షణ్ముగరావు సిల్కుపంచె, సిల్కు జుబ్బా కట్టుకున్నాడు. ప్రొడక్షన్ మేనేజర్ వచ్చి కారులో వాళ్ళని షూటింగ్‌కి తీసుకెళ్ళాడు.

ప్రేమనేది ఆక్సిజన్ లాంటిది. అది లేకపోతే బ్రతకలేని మనుషులు కొందరుంటారు. అలాంటివాళ్ళలో ఒకరు కామేశ్వరరావు. ముఖ్యంగా ఓసారి ప్రేమలో పడి, బయటకివచ్చిన వాళ్ళు రెండోసారి ప్రేమలో పడటం ఇట్టే జరుగుతుంది.

బచ్చలిపండు రంగు పట్టుచీరలో, నడుముకి వడ్డాణ్ణం, ముందుకు వేసుకున్న రెండు జడలతో, నుదుట పాపిడిబిళ్ళతో, పుష్టిగా, నిండుగా కనబడ్డ సుబ్బలక్ష్మి అక్కడి కార్యక్రమాన్ని ఆసక్తిగా చూసే ఆమె. ఆమె చురుకయిన పెద్దకళ్ళు కామేశ్వరరావు మనసుని దోచి, ఏమాత్రం టైం వేస్ట్ కాకుండా తక్షణం ఆమెని మొదటి చూపులో ప్రేమించేశాడు.

నటీనటులందరితో పాటని చిత్రీకరిస్తున్నారు. సుబ్బలక్ష్మి మీద రిఫ్లెక్టర్ వేసి, సూర్యకాంతి ఆమెమీద పడేలా చేసి ఆమె అటెన్షన్‌ని సంపాదించాడు కామేశ్వరరావు.

అతను మెళ్ళో వేలాడుతున్న విజిల్‌వేయగానే పాట ఆగడం, మళ్ళీ విజిల్ వేస్తే పాట మొదలవడంతో అతనో గొప్పవ్యక్తి అన్న ఆలోచన సుబ్బలక్ష్మికి కలిగింది. తన తండ్రితో పాటు అసోసియేట్‌గా వ్యవహరిస్తున్న కామేశ్వరరావు లంచ్‌కి సుబ్బలక్ష్మి ఇంటికివచ్చాడు. అతని చూపులనిబట్టి తనంటే ప్రత్యేకంగా చూస్తున్నాడని గ్రహించింది సుబ్బలక్ష్మి.

కామేశ్వరి, సుబ్బలక్ష్మి ఆడవాళ్ళకి, రాములు, షణ్ముగరావు మొగవాళ్ళకి వడ్డించారు. నాదకర్ణి ఎప్పటిలా మౌనంగావున్నాడు. షూటింగ్స్ సమయాల్లో ఆయన తక్కువమాట్లాడుతాడు.

అలా నాలుగురోజులు వరసగా చూపుల ఎక్స్చేంజితో సుబ్బలక్ష్మి కూడా కామేశ్వరరావుతో ప్రేమలో పడింది. ఇది యూనిట్ వాళ్ళు కనిపెట్టేసి, కామేశ్వరరావుని ప్రోత్సహించారు. షూటింగ్ ఆఖరిరోజు, లాస్ట్ షాట్ అయ్యాక 'పేకప్' చెప్పాడు నాదకర్ణి.

సుబ్బలక్ష్మికి అర్థమైంది వాళ్ళంతా పావుగంటలో కార్లెక్కి వెళ్ళిపోతున్నారని. ధైర్యంచేసి కామేశ్వరరావు దగ్గరకి వెళ్ళి చెప్పింది మాటలు కలపాలని.

"నాకా విజిల్ ఇస్తారా? బాగా మ్రోగుతోంది."

వెంటనే భుజాన వేలాడుతున్న సంచిలోంచి కామేశ్వరరావు వలిచిన ఓ కొబ్బరికాయ తీసి తక్కున రాతిమీద కొట్టాడు.

"ఎందుకు కొట్టారు?" అడిగింది సుబ్బలక్ష్మి ఆ హఠాత్ సంఘటనకి.

"మీరు నాతో మాట్లాడితే కొబ్బరికాయ కొడతానని శ్రీరామచంద్రుడికి మొక్కుకొన్నాను కాబట్టి" సమాధానం చెప్పాడు కామేశ్వరరావు.

"ఏందుకని అలా మొక్కుకున్నారు?" అడిగింది అమాయకంగా.

"మీరు నాతో మాట్లాడితే నేను ఆ తర్వాత మీతో మాట్లాడచ్చుని" జవాబుచెప్పాడు.

"నేను మాట్లాడాగా. మీరు మాట్లాడండి."

"మీ వెడంకాలి చెప్పు ఓ సారి ఇలా ఇస్తారా?"

"ఎందుకు?" అడిగింది మళ్ళీ ఆశ్చర్యంగా.

"ఊరికే ఇవ్వండి చెప్తాను."

ఇచ్చింది.



"నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. మిమ్మల్ని పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నాను" చెప్పాడు కామేశ్వరరావు.

సుబ్బలక్ష్మి బుగ్గలు కెంపులయ్యాయి.

"నాకు సిగ్గేస్తోంది" చెప్పింది.

"అయితే ఇందండి చెప్పు. కోపం వస్తుందనుకున్నాను."

సుబ్బలక్ష్మి వెడంకాలిచెప్పుని తిరిగి ఆమెకి ఇచ్చేసాడు కామేశ్వరరావు.

"నేనంటే మీ కిష్టమేనా?" అడిగాడు.

తలవూపింది సుబ్బలక్ష్మి.

"అయితే మనం పెళ్ళిచేసుకోవచ్చా?"

"మా నాన్నగారు ఇష్టపడితే అలాగే. ఆయనకేమో కలెక్టరో. పైలట్టో కావాలని చెప్పేసాగా."

"మరేం ఫర్వాలేదు."

మర్నాడు ఉదయం నాదకర్ణికి అతని కొడుకుగురించి నిర్మాత బావమరిది హడావిడిగా వచ్చి ఇలా చెప్పాడు.

"ఇవాళ ఉదయం మీ అబ్బాయి నిద్రలేచాక జాగ్రత్తగా బూట్లని టూత్‌పేస్ట్‌తో పాలిష్‌చేసి, బూట్ల పాలిష్‌ని బ్రష్‌మీదవేసి పళ్ళు తోముకొని, వేడి కాఫీని ఇడ్లీ ప్లేట్‌లో పోసుకొని కలుపుకుని తిని, సాంబార్‌ని కాఫీలా చప్పరిస్తూ తాగుతున్నాడు."

"ఎందుకని?" ఆశ్చర్యంగా అడిగాడు నాదకర్ణి.

"ఆ చర్యలు అతని మానసిక స్థితిని తెలియచేస్తున్నాయి. అతను నిస్సందేహంగా ప్రేమలో పడ్డాడు. మిరు జోక్యం చేసుకోవాలి."

"అలాగా! ఎవరితో ? రజనా? శ్రీలక్ష్మా?" ఆలోచనగా అడిగాడాయన.

"యూనిట్‌లో అనుకోవడం ముదునూరు గ్రామపెద్ద షణ్ముగరావు ఏకైకకూతురు సుబ్బలక్ష్మిని అని."

"ఆ అమ్మాయి వడ్డాణ్ణం ఖరీదే అరవై, డభైవేలు చేస్తుంది. ఆలోచనగా చెప్పాడు నాదకర్ణి.

ఆ రోజు మధ్యాహ్నం నిర్మాత, మరో ఇద్దరు పెద్ద మనుషులు ముదునూరులోని షణ్ముగరావు ఇంటికెళ్ళారు. విషయాన్ని సూటిగా చెప్పారు.

"అయ్యా! అదీ సంగతి. మీ కిష్టమయితే ఆడపిల్ల తండ్రి కాబట్టి మా డైరెక్టర్‌గార్ని వెంటనే కలుసుకోండి."

ఆయన లోపలకెళ్ళి భార్యతో వున్న విషయాన్ని సూటిగా చెప్పాడు. భార్య సలహా అడిగాడు.

"అమ్మాయికీ ఇష్టమేట! నాతో షూద్మన్న వాళ్ళంతా వెళ్ళాక అన్నది. మనిషి బానేవున్నాడు."


"కాని సినిమావాడుకదా? ఇలా వూరూరు షూటింగ్‌లంటూ తిరిగితే మనమ్మాయి ఏం సుఖపడుతుంది?"

"సుఖపడే వయసులో వెంటవెళ్తుంది."

"పైలట్ అయితే ఘనంగా వుంటుందేమో ఆలోచించు. నాకెటూ పాలుపోకుండా వుంది. వాళ్ళంతట వాళ్ళు అడుగుతున్న సంబంధమాయె."

"పైలట్ అయితే విమానం కూలచ్చు. నాకు మొదటి నించీ పైలట్ ఇష్టంలేదు. రేపు మనల్లుడు డైరక్టరయి రాష్ట్రపతి నించి స్వర్ణకమలం అవార్డు తీసుకుంటేమాత్రం ఘనంగావుండదూ? పైగా పెళ్ళికి సినిమా నటీనటులంతా వస్తారు."

"ఏమ్మా సుబ్బులు? నువ్వేం అంటావు?" కూతురిదగ్గరకి వెళ్ళి ఆప్యాయంగా అడిగాడు.



వినాయకరావుపెళ్ళి

"నా కిష్టమేనన్నారు. పైగా ఇంటిపేర్లు కూడా కలిసాయి. మనింటి పేరు గుమ్మడి. ఆయనింటిపేరు వంకాయల."

"సరే నీ యిష్టం. పెళ్ళిచూపులు ఎప్పుడు ఏర్పాటుచేయను? నీకు ఇబ్బందిరోజులు కావుగా?"

"పెళ్ళిచూపులు వేస్ట నాన్నారు. దగ్గర్లో ముహూర్తం ఎప్పుడుందో చూడండి" చెప్పింది సుబ్బలక్ష్మి.

వాళ్ళతో కారెక్కి జిల్లా హెడ్ క్వార్టర్స్‌లోని నాదకర్ణి వుండే హోటల్‌కి వెళ్ళాడు షణ్ముగరావు, ఇంట్లోని బీరపాదునించి కోసిన కొన్ని బీరకాయలతో.

వంకాయల షణ్ముగరావు, గుమ్మడి నాదకర్ణికి బీరకాయలిచ్చి చెప్పాడు.

"శాకదానంచేస్తే శోకంవుండదని శాస్త్రం. వుంచండి. ఇంతకీ నే నెందుకొచ్చానంటే....."

మర్నాడు ఉదయం పదకుండన్నరకల్లా ముదునూరులోని షణ్ముగరావు స్వగృహంలో తాంబూలాలు పుచ్చుకున్నారు. అంతేకాదు. ముహూర్తంకూడా నిర్ణయంచేసారు. వాళ్ళెళ్ళాక భార్యదగ్గరకి వెళ్ళి ఏదో అనబోతే చెప్పింది కామేశ్వరి.

"నన్ను విసిగించకండి. పెళ్ళిపనుల్లో వున్నాను."

"ముహూర్తానికి పదిరోజులే ఎందుకో తెలుసా? ఇంతదగ్గిరగా పెట్టించింది? డాంబికేశ్వరావు తల కొట్టినట్లుగా ఆ వినాయకానికన్నా మన అమ్మాయి పెళ్ళి ముందుగా జరుగుతోందని చెప్పడానికి" ఆనందంతోకూడిన గర్వంతో చెప్పాడు వంకాయల షణ్ముగరావు.


ఆయన స్వయంగా హైదరాబాద్ కూడా వెళ్ళి పిలిచాడు వినాయకరావుని. అదే రోజు వినాయకరావు ఇంటాయన రమణమూర్తిని ఆహ్వానించడానికి వచ్చిన కాబోయే వియ్యంకుడు నాదకర్ణిని అక్కడచూసి ఆశ్చర్యపోయాడాయన. పరిచయాలయాక ఇంకాస్త ఆశ్చర్యపోయాడు.

"ఆ రోగిష్టివెధవకి పెళ్ళెందుకు? ఆ అమ్మాయి నుదుట బొట్టుకి ఎసరుపెట్టకపోవడం కాకపోతే" భార్యతో చెప్పాడు రమణమూర్తి అంతావెళ్ళాక.

"ఈ కాలంలో మొగుడుపోయినా బొట్టుపెట్టుకోవడం ఫేషన్లెండి" మరేంఫర్వాలేదు.

కామేశ్వరరావుకి ఎలాంటి రోగంలేదని తెలిసిన కనకమహాలక్ష్మి చెప్పింది భర్తతో.

ఆ వివాహానికి డాంబికేశ్వరరావు, ఆయన భార్య చాముండేశ్వరి. అలాగే రమణమూర్తి, కనకమహాలక్ష్మి హాజరయ్యారు. ఒకరిగురించి మరొకరికి తెలియగానే డాంబికేశ్వరరావు రమణమూర్తివంక కన్నెత్తయినా చూడలేదు. మొగపెళ్ళివారమనే డాంబికంతో. రమణమూర్తి అంతపట్టుదలతోనే మాట్లాడలేదు. కనకమహాలక్ష్మి, చాముండేశ్వరి మాత్రం ఒకరితో వకరు ఆప్యాయంగా మాట్లాడుకున్నారు.



ముదునూరులో జరిగిన ఆ వివాహానికి తలితండ్రులతోపాటు హాజరయిన వినాయకరావు, ఆదిలక్ష్మి మాత్రం పెద్దలుచూస్తుండగా ఒకరితో వొకరు మాట్లాడుకోడానికి సిగ్గుపడ్డాడు.

పీటలమీద కూర్చున్న పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు ముహూర్తం సమీపిస్తుండగా పెళ్ళి జరిపించే పురోహితుడికోసం ఎదురుచూడసాగారు. అకస్మాత్తుగా ఆయన మిస్‌అవడంతో.

"ఏడీ ఆయన? ఇంతసేపు ఇక్కడే వుండాలే" అని పిల్ల, పిల్లాడి తలితండ్రులు చెవులు కొరుక్కొని ఆయనకోసం వెదకసాగారు.

చివరికి ఆయన లోపలిగదిలో టి. వి. ఆన్‌చేసి 'రామాయణ్' చూస్తూ దర్శనం ఇచ్చాడు. టి. వి. ఆర్పేసి, ఆయన్ని కోప్పడి పెళ్ళిపందిరి దగ్గరకి తీసుకెళ్ళారు. అంచేత ముహూర్తానికి అరనిముషం ఆలస్యంగా కామేశ్వరరావు సుబ్బలక్ష్మి మెళ్ళో మూడు ముళ్ళు వేసేశాడు. మూడోముడి పడినవెంటనే సుబ్బలక్ష్మి తలెత్తి కామేశ్వరరావువంక చూసి అడిగింది.

"ఏమండి. విజయవాద మంగళ్‌దీప్‌కి కొత్త చీరలు వచ్చాయిట. నాకు కాసిన్ని కొని పెట్టరూ"

"అలాగే" జవాబు చెప్పాడు కామేశ్వరరావు.

"ఎలాగయినా పెళ్ళికొడుకు నెమ్మదస్తుడు" చెప్పారు ఆ మాటలు విన్న ఒకరు.

"అంతా అతగాడి అమ్మ పోలిక. ఆవిడ చచ్చి ఎక్కడుందో కాని, నెమ్మదస్తురాలు కాకపోతే కామేశ్వరరావు మూడేళ్ళ ముందుగానే పుట్టి వుండేవాడు."

ఆ రాత్రి పెద్ద బజార్లో ప్రత్యేకంగా వేసిన పందిట్లో నాదకర్ణి చిత్ర నిర్మాత 'రామ రావణ యుద్ధం' అన్న పౌరాణిక నాటకాన్ని ఏర్పాటు చేసాడు. అంతా ఆ నాటకానికి హాజరయ్యారు.

దుష్ట శిక్షణ చేసి శిష్ట రక్షణ చేసే ఆఖరి అంకం వచ్చింది. రామ రావణులు యుద్ధానికి తల పడ్డారు. 'ఇదిగో రామబాణం ఈ శరాఘాతంతో చస్తావు' అన్న డైలాగ్ చెప్పి రాముడు బాణం వేస్తే రావణాసురుడు పాత్రధారి దాన్ని చేత్తో అందుకుని నిర్లక్ష్యంగా మోకాలెత్తి దానిని కొట్టి మధ్యకి రెండుగా విరిచి పారేసాడు.

రాముడు క్షణ కాలం తడబాటు పడి, "అది మాయతో నీవు సృష్టించింది. ఇదిగో రామబాణం" అని మళ్ళీ విల్లు సంధించి బాణం వదిలాడు.

రావణుడు దాన్ని కూడా గాల్లో చేత్తో అందుకుని విరిచి ప్రేక్షకుల్లోకి విసిరేసాడు.

రాముడు బిక్క మొహం పెట్టి మరో బాణం సైడ్ వింగ్‌లోంచి అందుకుని" ఇదిగో ఇది అసలయిన రామబాణం" అని సంధించి వదిలాడు.

రావణుడు ఆ బాణానికి అదే గతి పట్టించాడు.

సైడ్ వింగ్‌లోంచి డ్రామా ఆర్గనైజర్ రావణుడు వినేలా నెమ్మదిగా చెప్పాడు. "ఏమిటిది? చావు

రావణుడు తాను చావనన్నట్లుగా సౌంజ్ఞ చేసాడు.

"ఎందుకు చావవు?" అడిగాడు ఆర్గనైజర్.

'నాకు డబ్బు ముట్టలేదు' అన్నట్లుగా చేత్తో సౌంజ్ఞ చేసాడు రావణ పాత్రధారి.

"నీవు చచ్చి నాటకం అయాక ఇస్తాలే".

"ఉహూ ముందు డబ్బు చేతిలో పడాలి తర్వాతే చచ్చేది" సౌంజ్ఞ చేసాడు రావణాసురుడు.

మరో బాణాన్ని ఎక్కువసేపు గురి చూసి కొట్టాడు రాముడు. దానికీ

నాటి పెళ్ళి ముచ్చట్లు

ఆ రోజు మా పెళ్ళి రోజు. నా మంత్రివర్గంలో 'హోం మినిస్టర్' (గృహిణి)కావలసిన వాళ్ళ యింట్లో తనివితీరని హడావుడి. పట్టుచీరలు రెపరెపలు; పెద్ద వాండ్ల అజమాయిషీలు, భోజనప్రియుల ఆకలి కేకలు. ఆడపెండ్లి వారి ఆరాటాలతో, మగపెండ్లి వారి చెల్లగాటంతో పెండ్లి పందిరి ఒక సర్కస్‌లా తయారయ్యింది. పెండ్లి కుమారుడైన నేను రోజున్నర ఉపవాసం పేరుతో పీటలపైన ఆకలితో చస్తుంటే, నా స్నేహితులు (అంటే ఆడ పెండ్లివారికి రాక్షసులు) వుప్మాలో


"పచ్చిమిర్చి పెండ్లి"

జీడిపప్పు, మంచి నెయ్యి లేదనే కోపంతో ఆడపెండ్లి వారిని ఆటలు ఆడిస్తున్నారు. వాళ్ళది 'ఏం అదృష్టంరా బాబు' అనుకున్నాను.

ఇంకా ముహూర్తం పది నిమిషాలు మాత్రమే వుంది. పురోహితుని మంత్రాలు తారస్థాయికి చేరుకొన్నవి. హడావుడి ఎక్కువయ్యింది. మూడు ముళ్ళు వేయవలసిన సమయం ఐదు నిమిషాలే. ఊహించని విధంగా పురోహితుడు లేచి నిలబడ్డాడు. నేను అతని వైపు చూశాను. చెవిలో విషయం చెప్పాడు. ముహూర్త సమయం అయిపోతుందని భయపడినాను. నాల్గు నిమిషాల తర్వాత పురోహితుడు వచ్చాడు. మళ్ళీ అర నిమిషంలోనే లేచాడు- చెంబు పట్టుకున్నాడు. అలా మూడు నిమిషాలకొకసారి రావడం, మళ్ళీ అర నిమిషానికే లేవడం జరుగుతుంది. ముహూర్త సమయం దాటిపోయింది. పెండ్లి పందిరిలో అల్లకల్లోలం. కేకలు, గుసగుసలు వేరే పురోహితుడు చుట్టు ప్రక్కల దొరకని చిన్న గ్రామం అది.

నాకు ఆలోచన రావడంలేదు. గంట గడచిపోయింది. పురోహితుడు నీరసంతో ఒక మంత్రం కూడ పలకలేక పోతున్నాడు. ఒక దిక్కు ఆకలి మంటలు. వేరొక దిక్కు పెండ్లి గురించి భయం చివరికి నేనొక నిర్ణయానికి వచ్చాను. పెద్దలు వద్దంటున్నా వినకుండా మూడు ముళ్ళు వేసాను. అలాగ మంత్రాలు లేకుండానే నా పెళ్ళి అయిపోయింది.

అసలు విషయం ఏమంటే పురోహితుడు ఉదయం వుప్మాలో వేసిన పచ్చి మిరపకాయలు తిన్నందుకు బయటికి పోయ్యే పరిస్థితి వచ్చింది. కొందరికి పచ్చిమిరపకాయలు సరిపడవు. ఇప్పటికి నా స్నేహితులు "పచ్చిమిర్చి పెండ్లి" అని ఎగతాళి చేస్తారు.




-పి. జగన్మోహన్‌రావు, శ్రీపురం

★ ★ ★

మా బంధువుల అందరి వివాహాలలోను నేను ముఖ్య పాత్ర వహించే దాన్ని. పెండ్లి కూతురు, పెండ్లి కొడుకులకు హారతు లిచ్చేటప్పుడు నన్ను తప్పక పాటలు పాడమనే వారు. ద్వారబంధాలకు అడ్డుపడి నూతన దంపుతుల దగ్గర పేరు చెప్పించమని నన్ను ప్రోత్సహించే వారు.

పెండ్లి కొడుకు, పెళ్లి కూతురు నలుగులు పెట్టేటప్పుడు నా పాటలు తప్పక ఉంటాయి.



అందరి పెళ్లిళ్లకు ముఖ్య పాత్ర వహించు చున్న నాకూ వివాహము నిశ్చయ మయింది.

పెండ్లి తతంగమంత అయిన తర్వాత నలుగులు ఆరంభ మయినాయి. అప్పుడు పెళ్లికి వచ్చిన మహిళలు అందరూ మాట్లాడు కొన్నారు. "శ్రీదేవి మన అందరి పెళ్లిళ్లకు- మన అన్నదమ్ముల వివాహాలలో ఉత్సాహంగ పాల్గొన్నది. బాగా పాటలు పాడింది. అందువలన ఎవ్వరూ అడుగకనే మన మందరము పాటలు పాడా"లని సంతోషంగ అందరూ పాడారు.

పాటతమాషా!

తర్వాత పెండ్లి కొడుక్కు- పెళ్లి కూతురు పాటలు పాడి నలుగు పెట్టాలి. నన్ను బలవంత పెట్టారు అందరూ పాడమని. నేను ఎలాగో గొంతు తెముల్చుకొని పాడాను.

తర్వాత జరిగిన పెళ్లిళ్ల సందర్భములో మా చినమామ గారు అంటూ ఉండేవారు తమాషాగ- శ్రీదేవీ, నీ పెళ్లప్పుడు ఒక పాట పాడితివే! ఆ పాట పాడూ అని.

నా వివాహమయి 20 సంవత్సరాలు అయింది. ఇప్పుడు కూడ- టి. వి.లో, రేడియోలో పాత పాటలు వేసినప్పుడు వస్తూ ఉంటుంది నేను పాడిన పాట. అప్పుడు మా వారు నీ పాట వస్తూ ఉందని తమాషా చేస్తూ ఉంటారు.

– వి. శ్రీదేవి, విల్లుపురం
(తమిళనాడు)

రావణాసురుడు చావకపోగా దాన్ని మధ్యకి విరిచి రాముడి మీదకి విసిరాడు. ఆ విధంగా అప్పటికే పాశుపతాస్త్రం, ఆగ్నేయాస్త్రం, వాయువ్యాస్త్రం, ఆఖరికి బ్రహ్మాస్త్రం కూడా విఫలం అయాయి.

సైడు వింగుల్లోంచి ఆర్గనైజర్ ఇతర నటీ నటులు గోల పెడుతున్నారు. రావణాసురుడిని చావమని ప్రేక్షకులు విజిల్స్ వేసి రాముడితో చెప్తున్నారు త్వరగా రావణాసురుణ్ని చంపమని.

ఆర్గనైజర్‌కి అర్థమయింది రావణాసురుడు డబ్బు ముడితేగాని చావడని. విధి లేక ఏభై రూపాయల నోట్లని జేబులోంచి తీసి రావణాసురుడికి చూపించి చెప్పాడు.

"చచ్చి రా. ఇస్తాను".

"అది నాకు ఇస్తే గాని చావను. రాను' మళ్ళీ సొంజ్ఞ చేసాడు రావణాసురుడు.

ఎలా నాటకం మధ్యలో రావణాసురుడికి డబ్బిస్తే అసహ్యంగా వుంటుంది. ఆర్గనైజర్ చెవిలో వెంటనే ఓ ఆలోచనని చెప్పాడు హనుమంతులవారు.

రాముడి బాణాలయిపోయాయి. రావణున్ని చంపడానికి బాణం లేదు. రాముడు నాటకం చెడిపోకూడదని శాయశక్తులా ప్రయత్నిస్తు, బాణం కోసం ప్రార్థిస్తున్నట్లుగా కళ్ళు మూసుకుని వంటి కాలి మీద నిల బడ్డాడు. రావణాసురుడు మీసం దువ్వుకుంటూ ఎస్వీ రంగారావు ఫోజులో నిలబడి ఉన్నాడు.

డబ్బున్నా బాణం లేకుండా ఎలా రావణాసురుడ్ని చంపడం? హనుమంతుల వారు ఇచ్చిన మరో ఐడియాతో, లక్ష్మణుడు, సీత దొంగతనంగా షణ్ముగరావు ఇంట్లోంచి కోసుకుపోతున్న ములక్కాడలని బాణంగా వాడమని రాముడికి సైడ్ వింగ్‌లోంచి చెప్పాడు ఆర్గనైజర్.

రాముడు కళ్ళు తెరచి రావణాసురుడివంక చూసి చేతులు రెండూ చాపి 'ఇప్పుడు అసలయిన రామబాణం వస్తోంది. దానికి తిరుగులేదు' అన్నాడు.

వెంటనే సెడ్‌వింగ్‌లోంచి అతని రెండుచేతుల్లోకి ఓ మూలక్కాడ వచ్చిపడింది. దానికి ఏభైరూపాయల నోట్లు చుట్టి పడిపోకుండా రబ్బర్‌బేండ్ వేసివుంది.

రాముడా ములక్కాడని ధనస్సుకి సంధించి 'చావు రావణా' అని అరిచివదిలాడు. గురితప్పి ఆ మూలక్కాడ రావణుడి వెనకాల దూరంగా పడింది.

న్యాయపీఠం



బి.బి.రావు. ఎమ్.ఏ.ఎల్ఎల్.బి.

సుప్రీమ్‌కోర్టు చెప్పిన 'లా' అన్ని కేసులకు వర్తిస్తుంది.

ఢిల్లీ మేజిస్ట్రేట్‌కోర్టులో మేజర్ జనరల్ గౌరయమీద మైన్సు చట్టంప్రకారం కేసుపెట్టారు. 1972 జనవరి 6వ తేదీన హాజరుకావాలి. కాని ఆతేదీన కంప్లయింట్ పెట్టినవారు, నిందితుడు కూడా కోర్టుముందు హాజరుకాలేదు. అందుచేత మేజిస్ట్రేట్ కంప్లయింట్‌ను డిస్మిస్ చేసివేశారు. జనవరి 13వ తేదీన కంప్లయింట్‌దారు మళ్ళీ పిటిషన్‌పెట్టారు. జనవరి 20వ తేదీన మేజిస్ట్రేట్ పిటిషన్ విచారించి కంప్లయింట్‌ను రెస్టోర్‌చేసి సమన్లు జారీచేశారు. అలా చెయ్యడానికి మేజిస్ట్రేట్‌కు అధికారంలేదని నిందితుని తరఫున పిటిషన్ పెట్టారు. పిటిషన్‌ను మేజిస్ట్రేట్ త్రోసిపుచ్చారు. ఢిల్లీ చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్‌కు పెట్టుకున్న రివిజన్ పిటిషన్‌ను కొట్టివేశారు. నిందితులు హైకోర్టుకు రివిజన్ పిటిషన్ పెట్టారు. క్రిమినల్ కోర్టుకు కొన్ని ప్రత్యేకమైన అధికారాలు ఉన్నవని పేర్కొంటూ నిందితులు పెట్టుకున్న రివిజన్ పిటిషన్‌ను హైకోర్టువారు 1975 జనవరి 10వ తేదీన డిస్మిస్ చేశారు. కాని 1976 ఆగస్టు 5 తేదీన సుప్రీమ్‌కోర్టు ఒక తీర్పును యిచ్చింది. ఆ తీర్పులో క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లో పేర్కొనని అధికారాలు క్రిమినల్ కోర్టులకులేవని తీర్పుచెప్పారు. ఈ తీర్పుప్రకారం నిందితులు మేజిస్ట్రేట్‌కు పిటిషన్ పెట్టుకున్నారు. ఫలితంగా 1977 జూలై 16వ తేదీన మేజిస్ట్రేట్ కంప్లయింట్‌ను కొట్టివేశారు. కంప్లయింట్‌దారు 1978లో ఢిల్లీ సెషన్సు జడ్జికోర్టులో రివిజన్ పిటిషన్ పెట్టుకున్నారు. సెషన్సుజడ్జి మేజిస్ట్రేట్ ఉత్తర్వును కొట్టివేశారు. పరిష్కారమైపోయిన కేసులు మళ్ళీ విచారించడానికి సుప్రీమ్‌కోర్టు తీర్పు పార్లమెంట్ చేసిన చట్టంకాదని జడ్జి పేర్కొన్నారు. దీనిపై నిందితులు హైకోర్టుకు రివిజన్ పిటిషన్ పెట్టుకొనగా, హైకోర్టుకూడా పిటిషన్ త్రోసిపుచ్చింది. దీనిపై సుప్రీమ్‌కోర్టుకు నిందితులు అప్పీలు పెట్టుకున్నారు. సుప్రీమ్ కోర్టు అప్పీలు అనుమతించి తీర్పుచెప్పింది. సుప్రీమ్‌కోర్టు తీర్పులో భారత రాజ్యాంగంలోని 141 ఆర్టికల్ ప్రకారం సుప్రీమ్‌కోర్టు నిర్ణయించిన 'లా' భారతదేశంలోని అన్ని కోర్టులకు వర్తిస్తుంది అన్నారు. జిల్లా జడ్జి ఈ 141 ఆర్టికల్‌ను తప్పుగా అర్థంచేసుకున్నారు. సుప్రీమ్‌కోర్టు నిర్దేశించిన 'లా' రాబోవు కేసులకుమాత్రమే వర్తిస్తుంది అనిలేదు. పెండింగుగా వున్న అన్ని కేసులకు కూడా వర్తిస్తాయి. 141 అధికరణ ప్రకారం సుప్రీమ్‌కోర్టు యిచ్చిన తీర్పులు అన్ని కోర్టులకు కూడా బైండింగ్ అన్న విషయం జడ్జి గుర్తించలేదు. కనీసం హైకోర్టు అయినా జడ్జి యిచ్చిన ఈ తప్పు ఉత్తర్వును సరిదిద్దవలసినది. ఈ కేసు 15 సంవత్సరాల నుంచి నలుగుతున్నది. ఈ కేసును సమాధి చెయ్యడం మంచిదికనుక హైకోర్టు ఉత్తర్వు కొట్టివెయ్యడమైనది. అప్పీలును అనుమతిస్తూ 1972వ సంవత్సరం కంప్లయింట్‌ను డిస్మిస్ చెయ్యడమైనది అంటూ 1986లో సుప్రీమ్‌కోర్టువారు తీర్పుచెప్పారు. □

వినాయకరావుపెళ్ళి

వెంటనే రావణాసురుడు వెనక్కి తిరిగి ఆ ములక్కాడ దగ్గరకివెళ్ళి, వంగి దాన్నందుకుని, రబ్బర్‌బేండ్‌ని తీసి ఏభైరూపాయల నోట్లనిలెక్కపెట్టుకుని సరిగ్గావుండటంతో ఆ డబ్బుని కిరీటంకింద దాచుకొని, ములక్కాడ ఎత్తి కత్తితో పొడుచుకొన్నట్లుగా తన పొట్టలోకి పొడుచుకొన్నాడు. ముదురు దేమో ఆ దెబ్బకి అది విరిగి కిందపడింది.

"హా రామా. ఈ దశకంఠుడిని చంపావుకదరా" అని అరిచి ధామ్మని కిందపడి రావణాసురుడి పాత్రధారి చచ్చినట్లుగా నటించాడు.

వెంటనే ఆర్గనైజర్ స్వయంగా కర్టెన్ వేసేసాడు. ఆవిధంగా సీరియస్‌గా ముగియాల్సిన ఆ నాటకం హాస్యంగా నవ్వులతో ముగిసింది. రావణాసురుడ్ని పిలిపించాడు నాదకర్ణి.

"ఏరా అబ్బాయ్? ఏమిటి సంగతి?" అడిగాడాయన నవ్వుతూ.

"మొన్న కావూరులో ఇదే నాటకం వేసాం. నిన్న తిరువూరులో వేసాం. ఆ ఆర్గనైజర్‌గాడు నా డబ్బులిస్తేనా? అందుకని....." నసిగాడు రావణాసురుడు.

"సినిమాల్లో మాకు ఫెసిలిటీలేదుకాని వుంటేనా ఏ నిర్మాతా నా రెమ్యూనరేషన్ ఎగ్గొట్టేవాడు కాదు" చెప్పాడు ఓ చిన్న నటుడు.

ఆవిధంగా సుబ్బులక్ష్మి, కామేశ్వరరావుతో యంగ్‌లవర్స్ అయిన వినాయకరావు, ఆదిలక్ష్మిల జీవితాల్లోంచి పూర్తిగా తప్పుకున్నారు.

మర్నాడు వుదయం వినాయకరావు సత్యనారాయణ వ్రతానికి పెద్దలకి బట్టలుపెట్టి హైదరాబాద్ బయలుదేరుతుంటే సుబ్బులక్ష్మి వినాయకరావు దగ్గరకి వచ్చి చెప్పింది కోపంగా –

"నువ్వింత మోసగాడివనుకోలేదు."

"ఏం మోసంచేసాను?" అడిగాడు.

"మావారికి ఎయిడ్స్ వ్యాధా?"

"అబ్బే.... లేదే.... ఎవరన్నారు?"

"ఆయన నాకు అంతా చెప్పారు. నీవు, ఆ ఆది కలిసి ఆడిన నాటకం ఇది. అవునా?"

"నీ కెలా తెలిసింది?"

"ఆడవాళ్ళ నోట్లో నువ్వుగింజ దాగదన్నది కనకమహాలక్ష్మి విషయంలో రుజువయింది."

"ప్రేమవిషయంలో, జీవితంలో కొన్ని అబద్ధాలు తప్పవు. తప్పుగా అర్థంచేసుకోకు సుబ్బులు."

"నీకిదివరకో వుత్తరం రాసాను గుర్తుందా?"

"ఏం వుత్తరం?"

"మీ స్వార్థంకోసం అటు నామీద అలాంటి అపనిందవేసావు. ఇటు మావారిమీద ఇలాంటి అపనిందవేసావు. నిన్ను నేనే క్షమించను."

"ఇప్పుడు నేను క్షమార్పణ అడగలేదే!"

"ఈ సుబ్బలక్ష్మి పల్లెటూరిబైతు అనుకుంటున్నావుకదూ? కాదు పరమ గడుగ్గాయి. సరిగ్గా గురిచూసి కొడతాను. జీవితాంతం గుర్తుండేలా. కాచుకో" చెప్పింది రోషంగా.

"ఎప్పుడుకొడతావు" అడిగాడు వినాయకరావు. అతనామెలో అమాయకత్వంతప్ప అంత కోపాన్ని ఎప్పుడూ చూడలేదు.

"ఎప్పుడా? సమయం వచ్చినప్పుడు. నీలాకాదు. కొట్టి ఆ తర్వాత అది నా దెబ్బ అని చెప్తాను."

అక్కడనించి విసవిస వెళ్ళిపోయింది సుబ్బులక్ష్మి. (ఇంకా వుంది)

ప్రశ్నావళి కె. రామలక్ష్మి

సి. హెచ్. ఎన్. ఆర్. సత్తెనపల్లి

★ టి. వి. వలన ప్రజలలో రచనలమీద ఉన్న ఆసక్తి కొంతవరకు తగ్గింది కదా?

● తప్పదు - ఏదైనా కాలక్షేపమేకద! విడియోలవల్ల సినిమాకి జనం తగ్గలేదా? ఏ రంగంలోనైనా కొత్త పోకడ పాతని కాస్త మరుగున పడేయడం సహజమే.

★ కొన్ని వేల సంవత్సరాల క్రిందటి తమ తాత ముత్తాతల పూర్వీకుల చరిత్రను పునాదిగా నేడు తమ స్థాయికి వాడుకోవడం చేసే వారిని చూస్తే నాకు వారి పట్ల హీనభావం కల్గుతుంది మీకు?

● ఇప్పుడు - తమ ఉనికికి నాందిని తెలుసుకుందుకు వెనక్కి తవ్వుకుంటూ పోవడం - ఆధునిక పోకడ! రూట్స్. అందరికీ - అవి ఎక్కడివి. తెలుసుకోవాలన్న ఆరాటం - ఇది 'బానిసలుగా బ్రతికిన' నల్ల తెగలు కొత్తగా తమకు గుర్తింపు కోసం - తమ జాతి జీవనాడి కోసం వెతకడం- బ్లాక్ రైటర్స్ సగర్వంగా చేస్తున్నారు... అంతేకాని ముందుకు పోతూ వెనక్కి చూడ్డంలేదు మనవాళ్ళు... ప్రాచీనపు క్షీణ సంప్రదాయాలకి కొత్త గౌరవం దక్కించాలని తాపత్రయపడుతున్నారు. ఇది - ముందుకు పోవడానికి వెనక్కి చూడ్డం!

★ కట్న పిశాచి పుట్టు పూర్వోత్తరా లేమిటి? అది నశించడానికి మీ సలహా ఏమిటి?

● ఏ సంప్రదాయమైనా సరదాకి ప్రారంభం అయి - ఇలా పిశాచంలా వస్తుంది... కొన్ని సరదాలు ఉరితాళ్లయి బిగిస్తుంటే - వాటిని తెంపుకోవాలి. దానికి నాకు తోచిన మార్గం ఒక్కటే - ఆడపిల్లలని పెళ్లే ధ్యేయంగా పెంచకుండా వుండడం; ఆడా మగా తేడా లేకుండా పిల్లలని పెంచి- చదివించి ప్రయోజకులను చేయడం, తరవాతే - పెళ్లి - అబ్బాయి కయినా - అమ్మాయి కయినా.

కె. వి. ఎల్. పెనుగొండ

★ ఇతరుల ఉత్తరాలు మీ రెప్పుడైనా చదివారా!

● మీరు రాసేవి నాకేలే! ఇతరుల పేర వచ్చిన ఉత్తరాలు సంస్కారవంతులు చదవరు.

★ మా అభిమాన హీరో వెంకటేశ్ చిత్రాలు చూశారా?

● ఇంకా లేదు.

ఎం. బి. ఆర్. భిలాయి

★ మన ప్రస్తుత రాజ్యాంగం మనకు ఎంతవరకు న్యాయం చేకూర్చ కలదంటారు?

● చాలా ఉన్నతాదర్శాలతో రూపొందించబడినదే మన రాజ్యాంగం. కాని ఏం లాభం? ఈ దేశంలో కాగితం మీది ఆదర్శాలు- చేతలుగా మారవే.

బి. కె. సోంపేట

★ ఒక మగవానికి పది మంది అమ్మాయిలతో పరిచయం వున్నా ఆడది అతనికి హృదయంలో స్థానం యిస్తుంది. కాని ఒక మగవానితో పరిచయం వున్న ఆడదాన్ని మగాడు చేరువ చేయలేడు....

● ప్రకృతీ, నీతీ ఆడదానికి ప్రసాదించిన కట్టడి- మగవాడికి యివ్వలేదు కనుక. ఎంత మందితో తిరిగితేనేం నన్ను ప్రేమించాడు- ఇక అతనికి నేనే సర్వం అనే పిచ్చి మాలోకం ఆడది. ఒకడితో స్నేహం చేసినా "ఇలాగే ఎంత మందితో చేసిందో" అన్న అనుమాన పిశాచం పట్టి పీడిస్తుంది మగవాడిని. ఇంతెందుకు? ఆడది నమ్ముతుంది. మగాడు నమ్మినట్టు నటిస్తాడు.!

★ ప్రతి అభిమానం వెనుక స్వార్థం వుంటుందంటాను!

● ఉండక తప్పదు.

★ ఈ కుల మతాలు మనకు అవసరమా?

● కావు. కాని రాజకీయ వాదులకి చాలా అవసరం.

★ మీ "గురుదక్షిణ" సినిమాగా వస్తుందని విన్నాం. నిజమేనా?

● "ఎప్పటికేనా తీస్తా" నంటూ బెదిరిస్తుంటారు మోహన్‌బాబు! అంతే!

కె. కె. రామవరం

★ ఆడవారి మాటలకు అర్థాలు వేరులే- అంటారు... మరి మగవారి మాటలు సూటిగా వుంటాయనే అర్థమా?

● కాదు. అసలు అర్థాలు వుండవని అర్థం.

★ ఆడవారిని ఆడవారే విమర్శించు కోవడం, అసూయ పడడం చిత్రంగా లేదూ?

● ఏం మగవారిలో యివి వుండవనా?!

★ వరకట్నం యివ్వమని ఎదిరించే దెక్కడ? పైగా నేనింతిచ్చానంటే నేనింతిచ్చానని గొప్పలు చెప్పుకుంటూంటే!

● డబ్బిచ్చి వూరుకోలేక పోవడం- మానవ సహజం. అబ్బాయిలకీ- అమ్మాయిలకీ పౌరుషం రానంత వరకు- యీ సమస్య తీరేది కాదు.

బి. ఎ. ఆర్. రాయగడ

★ గూర్ఖా సమస్యకు పరిష్కారం చేయడానికి ఒక పక్క ఉత్సాహం కనబరుస్తున్నట్టు చర్చలు ప్రారంభిస్తూ మరో వైపు వెనుకాడుతోంది. ఏమిటి?

● మళ్లీ పంజాబ్- సిలోన్‌లలాగా కొరివితో తల గోక్కోవలసి వస్తుందన్న భయం ఒక వైపు. సమస్యలు పరిష్కరించేస్తే- తమ ఉనికికి ముప్పు వస్తుందని- యింకొక వైపు- ప్రభుత్వం కూడా ముందు కాళ్ల వెనకాళ్ల తన్నాలని చూసే గాడిదే.


★ శీలం అంటే?

● నీపై నీకుండ వలసిన నమ్మకం.

టి. కె. పాలకొల్లు

★ బిల్లా రంగాల మీద నవల వచ్చిందా? ఏ పేరుతో వచ్చింది?


● తెలియదు. అయితేనేం- నేరగాళ్ళు ఎప్పుడైనా హీరోలే- మీరే ఒకటి ప్రారంభించండి- ఆ నాటి కట్టింగుల ఫైలు దగ్గిర పెట్టుకుని! □




రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ మరియు
పబ్లిక్ సెక్టార్ ఉద్యోగులకు
సదవకాశం.

మీ ఊహల్లోని ఖరీదైన వస్తువుకు కేవలం 15% మొదటి చెల్లింపు


APSTC – హైర్ పర్చేజ్ పథకం – ఇప్పుడు మీకు ఏ విధమైన ఆందోళన లేకుండా ఒక ఖరీదైన వస్తువు కొనగలిగే సౌకర్యం కలుగజేస్తుంది. అది మీరు ఎంతోకాలం నుండి ఎదురుచూస్తున్న



ఫ్రిజ్ కావచ్చు.



కలర్ లేక బ్లాక్ & వైట్ టీవి కావచ్చు.



లేదా మోటార్ బైక్, మోపెడ్, స్కూటర్ ఏదైనా కావచ్చు.
ఇవేకాక అతిత్వరలో ఎ.సి.ఆర్., వెట్ గ్రైండర్, వాషింగ్ మెషిన్ మరియు డొమెస్టిక్ ఫర్నీచర్ కూడా ఈ పథకం ద్వారా లభించును.
ఏ వస్తువుకైనా మొదటి చెల్లింపు 15% మాత్రమే. మిగిలిన మొత్తం 12, 18, 24 సులభ వాయిదాలలో చెల్లించవచ్చు. 12% ఫ్లాట్ రేట్ వడ్డీతో.
అందుకే ... ఈ పథకంలో చేరండి! మీకు కావలసిన వస్తువును ఎన్నుకోండి.

APSTC – హైర్ పర్చేజ్ పథకం

మీ సౌకర్యం కోసం – మీ సౌలభ్యం కోసం

వివరాలకు సంప్రదించండి:

ఆంధ్రప్రదేశ్ స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ లిమిటెడ్.
హైర్ పర్చేజ్ డివిజన్, ఖైరతాబాదు, హైదరాబాదు-500 004. ఫోన్: 222639

లేదా ఏదైనా మా ఈ బ్రాంచిల వద్ద:

విశాఖపట్నం – ఫోన్: 66275, 66276, గుంటూరు – ఫోన్: 22035, తిరుపతి – ఫోన్: 2175, వరంగల్ – ఫోన్: 4913,
కాకినాడ – ఫోన్: 5213, ఒంగోలు – ఫోన్: 3259, ఏలూరు – ఫోన్: 20538, అనంతపూర్ – ఫోన్: 2379,
రాజమండ్రి – ఫోన్: 6380, నిజామాబాద్, కర్నూలు, మరియు విజయవాడ.

ఈ సదుపాయం రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వంలో లేదా కేంద్ర, రాష్ట్ర, పబ్లిక్ సెక్టార్‌లలోని 56 సం.లకు పైబడని పర్మినెంట్ ఉద్యోగులకు మాత్రమే!

శివరాత్రి జాగరణ

సుమంతి శ్రీ అన్నపూర్ణ

చలి కాలం చలి శివశివ అంటోంది. భక్తుల స్నానాలతో కోనేరు వెచ్చబడింది. కోనేరుకు వెళ్ళలేని స్త్రీలు నూతుల్లో నిప్పులు వేసారు. 'శంకరా!' అన్న పాటలతో మైకులు దద్దరిల్లుతూ వుంటే, దానికి వులిక్కిపడి సూర్య భగవానుడు దుప్పటి తొలగించి 'దొంగ చూపులు చూస్తున్నాడు. ముడుచుకున్న మందారాలు మనదే ఆలస్యం అన్నట్టుగా రేకలు విప్పటం ప్రారంభించాయి. గుళ్ళో పువ్వులు, మారేడు పత్రి 'మన అవసరం ఇప్పుడే' అనుకుంటూ గలగల నవ్వుకుంటూ రాలిపడ్డాయి. మీ కంటే మేమే నయం అన్నట్టుగా తులసి కోటల్లో, మట్టి ప్రమిదల్లో గోరంత దీపాలు, కొండంత దీపాలై ప్రకాశిస్తున్నాయి. వాటిని చూచేసరికి నాలో నూతనోత్తేజం కల్గింది వెంటనే స్నానం కార్యక్రమం ముగించుకుని వీధిలోకి అడుగు పెట్టాను పది సంవత్సరముల తర్వాత నా స్వంత ఊరు శివరాత్రి శోభను చూద్దామని

స్త్రీలు పసుపు రాసుకుని స్నానాలు చేసిన తలలతో గర, గరమనే పట్టు చీరల శబ్దాలతో, చేతిలో పూల సజ్జలతో చంకలో చంటి పిల్లలతో భక్తి శ్రద్ధలతో గుడికి గుంపులు, గుంపులుగా వెడుతున్నారు.

మగవారు కూడా నుదుట వీభూది, కుంకుమ అలదుకుని చేత పిల్లల్ని పట్టుకుని స్త్రీలను అనుసరిస్తున్నారు

పిల్లలు అరటి పండ్ల కోసం పేచీ పెడుతూ "అమ్మా దేముడు ప్రసాదం ఎప్పుడిస్తాడు!" అని వేధించుకుతింటూ తిరునాళ్ళలో కొనుక్కుందుకు డబ్బులు ఇమ్మని పేచీ పెడుతున్నారు!

"డూ డూ బసవన్న అమ్మగారికి దండం పెట్టూ, అయ్య వారికి దండం పెట్టూ" అని సింగారించిన గంగిరెద్దును వూరేగిస్తున్నాడు గంగిరెద్దువాడు.

"అంబపల్కు, జగదాంబ పల్కు" అని డమరుకను చప్పుడు చేస్తూ యాచిస్తున్నాడు బుడ, బుడక్కలవాడు!

ప్రతీ శివాలయంలోను చెప్పలేనంత జన సందోహం ఆలయ ప్రాంగణమంతా నవపరిమళంతో నిండి వుంది.

త్వరగా దర్శనం ముగించుకుని కాఫీ త్రాగుదామని కంగారుపడే వారు కొందరు, లైనులో దూరి దర్శనం త్వరగా చేసుకుని బలహారాలు



దుండి గణపతి (చాళుక్య శిల్పం)
ద్రాక్షారామం

వినవయ్యా విభవలో....

"అనివార్య వరదలు
అవినీతి రాజకీయాలు
ఆగని ఉగ్రవాదుల ఉరకలు
ఆశలు చచ్చిన నిరుద్యోగులు
వినవయ్యా 'విభవ'లో మా విలాపాలు
తొలగించవయా మా వేదనలు
దండమయా దుండి గణపయ్యా"

-నిడమర్తి ఆదిలక్ష్మీ ప్రసాద్

చేసుకుందుకు ఇంటికి వెళ్ళేవారు కొందరు, చెప్పులు విడిచినందువల్ల దైవ దర్శనం మీద నిలకడ లేనివారు, ఈ సందడిలోనే పాదరక్షలు తస్కరించేవారు, జేబులు కొట్టి కడుపులు నింపుకుందామనుకునేవారు. ఎవరి అడావిడిలో వారు వున్నారు. ఇదంతా నాకు తమాషాగ అనిపించింది. ఇలా సాయంత్రం వరకూ గుడి చాలా సందడిగా వుంది.

* * * * * *

సాయంత్రం అందరూ ఫలహారాలు ముగించుకుని, బయట పడుతున్నారు. తాము ముందే నిర్ణయించుకున్న విధంగా జాగరణ చెయ్యటాన్కి 'నల్గురుతో పాటూ, నారాయణ అన్నట్టుగా వారితో పాటు నేను వున్నాను.

తెల్లవార్లూ పేకాట ఆడి జాగరణ చేయదల్చుకున్నవారు భార్యా, బిడ్డల్ని హరికథలకు పంపించి ఇంట్లో చెంబు. ముంత తెచ్చి పేకాట జోరుగా ఆడేస్తున్నారు.

సినిమా పిచ్చి వున్నవారు మొదటి ఆట, రెండవ ఆట మూడవ ఆట సినిమాలకు వెడుతున్నారు. సినిమా టిక్కెట్ల లైనులోనే జాగరణ చేసేస్తున్నారు. వారిలో కొందరు జేబులు తడుముకుని వెర్రి ముఖాలు వేస్తున్నారు ! వారిలో లతాంగులు మెడలు తడుముకుని తెల్ల ముఖం వేస్తున్నారు! పోకిరీ వాళ్ళు ఆడవారి మీద చెయ్యివేసి 'సారీ' అంటున్నారు పుణ్య కోసం జాగరణ చేద్దామనే వుద్దేశ్యంతో సినిమాకు వచ్చిన విషయం మర్చిపోయి!

"రాజాగారి బొచ్చు కుక్కలు కూడా జాగరణ చేస్తున్నాయి. వచ్చేపోయే జనాల్ని చూచి ఎవరు దొంగలో ఎవరు దొరలో తెలియక!!

స్త్రీలు గుమిగూడి గవ్వలు ఆడేసు కుంటున్నారు తన్మయత్వంగా శివరాత్రి జాగరణ ఆసరాగా తీసుకుని.

పడతులు రామశాస్త్రి గారి అరుగు మీద సభ చేసి. సరస సంభాషణలతో ఇరుగమ్మా- పొరుగమ్మా మీద ఆడిపోసుకుంటూ జాగరణ చేస్తున్నారు. వారి సంభాషణ విన్న నాకు నవ్వు వచ్చింది.

పందిట్లో శివరాత్రి సందర్భంగా మైకులో పాటలు వినబడు తున్నాయి.

"ఆరేసుకోబోయి పారేసు కున్నాను హరి హరి!", "కొందరికేమో జన్మకో శివరాత్రి మరి కొందరికేమో ప్రతి రాత్రి నవరాత్రి" మొదలైన పాటలతో, వన్స్‌మోర్ అనే కేకలతో అంతా రణ, గొణ ధ్వనిగా వుంది. శివరాత్రి అన్న సంగతి మర్చిపోయి. జాలీ రాత్రిగా కాలక్షేపం చేస్తున్నారు. "కలియుగం అంటే ఇదే కాబోలు" అనిపించింది నాకు.

* * * * * *

జాగరణలో ప్రధాన ఘట్టం హరి కథా కాలక్షేపం! అన్ని చూచి విసుగు చెందిన నేను హరికథా కాలక్షేపం



దగ్గర చేరుకున్నాను.

ముందు నుండి ప్రచారం చేసిన హరిదాసు గారు రానే రాలేదు. ఆ టైముకి ఏవో ఎక్స్క్యూజులు చెపుతున్నారు నిర్వాహకులు. అదేమి శాపమో తెలియదు కాని ఊరు పొలి మేరలో అడుగు పెట్టే వరకూ పార్వతీ కల్యాణం చెపుదా మనుకున్న హరిదాసు లంతా వూర్లో అడుగు పెట్టేసరికి సీతాకల్యాణం చెపుతాము అంటారుట.

సుప్రసిద్ధ లైనటు వంటి, పలు బిరుదాంకితు లైనటువంటి హరిదాసు గారు వేదిక నలంకరించారు.

ముసలి– ముతక, పిల్ల– మేక, బీద– సాద, రాజా–పేద మొదలైన వారితో సభ నిండుగా వుంది.

హరిదాసు గారు కూడా గంభీరంగానే వున్నారు. చేతిలో చిడతలు, నుదుట కుంకుమ, మెడలో పూల మాల, చేతికి బంగారు కడియం, వేళ్ళకు వుంగరాలు, కాళ్ళకు గజ్జలతో, పట్టు బట్టలు ధరించి చూపరులకు వుల్లాసంగా కనబడు తున్నారు.

స్టేజి ఎక్కగానే ఒక్కసారి గొంతి గట్టిగా వుందో లేదో అని పరిశీలన చేశారు. అయితే గట్టి కథకులే అనిపించారు.

ప్రార్థనా గీతం ఆలపించారు. సినిమా పాట స్టైలులో. జనంలో వుత్సాహం అందుకుంది.

సీతా కల్యాణం కథ చెప్ప నారంభించారు. కథ మంచి పట్టులో వుండగా జనంలో కలకలం బయలు దేరింది. దానికి వైద్యం హరిదాసు గారికి బాగా తెలుసు కాబోలు, అంతే వెంటనే కథను చిన్న మలుపు తిప్పి పిట్ట కథను ప్రారంభించారు.

"మా వూళ్ళో ఒకసారి ఏమయిందంటే! ఓ శివరాత్రి జాగరణ నిమిత్తం హనుమంతుడు గుళ్ళో పురాణ కాలక్షేపం ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. అమడ దూరంలో రికార్డు డాన్సులు ప్రోగ్రాం జరుగుతోంది. అందులో "ఒకలైలా కోసం తిరిగాను దేశం", "లేలే నా రాజా" మొదలైన పాటలతో వాటికి అనుగుణంగా జోరుగా డాన్సులు చేస్తున్నారు. కుర్రకారు ఈలలు వేసి, గోల చేస్తున్నారు. హనుమంతుడికి ఈ పురాణ శ్రవణం విసుగు కల్గించిన దట. అయన గుడిలో నుండి వెళ్ళి ఆ రికార్డు డాన్సుల పందిట్లో కూర్చున్నాడట."

"ఏమయ్యా! హనుమంతా!! ఏమిటి ఇలా వేంచేశావు అన్నారుట." "ఏమి చెయ్య మంటారు. అస్తమాను ఆ పురాణం విని బోరుగా వుంది. ఉప్పిడి ఫిండి తిన్నట్టుగా వుంది. మరి నేనేమో "వుప్పు– కారం తింటున్నాను కదా!" అందుకే ఇక్కడకు వచ్చేసేను" అన్నాడుట హనుమంతుడు నసుగుతూ! అని హరిదాసు గారు మెడలో పూలదండను సవరించుకుంటూ విన్నవించేరు.

అంతే జనంలో వుత్తేజం కల్గింది. నవ్వులు, కరతాళ ధ్వనులుతో మిన్ను ముట్టాయి!

అసలు కథలో ప్రవేశించారు హరిదాసు గారు. చదివింపులు ప్రారంభించారు. జనం చదివింపులు– ఆశీర్వచనాలు జర్గు చున్నాయి. ఈ చదివింపులు. మనసులో అంచనా వేసుకున్న హరిదాసు గారు ఇంకా ఎటువంటి పిట్ట కథలు చెప్పి జనులను రంజింప చెయ్యాలా అని అనుకుంటూ అసలు కథలో ప్రవేశించారు హరిదాసు గారు. కథ చాలా బాగుంది. అయితే చెణుకులు లేక పోవటంతో జనం నిద్రాదేవి ఒడిలో వాలటానికి సిద్ధంగా వున్నారు.

"ఏమోయ్ నిన్నే! ఇలా రావోయ్! నిన్నే" అని హరిదాసు గారు ఒక్క గావుకేక పెట్టారు. ఆ దెబ్బతో అందరికీ మెలకువ వచ్చి హరిదాసు గారు చూపిన దిక్కు చూచారు!


"అలా అన్నాడండీ సుగ్రీవుడు" అన్నారు హరిదాసు గారు కొంచెం పాలు - మిరియాలు తీసుకుంటూ!

అందరికీ మెలకువ వచ్చింది. పకపకా పడి, పడి నవ్వారు జనాలు.

"ఒకసారి ఏమయిందంటే మా వూళ్ళో ఎమ్మెల్యే గారి ఇంట్లో మహా వైభవంగా వివాహం జరుగుతోంది. రాత్రి మూడు గంటల ప్పుడు

ఇ 'వేమన' పద్యాలు

ధర్మ రక్షకుడు



ధర్మమరసిపూని ధర్మరాజాదులు
నిర్మలంపు కీర్తి నిలుపుకొనిరి
ధర్మమే నృపులకు తారకయోగంబు
విశ్వదాభిరామ వినురవేమ

నిముషాలుకు ముహూర్తం. బ్రహ్మగారు కళ్ళు నులుముకుంటూ వచ్చి పెండ్లి తతంగం ప్రారంభించారు. మంత్రాలు చదువుతూ ఏవేవో చేయమని అందరికి పురమా యిస్తున్నారు బ్రహ్మగారు. మొత్తానికి పెండ్లి అయింది! బ్రహ్మగారు మూట- ముల్లె సర్దుకుని ఇంటికి వెళ్ళి పోయారు. బ్రహ్మ గారి భార్య మూట విప్పింది. ఆ బియ్యంలో మంగళసూత్రాలు తళతళా మెరుస్తున్నాయి. అమెకు గుండె ఆగినంత పని అయ్యింది.

"అయ్యో! ఇదేమి ఖర్మండీ మంగళ సూత్రాలు తెచ్చేసారు. ఏమి పెండ్లి చేయించేరండి" అని బ్రహ్మగారి భార్య నెత్తి నోరు బాదుకుంది. అప్పుడు బ్రహ్మ గారికి పూర్తిగా మెలకువ వచ్చింది. "ఎలాగ ఇప్పుడు ఏమి చెయ్యాలి" అని గాబరా పడసాగారు బ్రహ్మగారు.

శివరాత్రి జాగరణ

అప్పుడు ఆయన అర్ధాంగికి ఒక వుపాయం తోచింది! "మీరు ఒక పని చెయ్యండి" అని చెవిలో గుసగుసగా చెప్పారు.

ఈ సలహా బ్రహ్మగారికి బాగానే నచ్చింది. చీకటి పడే వేళకు పెండ్లి వారింటికి చేరుకున్నారు. అందరూ నిద్రలో జారుకున్న సమయంలో పెండ్లి కూతురు ఏ గదిలో ఎక్కడ పడుక్కుందో జాగ్రత్తగా గమనించి నెమ్మదిగా పెండ్లి కూతురు వున్న గదిలో ప్రవేశించి ముందుగా దీపం ఆర్పేసి, జాగ్రత్తగా తను గుర్తు పెట్టుకున్న ప్రకారం వెళ్ళి, గబగబా పుస్తె ముడి వేసి ఎవరూ చూడకుండా ఇంటికి చేరుకుని వంటికి పట్టిన చెమటను పై పంచతో తుడుచుకున్నారు.

ఇంతకీ జరిగిం దేమిటంటే ఆ చీకట్లో పెండ్లి కూతురు మెడలో పుస్తె కట్టడానికి బదులుగా, ఆ ప్రక్కన వున్న విధవ బామ్మగారి మెడలో కట్టారు బ్రహ్మగారు." ఇదండీ సంగతి. అని ముగించాడు బుర్ర గోక్కుంటూ.

జనమంతా ఘొల్లున నవ్వారు. బామ్మగార్లు సిగ్గుతో ముసుగులు ముందుకు లాక్కున్నారు. చదివింపులు తారస్థాయిని చేరుకున్నాయి. ఆశీర్వాదాలు దండీగానే జరిగాయి.

ఆయనకు మనస్ఫూర్తిగా సీతా కల్యాణం పూర్తిగా సవివరంగా చెప్పాలనే వుంది! కాని అసలు కథ వినే వాళ్ళెవరు?! మళ్ళీ కథను ప్రారంభించారు. కథ చక్కగా నడుస్తోంది.

కాని ప్రాజ్ఞులైన వారికి విసుగు వస్తోంది! "ఎప్పుడు వినే "సీతా కల్యాణమే" అని ఒక్కొక్కరే లేవటం మొదలు పెట్టారు. హరిదాసు గారికి అర్థమయి పోయింది. "ఇంక లాభం లేదు" అనుకుని "అప్పుడు సీతాదేవి రాముల వారిని చూచి ఎలా సిగ్గు పడింది అభినయించి చూపించి, నేటి సీత అయితే ఇలా అంటుంది అని ఇలా చెప్పడం ప్రారంభించారు.

"ఐ యామ్ ఎ డిస్కో డాన్సర్" అంటూ డిస్కో డాన్సు స్టెప్పులు వేశారు దాసుగారు.

ఆహా! ఇక వేరే చెప్పాలా! బయటకు వెళ్ళిన జనం, చుట్టు పక్కల వున్న జనం లోపలికి వచ్చారు. ఇంక చూడండి జనుల ఆనందానికి అవధు ల్లేవు.

"అమ్మలారా! అయ్యలారా!! కొంచెం సేపు ఓపికగా కూర్చుంటే మన కథా పూర్తవుతుంది- జాగరణ చెయ్యడం పూర్తవుతుంది. పుణ్యం- పురుషార్థం కూడా దక్కుతాయి! దయచేసి కూర్చోండి" అని మనవి చేసుకున్నారు హరిదాసు గారు. జనం అంతా సర్దుకుని చతికిల బడ్డారు. ఇంకా హరిదాసు గారు ఏమేమి తమాషాలు చేసి చూపిస్తారో చూద్దామని.

ఇదే సమయ మనుకుని హరిదాసు గారు కథను శాస్త్రయుక్తంగా చెపుతున్నారు.

కొంత సమయం గడిచే సరికి జనాలకి బోరు కొట్టింది కాబోలు ఒక్కొక్కరే వెళ్ళి పోతున్నారు.

హరిదాసు గారు పరిస్థితిని గ్రహించారు. అంతే కథను క్లుప్తంగా ముగించి తక్కున మంగళం పాడేసారు.

ఇదంతా గమనిస్తున్న పరమ శివుడు మూడవ కన్నే కాదు మిగిలిన రెండుకళ్ళూ మూసుకున్నారు.

తప్పయి పోయింది క్షమించు స్వామీ! "కూటి కోసం" అన్నట్లుగా ఏదో కూయవలసి వచ్చింది. మహాప్రభో శంకరా! ఈ నీ దాసుడ్ని క్షమించవయ్యా!!" అని సాష్టాంగ ప్రమాణం గావించారు హరిదాసు గారు!"

ఇంటికి ఎప్పుడు చేరుకున్నానో తెలియదు. శ్రీమతి ఇచ్చిన వేడి, వేడి కాఫీ గ్లాసు చేతికి తగిలేసరికి తెలిసింది శివరాత్రి జాగరణ పూర్తయి చాలా సేపయిందని! □

సమాజంలో మార్పే సమస్యలకి పరిష్కారం



ఆలయంలో జరిగిన 'శుద్ధి' కార్యక్రమంతో భాగంగా ఇచ్చిన 'కంఠమాల'ని ధరించిన హరిజన యువకుడు

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి నాలుగు దశాబ్దాలు దాటినా అనాదిగా ఉన్న ఎన్నో దురాచారాలు, మూఢ నమ్మకాలు ఇంకా అలాగే కొనసాగుతూ ఉన్నాయన్న దానికి నిదర్శనాలెన్నో కనిపిస్తూ ఉండటం నిజంగా దురదృష్టమనే చెప్పాలి. సాంకేతికంగా ఎంత అభివృద్ధి సాధించినా సమాజంలో ఉన్న వారి దృక్పథంలో మార్పు రానంత వరకూ అది నిష్ఫలమే అవుతుంది. మానవత్వం అన్నది అన్నిటి కన్నా ఉత్తమమైనది. సాటి మానవుని పట్ల విచక్షణ చూపటం క్షమించరాని నేరం. జాతి మత భాషా వైషమ్యాలు మన దేశంలో అత్యంత విషాదకరమైన దుర్ఘటనలకి కారణం అవుతున్నాయన్న విషయం అందరికీ తెలిసిందే. అనాదిగా భయంకరమైన విచక్షణకి గురవుతూ వస్తున్న ఒక వర్గం వారిపై నేటికీ అమానుషమైన అత్యాచారాలు జరుగుతున్నాయంటే అది నిజంగా మనం సిగ్గుతో తలలు వంచుకోవలసిన విషయం. విచక్షణకి గురవుతున్న ఆ వర్గంవారి అభ్యున్నతి కోసం మహాత్మాగాంధీ తమ జీవితాన్ని అంకితం చేసారు. ఆయనే వారికి హరిజనులని పేరుపెట్టారు. కానీ ఇప్పుడు ఆయన వారసులు త్యాగం, స్వయంకృషి కన్నా ప్రభుత్వ విధానాలే ముఖ్యంగా భావిస్తున్నట్టు కనిపిస్తున్నది. ప్రభుత్వపరంగా హరిజనోద్ధరణకి జరుగుతున్న కృషి ఫలితాన్ని స్వార్థపరులు కొందరు అందవలసిన వారికి అది అందకుండా చేస్తున్నారని ఎంతోమంది అంటూ ఉంటారు. హరిజనుల కోసం ఉద్దేశించబడిన సౌకర్యాలని అన్యాయంగా, అక్రమంగా స్వార్థపరులైన కొందరు చేజిక్కించుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయన్న విమర్శ ఉన్నది. నిలువెల్లా స్వార్థాన్ని నింపుకున్న రాజకీయ నాయకులు కొందరు హరిజనుల అసహాయతని, పేదరికాన్ని, అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని కల్లబొల్లి కబుర్లతో వారిని ఏవేవో ప్రలోభాలకి గురి చేసి తమ పబ్బం గడుపుకోవటం జరుగుతున్నది. రాజకీయాధికారంలో కూడా వారికి ఉన్నత స్థానాలు దక్కకుండా చేసిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయి.

భయంకరమైన విచక్షణకి విసిగిపోయిన కొందరు హరిజనులు ఇతర మతాలలో చేరినావారి పరిస్థితిలో మార్పులేదు. కేరళలో ఈ మధ్య జరిగిన హరిజన క్రైస్తవ సమావేశం ఆ విషయాన్ని తెలియ చేస్తున్నది. చర్చి, ప్రభుత్వం రెండూ తమ పట్ల విచక్షణ చూపిస్తున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేసారు.

దేశంలో హరిజనులపై అత్యాచారాలకి కొదువలేదు. బీహార్‌లోని ధమూహా, ఖాగరి గ్రామాలలో జరిగిన దాడులలో స్త్రీలు, పిల్లలతో సహా 11 మంది హరిజనులు దారుణంగా కాల్చి చంపబడ్డారని ఇటీవలే వార్తలు వెలువడ్డాయి. ఆంధ్రప్రదేశ్‌లో కారంచేడు, నీరుకొండ మొదలైన చోట్ల హరిజనులపై జరిగిన భయంకరమైన దాడుల విషయం అందరికీ తెలిసిందే. ఇటువంటివన్నీ మానవత్వానికే తీరని కళంకాన్ని తెచ్చే దుర్ఘటనలు. సాటి మనిషిని సహృదయంతో అర్థం చేసుకునే మనస్తత్వం, అందరూ ఒక్కటే అన్న భావన సమాజంలో రానంత వరకూ ఎన్ని చట్టాలు చేసినా ఫలితం ఉండదు. అసలు మార్పు అన్నది మనలోనే రావాలి. నానాటికీ పెరిగిపోతున్న స్వార్థ రాజకీయాలు పరిస్థితిని మరింత దిగజారుస్తున్నాయి. చివరికి హరిజనుల ఆలయ ప్రవేశ యాత్రలు కూడా ప్రచార కార్యక్రమాలుగా మారుతున్నాయన్న దానికి నాథ్ ద్వారా సంఘటన



నాథ్‌ద్వారా శ్రీనాథ ఆలయంలోకి వెళ్ళిన హరిజనుల కోసం ఆత్రుతగా నిరీక్షిస్తూ మూసి ఉన్న గుడి తలుపుల ముందు నిలబడి ఉన్న అధికారులు. పోలీసులని చిత్రంలో చూడవచ్చు

సమాజంలో మార్పే సమస్యలకి పరిష్కారం


ఒక ఉదాహరణ.

రాజస్తాన్‌లోని నాథ్‌ద్వారా శ్రీనాథాలయంలోకి హరిజనులని రానివ్వటం లేదని వార్తలు కొంత కాలంగా వినిపిస్తున్నాయి. అక్కడి రాష్ట్రప్రభుత్వానికి ఆ కార్యక్రమాన్ని నిర్వహించమని కేంద్రం ఆదేశాలు పంపింది. ఇక ఆ రాష్ట్రప్రభుత్వం దానికి భారీఎత్తున ప్రచారం ఇచ్చింది. కానీ ఆగస్టు 9న జరగవలసిన హరిజనుల ఆలయ ప్రవేశం అనుకున్నట్లు జరగలేదు. నాథ్‌ద్వారా సంఘర్ష సమితిగా ఏర్పడిన అక్కడి ప్రజలు కొందరు దానిని వ్యతిరేకిస్తూ బంద్ జరిపారు. ప్రభుత్వం వేలాదిమంది పోలీసులని, ఉన్నతాధికారులని అక్కడికి పంపినా ఫలితం లేకపోయింది. అతి కష్టం మీద సంఘర్ష సమితి వారు ఆ మర్నాడు హరిజనుల ఆలయ ప్రవేశానికి అంగీకరించారు. పదవ తేదీ ఉదయం హరిజనులకి రక్షణగా ఆలయంలోకి వెళ్ళిన పోలీసులని, అధికారులని, చివరికి రాజకీయ నాయకులని కూడా ఆలయ సిబ్బంది బయటికి పంపి. ప్రధాన ద్వారం మూసివేశారు. లోపల ఉండిపోయిన హరిజనులు భయాందోళనలతో బిక్కు బిక్కుమంటూ ఆలయ సిబ్బంది ఏది చెప్తే అది చెయ్యటానికి సిద్ధమైనారట. మొదట వారందరినీ ఒక చోట చేర్చి శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించి మెడలో కంఠమాలలు వేసుకోమని ఆ తర్వాత వారికి తులసీదళాలు ఇచ్చి, గంగాజలం చల్లిన తర్వాత దైవదర్శనం చేయించి గంటన్నర తర్వాత తిరిగి బైటికి తీసుకు వచ్చి ఆతృతతో వారి కోసం నిరీక్షిస్తున్న అధికారులకి అప్పగించారట. ఆలయప్రవేశం చేసి బయటికి వచ్చిన హరిజనుల పైన, వారికి రక్షణగా ఉన్న పోలీసులపైన జనం రాళ్ళు రువ్వటంతో హింసాకాండ ప్రారంభం అయింది. పోలీసులు లాఠీఛార్జి చేసారు. ఫలితంగా ఆరుగురు హరిజనులు, పోలీసు డి. ఐ. జి. తో సహా అనేక మంది పోలీసులు గాయపడ్డారు. ప్రభుత్వం పూనుకుని భారీ ఎత్తున ప్రచారం చేసుకున్న హరిజనుల ఆలయ ప్రవేశ యాత్ర ఆవిధంగా ముగిసింది.

దీన్నిబట్టి మార్పు ప్రజలలో రానంత వరకూ చట్టాలూ, ప్రభుత్వం సాధించగలిగేది, ముఖ్యంగా దురాచారాలూ, మత మౌఢ్యాల విషయంలో చాలా స్వల్పం అని స్పష్టమవుతుంది. నాయకులనే వారెవరైనా అలా అనుకుంటే అది ఆత్మ వంచనే అవుతుంది.


చిత్తశుద్ధిలేని ఇటువంటి సంస్కరణ ఉద్యమాల వల్ల స్వార్థపరులైన రాజకీయ నాయకుల ప్రచారానికి తప్ప మరెవరికీ ప్రయోజనం ఉండదు. త్యాగం, స్వయంకృషి అన్నవి ఎంతైనా అవసరం. కానీ దేశంలో క్రమంగా బలపడుతున్న కొన్ని వర్గాల వైఖరి దీనికి భిన్నంగా ఉందనిపిస్తున్నది. మధ్య రకం రాజకీయ పక్షాలనే వాటికి అధికారమే ప్రధానం తప్ప స్త్రీలు, హరిజనులు, నిరుపేదలు, అల్పసంఖ్యాక వర్గాలవారి సమస్యలు ముఖ్యం కావని అనిపిస్తున్నది. ఎక్కువగా అలాంటివారే రాజకీయాలలోకి వస్తున్నారు. వాళ్ళే ఇప్పుడు సిద్ధాంతాలకి తిలోదకాలిచ్చి అధికారాన్ని ఎలాగో అలా చేజిక్కించుకోటానికి, దాన్ని నిలుపుకోటానికి పాట్లుపడుతున్నారు. ఆశ్రిత పక్షపాతం, అవినీతి, బంధుప్రీతి అన్ని స్థాయిలలో విలయ తాండవం చేస్తున్నది. అలాంటి ఆరోపణలు ఉన్న వారే ఉన్నత స్థానాలని అందుకుని మరొకరిపై అవే రకమయిన ఆరోపణలు చేస్తూ ఉండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఏ విధంగా చూసినా నిరాశ నిస్పృహలే నానాటికీ ఎక్కువయ్యే సూచనలు కనిపిస్తున్నా ఆరోగ్యకరమైన మార్పు సమాజంలో వచ్చి, అవకాశ వాదుల ఆట కట్టించి, మానవత్వం. సమానత్వం, సోదరభావం అందరిలో పెంపొందే తరుణం హాలాహలం తర్వాత అమృతంలా త్వరలోనే ఆవిర్భవిస్తుందని ఆశించాలి. (ఒ. వి.)

అమృతాంజన్
లిమిటెడ్‌వారి విశిష్టమైన
ఆముదము



అమృతాంజన్ లిమిటెడ్ 42-45, లజ్ చర్చ్ రోడ్డు, మద్రాసు 600 004

Amrutanjan Limited



(గత సంచిక తరువాయి)

"శైలజా!" అన్న వాసు అరుపు విని, నిద్రలోకి జోగుతున్న వాడల్లా ఉలిక్కిపడి అటెన్షన్‌లోకి వచ్చాడు కుక్కుటం.

"సార్... శోభనం గదిలోంచి పెళ్ళికొడుకు అరిచాడు!"

కంగారుగా అన్నాడు యస్. ఐ. నరసింహ.

"షటప్! శోభనం గదిలో పెళ్ళికొడుకు అరవక నువ్వూ నేనూ అరుస్తామా?" అన్నాడు కుక్కుటం.

ఇంతలో –

లోపల గదుల్లోంచి మోహన్రావు, అతని వియ్యంకుడు సుబ్బారావు– మిగతా బంధువులు– ఆడవాళ్ళు– అంతా పరుగెత్తుకొచ్చారు.

"సార్! పెళ్ళికొడుకు అరుపు డేంజరస్‌గా వుంది సార్!" అన్నాడు యస్సై నరసింహ తక్కున లేచి నిల్చుని.

జరిగిన కథ– 11: దేదీప్య శైలజతో ఒక ముఖ్య విషయం మాట్లాడుతుంది. మోహన్‌రావును బెదిరిస్తూ రాకా నుంచి ఉత్తరం వస్తుంది. సీతాదేవి భర్త శ్రీనాథ్ జైలు నుంచి విడుదలై వస్తాడు. తల్లిదండ్రితో కలిసి దేదీప్య కారులో యాదగిరిగుట్టకు బయలు దేరుతుంది. మార్గమధ్యంలో శ్రీనాథ్‌ను దుండగులు కాల్చి చంపేస్తారు. సీతాదేవి, దేదీప్య విడివిడిగా దుండగులలో ఒకరొకరిని గుర్తిస్తారు. ఇద్దరూ ఒకరికి తెలియకుండా ఒకరు ప్రతీకారాలు ఆలోచిస్తుంటారు. దేదీప్య రాకాకు కూడా చెప్పకుండా ఉంటుంది. శైలజ శోభనం రాత్రి భర్తతో విచిత్రంగా ప్రవర్తిస్తుంది.

"సరసమెక్కువై పెళ్ళికూతురు– బుగ్గలు కరిచేసిందేమో!" అన్నాడు కుక్కుటం తన భారీకాయాన్ని సోఫాలోంచి కదల్చడానికి ప్రయత్నిస్తూ.

"శైలూ...." మళ్ళీ వాసు గొంతు బిగ్గరగా విన్పించింది. అందరూ హడావుడిగా శోభనం గదివేపు పరుగెత్తారు.

ఇంతలో –

"ధాం!" అని చెవులు చిల్లులు పడేలా రివాల్వర్ పేలిన శబ్దం విన్పించింది.

తలుపులు బద్దలు కొట్టుకుని లోపలికి అడుగుపెట్టిన కుక్కుటం నిశ్చేష్టుడైపోయాడు.

బిలబిలమంటూ గదిలోకి వచ్చిన జనం– లోపలి దృశ్యాన్ని చూసి హడలిపోయారు.

గది మధ్యలో – మంచానికి కాస్త దూరంగా శైలజ– రక్తపు మడుగులో పడివుంది.

ఆమె ఎదురుగా–

పిచ్చి చూపులు చూస్తూ వాసు నిలబడివున్నాడు.

"వాట్ హాపెన్డ్? ఏం జరిగింది?" అడిగాడు కుక్కుటం ఒక్క గంతులో వాసు దగ్గరకెళ్ళి. అతను కుక్కుటం వేపు చూశాడు గానీ ఏం సమాధానం చెప్పలేదు.

అతను షాక్‌లో కెళ్ళిపోయాడని గ్రహించిన కుక్కుటం– ఈడ్చి చెంపమీద కొట్టాడు. వాసు ఉలిక్కిపడ్డట్టు కదిలాడు.

"టేక్‌హిమ్ అవే ఫ్రం హియర్! నరసింహా! ఈ అమ్మాయి దగ్గరకెవర్నీ రానీయకు!" అని కుక్కుటం జాగ్రత్తగా మోకాళ్ళమీద కూర్చుని ఆ అమ్మాయి చేతిని పట్టుకున్నాడు.

"షిఈజ్ డెడ్!"

శైలజ రెండో చేతిలోని రివాల్వర్ అలాగే వుంది.

"అమ్మా... శైలూ... నా తల్లీ! ఏమయిందమ్మా... మాట్లాడవా?" పిచ్చెక్కినవాడిలా కూతురి శవం దగ్గరకి రావడానికి ప్రయత్నం చేస్తున్న మోహన్రావుని ఆపాలని అతని బంధువులు శత విధాల ప్రయత్నిస్తున్నారు.

పరిస్థితి కంట్రోల్ చెయ్యడం కష్టం అనిపించిన కుక్కుటం కానిస్టేబుల్‌ని చూసి–

"అందర్నీ బయటికి పంపి గది తలుపు వేసెయ్! నేను డి. జి. పి. గారికి ఫోన్‌చేసి వస్తాను!" అంటూ బయటికి పరుగెత్తాడు.

ఏడ్పులతో – పెడబొబ్బలతో ఆ ప్రాంతం దద్దరిల్లిపోయింది.

* * * * * *

"కెన్ ఐ స్పీక్ టు హిమ్ డాక్టర్?" అడిగాడు కళ్యాణరాం డాక్టర్ థామస్‌ని.

"యస్.... కానీ ఆ సంఘటన గురించి మాత్రం గుచ్చి గుచ్చి అడగకండి! మళ్ళీ అతనికి షాక్ కలగొచ్చు!" అన్నాడు డాక్టర్.

"అలాగే" నని వాసు ఉన్న గదిలోకి వెళ్ళాడు డి. జి. పి. కళ్యాణ్‌రాం.

కొన్ని గంటలల్లోనే వాసు వాలకం పూర్తిగా మారిపోయింది. ఎంతో కాలంగా నిద్రాహారాలు లేనివాడిలా నీరసించిపోయాడు.

"సారీ వాసూ! ఐయాం టెరీబుల్లీ షాక్‌డ్! నిన్ను విసిగించనుగానీ, ఆ రోజు ఏం జరిగిందో క్లుప్తంగా చెప్పు!" అన్నాడు డి. జి. పి.

వాసు మెల్లగా జరిగిన విషయం చెప్పాడు.

"ఆ అమ్మాయి గదిలోకి వచ్చినపుడు మామూలుగానే వుందా?"

"చాలా హాపీగా ఉంది."

"శైలజ దగ్గర రివాల్వర్‌ని నువ్వెప్పుడు చూశావు?"

"ఆమె హఠాత్తుగా టేబుల్‌డ్రా తెరిచి అందులోంచి తీసింది. బహుశా అది

వాళ్ళ నాన్నగారిదనుకుంటాను. ఆ గదిలోనే ఆయనెప్పుడూ విశ్రాంతి తీసుకునేవారట!" అన్నాడు వాసు.

తన ప్రశ్న తనకే సిల్లీగా అన్పించింది డి. జి. పి. కళ్యాణ్‌రాంకి. శోభనం గదిలో పెళ్ళికూతురు– పెళ్ళికొడుకూ నిరాటంకంగా ఎంజాయ్ చేసే ఏర్పాట్లు చేస్తారు గానీ– ఆ గదిలో ప్రమాదకరమైన వస్తువులేమైనా ఉన్నాయా? వాళ్ళ కొంపకు ఛస్తారేమోనని ఎవరూ ఆలోచించరుకదా!


కొన్ని క్షణాల మౌనంరీ తర్వాత మళ్ళీ అన్నాడు డి. జి. పి.

"సారీ! ఈ ప్రశ్న కాస్త ఇబ్బందిగానే వుంటుంది. గానీ తప్పదు.... ఆమె ఏ స్టేజిలో ఆ మూడ్‌లోకి వెళ్ళింది?... ఐమీన్..."

"అర్థమైంది సర్! అప్పటికి మేమా స్టేజీకి వెళ్ళలేదు. కొంచెం దగ్గరగా కూర్చున్నాం అంతే!" అన్నాడు వాసు.

డి. జి. పి అడుగుతున్న ప్రశ్నలూ– వాసు ఇస్తున్న సమాధానాలూ డి. జి. పి వెంట వచ్చిన స్టెనో నోట్ చేసుకుంటున్నాడు.

"ఆ అమ్మాయిని నువ్వు వారించడానికిగానీ, కలబడడానికిగా ప్రయత్నించలేదా?"



పవిత్ర పాపి

"లేదుసర్! శైలజ చాలా డేంజరస్ మూడ్‌లో వుంది. ఎక్కడ ట్రిగ్గర్ నొక్కుతుందోనని గాబరాపడుతున్నాను. శైలజ నన్ను చంపుతుందనుకున్నాను గానీ తన్ను తాను కాల్చుకుంటుందనుకోలేదు!"

అంటున్న వాసు కంఠం జీరబోయింది.

"అప్పుడా అమ్మాయి ఎలా కన్పించింది? పిచ్చిదానిలాగానా?" అడిగాడు డి. జి. పి.

"లేదుసర్! ఏదో ఇంటాక్సికేటెడ్ మూడ్‌లో ఉన్నట్లనిపించింది!"

"ఇట్సాల్‌రైట్! సీయూ ఎగైన్!" అంటూ లేచాడు డి. జి. పి. కళ్యాణ్‌రాం.

* * * * * * *

"శోభనం గదిలో దారుణం! రొమాన్స్‌లో రాక్షస క్రీడ!! పెళ్ళికొడుకుని రివాల్వర్‌తో బెదిరించి తన్ను తాను కాల్చుకుని మరణించిన మగువ తెగువ!"

"పెళ్ళికొడుకులూ పారా హుషార్! మీ కొత్త భార్యల అలవాట్లు– శోభనం గదిలోని సామాన్లు– ముందే పరిశీలించుకోండి! అక్కడ రివాల్వర్లుండచ్చు! బాంబులుండచ్చు!"

"శోభనం గదిలో జరిగిన ఆత్మహత్య వెనక మిస్టరీ ఏమిటి? ఇందులో "రాకా" హస్తం ఎంతవరకూ వుంది? రాకా ఈ విధంగా మోహన్రావు మీద పగ తీర్చుకున్నాడా?"

వివిధ పేపర్లు తమ ఇష్టం వచ్చినట్టుగా వ్యాఖ్యానిస్తూ రాసిన బ్యానర్ వార్తలు చదివిన శంభు దాదా పేపర్లు పక్కకి విసిరికొట్టాడు.

ఎందుకో ఈ వార్త అతన్ని చాలా కలవర పరిచింది. అతని కళ్ళు కోపంతో ఎరుపెక్కాయి! అతని పిడికిళ్ళు బిగుసుకున్నాయి!

మోహన్రావ్ మీద పగ తీర్చుకోవడానికి అతని కూతురు ఆత్మహత్యకు పాల్పడేలా 'రాకా' చేశాడా? ఎలా చేశాడు? ఎంత బుర్రబద్దలు కొట్టుకున్నా జరిగిందేమిటో అతనికి అర్థం కాలేదు.

ఇంతలో అతని శిష్యుడు పకీర్‌స్వామి ఫోనొచ్చిందని చెప్పడంతో ఒక్క అంగలో తనగదిలో కెళ్ళి రిసీవర్ ఎత్తాడు శంభూ దాదా.

"శంభూ! రాకా చేసిన గోలవిన్నావా?" అడిగిందో బొంగురు కంఠం.

ఆ కంఠం వినగానే శంభుదాదాలోని కోపం ఎగిరిపోయి వినయం చోటు చేసుకుంది.

"విన్నాను!" అన్నాడు.

"వాడీ ఘోరం చెయ్యడం మనకి చాలా మంచిది! ఇక మనం మన పనులు మొదలుపెట్టాలి! వజ్రాలహారంతో రాణీ గాయత్రీదేవి నగరానికి రాబోతోంది తెలుసా?"

ఆ మాట వింటూనే శంభుదాదా గుండె వేగం పెరిగింది.

"ఎప్పుడు?" అడిగాడు ఆతృతగా.

"అది తర్వాత చెప్తాను! నువ్వీ రాత్రికి నా దగ్గరకిరా! ఆ విషయాలన్నీ వివరంగా మాట్లాడుకుందాం!" అందా కంఠం.

"అలాగే... రాత్రి పన్నెండింటికి వస్తాను!" అని ఫోన్ పెట్టేశాడు శంభుదాదా.

రాణి గాయత్రీదేవి!

కోట్లు విలువచేసే వజ్రాలహారంతో నగరానికి రాబోతోంది!! ఎగ్జైటింగ్‌గా ఫీలైన శంభుదాదా పిచ్చిగా నవ్వేశాడు.

* * * * * * *

డి. జి. పి. చాంబర్స్!

కమీషనర్ ఆఫ్ పోలీస్ చక్రవర్తి కళ్యాణ్‌రాం గదిలోకి అడుగుపెట్టాడు. అతని ముఖం చూడగానే ఇంకేదో దారుణమైన వార్త మోసుకొచ్చాడని అర్థమైంది డి. జి. పికి.

"వాట్ హాపెండ్ మిస్టర్ చక్రవర్తీ!" అడిగాడు డి. జి. పి.

చక్రవర్తి వినయంగా సెల్యూట్‌చేసి–

"అశోకపురంలో మరో కేసుసర్! శైలజ కేసులానే జరిగింది. శోభనం గదిలో

ర్తని బెదిరించి తను ఆత్మహత్య చేసుకుంది– వనజ అనే అమ్మాయి!" ప్పాడు.

"గుడ్‌గాడ్! ఇటీజ్ రిడుక్యులెస్!"

"యస్‌సార్!" అని జేబులోంచి ఓ కవర్ తీసి డి. జి. పి.కి అందించాడు క్రవర్తి.

దాన్ని జాగ్రత్తగా తీసి చదవసాగాడు డి. జి. పి.

అది మోహన్రావుకి వచ్చిన ఉత్తరం!

"ఇప్పుడర్థమైందా మోహన్రావ్? కూతుళ్ళను అర్ధాంతరంగా కోల్పోయిన ంద్రుల బాధ? ఎందరో అమాయకుల్ని– డబ్బు కక్కుర్తికోసం యమపురికి ంపావ్! ఆ బాధ నువ్వు జీవితాంతం అనుభవించడానికే నీ కూతురు ఆత్మహత్య సుకుంది! అదే నీకు తగిన శిక్ష!– రాకా"

ఉత్తరం చదివిన డి. జి. పి. ముఖం కోపంతో జేవురించింది.

"ఒకవేళ రాకాని పట్టుకున్నా ఉత్తరాల ఆధారంగా కేసు ఫైల్ చెయ్యలేం! ందుకే తెలివిగా ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకునేలా చేశారు. అది ఎలా శారో అర్థం కావడంలేదు!" అన్నాడు డి. జి. పి.

"మన ప్రాణంతియ్యడానికి!" అనుకున్న చక్రవర్తి–

"ఇంకా సిటీలో ఈ మూడు రోజుల్లో మరో పది శోభనాలు రగబో తున్నాయ్ సార్!" అన్నాడు.

"వాట్‌డుయుమీన్? అన్ని శోభనం గదుల్లోనూ అలాగే జరుగుతాయనా మీ ద్దేశం?" అని కోపంగా అన్నాడు డి. జి. పి. కానీ అంతలో నే– తమ ఖర్మ బాగా కపోతే ఎందుకలా జరక్కూడదు? అన్పించిందాయనకి. అంత్య నిష్ఠూరంకంటే ది నిష్ఠూరమే మేలనుకుని–

"ఎనిహౌ మిస్టర్ చక్రవర్తీ! ఊరేగింపులకీ సభలకీ ముందు పోలీస్ పర్మిషన్ సుకున్నట్టు శోభనానికి ముందు మన పర్మిషన్ తీసుకోవాలని ఎనౌన్స్ చెయ్! లయితే కొన్నాళ్ళపాటు శోభనాలు వాయిదా వేసుకోమని ప్రకటించు!" అన్నాడు ళ్యాణ్‌రాం.

"జనం నవ్వుతారేమో సర్!" అన్నాడు చక్రవర్తి కాస్త అనుమానంగా

"అంటే ఇప్పుడు నవ్వడం లేదనా నీ ఉద్దేశం?" అన్నాడు డి. జి. పి.

చక్రవర్తి మాట్లాడలేదు.

"జనం నవ్వితే నవ్వనీ! అన్ని నిందలు మనమేగా భరించాల్సింది? సరే.. ండో శోభనం కేసులో పోయిన ఆ వనజ– విషయంలో ఏవైనా క్లూలు రికాయా?" అనడిగాడు డి. జి. పి.

"లేదుసర్! ఆ అమ్మాయికి తాను ఇష్టపడిన మేనమామ కొడుకునే ఇచ్చి ళ్ళి చేశారు ఆమె తండ్రి నారాయణరావు. పెళ్ళి సెటిలయ్యిందగ్గర్నుంచీ వనజ వాలా సంతోషంగా వుందని చెప్పారు. అయితే సడన్‌గా ఎందుకు ఆత్మహత్య చేసుకుందో తెలీదు–" అన్నాడు చక్రవర్తి.

డి. జి. పి. నిట్టూర్చాడు.

"అయితే ఒక్క క్లూ మాత్రం దొరికింది సర్!"


"ఏమిటది?"

"మోహన్ అపార్ట్‌మెంట్స్ మోహన్రావుగారి వర్క్స్ మేనేజర్ చనిపోయిన వనజ తండ్రి!" చెప్పాడు చక్రవర్తి.

* * * * * *

ప్రఖ్యాత సైంటిస్ట్– హిప్నాటిస్ట్ ప్రొఫెసర్ జెమిని తన ముందు కూర్చున్న పోలీస్ ఉన్నతాధికారులు డి. జి. పి. కళ్యాణ్‌రాం, కమీషనర్ చక్రవర్తినీ చూస్తూ–

"అయాం ష్యూర్ ఆఫ్ ఇట్ మిస్టర్ కళ్యాణ్‌రాం! దీని వెనక వున్న వాడెవడో గానీ మహామేధావి! టైం షెడ్యూల్ మీద ఈ ఆడపిల్లల బ్రెయిన్ లివెల్ని ఫిక్స్ చేసి పోస్ట్ డేటెడ్ సజెషన్స్ ఇచ్చాడు. హిప్నాటిజంలో ఇది చాలా అడ్వాన్స్‌డ్ స్టేజీ! అమెరికాలో కొందరు ప్రతిభావంతులైన హిప్నాటిస్ట్‌లు ఈ పద్ధతి నవలంబిస్తున్నారు.



ఉదాహరణకు శుక్రవారంనాడు ఆ అమ్మాయి తాను చెప్పిన విధంగా చెయ్యాలనుకోండి. ఈ లోపల అతనికి అనుకూలంగా వున్న ఏదో ఒక రోజు సజెషన్ ఇచ్చి శుక్రవారం నాడు ఇన్ని గంటల ఇన్ని నిముషాలకి ఇన్ని సెకన్లకి ఈ సజెషన్ ప్రకారం చెయ్యాలని టైంఫిక్స్ చేసి సజెషన్ ఇస్తాడు. నిజానికి తనో భయంకరమైన సజెషన్ తీసుకున్నట్టు కూడా ఆ అమ్మాయికి తెలియకుండానే ఫిక్స్ చేసిన టైం ప్రకారం ప్రవర్తిస్తుంది. ఒకవేళ ఆ టైం ఏదో కారణాన దాటిపోతే ఆ అమ్మాయికి ఏమీ గుర్తుండదు. మనం ఎంత ప్రయత్నించినా ఏమీ చెప్పలేదు." వివరించాడు జెమిని.

"అన్ బిలీవబుల్! ఇలా జరిగిందని కేసు ఫైలు చేసినా కోర్టు నమ్మదు" అన్నాడు కళ్యాణ్‌రాం.

ప్రొఫెసర్ జెమిని చిరునవ్వు నవ్వాడు.

"అందుకే అంటున్నాను. వాడెవడో గానీ మహా మేధావి అని! అయితే ఏ హిప్నాటిస్ట్ కూడా విద్రోహానికీ– వినాశనానికీ తన విద్యను వినియోగించడు. అయినా నిస్వార్థంగాచేస్తున్నాననే నమ్మకం అతనికున్నప్పుడే ఆ సజెషన్స్ ఎఫెక్టివ్‌గా పని చేస్తాయి." అన్నాడు.

"అయితే ఇక్కడ అతను ఆ అమ్మాయిల్ని అన్యాయంగా ఆత్మహత్యకు పురికొల్పాడు కదా!" అన్నాడు చక్రవర్తి.

"నిజమే! కాని, మనకి అన్యాయంగా అనిపించిన ఈ విషయం చేసిన వ్యక్తికి న్యాయంగా అన్పించవచ్చు. పైగా ఈ టైప్ ఆఫ్ హిప్నాటిజం అందరి మీద పని చెయ్యకపోవచ్చు కూడా!"

"ఏమో... ఈ విషయం నమ్మలేక పోతున్నాను!" అన్నాడు డి. జి. పి.

"మై డియర్ ఆఫీసర్! మనం ప్రస్తుతం అణుయుగంలో వున్నామనీ– అన్ని శాస్త్రాలూ అడ్వాన్స్‌డ్ స్టేజెస్‌లో వున్నాయనీ మీరు మర్చిపోకూడదు" అన్నాడు జెమిని.

"ఇదంతా విజ్ఞానం పేరుతో సంపన్న దేశాలు చేస్తున్న ప్రయోగాలు! కాదు... కాదు... విజ్ఞాన వినాశక ప్రయోగాలు" అన్నాడు కళ్యాణ్‌రాం కోపంగా.

"కావొచ్చు కానీ అణుశక్తిని సృష్టి నాశనానికీ వినియోగించవచ్చు. అలాగే సృష్టి వికాసానికీ కూడా ఉపయోగించవచ్చు. అది వినియోగించే మానవుడి బుద్ధి, విచక్షణ మీద ఆధారపడి వుంటుంది.

ఇంకో ఆశ్చర్యకరమైన విషయం చెప్పమంటారా? నిజానికి ఇవన్నీ మనపూర్వీకులు కనిపెట్టి ప్రయోగించినవే! కాలక్రమేణా ఇతర దేశస్థులు వాటికి కొత్త కొత్త పేర్లు పెట్టి వాళ్ళ స్వంత సృష్టిలా చెలామణి చేసుకున్నారు.

ఉదాహరణకు ఈ 'హిప్నాసిస్' అంటే 'సమ్మోహనం'ని ప్రాచీన భారత దేశంలో వైద్య శాస్త్రజ్ఞులు వాడారు. క్రీస్తుపూర్వం 100–300 ఏళ్ళ మధ్య అప్పటి వైద్య శాస్త్రజ్ఞులు చరకుడు, వాగ్భటుడు, సుశ్రుతుడు తమ గ్రంథాలైన 'చరక సంహిత' సుశ్రుతంలలో రాశారు తెలుసా?" అన్నాడు ప్రొఫెసర్ జెమిని.

"థాంక్స్ ప్రొఫెసర్‌గారూ! ఈ అమ్మాయిల విషయంలో మాకు ఏదో కొంత ఇన్ఫర్మేషన్ తెలిసినట్లయింది. థాంక్యూ!"

అన్య మనస్కంగా అని లేచాడు డి. జి. పి. కళ్యాణ్‌రాం.

* * * * * * *

కాబినెట్ మీటింగ్ జరుగుతోంది.

సి. యం. ఆహ్వానం మేరకు డి. జి. పి. కళ్యాణ్‌రాం ఆ మీటింగ్‌కి హాజరయ్యాడు.

"ఇప్పటి వరకూ రాష్ట్రంలో అనేక ఘోరాలు చేసి అల్లకల్లోలం సృష్టించిన హంతకుడు 'రాకా'ని మనం పట్టుకోలేక పోయాం. డి. జి. పిగారు ఈ కేసు విషయంలో సమర్పించిన నివేదిక చదివాను. ఆ నివేదికలో డిపార్ట్‌మెంట్ వైఫల్యాన్ని గురించి కాకుండా రాకా గొప్పతనాన్నే ఎక్కువగా వర్ణించినట్లు నాకుతోచింది. ఈ విషయంలో ఆయన సమాధానం అందరిముందూ వివరిస్తే బావుంటుంది!" అని సాభిప్రాయంగా ముఖ్యమంత్రి ఏకాంబరం డి. జి. పి. వేపు చూశాడు.

కళ్యాణ్‌రాం లేచి నిల్చున్నాడు.

"ముఖ్యమంత్రిగారి ఆదేశం మేరకు నేను కొన్ని విషయాల్ని మంత్రి మండలి ముందు చెప్పదల్చుకున్నాను. ప్రతిదేశంలోనూ అప్పుడప్పుడు ఒక నట్వర్‌లాల్, ఒక బ్లాక్‌సెప్టెంబర్, ఒక జెకిల్ అండ్ హైడ్‌లాంటి వాళ్ళు పుడుతూనే వుంటారు.


"ఒక దారిదోపిడీ ముఠానో – స్మగ్లింగ్ గాంగ్‌నో – అమ్మాయిల్ని రవాణా చేసే వాళ్ళనో పట్టుకో గలిగినంత తేలికకాదు ఒక వ్యక్తిని పట్టుకోవడం. అలాగని అసంభవమూ కాదు. అయితే సింగిల్‌గా ఆపరేట్ చేసే నేరస్తులకి కొంత కాలానికి వాళ్ళపట్ల వాళ్ళకి ఎక్కడలేని నమ్మకం కుదిరిపోతుంది. ఆ 'ఇగో'లో వాళ్ళు తప్పకుండా పొరపాట్లు చేస్తారు. అలాంటి పొరపాటు కోసమే మనం కాచుకుని వుండాలి! అప్పుడే వాళ్ళు పోలీసుల వలయంలో పడతారు!" అన్న డి. జి. పి. కళ్యాణ్‌రాం మాటల్ని కట్‌చేస్తూ అందుకున్నాడు ముఖ్యమంత్రి. అంటే అతనికి 'ఇగో' పెరిగి పొరపాట్లు చేసిందాకా అతనెన్ని ఘోరాలు చేసినా సహించవలసిందేనా?" అన్నాడు.

"అలా అని నేననను సర్! ఈ లోపలే అతన్ని పట్టుకునే ప్రయత్నం చేస్తున్నాం. సాధారణంగా ఇటువంటి క్రిమినల్స్ ఎవరికి వారు ఒక పద్ధతి ఏర్పాటు చేసుకుని– ఆ పద్ధతిలోనే నేరాలు చేస్తుంటారు. అలవాటయిన పద్ధతికి భిన్నంగా నేరాలు చెయ్యడానికి ఏ నేరస్తుడూ ఇష్టపడడు. ఇదే నేరస్తుల్లో వుండే చిత్రమైన మనస్తత్వం

ఒక్కో నేరస్తుడు ఎన్నుకునే పద్ధతిని క్రిమినాలజీలో 'మోడస్ ఆపెరాండీ' అంటారు. ఈ మోడస్ ఆపెరాండీ వల్ల ఏ నేరం చేసినా ఆ నేరస్తుడి ముద్ర మాత్రం ఆ నేరంలో స్పష్టంగా కన్పిస్తుంది! కొన్ని కొన్నిసార్లు అతను నేరం చేసే పద్ధతే అతన్ని పట్టిస్తుంది కూడా!

అయితే రాకా విషయం అలాకాదు. అతను చాలా ట్రిక్కీష్! అతను ఎట్టి పరిస్థితిలోనూ తన చేతికి మట్టి అంటకుండా– ఒకవేళ పట్టుపడినా బెనిఫిట్ ఆఫ్‌డౌట్ ఏర్పడేలా ప్లాన్‌చేసి దారుణాలు చేస్తున్నాడు. ఒక్కో నేరానికి ఒక్కో పద్ధతి అవలంబిస్తున్నాడు. మూకుమ్మడి హత్యల నుంచి చిలిపి నేరాల వరకు చేస్తున్నాడు. ముందు హెచ్చరించి కొన్ని నేరాలు చేస్తే– చెప్పా పెట్టకుండ మరికొన్ని నేరాలు చేసి కన్‌ఫ్యూజ్ చేస్తున్నాడు. ఈ టిక్కిక్‌ని కూడా మేం ఛేదిస్తాం!" అన్నాడు కళ్యాణ్‌రాం.

"ఒకే కళ్యాణ్‌రాంగారూ! మరో ముఖ్యమైన విషయం మీకు చెప్పడానికి మిమ్మల్ని పిలిపించాం. రాష్ట్ర రాజధాని అయిన ఈ నగరంలో కోటి రూపాయల ఖర్చుతో నెలకొల్పబోతున్న 'ఆంధ్రమాత' విగ్రహాన్ని ఆవిష్కరించడానికి గైక్వాడ్ మహారాణి గాయత్రీదేవిని ఆహ్వానిస్తున్నాం. ఆమె రెండు రోజులపాటు ప్రభుత్వ అతిథిగా వుంటుంది. అయితే ఆ రాణీగారు ఓ చిలిపి కోరిక కోరింది. ఆ కోరిక మన



విస్మరింపము నిను విఘ్నరాజ

అయ్యగారి నరసింహమూర్తి
అయ్యగారి లక్ష్మీనారాయణ

ఆది దేవుడ వీవని అమిత భక్తి
నెల్లలోకాలు నినుగొల్చు నేకదంత
తొలుత నిలలోన నీ పూజ సలుపు నెవడు
నింద నాతండు పొందండు మందహాస!

భక్తి శ్రద్ధల నిను మేము శక్తి కొలది
పూజ సేతుము పత్రిని పూలుఁదెచ్చి
కుడుము లిడుదుము కొబ్బరి గుడముతోడ
ఒజ్జవయి సాకు మము నీవు గుజ్జువేల్ప!

ఎలుక వాహనమున కులుకుచు రావయ్య
బంట్లమగుదు మీకు భక్తవరద
విద్యలొసఁగుమయ్య వినయంబు దైవార
విస్మరింపము నిను విఘ్నరాజ!

కొంపలు ముంచేదిగా వుంది." అన్నాడు ముఖ్యమంత్రి.

"ఏమిటి సార్? ఆమె కోరిక?" అడిగాడు కళ్యాణ్‌రాం మెల్లగా

"ఆమె దగ్గర కోట్లు విలువచేసే ఓ వజ్రాల హారం వుంది. అశేష ప్రజానీకం చూడాలని ఉవ్విళ్ళూరే ఆ వజ్రాలహారాన్ని ఆంధ్రమాత కంఠసీమను కొద్దిసేపు అలంకరించాలని వుందట!

ఆ కొద్దిసేపట్లో ఆ హారానికేమయినా అయితే మన ప్రభుత్వం పరువు, మన పోలీసు వ్యవస్థ పరువు పోతుంది. పైగా లక్షలమంది గుమికూడే ఆ ప్రదేశంలో హారాన్ని ఎలా కాపాడగలం?" అన్నాడు ముఖ్యమంత్రి.

కళ్యాణ్‌రాం గుండెల్లో రాయిపడింది. అసలీ గొప్ప గొప్ప వాళ్ళకి ఇలాంటి ప్రమాదకరమైన కోరికలెందుకు పుడతాయో అర్థంకాదు. ముఖ్యమంత్రి 'ఎలా కాపాడగలం?' అన్నారంటే 'నువ్వేం చర్యలు తీసుకుంటావో చెప్పు!" అనర్థం!

కళ్యాణ్‌రాం గబగబా ఆలోచించాడు.

రొటీన్‌గా పోలీస్ డిపార్ట్‌మెంట్ తీసుకునే చర్యలు వివరించి, ఆ తర్వాత "ఇంకో ప్రత్యేకమైన ఏర్పాటు కూడా చేస్తాం సర్!" అన్నాడు.

"చెప్పండి. మీ ప్రణాళికలు మంత్రులంతా వింటారు!" అన్నాడు సి. ఎం.

క్షణం తటపటాయించాడు కళ్యాణ్‌రాం. మంత్రులకు ఎందరో అనుయాయులు, భజనపరులు వుంటారు. ఈ విధానాలు మంత్రుల ద్వారా బయట పాకే అవకాశముంది! పెద్ద స్థాయిలో వున్నవాళ్ళకు సైతం అండర్ వరల్డ్ థగ్స్‌తో సన్నిహిత సంబంధాలుండే పాలిటిక్స్ చెలామణీ అవుతున్న రోజులివి!...

"ఊ! చెప్పండి! ఏమిటాప్లాను?" అడిగాడు ముఖ్యమంత్రి మళ్ళీ.

"సారీసర్! ఇంకా నాలోనే ఆప్లాన్ సమగ్రంగా రూపు దిద్దుకోలేదు. తర్వాత చెప్తాను!" అన్నాడు వినయంగా.

ముఖ్యమంత్రి కూడా ఓ నిముషం ఆలోచించి–

"ఒకే! టేక్ యువర్ ఓన్ టైం! అసలైనా ఆరాణీగారిని నేను ఎంత డిస్కరేజ్ చేసినా ఆమె ఒప్పుకోలేదు. మరీ ఒత్తిడి చేస్తే మనం భయపడుతున్నామనుకునే ప్రమాదముంది. అందుకే ఊరుకున్నాను! ఒకవేళ 'రాకా ఆ వజ్రాలహారాన్ని కొట్టేసే ప్రయత్నం చేస్తాడేమో!" అన్నాడు. అంతలో హోం మంత్రి అందుకుని–

"రాకా అనే ఏముంది సర్! రాష్ట్రంలో వున్న ప్రతి పెద్దగాంగూ ప్రయత్నించవచ్చు. అందుకే నగర చోరీతో సంబంధమున్న పెద్ద కేడీల మీద ఓ కన్నేసి వుంచాలి. వీలయితే నిర్బంధించాలి!" అన్నాడు.

"అలాగే సర్! నేను అన్ని జాగ్రత్తలూ తీసుకుంటాను. రాకా వజ్రాలహారం కోసం రావడమంటూ జరిగితే అతన్ని పట్టుకోక పోయే ప్రసక్తి లేదు. అడుగడుగునా మఫ్టీలో పోలీసుల్ని వుంచి వలపన్నుతాం. తిరిగి ఆ వజ్రాల హారం రాణీగారి మెడ నలంకరించేటట్లు చేసే బాధ్యత నాది!" అన్నాడు కళ్యాణ్‌రాం.

సరిగ్గా అదే సమయంలో –

'స్వప్నలోక్' కాంప్లెక్స్ పద్నాలుగవ అంతస్థులో చివరి ఫ్లాట్ కాలింగ్‌బెల్ నొక్కింది దేదీప్య.

తలుపు తీసిన రాకా క్షణం ఆమె వేపు కన్నార్పకుండా చూశాడు. తండ్రి చనిపోయాక అదే మొదటిసారి ఆమెని చూడ్డం.

నెలరోజుల పాటు నిద్రాహారాలు లేనిదానిలా అయిపోయింది దేదీప్య. అయినప్పటికీ చక్కనమ్మ చిక్కినా అందమే అన్నట్టుగా వుందామె.

మొదటిసారిగా తన ఇంటికొచ్చిన దేదీప్యని ఆనందంగా లోపలికాహ్వానించాడు రాకా.

ఆ ఫ్లాట్‌లో వుండే వ్యక్తి రాకా అనీ, పోలీసుల్ని గడగడలాడిస్తున్న నేరస్థుడనీ అక్కడెవరికీ తెలీదు. ఓ మెడికల్ రిప్రజెంటేటివ్‌నని చెప్పుకుని ఆ ఫ్లాట్ అద్దెకి తీసుకున్నాడతను. ఆ కాంప్లెక్స్‌లో ఉండేవాళ్ళంతా కంపెనీ ఎగ్జిక్యూటివ్స్, మానేజింగ్ డైరెక్టర్లూ అవడంతో ఒకరి గురించి ఒకరు పట్టించుకోరు.

ఆమె తండ్రి మరణం గురించి కొద్దిసేపు మాట్లాడిం తర్వాత "ఆరోజు శైలజతో నేను మాట్లాడిన మామూలు మాటలు నువ్వు ఆ అమ్మాయి బ్రెయిన్‌లోకి ఇంజెక్ట్ చేయదల్చుకున్న హిప్నాటిక్ సజెషన్స్ అని తెలీదు" అంది దేదీప్య.

"ఏం? తెలిసివుంటే ఆ మాటలు చెప్పేదానివి కాదా?" అడిగాడు.

దేదీప్య అదోలా చూసింది.

"తండ్రి చేసిన దుర్మార్గానికి శిక్షవేయడం కోసం నువ్వు చేస్తున్న ప్రయత్నంలో నా స్నేహితురాలు – అమాయకురాలూ అయిన శైలజ సమిధ కావడానికి అభ్యంతరం చెప్పి ఉండేదాన్ని!" అంది.

రాకా భావరహితంగా నవ్వాడు.

"కొన్ని వందల మందిని తన స్వార్థం కోసం పొట్టన పెట్టుకున్న ఆ మురళీమోహనరావు లాంటి కిరాతకుడిని మరే విధంగా శిక్షించాలో నాకు తెలీదు!" అన్నాడు.

నెత్తిమీద పిడుగు పడ్డట్టుగా అదిరిపడింది దేదీప్య.

"ఎవరు? ఎవరతను? అతని పూర్తి పేరేమిటి?"

అనడిగింది వణుకుతున్న కంఠంతో –

రాకా ఆశ్చర్యంగా–

"అరె! ఇంతలోనే ఏమయింది నీకు? అతనిపేరు అందరికీ తెలుసు! పూర్తిపేరు మురళీమోహనరావు! ఎందుకలా అడిగావు?" అన్నాడు.

రాకా మాటలు దేదీప్య వినలేదు.

మురళి.... మురళీమోహనరావే తన తండ్రి కేసులో వున్న మురళి.... తమ జీవితాల్ని అశాంతిమయం చేసిన నీచుడు! అవును.... అతనే! కంట్రాక్టర్ మురళీమోహనరావంటే.... ఆ మురళే.... ఎప్పుడూ పంచెకట్టులో తప్ప కనిపించని ఆ వ్యక్తి తన తండ్రిని చంపడం కోసం మొత్తం గెటప్ మార్చుకుని నల్లకళ్ళద్దాలతో వచ్చాడు. ఇంత డబ్బూ హోదా.... అన్నీ వుండి కూడా స్వయంగా తన తండ్రిని చంపడానికి అతనే ఎందుకొచ్చాడు అన్నదే ఆశ్చర్యంగా వుంది.

మరెవరూ తన తండ్రిని చంపలేరనే ఉద్దేశంతో కావచ్చు. లేదా- మొదట్నుంచి వేషాలు మార్చి హత్యలు చేసే అలవాటయినా వుండి వుండాలి! ఏది ఏమయినా తండ్రి పాత కేసు ఫైల్లో వున్న మురళీమోహన్రావూ- తానారోజు చూసిన నల్లకళ్ళద్దాల వ్యక్తి – శైలజ తండ్రీ– ఒక్కరే! అవును. (ఇంకా వుంది)

పుత్రాదిచ్ఛేత్ పరాజయమ్

గోవిందరాజు రామకృష్ణారావు

ఫిల్టర్ కాఫీ రుచి మాటల కందదు. ప్రొఫెసర్ చక్రపాణికి కాఫీ అంటే మహాయిష్టం. నిజానికి ఆ పూట కాఫీ మరింత రుచిగా కూడా వుంది. అయినా కాఫీ తాగిన అనుభూతి కలగలేదు. పేపరు పైకి మనసుపోవడంలేదు. నిన్నటిదాకా కాఫీ నోట్లో పోసుకోగానే పేపరు చదవకపోతే ఏమీ తోచేదికాదు. పేపరు కుర్రాడు ఏ కారణంచేతనైనా రావడం ఆలస్యమైతే గంగవెర్రు లెత్తడం ఖాయం. అలాంటిది ఎదురుగా పడివున్న పేపరుపైకే దృష్టిపోవడంలేదు. ఏదో పోగొట్టుకున్నవాడి మాదిరిగా చక్రపాణి వరండాలో పచార్లు చేస్తూ మాటిమాటికి పెదాలు తడుముకుంటున్నాడు. ఆదివారంనాడు చాల రిలాక్సింగ్ మూడ్‌లో వుండవలసింది. ఆ ఛాయలే లేవు. గదిలోకి వెళ్ళి పక్కపాడి వేసుకొచ్చాడు. పేపరు తీసుకుని ఈజీచైర్లో చార్లాపడ్డాడు. అప్రయత్నంగా జేబు తడుముకున్నాడు. సిగరెట్ పెట్టిలేదు. దాన్ని రాత్రి తానే కసితో నలిపి అవతలపారేశాడు. జన్మలో యిక సిగరెట్ ముట్టుకోనని పార్వతికి మాటిచ్చాడు. అంతేకాదు. తమకు ప్రాణంకంటే ఎక్కువైన రాఘవ పైన ఒట్టేసి మరీ వాగ్దానం చేశాడు. రాఘవ ఒక్కగా నొక్క కొడుకు. ఆశలన్నీ అతనిమీదే లగ్న మయ్యాయి. తమ కలలపంట. అతని భవిష్యత్తుకు బంగారుబాట వేయడమే తమ జీవితధ్యేయం. అందుకు ఎంతటి త్యాగానికైనా సిద్ధమే. సాధ్యా సాధ్యాల ప్రసక్తి వుండదు. ప్రమాణం తప్పడానికి మనసు ససేమిరా సమ్మతించడంలేదు.


ఇప్పుడెలా? ఉదయం కాగానే ఆలోచలన్నింటిని అదుపుచేసేవి – కాఫీ, సిగరెట్, పేపరు. వీటిలో ఏది లోపించినా తలలో ఏదో పురుగు తొలుస్తున్నట్టుగా వుంటుంది.

కళ్ళు పేపరు వంక చూస్తున్నా వార్త లేమీ అర్థంకావడం లేదు. పేజీలు మాత్రం యాంత్రికంగా తిరగేస్తున్నాడు. క్రితం రాత్రి జరిగిన సంఘటన కళ్ళకు కట్టినట్లయింది.

డైనింగ్ టేబిల్‌మీద రెండు పేట్లలో ఇడ్లీ పెట్టివున్నాయి. చిన్న గిన్నెలో తన కిష్టమైన మామిడి అల్లం పచ్చడి నోరూరిస్తోంది. పక్కనే చిన్న పేట్లో కారప్పొడి పైన వేసిన వెన్నకాచిన నెయ్యి ఘుమఘుమలాడుతోంది. రాఘవ అన్నం తిని ప్రయివేటు చెప్పించుకునేందుకు వెళ్ళాడు. మరో గంటకి గాని రాడు. పార్వతి, చక్రపాణి శనివారం నాడు రాత్రిపూట భోజనం చేయరు.

ఇద్దరూ కుర్చీల్లో కూర్చున్నారు. ప్లేట్లలో ఇడ్లీలు నిమ్మదిగా తరుగుతున్నాయి. పార్వతి ముభావంగా వుండడం చక్రపాణి గమనించాడు. "ఏమిటోయ్! ఇంత బ్రహ్మాండంగా టిఫిన్ తయారు చేసి అలా మాట్లాడకుండా కూర్చున్నావ్!' భార్యని కబుర్లలోకి దింపాడు.

నిజానికి టిఫిన్ అవగానే ఒక ముఖ్యవిషయం భర్తతో చెప్పాలనుకుంటోంది. అసలు ఎంతో కాలంగా తనలో తాను మథనపడుతోంది. సిగరెట్ల వల్ల ముంచుకొచ్చే ప్రమాదం గురించి ప్రతిరోజూ పేపర్లు మోసుకొస్తున్న సంగతులు చదివి తల్లడిల్లిపోతోంది. ఎలాగైనా భర్తచేత ఈ పాడు అలవాటు మాన్పించాలని గట్టిగా నిర్ణయించు కుంది. రాఘవ లేనప్పుడు ఈ చర్చ జరపాలని కూడా అనుకుంది. ఎలా ప్రారంభించాలో తెలియక ఆలోచనతో సతమతమవుతూ మౌనంగా వుండి పోయింది. భర్తే కబుర్లలోకి దింపడంతో ధైర్యం కూడగట్టుకుంది.



గణాధిపతి

(చిత్రం : బి. వెంకటేశ్వరరావు)

"ఇడ్లీ బావుంటే మరో రెండు వేస్తా" అని కొసరి కొసరి వడ్డించింది.

ఫలహారం అయ్యాక చక్రపాణి సిగరెట్‌పెట్టిలోంచి హుషారుగా సిగరెట్ తీసి పేట్టిమీద సుతారంగా కొడుతూ 'అగ్గిపెట్టి యిలా యివ్వవోయ్' భార్యని అడిగాడు దీర్ఘాలు తీస్తూ.

తన కోరిక ఫలించేందుకు యిదే మంచి అదననుకుంది పార్వతి.

అగ్గిపెట్టి పట్టుకెళ్ళకుండా దగ్గరికెళ్ళి ఒయ్యారంగా భర్త చేతిలోంచి సిగరెట్ లాక్కుంటూ 'మీ రీ అలవాటు వెంటనే మానేయాలండీ!' బుంగ మూతిపెట్టి నిక్కచ్చిగా చెప్పింది.

సిగరెట్ అందుకోబోతూ 'అదేమిటి. దేవి గారికి అంత సడన్‌గా జ్ఞానోదయమయిందే! ఏం కథ?' వెటకారంగా చూశాడు.

పార్వతి చేతులు వెనక్కి పెట్టుకుని గొంతులో గాంభీర్యం నింపుకుని 'నే నెప్పట్నుంచో పోరుతూనే వున్నాను. మీరే నన్ను పురుగును దులిపినట్లు దులుపుతున్నారు యింతకాలం. ఇకనైనా దీని జోలికిపోకండి' అంది.

'ఏం కొంపమునిగిందిపుడు' చిరాకు పడ్డాడు.

పార్వతి ఈ అవకాశాన్ని జారవిడుచుకోదలచ లేదు.

'నే నో ప్రశ్నడుగుతాను. సూటిగా సమాధానం చెబుతారా?' గట్టిగా అడిగింది.

'ససపెట్టక అదేమిటో అడుగు' గొంతు పెంచాడు.

'మీరు ఎప్పటినుంచి సిగరెట్లు తాగడం మొదలు పెట్టారు? కాలేజీలో చేరాకా? స్కూల్లో వుండగా నేనా? అయితే ఎన్నో క్లాసు నుంచి?' ప్రశ్నలు వాడి బాణాల్లా గుండెల్లో గుచ్చుకుంటున్నాయి.

చక్రపాణి నిశ్చేష్టుడయ్యాడు. ఊహించని ప్రశ్నలు. పైగా పార్వతి కంఠంలో కరకుతనం. బోనులో నిలబడ్డవాడిలా 'పదో తరగతి నుంచి' జవా బిచ్చాడు.

పార్వతి ఆ సమాధానం విని వుగ్రమూర్తిలా మారింది. 'అయితే మీ కొడుకు మిమ్మల్ని





మించిపోయాడు. తొమ్మిదో తరగతిలోనే మొదలు పెట్టాడు' ఈ సడింపుగా అంది గళంలో మార్దవం మచ్చుకైనా లేకుండా.

చక్రపాణికి నెత్తిమీద వందపిడుగులు అగకుండా పడినట్లయింది. తన నెవరో పాతాళానికి విసిరివేసి నట్లయింది. నోట మాట రాలేదు. శక్తి నంతా కూడగట్టుకుని తెప్పరిల్లాడు.

'నువ్వంటున్న దేవిటి పార్వతీ' గొంతు వణికింది.

చక్రపాణిని చేయిపట్టుకుని గబగబా రాఘవ గదిలోకి తీసుకెళ్ళింది. హ్యాంగర్ కున్న చొక్కా తీసి జేబు దగ్గర వాసన చూపించింది. జామెట్రీ బాక్సు తెచ్చి మూతతీసి అందులోంచి సిగరెట్ పైకిలాగి చేతితో నలిపి కిందపడేసి కసితో కాళ్ళతో తొక్కింది. భర్త గుండెపై తలవాల్చి ఏడ్చింది. సైకాలజీ ప్రొఫెసర్ మీరు. ఆ మాత్రం గ్రహించలేకపోయారు. ఏ ముఖం పెట్టుకుని వాళ్ళ మందలించగలరు? మీ కా ధైర్యం లేదు. ఎదురుతిరిగి మిమ్మల్ని నిలదీస్తే మీ రేం జవాబిస్తారు?' బాకుతో పొడిచినట్లున్నాయి ఆమె మాటలు.

చక్రపాణి యింకేమీ వాదించే స్థితిలో లేదు. రాఘవని నిలదీసే సాహసంలేదు.

'పారూ! ఊరుకో. రాఘవమీద ఒట్టేసి చెబుతున్నా..... నేను ఈ జన్మలో మళ్ళీ సిగరెట్ తాగను. నువ్వే వాడికి నచ్చచెప్పి వాడిచేత సిగరెట్లు మాన్పించు. ఆ మాట తలుచుకుంటేనే నా గుండె బద్దలవుతోంది' ప్రాధేయపడుతూ అన్నాడు.

రాఘవ ప్రయివేటు నుంచి వస్తున్నట్లు అలికిడి విని గదిలోంచి యిద్దరూ హాల్లోకి వచ్చారు సంబాళించుకుని.

అదీ రాత్రి సంఘటన. అవును ఎంత కష్టమైనా ఓర్చుకోవాలి! రాఘవ చెడిపోకూడదు. తండ్రిగా ఆ మాత్రం త్యాగానికి సిద్ధపడాలి. చక్రపాణి మనసు సమాధానపరచుకుంటోంది. తాను చేస్తున్న ఈ త్యాగాన్ని చూసి రాఘవ సన్మార్గంలో పడితే అంతకన్నా కావలసిందేముంటుందని చక్రపాణి మనసు పదేపదే చెబుతోంది. ఈ తర్జన భర్జనలో పేపరు పేజీలు పూర్తయ్యాయి.

చక్రపాణి అవస్థ గమనించి లోపల హాల్లో తల్లీ కొడుకులు నవ్వుకోవడం అతనికి తెలియదు.

'అమ్మా! మొత్తంమీద నాన్నని దార్లోకి తెచ్చావ్ ఒక్క రోజులో! నాటకం భలే రక్తికట్టింది. నాన్న ఆటకట్టు. కాని నా పైన నాన్నకి అనవసరంగా అపోహకల్పించావ్!' అని రాఘవ తల్లితో అన్న మాటలు చక్రపాణికి వినిపించలేదు.

'ఆయన దార్లో పడ్డాక అంతా చెబుతాలేరా!' అని హామీ యిచ్చింది. □

సీరియల్

తమస్





తెలుగుసేత: డా॥ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

హిందీమూలం: డా॥ భీష్మసాహ్నీ

(గత సంచిక తరువాయి)

వారానికి ఒకసారి ఏర్పాటయ్యే సత్సంగ్ కార్యక్రమం పూర్తి అవడానికి ముందు మహాత్మా వానప్రస్థీజీ ఎప్పటిలాగానే మంత్రాలు చదవసాగారు. ఈ మంత్ర పఠనాన్ని ఆయన సత్సంగ యజ్ఞానికి 'పూర్ణాహుతి' అంటారు. ఎంపిక చేయబడిన ఈ ప్రత్యేక శ్లోకాలు, మంత్రాలలో భారతీయ సంస్కృతీ సారం నిండి ఉందని ఆయన భావించి సభాసదులందరి చేత కంఠస్థం చేయించారు. వేదిక మీద కూర్చుని, కళ్ళు మూసుకుని, చేతులు జోడించి, తల ఊపుతూ ఆయన మంత్రోచ్చారణ చేయసాగారు.....

"సర్వేభవంతు సుఖినః సర్వే సంతు నిరామయః
సర్వే భద్రాణి పశ్యంతు సాకశ్చిత్ దుఃఖభాగభవేత్"

అక్కడ ఉన్నవారి అందరిలోనూ వానప్రస్థీజీకే సంస్కృతం తెలుసు. ఆయన వేదవేదాంగాలన్నీ అధ్యయనం చేసారు. అందుకే ఆయన చదివేటప్పుడు ఉచ్చారణ దోషాలుండవు. ఉపనిషత్తులోని శ్లోకం తర్వాత ఆయన గీతలోని శ్లోకాలు చదవసాగారు–

"అపూర్వమాణం అచల ప్రతిష్ఠం........"

సభాసదులందరు ఆయన్ను అనుకరించసాగారు. కొందరు ఉచ్చారణలో వెనకబడిపోయారు. అందుకే ఆయన చదవటం పూర్తిచేసిన తర్వాత కూడా కొందరు ఇంకా ఉచ్చరిస్తూనే ఉన్నారు.

చివరకు శాంతి మంత్రం చదవబడింది. హాలులోని స్త్రీ పురుషులందరికి ఆమంత్రం కంఠస్థమైన కారణంగా అందరి గొంతులూ ఒక్కసారే ప్రతిధ్వనించాయి......

"ఓం ద్యౌ శాంతి పృథ్వీ శాంతిరాపః
శాంతిరోషధయః, శాంతివనస్పతిః"

వాయుమండలంలో ఈశాంతిమంత్ర ప్రభావం వ్యాపించిందా అన్నట్లు, వీరందరూ ముక్తకంఠంతో ఆలపించిన ఈ శాంతిమంత్రం ఇంటింటికి చేరిందా! అన్నట్లు ఉన్నది. 'పూర్ణాహుతి' తర్వాత అందరికి ఎంతో ఆనందం కల్గింది. మంత్రోచ్ఛరణ తర్వాత సకల చరాచర ప్రాణికోటి క్షేమాన్ని ఆకాంక్షించే ప్రార్థనా గీతం పాడబడుతుంది. వానప్రస్థీజీ, మెల్లగా పాడసాగారు.

"దయచూపుము దేవా!
అందరినీ బ్రోవుము దేవా!........"

ప్రార్థనాగీతం తర్వాత 'పూర్ణాహుతి' పూర్తయింది. తర్వాత సభ చాలించవలసి ఉంది. కాని, కార్యదర్శి ఒక ముఖ్య ప్రకటన చేయవలసి ఉన్న కారణంగా, సభాసదులందరూ ఇంకా కూర్చునే ఉన్నారు. కార్యదర్శి లేచి సభానంతరం కార్యవర్గ సభ్యులతో ఒక ముఖ్యమైన విషయం చర్చించవలసి ఉందని, అందుచేత సభ్యులంతా ఉండి మిగిలిన వారంతా వెళ్ళి పోవచ్చునని ప్రకటించారు. చర్చించవలసిన ముఖ్యవిషయం గురించి సభ్యులకు కొద్దిగా తెలిసినట్లే ఉంది. వానప్రస్థీజీ తన ప్రసంగంలో కొంచెం ఉద్వేగంతో ఈ పలుకులు చదివారు.

"మహమ్మదీయులు వెదజల్లారిట ఘోర పాపాన్ని.
విధాత ఆకాశాన్ని, భూమాత సంపదలను లాక్కుపోయారు"

అందువలన కార్యవర్గం చర్చించే విషయం మిగిలిన వారందరికీ చూచాయగా తెలుసు. కార్యదర్శి ప్రకటన తర్వాత సభముగించబడింది. సభాసదులు లేచి దేవాలయపు ఏడు ద్వారాల గుండా బయటకు వచ్చి తమ పాదరక్షలు ఏరుకుని వేసుకోసాగారు. వారిలోనే చిన్న చిన్న గుంపులుగా కలిసి

జరిగిన కథ– 5: ముస్లింలకు, ప్రభాత ప్రదర్శన బృందానికి ఘర్షణ మొదలవుతుంది. నత్తూ భయపడి పారి పోతాడు. డెప్యూటీ కమిషనర్ రిచర్డ్ భార్య లీజాకు ఆ ప్రాంతాన్ని చూపి చారిత్రక విశేషాలు చెపుతుంటాడు. పట్టణం లోని పరిస్థితులకు సంబంధించిన రిపోర్ట్సు చదివి రిచర్డ్ బైటికి వెళతాడు. ప్రభాత ప్రదర్శన బృందం ఇమామిదీన్ పేటలో పారిశుధ్య కార్యక్రమాన్ని పూర్తి చేయకుండానే వెనక్కి మళ్ళ వలసి వస్తుంది. ఒక మసీదు ముందు చంపి పడవేసిన పందిని బక్రీ జనరల్ పక్కకు లాగి వేస్తారు. అప్పటికే ఉద్రిక్తంగా మారిన స్థితిలో ఆవును వెంట తరుముతూ ఒక ఆగంతకుడు పరుగెత్తుకొస్తాడు.



పట్నంలోని పరిస్థితిని గురించి చర్చించుకోసాగారు. వానప్రస్థ్‌జీ. తనగంభీరమైన ఉపన్యాసం తర్వాత ఇంకా వేదిక మీద కూర్చుండిపోయారు. ఆయనింకా ఉద్వేగంగానే కనబడుతున్నారు.

అప్పుడే కొందరు వ్యక్తులు ఆ సభా మందిరంలోనికి ప్రవేశిస్తూ కన్పించారు. బయట ఆవరణలో ఉన్నవ్యక్తులు వారిని గుర్తుపట్టారు. వారు పట్నంలోని ప్రముఖ హిందూ ధర్మ సంస్థల ముఖ్యులు. వారి వెనుక ఐదారుగురు సిక్కు ప్రముఖులు కూడా లోపలికి వస్తూ కనిపించారు. వారు స్థానిక గురుద్వారా నుండి వచ్చారు. వీరిని గూడా కార్యవర్గ సమావేశంలో పాల్గొనవలసిందిగా ప్రత్యేకంగా ఆహ్వానం పంపబడింది.

లోపల సమావేశం మొదలైంది. సన్నగా బలహీనంగా ఉన్న కార్యదర్శి చాలా ఉత్తేజంగా నగరంలో నానాటికి దిగజారిపోతున్న పరిస్థితులను వివరించారు. జరుగుతున్న తప్పుడు ప్రచారాలను గురించి మసీదు మెట్లమీది పంది మృత శరీరం గురించి కూడా వివరించారు. చాలా కాలంగా మసీదులో కర్రలు, బల్లేలు, రకరకాల ఆయుధాలు పోగుచేయబడుతున్న విషయాలను కూడా ప్రస్తావించారు. ఈ పరిస్థితులన్నీ వివరించిన తర్వాత వాటిపై కూలంకషంగా చర్చించాలని, తమ తమ అమూల్యమైన సలహాలు ఇవ్వాలని ఆ సమావేశంలో పాల్గొన్నవారికి విజ్ఞప్తి చేసారు.

"ఇక్కడ కూర్చోవటం ఉచితం కాదు."

వేదికపై కూర్చుని చెయ్యెత్తి వానప్రస్థ్‌జీ గంభీరంగా అన్నమాటలివి.–

"ఈ విషయం గురించి వేరే ప్రదేశంలో కూర్చుని చర్చించుకోవడం మంచిది." అంటూ ఆయన వేదిక దిగి ఆ ప్రార్థనా మందిరపు వెనుక భాగానికి నడవసాగారు. మిగిలినవారు కూడా ఆయనను అనుసరించారు. ఆ దేవాలయపు వెనుక భాగంలో ఉన్నమెట్లెక్కి అందరూ చిన్నగదిలోనికి వెళ్ళారు. అందరూ కూర్చున్న తరువాత మహాత్మా వానప్రస్థ్‌జీ గంభీరంగా చెప్ప సాగారు.

"మొట్టమొదట మన రక్షణ ఏర్పాటు చూసుకోవలసి ఉంది. ప్రతి ఒక్క సభ్యుడు తమ తమ ఇళ్ళలో ఒక పీపా ఆవనూనె, ఒక బస్తాముడి బొగ్గు ఉంచుకోవాలి. మరగ పెట్టిన నూనె శత్రువుల మీద పోయవచ్చు. కణకణమండే నిప్పులు, పైనుండి విసరవచ్చు."

సభ్యులు శ్రద్ధగా వింటున్నారు. వానప్రస్థ్‌జీ నోటి వెంట ఈమాటలు విని చాలా మంది కంగారు పడ్డారు. ఆ సమావేశంలో పాల్గొన్న వారిలో ఎక్కువ మంది



వ్యాపారస్తులు, వయసు మళ్ళినవారు. కొందరు ఉద్యోగస్తులు, ఒకరిద్దరు లాయర్లు ఉన్నారు. అందరూ బాధపడుతున్నారు. ఆలోచిస్తున్నారు. కాని ఎవరూ వానప్రస్థీజీలాగా ఆవేశపడటంలేదు. ఇళ్ళలో పీపాలతో నూనె సిద్ధం చేసుకోవలసినంతగా పరిస్థితులు విషమించినట్లు వారెవరూ భావించటం లేదు. ఒకటి రెండు చిన్న చిన్న సంఘటనల తర్వాత ప్రభుత్వం జోక్యం చేసుకుంటుందని, పరిస్థితిని అదుపులోకి తెస్తుందని వారు అనుకొంటున్నారు.

"యువజన సంఘపు కార్యకలాపాలు చప్పబడిపోయాయి, మీరు దేవవ్రత్‌గారిని ఏంపనులలో పెట్టారు? యువకులకు కర్రసాము నేర్పించి కార్యక్రమం వెంటనే మొదలు పెట్టాలని నాఉద్దేశ్యం. రెండువందల కర్రలు తెప్పించి ఈవేళే వారికి పంపండి". ఒకపెద్దమనిషి కార్యదర్శితో చెప్పాడు.

"దానికి కావలసిన డబ్బు నేను ఇస్తాను. ఈరోజే రెండువందల కర్రలు తెప్పించి ఆయువకులకు పంపండి." సమావేశంలో దానధర్మాలకు ప్రసిద్ధి చెందిన ఒక వ్యాపార ప్రముఖుడు ప్రధాన్‌జీ అన్నాడు. సభలోని వారందరూ ప్రధాన్‌జీ యొక్క దాతృత్వాన్ని పలువిధాల ప్రశంసించారు. ఇంతలో ఒక సభ్యుడు లేచి – "ఇదే మన హిందువులలో ఉన్న పెద్ద బలహీనత. మనం దాహం వేసినప్పుడు బావితవ్వించడం మొదలు పెడతాం. ఇక్కడ పరిస్థితులు విషమించిన తర్వాత, మహమ్మదీయులు మసీదులలో ఆయుధాలు సిద్ధం చేసుకున్న తర్వాత మనం కర్రలు కొనడానికి బయల్దేరుతున్నాం" అని ఉద్రేకంతో అన్నాడు.

వెంటనే కార్యదర్శి లేచి "దీని గురించి చింతించవలసిన పని గాని ఆలోచించవలసిన పనిగాని లేదు. యువజన సంఘం సిద్ధంగా ఉంది. వానప్రస్థీజీ స్వయంగా యువజన సంఘపు కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. అంతేకాదు. అధ్యయనం, యజ్ఞయాగాలే కాకుండా వానప్రస్థీజీ హిందూవులను సంఘటిత పరిచే కార్యక్రమాన్ని హృదయపూర్వకంగా చేపట్టారు. అయినప్పటికీ ప్రధాన్‌జీ చేసిన సూచనతో నేను ఏకీభవిస్తున్నాను. ఆయన దాతృత్వంతో మనం ఎన్నో కార్యక్రమాలను చేబడుతున్నాము. మన ఏర్పాటులో ఏ విధమైన లోటు రానీయము" సమాధానం చెప్పాడు.

ఇప్పటివరకు తన చేతికర్రపైగడ్డాన్ని ఆనించి కూర్చున్న ఒక వయో వృద్ధుడు గంభీరమైన స్వరంతో చెప్పాడు.... "మీరు చెప్పేది బాగానే ఉంది. నేను కూడా చెబుతున్నాను వినండి మరి..... డెప్యూటీ కమీషనర్ దగ్గరకు వెళ్ళి ఆయన్ను కలవండి. ఒక్క నిముషం కూడా సమయం వ్యర్థం చేయవద్దు. వెంటనే ఆయన్ను కలవండి. పరిస్థితులు విషమించాయని, ధన మాన ప్రాణాలకు ప్రమాదం ఏర్పడిందని ఆయనకు అర్థమయ్యేటట్లు వివరించండి".

"డిప్యూటీ కమీషనర్ దగ్గరకు వెళ్ళటం అవసరమే. కాని, లాలాజీ! మన ప్రాణాలను మనమే రక్షించుకోవలసి ఉంటుంది" వానప్రస్థీజీ దృఢంగ చెప్పారు.

"అయ్యా! మహాత్మా! పిల్లలకు కర్రలు తిప్పడం తప్పకుండా నేర్పండి కత్తులు, కటారులు ఉపయోగించడం కూడా నేర్పించండి. వాళ్ళు వీరుల శూరులు అవుతారు కాని, ముందు డిప్యూటీ కమీషనర్‌ను కలవండి. పట్టణంలో గొడవలు జరగకుండా ఆపమని చెప్పండి. డిప్యూటీ కమీషనర్‌కు చాల అధికారాలున్నాయి. ఆయన చాలా శక్తివంతుడు. ఆయన కావాలనుకుంటే పిట్ట కూడా కదలదు".

"ఈ రోజు ఆదివారం. డిప్యూటీ కమీషనర్ ఎవరిని కలవరు". కార్యదర్శి సమాధానం ఇచ్చాడు.

"నా మాట వినండి. ఆయనను ఇంటికి వెళ్ళి కలవండి".

ఒక సిక్కు పెద్దమనిషి సూచన ఇచ్చాడు. "అప్పుడే ఒక ప్రతినిధివర్గం డిప్యూటీ కమీషనర్‌ను కలవటానికి వెళ్ళినట్లు నాకు తెలిసింది".

"అందులో ఎవరెవరున్నారు?"

"కొందరు కాంగ్రెసువారు. కొందరు ముస్లింలీగ్‌వారు. పట్టణంలోని మరికొందరు పెద్దలు కలిసి వెళ్ళినట్లు తెలిసింది".

కొంచెంసేపు నిశ్శబ్దం!

"ఆ ప్రతినిధివర్గం ఏం! చేస్తుంది. హిందూవులు సిక్కులు కలిసి విడిగా వెళ్ళాలి. మహమ్మదీయుల అకృత్యాలు డిప్యూటీ కమీషనర్‌కు వివరించాలంటే, వారిని కూడా వెంట తీసుకెళితే ఎలా వివరించగలం? ఈ కాంగ్రెసువాళ్ళు మొత్తం పాడు చేస్తుంటారు. వాళ్ళే ఈ మహమ్మదీయులను నెత్తికెక్కించుకున్నారు".

"మహమ్మదీయుల ఆగడాలు రోజు రోజుకలా పెరిగిపోతున్నదనడంలో ఎట్టి సందేహం లేదు. ఒక ఆవును కూడా నరికారని హిందూ ధర్మశాల వద్ద దాని శరీర భాగాలు విసిరి వెళ్ళారని తెలిసింది. ఇది ఎంతవరకు సత్యమో తెలియదు గాని చాలామంది అనుకొంటున్నారు" ఒక సిక్కు పెద్ద చెప్పాడు".

ఇది విన్న వానప్రస్థీజీ కళ్ళు కోపంతో ఎరుపెక్కాయి. ఆయన కోపాన్ని బలవంతాన దిగమింగుకుని మౌనంగా కూర్చున్నాడు.

"గోవధే జరిగితే ఇక్కడ రక్తపుటేరులు పారతాయి". కార్యదర్శి ఉద్రేకంగా అన్నాడు.

కొంచెంసేపు అందరూ మౌనంగా ఉండిపోయారు. ఇదే గనక నిజమైతే మహమ్మదీయుల ఆగడాలు మితిమీరినట్లే. హిందూవులను, సిక్కులను సంఘటిత పర్చడానికి ఆత్మరక్షణ ఏర్పాట్లు చెయ్యడానికి రకరకాల సూచనలు పరిశీలించబడ్డాయి.


"వార్డు కమిటీలను పరిస్థితి ఏమిటి?" ఒకపెద్దమనిషి అడిగాడు.

"వార్డు కమిటీలను వేయటం చాలా కష్టమైన పని. అన్ని వార్డులలోనూ మహమ్మదీయులున్నారు. ఈ పట్టణం ఒక తీరుతెన్నూ లేకుండా నిర్మించ బడింది. ప్రతి వార్డులోనూ హిందూవులూ ఉన్నారు. మహమ్మదీయులూ ఉన్నారు. ఇంకా వార్డు కమిటీలను ఏమి వేస్తాం. ఏమి చేసినా వెంటనే మహమ్మదీయులకు వార్త చేరిపోతుంది. 1926 గొడవల తర్వాత హిందువులు కళ్ళు తెరిచి ఇళ్ళు కట్టుకున్న వార్డులు రెండు మూడు ఉన్నాయి. ప్రత్యేకంగా హిందువులు సిక్కులు ఉంటున్న, నయాముహల్లా, రాజ్‌పురా, మినహా మిగిలిన అన్ని చోట్ల మహమ్మదీయులు ప్రవేశించే ఉన్నారు."

వార్డు కమిటీలను గురించి చాలాసేపు తీవ్రమైన చర్చ జరిగింది. ఈ వార్డు కమిటీలతో సంబంధాలు పెట్టుకోవడానికి ఒక సబ్ కమిటీ ఏర్పాటు చేయబడింది. ప్రమాదభూయిష్టమయిన స్థితిలో వార్డు కమిటీలతో సంబంధాలు పెట్టుకునే ఒక పథకాన్ని గురించి కూడా చర్చ జరిగింది.

అపుడొక వృద్ధుడైన పెద్దమనిషి జోక్యం చేసుకుని "శివాలా మీద ఏర్పాటు చేయబడిన గంట విషయం కూడా తెలుసుకోండి" అన్నాడు.

"ఇప్పుడు దానికేమయింది?"



"ఏమీ అవలేదు. కేవలం సమాచారం కోసం అడుగుతున్నాను. రాత్రిపూట ప్రమాదాలు ఏర్పడితే అది కనీసం సూచికగా ఉపయోగపడుతుంది. అవసరం అయినప్పుడు తాడు లాగితే తెగిపోయి గంట మోగకుండా ఉండే పరిస్థితి ఏర్పడకుండా జాగ్రత్తపడాలి".

పట్టణ మధ్యలో ఉన్న గుట్ట మీద ఒక ప్రాచీన దేవాలయముంది. ప్రజలు దానినే 'శివాలా' అని పిలుస్తారు. దాని చుట్టు పక్కల దుకాణాలున్నాయి. ఆ దేవాలయం పైనే ఈ గంట ఏదో కాలంలో ఏర్పాటు చేసారు.

"అది ఏర్పాటు చేసి కూడా చాలాకాలం అయినట్లుంది. 1927లో, అంతకుముందో...!

అది విన్న ఒక పెద్దమనిషి "మ్రోగకుండా ఉంటేనే మంచిది. భగవంతుడు దానిని మ్రోగించే అవసరం లేకుండా చేస్తాడులే!"

ఆ మాటలు వింటూనే వానప్రస్థీజీ కోపంతో "ఇటువంటి ఆలోచనలే మనలను పిరికిపందలను చేస్తున్నాయి. మాటమాటకు ప్రమాదమంటే భయపడతారు. ఈ కారణంగానే అమ్లేచ్ఛులు మనలను అటపట్టిస్తున్నారు. మన యువకులను పిరికిపందలని, పారుబోతులని పిలుస్తుంటారు.

అందరూ ఒక్కసారి మరలా మాట్లాడటం మానేసారు. అక్కడ వున్న వారి అందరి ఆలోచనలు, ఉద్దేశ్యాలు ఒక్కటే. అయితే వారెవరూ వానప్రస్థీజీలాగా ఆవేశపడటంలేదు. మహమ్మదీయుల అగడాలు పెరిగిపోయాయని వారందరూ ఒప్పుకుంటున్నారు. అయితే మతకల్లోలాలు జరగకూడదని వారు కూడా కోరుకుంటున్నారు. ఏవైనా గొడవలు జరిగితే హిందూ,- సిక్కుల ప్రాణాలకు, ఆస్తులకు నష్టం కలుగుతుందని వారి భయం.

చాలాసేపటి వరకు ఉపాయాల గురించీ, సాధనాల గుంచీ చర్చలు జరిగాయి. ఆత్మరక్షణ ఏర్పాట్లను గురించి, మతకల్లోలాలను నివారించే ఉపాయాలను గురించి కూడా చర్చలు జరిగాయి. వార్డు కమిటీలను ఏర్పరచాలని స్వచ్ఛంద సేవకుల బృందాలను తయారు చేయాలని, పట్టణంలోని హిందూ, సిక్కు సంఘాలను సమన్వయపరచాలని, ఆవనూనెకు బదులుగా ఇసుక, నీళ్ళు ఏర్పాటు చేసుకోవాలని, రకరకాల సూచనలు చేయబడ్డాయి. ఈ గంభీరమైన చర్చల మధ్య కూడా ఆ వృద్ధుడు తన పాత పాటను వినిపిస్తూనే ఉన్నాడు. "అయ్యా మీరంతా వెళ్ళి డిప్యూటీ కమీషనర్‌ను కలవండి. నీళ్ళు కూడా త్రాగవద్దు. వెంటనే డిప్యూటీ కమీషనర్ దగ్గరకు బయల్దేరండి. నేను కూడా వస్తాను. అందరమూ తిన్నగా డిప్యూటీ కమీషనర్ దగ్గరకే వెళ్దాము".

చివరకు కార్యదర్శి అక్కడే ఉండి, నూనె, బొగ్గు, కర్రలు మొదలగు వాటికి సంబంధించిన నిర్ణయాలను గురించి ఇంటింటికి పనివాళ్ళ ద్వారా సందేశం పంపించాలని, ఇతర సంఘాలతో సంబంధాలు పెట్టుకోవాలని, కాపలాకొరకు గూర్ఖాలను ఏర్పాటు చేసుకోవాలని శివాలే వద్ద నున్న గంటను బాగు చేయించటానికి సనాతన ధర్మసభ కార్యదర్శితో మాట్లాడాలని, యువజన సంఘాన్ని ఉత్తేజపరచాలని, ఆనాటి కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న పెద్దలు వెంటనే టాంగాల మీద డిప్యూటీ కమీషనర్ బంగళాకు వెళ్ళాలని, డిప్యూటీ కమీషనర్ వద్దకు వెళ్ళి ప్రతినిధివర్గంతో ధర్మోపదేశం చేస్తూ సాంసారిక విషయాలకు దూరంగా ఉండే వానప్రస్థీజీని మినహాయించాలని నిర్ణయాలు తీసుకోబడ్డాయి.


దానవీరుడుగా కార్యవర్గ సభ్యులచే ప్రశంసించబడిన ప్రధాన్‌గారు ఇంటికి వెళ్ళేసరికి, ఆయన కుమారుడు ఇంటిలో లేడని తెలిసింది. ఆ పట్టణంలో మొదలవబోతున్న తుఫానులో తన కుమారుడు చేరేడేమో అన్న భయం అతన్ని ఆవహించింది.

ఆయన ఇంటికి నడిచి వస్తున్నప్పుడే, రణవీర్ తాలింఖానా నడిపే మాష్టర్ దేవవ్రత్ వెనుక పట్టణమంతా తిరుగుతున్నాడు. దేవవ్రత్ బూట్ల అడుగుల శబ్దం ఆ పట్టణ వీధులలో ప్రతిధ్వనిస్తున్నాయి. అతని వెనుక నడుస్తున్న పదిహేను సంవత్సరాల యువకుడు రణవీర్ గుండెల్లో ఆనందం పొంగుతోంది. అతని అణువణువు పులకించిపోతున్నది. ఈ రోజు అతనికి పరీక్ష. పరీక్షలో నెగ్గితే అతనికి దీక్ష లభిస్తుంది.

పట్టణంలోని ఏ వీధీ తిన్నగా లేదు. ఒక సందు కొంచెం దూరం తిన్నగా వుంటే దానిలో మరో సందు వచ్చి కలుస్తుంది. కొన్ని ఇళ్ళు దట్టంగా, వసారాలు ముందుకు వుండి వీధులను కప్పి వేసాయి. కొన్ని సందులు అకస్మాత్తుగా మూసుకుపోయినట్లుంటాయి. కాని చివరకు వెళితే ఏదో సన్నని కాలిబాట వంటిది కుడి వైపుకో, ఎడమ వైపుకో ఉంటుంది. దేవవ్రత్ బూట్ల శబ్దం ఆ సందులన్నీ గుర్తిస్తాయి.

యువకుడైన రణవీర్ కళ్ళల్లో కుతూహలం, సరళమైన విశ్వాసం తొంగిచూస్తున్నాయి. గురువు ఆజ్ఞపై ప్రాణాలనైనా అర్పించే పట్టుదల, శక్తి వున్నాయి.

రణవీర్ ఇంతకంటే చిన్న వయస్సులో వున్నప్పుడు, దేవవ్రత్ ద్వారా ఎందరో వీరుల కథలు వింటూ వుండేవాడు. రాణాప్రతాప్, ఛత్రపతి శివాజీల కథలు అతనికి ఎంతో స్ఫూర్తిని కలుగచేస్తూ వుండేవి. పట్టణం చుట్టూ వున్న కొండలను చూస్తుంటే రాణాప్రతాప్‌ని, చేతక్ గుర్రం, శివాజీ గుర్రపుస్వారీ స్ఫురణకు వచ్చేవి. దేవవ్రత్ అతనికి తాళ్ళతో వివిధరకముల ముడులువేయటం,



గోడలు, ఇళ్ళు ఎక్కటం వంటివెన్నో తెలియచెప్పాడు. అగ్నేయాస్త్రం, వారుణాస్త్రం మొదలగు వాటిని గురించి కూడా మాష్టర్ దేవవ్రత్ వివరించాడు.

"గాలిలోకి వదిలిన అగ్నిబాణం నిప్పులు చిమ్ముకుంటూ ముందుకు సాగుతుంది. మహా భారత యుద్ధంలో అటువంటి అగ్ని బాణమే ప్రయోగించబడింది. అది గాలిని చీల్చుకుంటూ ముందుకు సాగిపోతున్నది. అది వెళ్ళి ఒక కౌరవ యోధుని డాలును తాకి మరల ముందుకు సాగింది. పడకుండా యుద్ధరంగమంతా నిప్పులు చెరగటమే అగ్ని బాణపు విశిష్టత. ఒక యోధుని కిరీటాన్ని తాకగా అది నిప్పులు కార్చసాగింది. ఒక రథపు పతాకాన్ని తాకింది. అది తగలబడిపోసాగింది. శత్రు శిబిరాన్ని దహించి వస్తున్న వీర యోధునిలా అది కాంతులు వెదజల్లుకుంటూ తిరిగి వస్తుంది.

విమానాలు, బాంబుల తయారీ పద్ధతులు వేదాలలో వర్ణించబడి ఉన్నాయని అతనుగురువైన దేవవ్రత్ ద్వారా విని వున్నాడు. యోగశక్తికి సంబంధించిన విశేషాలు కూడా ఆయన దగ్గరే విన్నాడు.

"యోగశక్తి కలిగిన మనిషి ఏదైనా చేయగల శక్తి కలిగి వుంటాడు. హిమాలయ శిఖరాలపైన ఒక యోగిపుంగవుడు యోగ సాధన చేస్తున్నాడు. ఆయనకు సిద్ధి లభిస్తుంది. ఒక రోజు ఆయన సమాధి సిద్ధిలో వున్న సమయంలో, ఒక మ్లేచ్ఛుడు ఆయనకు తపోభంగం కలిగించటానికి అక్కడకు వెళ్ళాడు.

మ్లేచ్ఛులు శుభ్రంగా వుండరు. వాళ్ళు స్నానం చేయరు. బయలుకు వెళ్ళి వచ్చిన తర్వాత చేతులు శుభ్రం చేసుకోరు. ఒకరి ఎంగిలి ఒకరు తింటారు. కాలకృత్యాలు సమయంలో తీర్చుకోరు. అటువంటి మ్లేచ్ఛుడు యోగిపుంగవుని ముందు నిలబడి తీక్షణంగా చూడసాగాడు. ఆ మ్లేచ్ఛుని వలన ఏర్పడిన కలుషిత వాతావరణం కారణంగా యోగిపుంగవుని కనులు వాటంతట అవే తెరచుకున్నాయి. ఆయన కళ్ళ నుండి వచ్చిన దివ్య జ్యోతి కారణంగా ఆ మ్లేచ్ఛుడు అక్కడే భస్మమయిపోయాడు...."

రణవీర్ కళ్ళ ముందు మ్లేచ్ఛులు పలుసార్లు కనిపించసాగారు. రోడ్డు ప్రక్కన కూర్చున్న పిరికివాడు, ఇంటి ముందు ఊడ్చేవాడు, గుర్రపు బండి తోలేవాడు, తన సహచర విద్యార్థి హమీద్, సందుల్లో పాటలు పాడుకుంటూ బిచ్చమెత్తుకునే ఫకీరు, అందరూ మ్లేచ్ఛులే. పొరుగున నివసించే కుటుంబం కూడా మ్లేచ్ఛులే. ఇటువంటి మ్లేచ్ఛుడే ఒకడు యోగిపుంగవుని సమాధి భంగం చేయడానికి హిమాలయాలకు వెళ్ళి ఉంటాడు. ఈ రోజు అతని తోటివారు ఎనిమిది మందిలో ఒక్క రణవీరే దీక్షకు ఎంపిక చేయబడ్డాడు. దేవవ్రత్‌ను చూస్తే అందరకూ భయమే. ఆయన కాకీ నిక్కరు క్రింద, నల్లటి బూట్లు ధరించి, కఠినమైన గొంతుతో మాట్లాడుతుంటాడు. ఎవరినైనా ఎప్పుడైనా ప్రభావితం చేయగలడు. అయితే అది చాలా రహస్యంగా వుంటుంది. కేవలం దీక్ష పొందిన యువకులకే ఆవిషయం తెలుసు. వారెప్పుడూ ఆ రహస్యాన్ని బయటకు చెప్పరు.

వీధులన్నీ పాడుబడినట్లున్నాయి. వీధిలో ఒక చోట చీకటి దట్టంగా అలుముకున్నట్లు రణవీర్‌కు అనిపించింది. అయితే దగ్గరకు వెళ్ళి చూస్తే అక్కడ ఏదో ఇంటి గోడ కూలిపోయినట్లు తెలిసింది.

ఒక చోట దేవవ్రత్ ఆగిపోయాడు. రణవీర్ హృదయం ఇంతే ఉత్సాహంతో ఉద్వేగంతో గంతులు వేస్తూనే వున్నది. నిర్మానుష్యంగా వున్న ఆవీధిలో, పొడవాటి గోడకు మూయబడిన తలుపులుతో గుమ్మం వుంది. దేవవ్రత్ ముందుకు వెళ్ళి ఆ తలుపును ఒక్క తోపుతో తెరిచాడు.

ఎదురుగాపెద్ద ఆవరణ వుంది. అవతల చిన్న గది వుంది. ఆ గది గుమ్మానికి పరదా వేలాడుతున్నది. ఆవరణలో కుడి వైపున ఇటుకలు, రాళ్ళ గుట్టలు వున్నాయి. రణవీర్‌కు ఆ ప్రదేశం పాడుబడినట్లుగా అనిపించింది.

ఆవరణ దాటి దేవవ్రత్ మాష్టారు గుమ్మపు తలుపులు తట్టాడు. లోపల ఎవరో దగ్గారు. పిమ్మట అడుగుల సవ్వడి వినిపించింది.

"నేను దేవవ్రత్‌ని"

తలుపు తెరుచుకుంది. ఎదురుగా స్కూలుకు కాపలా కాసే ముసలి గూర్ఖా నిలబడి వున్నాడు. అతను చేతులు జోడించాడు.

గది లోపల చీకటిగా వుంది. ఒక ప్రక్కన మంచం ఒకటి వాల్చి వుంది. దాని మీద మురికి దుప్పటి పరిచి వుంది. గోడకు ఒక లాఠీ వాలి వుంది. గోడకు వున్న మేకుకు గూర్ఖా ధరించే పొడవైన ఖాకీ కోటు వేలాడుతూంది. పైన నల్లని ఒరలో మూసిన బాయినెట్ వేలాడుతున్నది.

ఇంతలో గది ఒక మూల నుండి కోళ్ళు అరుస్తున్న శబ్దం. రణవీర్ ఆ వైపుకు చూసాడు. ఒకపెద్ద చిల్లుల గంప క్రింద నాలుగైదు తెల్ల కోళ్ళున్నాయి.

దేవవ్రత్ మాష్టారు రణవీర్ రెక్క పట్టుకుని వెనుక వైపు దొడ్డినికి తీసుకువెళ్ళాడు. ఆ వెనుక వైపు దొడ్డి చాలా చిన్నది. ప్రక్కన పొరుగింటి ప్రహరీ గోడ ఎత్తుగా వుంది. గూర్ఖా ఒక చేతిలో కోడిని, రెండవ చేతిలో కత్తిని పట్టుకుని వారి వెనుక నడవసాగాడు.

"రణవీర్! ఈ గోడ ప్రక్కన కూర్చుని ఈ కోడిని చంపు. నీకు దీక్ష ఇచ్చే ముందు, నీ మానసిక దారుఢ్యాన్ని పరిశీలించాలి".

ఆయన రణవీర్‌ను పట్టుకుని ముందుకు తీసుకువెళ్ళాడు. "ఆర్య యువకులు మనసా, వాచా, కర్మణా ధృఢంగా వుండాలి. కత్తి చేతిలో పట్టుకుని అటు వెళ్ళి కూర్చో".

రణవీర్‌కు నాలుగు వైపులా భయంకరమైన నిశ్శబ్దం కమ్ముకున్నట్లయ్యింది. కుడి ప్రక్కన రాళ్ళ గుట్ట దగ్గర అక్కడక్కడ కోడి ఈకలు చెల్లాచెదురుగా పడివున్నాయి. రాళ్ళ గుట్ట దగ్గర కోళ్ళ రక్తంతో తడిసిన ఓ పెద్ద నల్ల రాయి వుంది.

"ఇక్కడ కూర్చో! కోడి కాలునొక దానిని నీ కుడి కాలు కింద నొక్కి పెట్టు. కత్తిని రణవీర్‌కిచ్చి కోడి రెక్కలను ఒక దానిలో ఒకటి ఇరికించాడు. కోడి బిగ్గరగా అరిచింది. దాని రెక్కలు ఒక దానిలో ఒకటి ఇరికించి ఉండటం వలన రెక్కలతో కొట్టుకోవటం ఆపేసింది.

"ఇదిగో! తీసుకో! అంటూ అతని చేతికి కోడినిచ్చి దాని పీక తప్పించు".

కాని, రణవీర్ నుదురు చమటతో తడిసిపోయింది.అతని ముఖం పాలిపోయింది. రణవీర్‌కు మైకం కమ్ముతున్నట్లు దేవవ్రత్ తెలుసుకున్నాడు.

"రణవీర్!" అంటూ బిగ్గరగా అరుస్తూ అతని చెంప మీద గట్టిగా కొట్టాడు. ఆ దెబ్బకు రణవీర్ ప్రక్కకు పడిపోయాడు. గూర్ఖా అతని వెనకే నిలబడి ఉన్నాడు. రణవీర్ చాలా కంగారు పడిపోయాడు. అతనికి ఏడుపు వస్తోంది. చెంప దెబ్బ అతని మైకం వదిలించింది.

"రణవీర్! లేచి నిలబడు". దేవవ్రత్ తీవ్ర స్వరంతో అన్నాడు.

రణవీర్ లేచి, నీళ్ళు నిండిన కళ్ళతో గురువు వైపు చూసాడు.

"ఇదేమంత కష్టమయిన పని గాదు. నేను చేస్తాను చూడు!"

ఆయన కోడి కాళ్ళు తన కుడి బూటు కాలుతో నొక్కి పట్టాడు. కోడి కళ్ళు మూసుకొని వుంది. ఎడం చేత్తో కోడి మెడ పట్టుకుని కుడి చేతిలో ఉన్న కత్తితో ఒకే దెబ్బతో దాని పీక తెగ కోసాడు. రక్తం చిమ్మింది. రక్తం చిమ్మి ఆయన ఎడం చేతి మీద కూడా కొంచెం పడింది. అయినా దేవవ్రత్ కోడిని వదలిపెట్టలేదు. కోడి తల తెగి విడిగా పడిపోయినప్పటికి ఆయన కోడి మెడకు కిందకు వంచి నొక్కి పట్టాడు. కోడి శరీరం అదేపనిగా కొట్టుకోసాగింది. ఆయన దాని మెడను గట్టిగా నొక్కిపట్టాడు. కొద్దిసేపటికి కోడి కదలటం ఆగిపోయింది. రక్తంలో తడిసిన కొంత బొచ్చు రణవీర్ ముందు పడింది. దేవవ్రత్ కోడిని ఒక వైపుకు విసిరి వేసి లేచి నిలబడ్డాడు.

"లోపలికి వెళ్ళి ఇంకొక కోడిని తీసుకురా!" గూర్ఖాతో అన్నాడు.

రణవీర్ ఒక ప్రక్కన చేతులతో తల పట్టుకు కూర్చుని వాంతి చేసుకోవటం దేవవ్రత్ చూసాడు. ఆయనకు ఇతడినింకో చెంపదెబ్బ వేద్దామా అనిపించింది. కాని కొంచెంసేపు మాట్లాడకుండా ఉండిపోయాడు. తర్వాత మెల్లగా, "నీకు ఇంకొక అవకాశం ఇస్తున్నాను. కోడిని చంపలేని యువకుడు శత్రువును ఎలా చంపగలడు" అని అన్నాడు.

కొంచెంసేపు రొప్పిన తర్వాత రణవీర్‌కు తేలికగా అన్పించింది. కడుపులో తిప్పటం ఆగిపోయింది.

"నీకు అయిదు నిమిషాలు టైమిస్తున్నాను. ఈలోగా దీనిని కోయలేక పోతే నీకు దీక్ష ఇవ్వబడదు". అంటూ దేవవ్రత్ గది లోపలికి వెళ్ళిపోయాడు.

అయిదు నిమిషాల తర్వాత దేవవ్రత్ బయటకు వచ్చేసరికి గోడ దగ్గర కోడి కొట్టుకోవటం రక్తపు బొట్లు కారడం చూసాడు. రణవీర్ తన ఎడం చేతిని మోకాళ్ళ మధ్య నొక్కి కూర్చున్నాడు. కోడి రణవీర్ చేతి మీద పొడిచిందని, రణవీర్ దాని తల తెగ్గొట్ట లేకపోయాడని, కేవలం దాన్ని గాయపర్చాడని తెలుసుకున్నాడు. రణవీర్ అతి కష్టంమీద కోడిని తిరిగి పట్టుకుని కదులుతున్న దాని మెడని కోసాడు. కాని రక్తం చిమ్మటం చూడగానే దాన్ని వదిలి వేసాడు.

కోడి నేల మీద కొట్టుకుంటూ ఎగరసాగింది. అది కొంచెం దూరం ఎరటం మరల కింద బడుతూ గిలగిలా కొట్టుకుంటూంది. ఈకలు ఊడిపడ్డాయి. రక్తం బొట్లు బొట్లుగా పడసాగింది. అది మరల ఎగురుతూ కింద బడుతూ ఉంది.

అయితే రణవీర్ మాత్రం తన పరీక్షలో నెగ్గాడు.


"రణవీర్! లే" అంటూ దేవవ్రత్, రణవీర్ భుజంమీద ప్రోత్సాహంగా తట్టాడు.

"శభాష్! నీలో పట్టుదల వుంది. శక్తి లేకపోయినా దీక్ష ఉంది. అందుకే నువ్వు దీక్ష స్వీకరించడానికి అర్హుడివి".అంటూ దేవవ్రత్ నేల మీదికి వొంగి రాయి మీద పడిన రక్తంలో వేలు పెట్టి రణవీర్ నుదుట రక్త తిలకం దిద్దాడు.

రణవీర్‌కు ఇంకా తల తిరుగుతూనే ఉంది. అయితే అర్ధచేతనావస్థలో కూడా గురువుగారి మాటలు అతనికి సంతోషాన్ని కలుగజేసాయి.

మిగిలిన వస్తువులన్నీ ఏర్పాటు చేయబడ్డాయి. కాని కుర్రవాళ్ళకు నూనె మరిగించడానికి పెద్ద కళాయి దొరకలేదు. కిటికీలో మూడు చాకులు, ఒక చిన్న కత్తి, ఒక చిన్న కృపాణం కలిపి ఉంచబడ్డాయి. పైన ఇత్తడి బొడిపెలు బిగించబడి కింద చిన్న మేకులు కొట్టబడిన కర్రలు గదిలో ఒక మూల ఉన్నాయి. గోడకు ఒక దానిపక్క ఒకటి మూడు విల్లంబులున్నాయి. పడుకుని బాణాలు వెయ్యటం, శబ్దభేది బాణాలు ప్రయోగించటం, వేలాడుతున్న తాడును గురి చూసి కొట్టడం, అద్దంలో నీడ చూసి బాణం వెయ్యటం మొదలగు వాటిలో బోధరాజ్ ప్రవీణుడు. బాణాల చివర తగిలించడానికి అతను రేకుతో త్రికోణపు ముక్కలు తయారు చేయించి తీసుకువచ్చాడు.

"ఈ ముక్కకు 'అక్నైడు' పట్టిస్తే విష బాణమౌతుంది. దీనికి పచ్చ భాస్వరం పట్టిస్తే అగ్ని బాణమౌతుంది. బాణం ఎక్కడ తగిలితే అక్కడ



మండుతుంది. దీనికి మైలుతుత్తం అంటిస్తే దెబ్బ తగిలిన తర్వాత విషపు గ్యాస్ వస్తుంది" అంటూ ఆ బాణాల విశేషాలను గురించి బోధరాజ్ మిత్రులకు చెప్పసాగాడు. రణవీర్ గదిమీద దర్వాజా మీద పెద్ద పెద్ద అక్షరాలతో 'శస్త్రాగారము' అని రాసాడు.

వానప్రస్థీజీ, నూనె విషయమై ఇచ్చిన ఆదేశం వాళ్ళు ఇంతవరకు అమలు చేయ లేకపోయారు. ఒక పీపాడు నూనె మరగించడానికి కావలసిన కళాయి ఈ యువజన సంఘంలోని సభ్యుల ఎవరిండ్ల దగ్గరా లేదు. నూనె పోయడానికి కూడా కుర్రవాళ్ళు తలా ఒక నాలుగణాలు తీసుకొని, దుకాణం నుంచి పీపాతో సహా నూనె తీసుకొని వచ్చి గదిలో పెట్టారు. తరచుగా సహపంక్తి భోజనాలు జరిగే దేవాలయంలో కూడా పెద్ద కళాయి లేదు.

పెద్ద కళాయి హల్వా దుకాణం నుండి తీసుకు రావచ్చునన్న ఆలోచన వాళ్ళ నాయకుడు బోధరాజ్‌కు కల్గింది.

"కాని హల్వా దుకాణం తాళం వేసి ఉందే!"

"ఆ కొట్టు వాడెక్కడ ఉంటాడు?"

"కొత్త వీధిలో ఉంటాడు".

"వాడి ఇల్లు ఎవరికైనా తెలుసా?"

బోధరాజ్‌కు ఆ కొట్టువాడి ఇల్లు తెలుసు. కాని నాయకుడిగా ఈ

సమయంలో అంత చిన్న పనికి తాను వెళ్ళటం అతనికి సబబు అనిపించలేదు.

"ఆ కొట్టు తలుపులు పగలగొడదాం" రణవీర్ ధృఢంగా చెప్పాడు.

కుర్రవాళ్ళు ఒక్క క్షణం కంగారుపడ్డారు. అయితే, ఈ సూచన వారికి సరైనదిగా తోచింది.

నాయకుడు కొంచెంసేపు అటు ఇటు చూసాడు. నాయకత్వ బాధ్యత నిర్వహించడం చాలా కష్టం. ఎవరికీ దొరకకుండా తాళం పగులగొట్టటం అంత తేలికయిన పనికాదు. నాయకుడు, స్వర్ణకారు బాబూ మస్తారాం కుమారుడు. పట్టణంలో డిగ్రి మొదటి సంవత్సరం చదువుతున్నాడు.

"తాళం పగలుగొట్టండి. అయితే రహస్యంగా చేయాలి. ఎవరు పగులగొడతారు. పగలగొట్టడానికి ఎవరు వెళ్ళారు?"

"నేను వెళతాను" అంటూ రణవీర్ ముందుకొచ్చాడు.

నాయకుడు రణవీర్‌ను ఒక్కసారి కిందనుండి పైదాకా తేరిపార చూసి తల అడ్డంగా ఊపాడు.

"నువ్వు పొట్టిగా ఉంటావు. తాళం పైన తగిలించి ఉంటే నీ చేతులకు కూడా అందదు.

"లేదు, తాళం కిందే వేసి ఉంది. నేను చూసాను. నేను చాలాసార్లు చూసాను".

రణవీర్ ఇట్లా తొందరగా మాట్లాడడం నాయకుడికి ఇష్టం ఉండదు. కాని రణవీర్ చాలా చలాకీగా ఉంటాడు. వేగంగా పరుగెత్తుతాడు. ఏ పని అయినా చెప్పిన వెంటనే చేస్తాడు. కొంచెం క్రమశిక్షణే తక్కువ.

రణవీర్ ఏదో విధంగా కళాయి తీసుకు రాగలడన్న నమ్మకం నాయకునికి ఉంది. అయితే తొందరలో ఏదైనా పొరపాటు చేస్తే సంఘానికి చెడ్డ పేరు వస్తుందన్న భయం కూడా లేకపోలేదు.

"నువ్వు, ధర్మదేవ్ కలసి వెళ్ళండి". అన్నాడు నాయకుడు.

"అయితే తాళం పలగొట్టి కళాయి తీసుకొచ్చారన్న సంగతి ఎవ్వరికీ తెలియకూడదు.

వీధి నిర్మానుష్యంగా ఉన్నప్పుడు వెళ్ళండి. ఇద్దరూ కలిసి వెళ్ళొద్దు, విడి విడిగా వెళ్ళండి". అని హెచ్చరించాడు.

చౌరాస్తా దాటిన తర్వాత ఎడం వైపున ఈ మిఠాయిదుకాణం ఉన్నది. దుకాణం వెనుక రణవీర్‌కు ఎవరో కదులుతున్నట్లనిపించింది. కొట్టువాడి తలగుడ్డను రణవీర్ గుర్తుపట్టాడు. కొట్టువాడు దుకాణం తెరవడానికి వస్తున్నాడని రణవీర్ అనుకున్నాడు. అయితే, అతను కొట్టు వెనుక నుండి ఏం చేస్తున్నట్టు. వీడు నిజంగా కొట్టువాడేనా లేక ఎవరైనా మ్లేచ్ఛుడు దుకాణం దోచుకోడానికి వచ్చాడా! రణవీర్ పరికించి చూసాడు. అతను దుకాణపు యజమానే. వెనక నుండి దుకాణం తెరుస్తున్నాడు.

రోడ్డంతా ఖాళీగా ఉంది. ఒకటి అరా గుఱ్ఱపు బళ్ళు తప్ప ఈ సమయమంతా రోడ్డు ఖాళీగానే ఉంటుంది. ఈ వీధిలో సాయంత్రం పూట జనం సంచారం ఎక్కువుంటుంది.

ఇద్దరు కుర్రవాళ్ళూ ఒకరి తర్వాత ఒకరు రోడ్డు దాటారు.

"నువ్వు వాడిని మాటల్లో పెట్టు. నేను లోపలికి వెళ్ళి ఆ కళాయి ఎత్తుకొస్తాను". రణవీర్ ధర్మదేవ్‌తో అన్నాడు.

"ఎత్తుకు రావలసిన అవసరం లేదు. అతనూ మన హిందూ సోదరుడే! అడిగితే ఇచ్చేస్తాడు".

"నేను అతనిని కళాయి అడుగుతాను. నువ్వు అడగవద్దు".

"పోరా! నువ్వడిగేదేమిటి? నువ్వే గొప్పవాడివనుకుంటున్నావా?"

ఇద్దరూ వెనక వైపు నుండి దుకాణం వైపుకెళ్ళారు. దుకాణం తెరిచే వుంది. యజమాని లేడు. బహుశా లోపల వుండి ఉంటాడు.

రోడ్డు ప్రక్కనే ఉన్నప్పటికీ దుకాణం లోపల చీకటిగానే ఉన్నది. నూనె, నెయ్యి మొదలగు పదార్థాలపై ఈగలు ముసురుకొని ఉన్నాయి. లోపల నుండి సామాసోల వాసన వస్తున్నది. రణవీర్ లోపలకు తొంగి చూసాడు.

"ఎవరది? ఈ రోజు దుకాణం తెరవటంలేదు" లోపలి నుండి వినవచ్చింది.

యువకులిద్దరూ లోపలకు ప్రవేశించారు. లోపల యజమాని మైదా డబ్బాను వంచి గుండిలో పోస్తున్నాడు. గుమ్మం దగ్గర ఉన్న వీరిని చూసి కంగారుపడ్డాడు.


అయితే, వెంటనే తేరుకొని నవ్వుతూ "రండి! రండి! ఈ రోజు ఏమీ తయారు చేయలేదు. సామాను కొద్దిగా తీసుకొని వెళదామని వచ్చాను. పట్టణంలో పరిస్థితులు బాగులేవు. మీరు కూడా బయట తిరగటం మంచిదికాదు. ఇళ్ళకు వెళ్ళిపోండి". అన్నాడు.

"ఆ కళాయి ఎత్తుకో!" రణవీర్ ధర్మదేవ్‌కు ఆజ్ఞాపించాడు.


ధర్మదేవ్, గోడకు ఆనించి ఉన్న కళాయిల వైపు వెళ్ళాడు.

"హిందూ జాతిని రక్షించడానికి ఈ కళాయిని తీసుకు వెళుతున్నాము. విపత్తు తీరిన తరువాత కళాయి తిరిగి తీసుకొచ్చి యిస్తాము".

గడుసులోకం — బాబు



టి.జి.యల్. వంటనూనెలు



వంటకాలకు శ్రేష్ఠం

రుచిలో అద్భుతం

టిజియల్ మైక్రోరిఫైన్డ్ గ్రౌండ్‌నట్ ఆయల్;
టిజియల్ మైక్రో రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ స్వచ్ఛమైనవి, రుచికర మైనవి. వీటిలో వంట చేయుటమే గృహిణికి ఆనందదాయకం.
ఆ వంటల్ని తినటమే ఇంటిల్లిపాదికీ మహదానందకరం.



రు. 2/- తగ్గింపు

మీరు ఉపయోగించిన ఖాళీ సీసాను మూతతో
తిరిగి ఇచ్చేసి, కొత్త సీసా ధరలో
రెండు రూ.లు తగ్గింపు పొందండి!

TGL

ఉత్పాదకులు:


టిజియల్ గ్రౌండ్ నట్ కార్పొరేషన్

ఆదోని-518 301, ఆంధ్రప్రదేశ్.

సి. & ఎఫ్. ఏజెంట్ ఫర్ హైదరాబాద్ / సికింద్రాబాద్ & తెలంగాణా జిల్లా : నాగ్ మార్కెటింగ్, పూనం అపార్టుమెంట్స్, అబిడ్స్, హైదరాబాద్-500001, ఫోన్:232823. స్టాకిస్టులు: కె.వీ. ఎంటర్‌ప్రైజెస్, అఫ్జల్‌గంజ్, హైదరాబాద్-500012, ఫోన్:42271 శివ ఏజన్సీస్, రాంనగర్‌గుండు, విద్యానగర్, హైదరాబాద్-500044, అలీ-అక్బర్ ఎస్టాబ్లిష్‌మెంట్, ఫతేనగర్, హైదరాబాద్-500018 ఫోన్ : 261114.

విద్యకు అవధి లేదు

ధర్మపథం



విద్యకు జ్ఞానమే ప్రధాన ప్రయోజనమని అంటారు కాని ప్రస్తుత కాలాన్ని బట్టి చూస్తే ఉద్యోగ సంపాదనయే ప్రధాన ప్రయోజనంగా కానవస్తున్నది. ఆ ఉద్యోగాలలో చిన్న, పెద్ద భేదం వుండడం వల్ల వాటి అర్హతలకూ ఒక అవధి ఏర్పాటు చేయబడుతుంది. పాఠశాలా విద్య చిన్నచిన్న ఉద్యోగులకు, ఎలిమెంటరీ స్కూళ్ళ ఉపాధ్యాయులకూ చాలును. బ్యాంకులు, పెద్ద కంపెనీలు, పట్టభద్రులను ఎన్నుకుంటాయి. డాక్టర్లు గాను, ఇంజనీర్లుగాను తయారు కావడానికి తగిన ఉన్నత విద్యలు కావాలి. ఎం. ఏ., ఎం. ఎస్సి. పట్టాలు పొంది, డాక్టర్ పట్టానికి కొందరు పరిశోధనలు చేసి, ప్రతిభావంతులని పేరు తెచ్చుకుంటారు. వారు, వారు వివిధ ఉద్యోగాలలో పని చేస్తూ తమ చదువు పూర్తి అయినదని తృప్తి పడతారు. మహాప్రజ్ఞాశాలులు అంతతో వూరుకోరు. వారు తమకు తెలిసిన దాని కంటె తెలియనిదే అధికం వున్నదని భావించి యింకా పరిశోధనలు చేసి కొత్త కొత్త విషయాలు తెలుసుకుంటారు. వారు కనిపెట్టిన విషయాలు లోకానికి పెక్కు విధాల ఉపయోగపడుతున్నవి. విద్యకు అవధి లేదు. తెలుసుకోవాలనే కుతూహలం వుంటే ఎన్నో తెలుసుకోవచ్చును.

తాము పొందిన విశ్వవిద్యాలయపట్టం విద్యా పూర్తికి చిహ్నం కాదు. కాలేజీ చదువు పూర్తి అయిన తర్వాత మా గురువులు "ఈ పట్టం రావడంతో – మీ విద్య పూర్తి అయిందని భావించకూడదు. ఇంతవరకూ మీరు యితరులపై ఆధారపడి విద్య నేర్చుకున్నారు. ఇకమీద స్వతంత్రించి మీరు మీ జ్ఞానాన్నివృద్ధి చేసుకోవలసి వున్నది. మీరు సంపాదించిన పట్టం మీరు స్వయం కృషి చెయ్యడానికి అర్హతను సూచించేది మాత్రమే" అని హితాన్ని బోధించారు. వారి బోధన ఎంతో విలువైనది. ఆపైన తగిన కృషి చేసిన వారే పేరు ప్రతిష్ఠలు సంపాదించగలుగుతారు. విద్యకు అవధి లేదు.

–బులుసు వేంకటరమణయ్య

తమస్

దుకాణపు యజమానికి వీళ్ళ మాటలు ఏం అర్థంకాలేదు!

"మీరు ఎవరు? అసలు విషయం ఏమిటి? కళాయి దేనికి? ఎవరిదైనా పెళ్ళి జరుగుతుందా?"

ఇద్దరూ సమాధానం ఇవ్వలేదు.

"ఆ మధ్యలో కళాయి తీసుకో!" రణవీర్ మరలా ధర్మదేవ్‌తో చెప్పాడు.

"మీరెవరయ్యా బాబూ! అసలు విషయం ఏమిటి? కళాయి ఎక్కడకు తీసుకుపోతున్నారు?"

"అవన్నీ తరువాత తెలుస్తాయి. పద".

"భలేగా వుందే! అడగటంలేదు. పెట్టడంలేదు; కళాయి ఎత్తుకు పోతున్నారు".

రణవీర్ తన చొక్కా జేబులో చెయ్యి పెట్టి "నువ్వు కళాయి ఇవ్వనంటావా?" అని బిగ్గరగా అరుస్తూ ముందుకు దూకాడు.

దుకాణపు యజమాని ఏదో అనే లోపే, దుకాణపు యజమాని ఎడమ చెంపపై రక్తం కారసాగింది. మరొక్కసారి ఎగిరిన తర్వాత రణవీర్ చెయ్యి తిరిగి జేబులోనికి వెళ్ళింది. యజమాని రెండు చేతుల్తో ముఖం కప్పుకుని, "అయ్యో, అయ్యో...." అంటూ కూర్చుండిపోయాడు. అతని చెంప నుండి రక్తం బొట్టు బొట్టుగా నేలపై పడసాగింది.

"ఈ విషయం ఎవరికీ తెలియకూడదు. తెలిస్తే నీ ప్రాణాలు దక్కవు".

ధర్మదేవ్ కళాయి ఎత్తుకుని రోడ్డు దాటి నడవసాగాడు. రణవీర్ కొంచెం వణుకుతూ నడుస్తున్నాడు. చంపటం అంత కష్టం కాదని రణవీర్‌కు అన్పించింది. వీడిని తేలికగా చంపి ఉండేవాడిని. కాని పోరాడాలంటే కష్టమే. ఎదుటి వ్యక్తి తిరగబడితే, ఇబ్బందే! కాని, కత్తితో పొడిచి చంపటం తేలికే. అంత పెద్ద కష్టం కాదు. అనుకుంటూ, రణవీర్ రకరకాలుగా ఆలోచిస్తున్నాడు. ఇంటి ఆవరణలోకి వెళ్ళిన తర్వాత ధర్మదేవ్ ఆగిపోయాడు.

"నువ్వు వాడిని చంపలేదు కదా!" వెనక వచ్చిన రణవీర్‌ను అడిగాడు ధర్మదేవ్.

"వాడు పిచ్చి మాటలు ఎందుకు మాట్లాడాలి?"

ధర్మదేవ్ గొంతు ఎండిపోతున్నది. నాలుక తడబడిపోయింది. నాలుకతో పెదాలు తడి చేసుకుంటూ "ఎవరైనా చూస్తే ఏమై ఉండేది! వాడు అరిస్తే! మనం ఏం చేసి ఉండేవాళ్ళం" అని అడిగాడు ధర్మదేవ్.

"మనం ఎవరికి భయపడం. ఏవడేం చేస్తాడో చూద్దాం! నువ్వైనా సరే! నీ యిష్టమైంది చేసుకోవచ్చు".

నిర్లక్ష్యంగా అంటూ రణవీర్ మెట్లెక్కసాగాడు.

(ఇంకా ఉంది)

త్యాగం నిస్వార్థ సేవ నేటి నాయకులకి అవసరం


జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో సీనియర్ మంత్రిగా, అనేక పర్యాయాలు తాత్కాలిక ప్రధానిగా పదవీ బాధ్యతలని నిర్వహించిన శ్రీ గుల్జారీలాల్ నందాకి ఇప్పుడు 90 సంవత్సరాలు.



గత కొన్ని దశాబ్దాలుగా ఆయన రాజకీయాలకి దూరంగా ఉన్నా ప్రజా సేవ మాత్రం మానలేదు. అహమ్మదాబాదులో ఉంటున్న ఆయన అక్కడి కార్మిక సంస్థ మజ్దూర్ మహాజన్‌తో సన్నిహిత సంబంధాలని కలిగి ఉన్నారు. భారత్ సేవక్ సమాజ్‌కి ఆయన ఇంకా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆ సంస్థ వార్షికోత్సవానికి ఆరోగ్యం బాగుండకపోయినా ఆయన ఢిల్లీ వెళ్ళారు. నేడు సర్వత్రా నెలకొన్న క్రమశిక్షణారాహిత్యం పట్ల ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేసారు. హింసని అరికట్టటానికి ఒక వ్యక్తిగా చేయగలిగింది ఏమీ లేదని, ప్రతి నగరంలోని, పట్టణంలోని, పల్లెలోని ఒకే రకం భావాలు గల వ్యక్తులందరూ సంఘటిత కృషితో తమ చుట్టుపక్కల ఉన్న ప్రజలలో మార్పు తేవాలని, అందుకు ఆయా సంస్థల నిర్వాహకులు కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వం కూడా వివిధ స్థాయిలలో స్థానిక నాయకులకి సహకారాన్ని అందచేయాలని అన్నారు. అహమ్మదాబాదులో తమ పరిధిలో తాము అలాంటి కృషి ప్రారంభించామని శ్రీ నందా చెప్పారు. స్వాతంత్ర్యానంతరం హింస చెలరేగినప్పుడు ప్రజలు జవహర్‌లాల్ నెహ్రూ పటేల్ వంటి నాయకులు చెప్పింది విన్నారంటే దానికి కారణం స్వాతంత్ర్య సమరంలో వారు ఎన్నో కష్టాలని అనుభవించినందు వల్లనేనని, నేటి నాయకత్వం కూడా త్యాగం, నిస్వార్థ సేవలతో ప్రజల విశ్వాసాన్ని చూరగొనాలని, పేదవారి కష్టాలు తెలుసుకోవాలని, వికేంద్రీకరణ అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు...

దేశ బహిష్కృతుడే దేశాధ్యక్షుడైతే!?

ఏదో ఒక రకంగా సంచలనాన్ని సృష్టించి వార్తలలో ఉండడం "భగవాన్" రజనీశ్‌కి అలవాటే. ఈ మధ్యనే అమెరికాలోని గ్లోబల్ ప్రమోషన్స్ అనే సంస్థ ఆయనను అమెరికా అధ్యక్ష పదవికి పోటీ చేయమని కోరిందట. ఆ సంస్థే మొత్తం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తానందట. రజనీశ్ ఈ సూచనను అంగీకరించి "చరిత్రలోకల్లా గొప్ప అపహాస్య సంఘటన అవుతుందిది. చట్ట ప్రకారంగా ఐదు సంవత్సరాల పాటు దేశంలో



ప్రవేశించడానికి వీలులేని వ్యక్తి అమెరికా అధ్యక్షుడు కాగలగడం విచిత్రం కాదూ" అన్నారట. ఈ స్థితిలోని వేళాకోళాన్ని గుర్తించిన ప్రజలు తనకు వోట్లు వేస్తారని ఆయన అన్నారట. అబ్రహామ్ లింకన్ తర్వాత అమెరికాకు తానే నిజమయిన అధ్యక్షుడినవుతానని కూడా ఆయన అన్నారట....

మార్క్సిస్టు ముఖ్యమంత్రి కుమారుడి పన్ను ఎగవేత!

ఆశ్రిత పక్షపాతానికీ, అవినీతికీ, పన్నుల ఎగవేతకూ పార్టీ భేదాలు లేవని ఇదివరకెన్నోసార్లు రుజువయిన సంగతినే చందన్‌బసు మరొకసారి



రుజువు చేశారు. ఆయన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి జ్యోతిబసు కుమారుడు. ఆయనకు దుర్గాపూర్‌లో ఈస్టర్న్ బిస్కట్ కంపెనీ అనే బిస్కట్లు తయారుచేసే కంపెనీ ఒకటి ఉంది. ఆ కంపెనీలో తయారవుతున్న బిస్కట్ల ధర గురించి కేంద్ర ఎక్సైజ్ శాఖకు ఇస్తున్న నివేదికలోని ధరకు, అసలు ధరకు సంబంధం లేదని ఆ శాఖకు అనుమానం వచ్చింది. దుర్గాపూర్‌లోని ఫ్యాక్టరీ మీద, కలకత్తాలోని కార్యాలయం మీద దాడి చేయగా దొరికిన పత్రాలలో అసలు వాస్తవాలు బయటపడ్డాయి. చందన్‌బసు నివేదికలో ఒక కిలో బిస్కట్ల ధరలు వరుసగా 4-25, 6-60, 4-60 అని చూపగా నిజానికి వాటి ఉత్పత్తి వ్యయం రు. 10-00, రు. 9-60, రు. 10గా ఉంది. అంటే అమ్మకపు ధర ఇంకా ఎక్కువ ఉండి ఉంటుంది. 1981 నుంచి 1985 వరకు 75 లక్షల కిలోల బిస్కట్లు అమ్మారనీ, కనుక వాటిపై ఎక్సైజ్ పన్ను 31 లక్షల రూపాయలు చెల్లించాలని ఆ శాఖ ఆదేశించింది. గతంలో ఎన్నో ఉత్తరాలకు బసు జవాబివ్వనందు వల్ల దాడి చేసి ఈ డబ్బు చెల్లించాలని ఆదేశించారు....

బాడ్మింటన్ విజేత సయ్యద్ మోడీ హత్య!

ఎనిమిదిసార్లు జాతీయ విజేతగా గెలుపొందిన బాడ్మింటన్ క్రీడాకారుడు సయ్యద్ మోడీని లక్నోలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు కాల్చి చంపారు. సయ్యద్ మోడీ వయసు 28 సంవత్సరాలు. ఆయన భార్య శ్రీమతి అమితా కులకర్ణి కూడా బాడ్మింటన్ క్రీడాకారిణే. వారికి ఆరు నెలల పాప ఉంది. 1975లో కలకత్తాలో జరిగిన జాతీయ సబ్‌- జూనియర్ పోటీలలో గెలుపొందడంతో మోడీ బాడ్మింటన్ క్రీడారంగం మీద తన విజయయాత్ర ప్రారంభించారు. మరుసటి సంవత్సరం హైదరాబాద్‌లో జరిగిన ఆసియన్ బాడ్మింటన్ కాన్ఫెడరేషన్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనడం ద్వారా ఆయన అంతర్జాతీయ గుర్తింపును పొందారు. 1981లో విజయవాడలో జరిగిన జాతీయ పోటీలలో ప్రకాశ్‌పదుకొనెను ఓడించి ఆ స్థానాన్ని కైవసం చేసుకున్న మోడీ ఈ సంవత్సరం జమ్‌షెడ్‌పూర్‌లో ఓడిపోయేవరకూ అత్యున్నత స్థానాన్ని నిలబెట్టుకుంటూ వచ్చారు.



న్యూజిలాండ్, శ్రీలంక, కొరియా, మలేషియాలలో కూడా ఆయన తన ప్రతిభను ప్రదర్శించారు. ఇంకా ఒక జాతీయ ఛాంపియన్‌షిప్‌ను సంపాదించి ప్రకాష్ పదుకొనెను అధిగమించాలనే సయ్యద్ మోడీ కోరిక నెరవేరకుండానే దుర్మరణం పాలయ్యారు.... □



సరిత చీరలో అందాల తార భానుప్రియ.

ISKRA

కొత్త శీర్షిక ప్రారంభం!



సౌందర్యదీపం

చల్లా ఝాన్సీరాణి



సౌందర్యారాధకులకు ఇదే అందమైన ఆహ్వానం!

అసలు అందం అనేది ఆడదాని జన్మ హక్కు! అంటే కాదనే వారెవరుంటారు?

అందం అనేది చూసేవాళ్ళ దృష్టినిబట్టి ఉంటుంది అని కొందరంటే ఆరోగ్యాన్ని మించిన అందం లేదంటారు మరికొందరు.

శరీరంలోని మెరుపు - విరుపు - కవులు వర్ణించే కావ్య నాయికల అవయవ సౌష్టవం ఇవే అందానికి నిర్వచనాలు అంటారు ఇంకొందరు.

ఇలా తర తరాలుగా అందానికి ఎవరికివాళ్ళు తమ పరిధిలో అర్థాలు చెప్పుకుంటూ వచ్చారు. కానీ, 'ఇదే' అందానికి సరైన నిర్వచనం అని చెప్పడం సాహసమే అవుతుంది.

అందం ఆనందదాయకమే అయినప్పటికీ అందం ఒక్కటే ఆనందానికి కారణంకాదు. అలా అని అందాన్ని నిర్లక్ష్యంచేస్తే మనల్ని మనం నిర్లక్ష్యం చేసుకున్నట్లే.

ప్రతివారి జీవితంలో మధురమైన అనుభూతుల్లో విహరించే క్షణాలుంటాయి. ఆ కొద్ది క్షణాల అనుభవం ఆ మనిషి అందంతో కూడా ముడిపడి ఉంటుంది. ఒక్కోసారి కేవలం అందమే మనిషిని అత్యున్నత శిఖరానికి లాక్కొళ్ళి నిలబెడుతుంది.


అయితే అందమనేది మన కోసమా చూసేవాళ్ళ కోసమా? అనేది ఒక్క మాటలో సమాధానం చెప్పలేని ప్రశ్న.

పదిమంది మనల్ని ప్రశంశా పూర్వకంగా చూస్తే మనలో ఆత్మ విశ్వాసం తప్పకుండా పెరుగుతుంది. దాంతో మరింత హుందాగా, ఆకర్షణీయంగా ఉండడానికి ప్రయత్నిస్తాం. ఆ ఆత్మ విశ్వాసమే మనిషికి ఏ ఒడుదుడుకులకూ చలించని మనోధైర్యాన్నిస్తుంది.

అందుకే అందం అనేది ప్రతి మనిషికీ అవసరం. పుట్టుకతో ఉండాలి కాని మధ్యలో తంటాలు పడితే వస్తుందా అందం? అనే నిరాశావాదులూ లేకపోలేదు. అయితే ఎవరి పరిధిలో వాళ్ళు అవకాశమున్నంత వరకూ శుభ్రంగా, అందంగా ఉండడంలో తప్పులేదు. అందమంటే కేవలం హెవీగా మేకప్ చేసుకోవడం - లిప్‌స్టిక్ వేసుకోవడం - మోడ్రన్ డ్రెస్ వేసుకోవడం - జుట్టు కత్తిరించుకోవడమే ననే దురభిప్రాయం చాలా మందిలో ఉంది.

ఈ బ్యూటీషియన్లు చెప్పేవన్నీ మనం చేస్తే ఇంట్లో వాళ్ళు వూరుకుంటారా? నలుగురూ నవ్విపోరూ - అనే వాళ్ళు కూడా లేకపోలేదు.

అయితే అలాంటివాళ్ళు తెలుసుకోవలసిన విషయం ఒకటుంది. ఎవరి సర్కిల్‌నిబట్టి వాళ్ళు



ఎవరి సంస్కృతినిబట్టి వాళ్ళు ఉండడంలో తప్పులేదు. అలాగే మధ్య తరగతి గృహిణిని మేకప్ వేసుకుని జుట్టు కత్తిరించుకోమని ఏ బ్యూటీషియనూ సలహా ఇవ్వదు. వంటింట్లో అతి చవగ్గా దొరికే సహజమైన సాధనాలతో ఉన్న అందాన్ని పోకుండా కాపాడుకోవచ్చు. చర్మాన్ని ఆరోగ్య వంతంగా మార్చుకోవచ్చు.

చక్కటి . స్వచ్ఛమైన చిరునవ్వు, మృదువైన సంభాషణ, శుభ్రమైన, నప్పే దుస్తులు, చక్కటి కదలికలు, నడక, మర్యాద, మన్నన ఇవన్నీ కూడా మనిషికి లేని అందాన్ని తెచ్చిపెడతాయి.

ఖరీదైన బ్యూటీ క్లినిక్స్‌కు వెళ్ళగలిగే వాళ్ళకోసం నేనీ శీర్షికని రాయడంలేదు. బ్యూటీ క్లినిక్స్‌కి వెళ్ళడం ఇష్టంలేని సాంప్రదాయకమైన కటుంబాల మహిళలకి, కెమికల్స్ వాడ్డం ఏమాత్రం ఇష్టంలేని వారికీ - మాత్రమే నా సలహాలు ఉపకరిస్తాయి.

శరీర లావణ్యం, సౌందర్యం, పరిపూర్ణ ఆరోగ్యం ప్రకృతి తన బిడ్డలకిచ్చే శాశ్వతమైన వరాలు.

ప్రకృతిలో భాగమైన మన శరీరం ప్రకృతి ఒడిలోనే పెరిగితే ఏ సాధనాల అవసరం లేకుండానే సహజ సౌందర్య వన్నెలు దిద్దుకుంటుంది.

దుమ్ము, ధూళి, పొగ, అశుభ్రత మొదలైనవి మిళితమైన వాతావరణం మనల్ని - ముఖ్యంగా నగరవాసుల్ని ప్రకృతికి దూరం చేస్తుంది. అప్పుడు తప్పకుండా శరీరం పట్ల కొంత శ్రద్ధ తీసుకోవలసిన అవసరం ఏర్పడుతుంది - అంటే సౌందర్య సాధనాల సహాయం తీసుకోవాలన్నమాట.

మొదటగా శరీర భాగాలన్నిటిలోకి ముఖ్యమైన చర్మం గురించి వచ్చే వారం తెలుసుకుందాం- □

వినాయకచవితి కార్టూన్లు



కథలు, కావ్యాలు, మరెన్నో నవలలు, నాటకాలు, వ్యాసాలు రచించి హిందీ సాహిత్యంలో ఒక నూతన యుగాన్ని సృష్టించి, చేపట్టిన ప్రతి సాహితీ ప్రక్రియలోను అద్వితీయు డనిపించుకున్న ద్రష్ట, వాఙ్మయ తపస్వి, వారణాసి వాస్తవ్యులు శ్రీ జయశంకర్ ప్రసాద్ (1889–1937) నిరాడంబర జీవితం గడిపిన నైష్ఠిక తపస్వి ఆయన అందుకే నశ్యం అమ్ముకొని జీవించినా అవినశ్వర కావ్య సృష్టి చేసిన అమరజీవి "శంకరుడు వెలసిన వారణాసిలో జయశంకరుడని' పేరుపొందిన పుణ్యజీవి వాగ్మివి

హిందీ సాహిత్యానికి "ఛాయా వాద" (భావ) కవితా



"కామాయని"లో శ్రద్ధా మనువులుగ
కుమారి శ్రీబిందు, బాలాజీ

ప్రక్రియతో ప్రముఖంగా బహుముఖ సేవ చేసిన జయశంకర్ కలం నుండి జాలువారిన రచనిది "కామాయని" అందం ఆనందం. అనురాగం మానవుడు సేవించ వలసిన గుణత్రయాలు వీటిని సమన్వయ విజక్షంగా సమకూర్చుకో గలిగితే సమస్త లీలా రహస్యమయిం ప్రేమశ్రీ, శ్రేయోదాయక మవుతుందనే పావన దావలంబన వెలయించే కామాయని కావ్యంతో మూర్తిక ... ప్రక్రియలోను తిరుగులేని సిద్ధ హస్త ...

కున్నారు జయశంకర్ ప్రసాద్ "కామ"– రామ" సమారాధనను సమన్వయించేందుకు ప్రయత్నించిన అనర్ఘ రచన, ధర్మ సమ్మతమైన 'కామాన్ని' సకలజన సంసేవ్యంగా రసవంతమైన పద్ధతిలో వివరించిన కమనీయ కళాఖండం – కామాయని

'కామాయని' అని కావ్య నాయికకు కవి పెట్టిన పేరు అసలామె పేరు శ్రద్ధ... ఋగ్వేదంలో కావ్యనాయిక శ్రద్ధ ఋషిమోషితగా కనిపిస్తుంది. శ్రద్ధకు సంబంధించిన సూక్తాన్ని వ్యాఖ్యానిస్తూ 'సాయణుడు'– కామగోత్రజా శ్రద్ధా నామర్షికా' అంటాడు 'కామ' గోత్రంలో జన్మించి నందువల్ల కావ్యనాయిక "కామాయని" అయ్యిందని భావించవచ్చు.... ఇకపోతే ఈ కావ్య నాయకుడు మనువు. వైవస్వత మనువు... ఋగ్వేదంలో సంగ్రహంగాను, శతపథ బ్రాహ్మణంలో విపులంగాను "మను" చరిత్ర కనిపిస్తుంది... "శ్రద్ధా దేవో వైమనః" అని శత పథ బ్రాహ్మణంలో నిరూపించబడిన మనువునే భాగవతం "శ్రాద్ధ దేవుని"గా వర్ణిస్తుంది ఈ వైవస్వత మనువునే 'కాళిదాసు' 'మానసయో మనీషిణాం' అని ప్రశంసిస్తాడు... ఈ కావ్యంలో శ్రద్ధా మనువులతో పాటు సారస్వత రాణిగా ప్రసిద్ధి కెక్కిన "ఇద" అనె ఆమె వృత్తాంతం కూడ కనిపిస్తుంది. చాందోగ్యోపనిషత్తులో "ఇడా మనువుల" సంభాషణ చాలా మనోహరంగా వర్ణించబడింది. ఇలా వేదకాలం అనేక రూపాలలో ప్రచరిస్తూ వచ్చిన "ఇడా శ్రద్ధా మనువుల చరిత్రే కామాయని....

కామాయని కథ :–

అది వేదకాలం...

వైదిక కాలం నాటి భరత భూమి. పుణ్యభూమి అది... ఎటుచూసినా చక్కని, చిక్కని పంట పొలాలు. ప్రకృతికి పచ్చదనాన్ని అందించి, ఆహ్లాదపరిచే పచ్చిక బయళ్ళు. ఒకప్రక్క పరవళ్ళ పరువాలతో ప్రకృతిని పరవశింప జేస్తూ పరువులెత్తే నదీమ జలాలయితే, మరోప్రక్క నింగికెగిసిన ఉత్తుంగ, హిమాలయాలు మహిమాలయాలు ఆ విధంగా శోభాయమానంగా అలరారుతున్న వేదభూమిలో ఆసేతు హిమాచలం ప్రళయ భీకర గర్జనలతో మృత్యువు విలయతాండవం చేసింది పుడమి తల్లి కడుపున చిచ్చును రగిల్చింది సమస్త ప్రాణికోటి ఒక్కక్షణంలో మృత్యు కౌగిలిలో కరిగి పోయింది మృత్యువు అతన్ని మరచిందో అతనే మృత్యువుకు ఎదురు నిలచాడో కాని మృత్యుంజయుడై నిలిచాడు. ప్రళయానంతరం ప్రాణాలతో బయటపడిన అతను మనువు అంతు లేని వైభవం ఒక్కక్షణంలో అంతరించినందుకు అతడు "ఆవేదన" పొందుతాడు ప్రళయ ప్రకోపం తగ్గి క్రమంగా ప్రకృతి శాంతిస్తుంది మనువు మనస్సులో మళ్ళీ జీవితం మీద "ఆసక్తి" ఏర్పడుతుంది



"కామాయని"లో శివపార్వతులు.

శర్వరీ రమ
కమనీయ ...

కొంత కాలానికి తనతోపాటు శ్రద్ధ అనే గంధర్వకన్యకూడ జీవించి వున్నట్లు తెలుసుకుంటాడు ఆమెతో పరిచయం అతనికి "ఆహ్లాదాన్ని" కలగ జేస్తుంది ఆ పరిచయం మెల్లగా "అనురాగం"గా మారుతుంది వలపులతో పులకరించిన రెండు హృదయాల మధ్య గాఢమైన "అనుబంధం' ఏర్పడుతుంది కాని దానికి స్త్రీ సహజమైన బిడియం సన్నని "అవరోధం" కల్పిస్తుంది చివరకు కామాయని 'కాంతుని' కౌగిటిలో కరిగిపోతుంది అసుర

"కామాయని"లో ప్రకృతి కన్యల నృత్య విలాసం





గా కుమారి శ్రీబిందు-జ్యోతి

...ణీయం ...మాయని

పురోహితుల సాయంతో యజ్ఞంచేసి ఇరువురు "ఆచరణ" బంధాన్ని అంగీకరిస్తారు. శ్రద్ధ గర్భవతి అవుతుంది.. భావి సంతానం వైపు ఆమె మమకారం పెరిగిపోవడం మనువు సహించలేడు. అతని కామార్తి శాంతించదు. "అసంతృప్తి"తో అతడు చిక్కని సుఖానికై "అన్వేషణ" సాగిస్తాడు. సారస్వత నగరంలో "ఇడా" రాణితో అతనికి పరిచయం కలుగుతుంది.. ఆమె కోరిక ప్రకారం తన బుద్ధి బలంతో అతడు నగర శాసనాన్ని చక్కబెడతాడు.. కాని అతనిలో వున్న 'కామవాసన' అణగని 'కామతృష్ణ' 'ఇడ'ను కూడ స్వాధీనం చేసుకోవాలని చూస్తుంది. ఇడ అతని ప్రేమను తిరస్కరిస్తుంది.... తిరస్కారం సహించలేని మనువుని ప్రజలు పరాభవిస్తారు. అతని మీద తిరగబడతారు. ఈ కల్లోలమంతా శ్రద్ధకు పీడ కలగా కనిపిస్తుంది.. "ఆందోళన"తో ఆమె తన కన్న కొడుకుని వెంట బెట్టుకొని పతినన్వేషిస్తూ బయలు దేరుతుంది... తుదకు సారస్వత నగరంలో ఇడ కనిపిస్తుంది... మైమరచిన "ఆవేశం"తో ప్రజలతో పోరాడి గాయపడిన మనువును చూచి ఆమె తన కల నిజమైందని తల్లడిల్లి పోతుంది. మనువును "అప్యాయం"గా ఓదారుస్తుంది. మనువు పరితపించి శ్రద్ధకు తన పాప పంకిల ముఖం చూపలేక అర్ధరాత్రి వేళ పారిపోతాడు.. శ్రద్ధ తన కొడుకుని ఇడకు అప్పగించి మళ్ళీ భర్తను వెదుక్కుంటూ బయలు దేరుతుంది. చివరకు ఒక కొండ గుహలో మనువు కనిపిస్తాడు.... ఈ సారి శ్రద్ధ అతనికి అతిలోక సాధ్విగా గోచరిస్తుంది. అతని ముఖమండలంలో ఆమెకు నాట్యలోలుని దివ్య తేజస్సు, ఆ తేజస్సు కలితమైన "ఆలోకం" భాసిస్తుంది. అప్పుడు వారిరువురు విశిష్టమైన మనోదశలో త్రిపుర సౌందర్యం దర్శిస్తారు. ఇచ్ఛా జ్ఞాన కర్మ జగత్తుల "అంతర్యం" శ్రద్ధ వివరిస్తుంది. శ్రద్ధా సమేతుడైన మనువు మానస సరోవరాన్ని తన చిర నివాసం చేసుకుంటాడు.

ఈ లోగా సారస్వత నగర వాసులను కూడగట్టుకొని ఇడ మానవ (మను తనయ) సమేతంగా మానసయాత్ర చేస్తుంది. మానస సరోవరంలో సాంద్ర చైతన్య తరంగిణిలో ఓలలాడుతున్న మనువు అందరికీ "ఆనందం" పంచి పెడతాడు. అది జగదేకమైన ఏకాంతం.

"ఆవేదన" నుండి "ఆనందం" వరకు క్రమ పరిణామం పొందిన "శ్రద్ధామయ మానవుని" వివిధ మనోదశలు, భావ భూమికలు ప్రతిబింబించే ఈ పదిహేను సర్గల భావగర్భితమైన బృహత్కావ్యం "కామాయని"ని, జయశంకరుని వాగ్విభూతిని తిరుపతి ఇండియన్ బాలె థియేటర్ "కళాక్షేత్రం" ఇటీవల రెండు గంటల వ్యవధి గల చక్కనైన సంగీత నృత్య రూపకంగా ప్రదర్శించింది కవి, పండితులు ప్రముఖ రచయిత, సంపాదకులు శ్రీ శార్వరి ఈ సంగీత నృత్యరూపకానికి హృద్యంగా సాహిత్యాన్ని కూర్చగా చక్కనైన రాగమాలికలతో సంగీత మధురిమలను చేర్చారు రాయలసీమ గానకోకిల పరవస్తు మైథిలి శ్రీమతి నాగసరస్వతి శ్రీ మునిరాజ రత్నం శ్రీ ఎమ్ కె కుమార్, శ్రీ పి బి పి శ్రీనివాస్‌లు వయొలిన్ మృదంగం, ఫ్లూట్, వీణ వాయిద్యాలపై సహకార సంగీతాన్ని అందించగా, శ్రీ కిశోర్ కుమార్ శ్రీ వెంకటరమణ శ్రీ రమేష్ బాబు ఆహార్యం అలంకరణలు సమకూర్చారు

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ శ్రీనివాస ఆడిటోరియంలో శర్వరీ రమణీయంగా ప్రదర్శితమైన ఈ కమనీయ కామాయనిలో ఇండియన్ బాలె థియేటర్ విశిష్ట కళాకారిణి, నాట్యరాణి కుమారి శ్రీ బిందు కావ్య నాయిక శ్రద్ధగా ముగ్ధ మనోహరంగా నర్తించగా కావ్య నాయకుడుగా శ్రీ బాలాజీ, ఇడా రాణిగా కుమారి వినుత, మాయగా కుమారి జ్యోతిర్మయి, శివుడు పార్వతిగా కుమారి జ్యోతి, శ్రీబిందు, మిత్ర వరణులుగా వింధ్య రాధ.... పాత్రలకు తగిన విధంగా చక్కని అభినవేశంతో, హావ భావాలతో ప్రేక్షకులని మెప్పించారు. ప్రకృతి కన్యలుగా బబిత, రూప, శిరీష, సిరిమల్లి, చెలికత్తెలుగా కుమారి భవాని, పద్మ, నాగలక్ష్మి, సంధ్య చేసిన బృంద నృత్యాలు ప్రేక్షకులకి ప్రత్యేక



శ్రద్ధామనువులుగా శ్రీబిందు, బాలాజీ

ఆకర్షితాలు భారతీయ వాఙ్మయంలో ఏకైకంగా వున్న ఇడా శ్రద్ధామనువుల చరిత్రను సంగీత నృత్య రూపకంగా ప్రదర్శింప బూనడం సాహసమే అవుతుంది నృత్యశిల్పి మాస్టర్ రమణ నేతృత్వంలో నృత్య దర్శకత్వంలో సాహసించి సఫలం పొంది తిరుపతి ఇండియన్ బాలెథియేటర్ కళాకారులు నిజంగా అభినందనీయులు

పురుషుడనను మోహమునకు లోనయి
విస్మరించితివి స్త్రీ సహచరియని
సతిపతిని సౌహార్ద సూత్రమున
సంబంధమను సమరస సహకారము

–(ఐ వి)

కుమారి సంధ్య, జ్యోతిర్మయి, పద్మ, భవాని



మెనీ థేంక్స్ మనోరమా!

తటవర్తి రామచంద్రరావు

ఆవేళ కాలేజీకి స్ట్రయికు. స్టూడెంట్స్ కేవో డిమాండ్లు వున్నాయి. వాళ్ళు క్లాసులకి రాక పోయినా మాలెక్చరర్సుకి కాలేజీకి రాక తప్పదు!

స్టాఫ్‌రూములో అడుగు పెట్టేసరికి తెలుగు పండితులు గంగాధరశాస్త్రిగారు. కెమిస్ట్రీ లెక్చరరు శ్యామ్యూలు తప్ప మరెవ్వరూ కనిపించలేదు.... అంటే, అప్పటికే అంతా అటెండెన్స్ రిజిస్టరులో సంతకాలు పెట్టేసి ఉడాయించేసినట్టున్నారు!

గదంతా కలయజూసాను. అప్పుడు కనిపించింది జూయాలజీ డిమానిస్ట్రేటర్ మనోరమ! కిటికీ పక్కగా కుర్చీ వేసుక్కూర్చుని ఏదో నవల కాబోలు చదువుకుంటోంది. నన్ను చూసి విష్ చేసి మళ్ళీ నవలలో పడిపోయింది ఆమె.

శామ్యూలు ఏదో చెపుతున్నాడు. వింటున్నట్టు ఊకొడుతున్నానే కాని నాకళ్ళు మాత్రం మనోరమ మీదనే ఉండిపోయాయి.

ఆ అధరాలు పద్మపత్రాల్లా ముద్దుగా ముసిపెంగా ముడుచుకున్నాయి. అక్షరాల వరవడి పెడుతూ, కదిలే ఆ నల్లటి కళ్ళు మిలమిల మెఱుస్తున్నాయి. ఆమె కూర్చున్న భంగిమ హరివిల్లులా మనోజ్ఞంగావుంది. మళ్ళీ మళ్ళీ కన్నుల దోనెలతో, గుండెల కెత్తుకోవాలనిపించే మోహనరూపం. ఒక్కసారి చూస్తే మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే శరీర సౌష్టవం. మనోరమ నిజంగా మనోహరి!

నేను అన్య మనస్కంగా వున్నానని గుర్తించాడు కాబోలు... కబుర్లు కట్టిపెట్టి తన లెక్చర్ నోట్సు వ్రాసుకోవటంలో మునిగి పోయాడు శామ్యూలు.

నేనూ నా మేథ్స్ నోట్సు తిరగవేయటం ప్రారంభించాను. కాని, దృష్టి దాని మీదలేదు. మనోరమతో ఏదోటి మాట్లాడాలని మహాయిదిగావుంది. పోనీ, నా వైపు చూస్తుందేమో ఏదోటి టాపిక్ ఎత్తుదామంటే ఆమె నవలలో మరీ లోతుగా మునిగి పోయింది. ఆమెని ఆకర్షించటం ఎలాగో తోచలేదు.

'చెలులతో మాట్లాడు సౌఖ్యమ్ము కొఱకు
చిత్రలేఖన విద్య నేర్చినాను!' అన్నాడు గాలిబ్.

చిన్నప్పుడు బొమ్మలు బాగానే వేసే వాడ్ని. కాని, అస్తమానం బొమ్మలు వేయటమేనా లెక్కలు చేయరా వెధవాయ్– అని మామయ్య తిట్టేవాడు. ఆ బొమ్మలు పోయాయి. ఇప్పుడు నేనూ నా లెక్కలూ మిగిలాము. బొమ్మలు గీసే అలవాటు ఎంత తప్పి పోయిందంటే ఇప్పుడు జామెట్రీ ఫిగర్సు కూడ తిన్నగా గీయలేను. ఇంక అమ్మాయిల ఒంపుల సొంపుల్ని రేఖల్లో దిద్దటం నావల్ల ఏమవుతుంది!

శామ్యూలు, శాస్త్రిగారు వెళ్ళిపోతే బాగుండు ననిపించింది. వాళ్ళకన్న ముందు ఆమె వెళ్ళిపోతుందేమో నని నాభయం! నోట్సు పేజీలు తిరగవేస్తున్నానే కాని మనోరమ సుందర తనూలతనే నాకంటి కొసలు పరికిస్తున్నాయి! ఆల్ఫా బీటా గామాలకి బదులు చేపపిల్లల్లాంటి కళ్ళు, కొన దేలిన నాజూకయిన ముక్కు, దొండపండులాంటి పెదవులు కళ్ళముందు మురిపిస్తున్నాయి. ఉండబట్టలేక ఒక్కసారి దీర్ఘంగా ఆమె వైపు చూసాను.

ఆమె చేతిలోని పుస్తకంలో మూడు వంతులు పేజీలయిపోయాయి. అంటే, కథ మంచి క్లయిమాక్స్‌కి చేరిందన్నమాట! అందుకే దాన్ని వదలిపెట్ట లేక పోతోంది. లేకపోతే. అందరిలాగే ఎప్పుడో ఇంటికి వెళ్ళిపోయివుండేది.

ఆమె ఒక్కోపేజీ తిరగవేస్తున్న కొద్దీ నాలో ఆత్రుత ఒక్కో డిగ్రీ పెరిగి పోతోంది. ఆశ రెండేసి డిగ్రీలు చొప్పున తరిగిపోతోంది.

'అందాన్ని సృజించావు ఒక చేత్తో
అంక్షలు విధించావు ఒక చేత్తో
ఆశలు రేగుతున్న నాదారినుండి ఓ అల్లా!
అందాన్నో అంక్షనో తొలగించకపోతే ఎల్లా?'

ఆరుద్ర అరబ్బీ మురబ్బా ఒకటి గుర్తొచ్చింది..... తెగించి ఒకసారి కళ్ళారా ఆమె అందాన్ని త్రాగేసి తనివితీరా గుటక వేసాను. 'ఏదోటి డ్రమెటిక్‌గా జరిగితే ఎంత బావుండును!' అని కొంచెం మనస్సు కోరింది.

నా మనస్సులోని మాట విని అర్థం చేసుకున్న వాడిలా చేత్తో పుస్తకాలతో సహా చటుక్కున లేచి వెళ్ళిపోయాడు శామ్యూలు.

ఒకంట శాస్త్రిగారిని మరోకంట మనోరమని చూస్తూ నా నోట్సు పేజీలు మాత్రం యాంత్రికంగా అటూయిటూ తిప్పుతున్నాను.

'అందము + ఆకర్షణ = మనోరమ' అన్న కొత్త ఈక్వేషన్ ఒకటి బుర్రలో మెదిలింది. ఉన్నపళంగా బుద్ధి మరీ బరితెగించి పోయింది. కళ్ళప్పగించి ఆమె సోయగాన్ని కళ్ళతో త్రాగేస్తూ ఉండి పోయాను!

ఎక్కడి శ్రుతి యెక్కడి స్మృతి
యెక్కడి జపమేటి నేమమెక్కడి ధ్యానం
బెక్కడి జ్ఞానము చక్కని
దోక్క చకోరాక్షి యెదుట నుదటియున్నన్!

అనంత నార్యుడు నాలాంటి వాడి నెవడ్నో చూసాకనే ఆ పద్యం రాసుంటాడు.

'నేనొస్తానండీ రావుగారూ!' అని హఠాత్తుగా శాస్త్రిగారు లేచి నిలబడే సరికి ఉలిక్కిపడి గుమ్మం వైపు చూసాను. శాస్త్రిగారి అబ్బాయి అక్కడ నిలబడి వున్నాడు. అంటే, ఇంటి నుంచి పిలుపు వచ్చిందన్నమాట!

'థేంక్యూ చిట్టి శాస్త్రీ' అని అకుర్రాడికి మనస్సులోనే కృతజ్ఞతలు చెప్పేసి..... నిజంగా మేథ్స్ నోట్సు చూసేస్తున్న వాడిలా కాసేపు 'పోజు' పెట్టాను. మనోరమ ఓసారి తలయెత్తి నా వైపు చూసిందని క్రీగంట నేను గమనించక పోలేదు. ఆగదిలో మేమిద్దరం తప్ప మరో ప్రాణిలేదు. క్షణాలు హడావిడిగా పరిగెత్తి పోతున్నాయి. ఆమె త్రిప్పే పేజీల చప్పుడు నాగుండెల చప్పుడ్ని మరింత పెంచుతోంది.....

'హమ్ తుమ్ ఏక్ కమరేమె బంద్‌హో.... చాబీ ఖోజాయ్....' అని ఎక్కడినుంచో మైక్‌లో పాట వినిపించింది.

చటుక్కున మనోరమవైపు చూసాను. ఆమె కూడ అప్పుడే నావైపు చూసింది. ఆమె చూపులు చెదిరాయి. కంగారుగానవ్వి "అపాట బాబీలోది కదూ!" అన్నాను.

"అవునండి". అంది బిత్తరగా చూస్తూ.

ఇంక ఫర్వాలేదు. ఓ కొస దొరికింది. ఇంక సంభాషణ పెంచచ్చు. "ప్చ్! ఆసినిమా నాకు నచ్చలేదు". అన్నాను.

ఆమె చిత్రంగా చూసింది. "అదేమిటండీ! ఆ సినిమా బాగానే ఆడింది కదండీ!"

"మంచి సినిమా అంటే బాగా ఆడటం ఒక్కటే కాదుకదా! ఆవారా, జాగ్తే రహో, ... లాంటి క్లాస్ ఫిలుమ్సు తీసిన రాజకపూరేనా ఇంత చెత్త సినిమా తీసింది అని నాకనిపించింది. అలంకార్‌లో 'సంగమ్' ఆడుతోంది. మరి రాజకపూర్ తీసిందే! పదిహేనేళ్ళయినా ఇంకా జనం విరగబడి చూస్తున్నారు.



అదిగో, అలావుండాలి సినిమా అంటే – ఎన్ని జనరేషన్స్ మారినా కళాఖండాల్లా ఉండి పోవాలి....' అని ఓ పెద్ద లెక్చర్ ఇచ్చాను.

"నేను చూశ్శేదండీ! రాజకపూర్ సినిమాలంటే మానాన్నగారిక్కూడా చాలా యిష్టం".

ఎక్కడలేని ధైర్యం వచ్చింది. "అయితే, నువ్వు ఇప్పుడు ఎందుకు చూడకూడదు? కావాలంటే నేనూవస్తాను కంపెనీగా!" అన్నాను.

ఆమె బిత్తరపోతూ చూసింది.

ఆ అవకాశం జారవిడుచుకోవాలని లేదునాకు. "ఈ పూట కాలేజీ ఎలాగా లేదు. ఇక్కడ వూరికే కూర్చునే దానికి బదులు అలా సరదాగా వెళ్ళొద్దాంపద... అదే, నీకభ్యంతరం లేకపోతేనే! "సాధ్యమయినంత గోముగా అన్నాను.

"అహఁ! అందుక్కాదండి." అని బెదురుతూ ఆగిపోయింది.

"మరి?"

"ఎవరయినా చూస్తే...."

ఎగిరి గెంతినంత పని చేసాను. ఎవరయినా చూస్తారేమోనని భయంతప్ప నాతో రావటం ఆమె కభ్యంతరంలేదు. "ఇందులో తప్పేముంది మనోరమా! నువ్వేమీ కానిపని చేయటం లేదే! ఒకే కాలేజీలో పని చేసేవాళ్ళిద్దరికి ఒకేపూట ఒకేహాల్లో సినిమా చూడాలనిపించటం తప్పా! కంపెనీకోసం ఓ చోట కూర్చుని చూసినంత మాత్రాన ఇందులో అపరాధ మేముంది? చదువుకున్న దానివి. ఇంకా సందేహాలేనా?..." ఇలా ఉమన్స్ లిబ్‌మీద ఓ పది నిమిషాలు ఏకధాటిగా లెక్చరిచ్చి ఆమెను ఉక్కిరిబిక్కిరి చేసేసాను....

అరగంట తర్వాత అలంకార్‌లో ఆ అందాలభామ సరసన కూర్చుని 'సంగమ్' సినిమా చూస్తూ మధురోహలతో తేలిపోయాను. ఆమె నుంచి కమ్మని పరిమళాలేవో పాకి వస్తున్నాయి. పక్కనే కూర్చున్న పరువం అంతుపట్టని వెచ్చ తనాన్ని. నా నరనరాల్లోనూ పరిగెత్తిస్తోంది. ఏదో పరవశం.... మరేదో పులకరింపు. ఇంకేదో హాయి! మత్తుగా గమ్మత్తుగా వుంది!...

'మేరే మన్‌కీ గంగా
ఔర్ తేరే మన్‌కీ జమునాకా
బోల్ రాధా బోల్
సంగమ్ హోగాకీ నహీఁ!'

ముఖేష్‌పాట ఎంత చక్కిలిగిలి పెట్టిందంటే ఉత్సాహంతో ఊగిసలాడి పోయింది నేనేకాదు. మనోరమకూడ పరవశంతో పొంగి పొరలిపోయింది. అంతవరకు ఒళ్ళో చేతులు పెట్టుకొని ఒబ్బిడిగా కూర్చున్నది కుర్చీ చేతిమీదవున్న నాచేతిమీద తన చేయివేసింది!

అప్రయత్నంగా నా చేతిని వెనక్కి లాక్కున్నాను.

ఆంధ్రపత్రిక ప్రచురణ

బాలరంజని

చిన్నపిల్లల మాసపత్రిక

(పెద్దవారు కూడా చదవవచ్చు!)



ఆ హఠాత్పరిణామానికి నావైపోసారి చూసి ఆమె కూడ తన చేతిని గబుక్కున వెనక్కి తీసుకొని వొళ్ళో పెట్టుకుంది. తను చేసిన పనికి సిగ్గు పడినట్టుంది– తల తిప్పుకొని ముడుచుకు పోయింది.

'ఆమె ముద్దిచ్చుటకు వెనుకాడదేమొ
కాని ఇమ్మని అడుగ వెన్కాడినాను!'

అన్నాడు గాలిబ్. పూలగుత్తి వొచ్చి మీదపడితే చేత్తో తోసేసాను. ఎంతమూర్ఖుడ్ని! మర్యాదస్తుడిగా మనోరమ మనస్సులో నా గౌరవం పెరిగి వుండచ్చు! కాని, మళ్ళీ అలాంటి అదృష్టం దొరుకుతుందా?

'మైం క్యాకరూం రామ్
ముఝే బుడ్డా మిల్గయా!'

వైజయంతిమాల తన పాటతో రాజకపూర్‌ని ఆట పట్టిస్తోంది సినిమాలో. అప్రయత్నంగా మనోరమవైపు చూసాను. ఆ మసక చీకటిలో కూడ ఆమె అధరాల మీద చిరునవ్వు తళుక్కు మనటం నాక్కనిపించింది. కొంపదీసి మనోరమ నా గురించి అలాగే అనుకోవటం లేదుకదా!.... ఒక్క సారిగా ఏదో ఉద్రేకం ఒళ్ళంతా పట్టి వూపింది. గబుక్కున ఆమె ముఖాన్ని నా చేతుల్లోకి తీసుకొని ముద్దులతో ముంచెత్తేద్దామనిపించింది. అతికష్టం మీద నిగ్రహించుకున్నాను. చేతులకి సంకెళ్ళు వేసుకున్నాను. లేకపోతే, మరుక్షణంలో ఏ పిచ్చిపని చేసేవాడినో ఏమో!

ఇంటర్వెల్‌లో "బయటకు వెడదామా! కూల్డ్రింక్ తాగుదాం". అన్నాను.

"అబ్బే, వద్దండీ!" అంది ఆమె మొహమాటంగా.

"హాల్లో వేడిగావుంది. బయటకు వెడితే కొంచెం చల్లగాలి పీల్చుకున్నట్టు వుంటుంది." అని నవ్వాను.

ఆమె మృదువుగా నవ్వి "అయితే, ఒకషరతు..... కూల్డ్రింక్సయినా నన్ను డబ్బు లివ్వనివ్వండి" అంది.

"అందమయిన అమ్మాయిలు ఇలాంటి షరతులు పెట్టటం నేనెక్కడా వినలేదు. కనలేదు" అన్నాను కొంటెగా.

హాల్లో అట్టే వెలుగులేకపోయినా ఆమె బుగ్గలు ఎర్రపెక్కటం గుర్తించాను. "త్వరగా వెళ్ళి వచ్చేద్దాం. రండి." అని దారి తీసాను.

తన చేతిలోని పుస్తకాన్ని గుండెలకొత్తి పట్టుకుంటూ ముద్దరాలిలా బయటకు నడిచి వచ్చింది మనోరమ. 'ఆమె చేతిలోని పుస్తకాన్నయినా కాకపోయానే?' అని అనుకున్నాను.

స్ట్రాలోంచి కూల్డ్రింకు తాగుతుంటే.... అసలే చిన్నది.... మరీ మల్లె మొగ్గంత అయిపోయింది అమ్మెనోరు. 'ఆమె పెదాలు రుచి చూసిన స్ట్రా ఎంత పుణ్యం చేసుకుపుట్టింది.' అనుకున్నాను. కూల్డ్రింకు సీసాలోంచి పొంగి పొరలే నురుగులాగునే అంతరాంతరాలలో మధురోహలతో పొంగి పొరలిపోయాను.



నాట్య గణపతి
(చిత్రం : పి. పి. నాయుడు)

తొలి పూజల దొర

తొండమున్నవాడ, తొలి పూజ గొనువాడ
ఎలుక వాహనంబు నెక్కువాడ
కుడుము లుండ్రము లనకడు ప్రీతిగలవాడ
విఘ్న రాజ భువికి వేగరమ్మ

పాఠశాలకేగు బాల బాలికలము
పుస్తకాలు నాదు మ్రోల నుంచి
పూలు పత్రులతోడ పూజ చేయగ, వేచి
యుంటిమయ్య నీలకంఠ తనయ

కొబ్బ రరటిపండ్లు కుడుములు నుండ్రాళ్ళు
పాలు పంచదార పాయసమును
ఇష్టమనియె తెచ్చి యుంచాము నీకయ్య
ఆరగించ గణపతయ్య రార.

మంచి మనసు నిచ్చి మంచి మాలో పెంచి
మంచి రాతి మసల మాకు నేర్పి
ఎల్లవేళ మమ్ము చలగా గాచుచు
చూచుచుండుమయ్య శూర్ప కర్ణ.

-రాయప్రోలు వామనమూర్తి

మెనీ థేంక్స్ మనోరమా!

నాదృష్టంతా ఆమె బుగ్గల మీద చెమరే గులాబిరంగు మీదనేవుంది. ఆమెతో గడిపే ఆ తియ్యని క్షణాలు నాకెంతో థ్రిల్లింగ్‌గా ఉన్నాయి. కళ్ళముందున్న మనోరమ తప్ప..... పరిసరాలలో వున్నదంతా మిధ్య.... అని నా మనస్సు కనిపించింది.

ఎంత చక్కని అనుభవం!

ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు!

ఎప్పుడో పదిహేనేళ్ళ క్రితం – పెళ్ళి కాకముందు – శాంతితో సినిమాకు వెళ్ళినప్పుడు కలిగిన మధురానుభూతులు మళ్ళీ ఇప్పుడు – పునరావృతమయ్యాయి! చూస్తుండగానే ఆమధురక్షణాలు పరిగెత్తిపోయాయి....

సినిమా అయిపోయింది.

మనోరమ వెళ్ళిపోయింది.

ఏదో అమూల్యమయినది చేజారవిడుచుకున్న వాడిలా నిరుత్సాహంగా ఇల్లు చేరాను.

తలుపుతీసిన శాంతి "ఏమిట్లండీ అలావున్నారు!" అని అడిగింది.

"ఏంలేదు. కొంచెం తలనెప్పిగావుంది." అన్నాను ముఖం తిప్పుకుంటూ. నిజంగానే తలనెప్పనిపించింది. బట్టలు మార్చుకొని కాళ్ళు చేతులు ముఖం కడుక్కొని పడగ్గదిలోకి వెళ్ళి మంచం మీద వాలిపోయాను.

"కాఫీ తాగండి" అంటూ కప్పుతో వచ్చింది శాంతి.

నేనీవేళ ఆమెకు తెలియకుండా ఓ పని చేసాను. ఏ భార్యా సహించలేని పని చేసాను. అందుకే ఆమె ముఖంలోకి చూడలేక పోయాను. తలదించుకొని కాఫీ తాగేసాను.

"పోనీ, ఏ మాత్రయినా వేసుకుంటారా!"

ఆమె నాగురించి ఎంత ఆరాటన పడుతోంది! గిల్టీగా ఫీలయ్యాను. "వద్దు".

"అమృతాంజనం రాస్తా పోనీ!"

మామూలప్పుడయితే శాంతి చల్లని చేయి నానుదుటను తాకితే కలిగే హాయికోసం సరేనని వుండేవాడిని. కాని ఆక్షణంలో ఆమె కళ్ళల్లోకి చూసేధైర్యం లేక పోయింది. "కాసేపు పడుకుంటా. అదే తగ్గిపోతుంది" అన్నాను. నేనటు తిరిగి పడుకోవటం చూసి కాబోలు... మౌనంగా గది తలుపులు దగ్గరగా వేసి వెళ్ళిపోయింది శాంతి.

గట్టిగా కళ్ళు మూసుకొని పడుకున్నాను కాని ఎంతో సేపటి దాకా నిద్రపట్టలేదు. మనోరమతో గడిపిన మధుర క్షణాలు ఇచ్చిన మత్తులాంటి దేదో ఒళ్ళంతా పాకుతోంది. మరోవైపు శాంతి మనస్సు

'ఉత్తరాలు' శీర్షికకి
రాసేవారు
తమపేరు, పూర్తి చిరునామా
తెలుగు లిపిలో రాయాలని
మనవి చేస్తున్నాము.
–సంపాదకుడు.

కిష్టం లేనిది ఎందుకు చేసానా అని అసంతృప్తి గానూ వుంది. చిత్రమయిన పరిస్థితి!

నాకు తెలియకుండానే ఎప్పుడో నిద్రలోకి జారిపోయాను....

బయట గదిలో పిల్లల మాటల అలికిడికి మెలకువ వచ్చింది. కిటికీలోంచి బయిటికి చూసాను. అప్పుడే బయిట చీకట్లావరించుకుంటున్నాయి. అంటే, రెండు మూడు గంటలసేపు పడుకున్నానన్నమాట!

గది తలుపులు తోసుకుని కరుణ లోపలకి వచ్చింది. "లేచేసావానాన్నా! మామయ్య వచ్చాడు" అంది.

ఇంకనాకు పైకి లేవక త[illegible] గది బయటకు వచ్చి ప్రభాకర్‌ని పలకరించాను. "ఎప్పుడొచ్చావ్?" అంటూ.

"మామయ్య పొద్దున్నే వచ్చాడు నాన్నా! నన్నూ చెల్లాయినీ మేట్నీకి తీసుకు వెళ్ళాడు" అన్నాడు బాబు.

"ఏం సినిమా?" అప్రయత్నంగా అడిగాను.

"సంగమ్!" అంది కరుణ కళ్ళు తిప్పుకుంటూ.

నా తలమీద పిడుగు పడినట్టయింది. చటుక్కున ప్రభాకర్ ముఖంలోకి తేరిపార చూసాను. అతను తల తిప్పుకున్నాడు. అంటే?.... నేను మనోరమతో కలిసి సినిమాకు వెళ్ళటం చూసాడా అతను!

కంగారుగా శాంతివైపు చూసాను. ఆమె ముఖం

సాక్షి గణపతి

సాక్షి రంగారావు

మా ఇంటి పేరు 'సాక్షి' కాదు. 'సాక్షి' చిత్రం మూలంగా ఆ పేరు వచ్చిందన్న విషయం చాలా మందికి తెలుసనుకుంటాను.

అసలు 'సాక్షి' అనే ఇంటి పేరు ఎవరికైనా ఉన్నట్టు నాకు తెలీదు.

కాని, శ్రీశైలం ముందున్న వినాయకుడికి మాత్రం 'సాక్షి గణపతి' అని పేరు. భక్తులు ముందుగా ఈయన్ని దర్శించి, ఈయన వద్దున్న పుస్తకంలో తమ పేర్లు రాస్తే, ముక్తి కలుగుతుందట. ఫలానావారు శ్రీశైలాన్ని దర్శించి పుణ్యం మూట కట్టుకున్నట్టు ఈయన వచ్చి సాక్ష్యం చెబుతారట!

అంటే, ఈ లోకంలో కాకుండా పరలోకంలో కూడా 'సాక్షి' అవసరం ఉందన్న మాట! (జి. వి. జి.)

మెనీ థేంక్స్ మనోరమా!

ఎర్రగావుంది. అంటే? ప్రభాకర్ తను చూసింది వాళ్ళక్కయ్యకి చెప్పేసాడా?... ఏదో గగుర్పాటుతో నాగుండె జల్లుమంది.

నన్ను రక్షిస్తూ.... అక్కడ్నించి తనే వంటింట్లోకి వెళ్ళి పోయింది శాంతి. పిల్లలు ఎటువంటి ఇబ్బంది కలిగించే ప్రశ్నలూ వేయకుండా ముఖం కడుక్కునే వంకన బాత్రూముకి పారిపోయాను.

ఆ తర్వాత భోజనాల దగ్గర కూర్చున్న పదిహేను నిమిషాలు నాకు పదిహేను యుగాలుగా గడిచాయి. శాంతి మౌనం భరించలేనంత బాధగా వున్నా.... పిల్లలతో ఏదో చిలిపి కబుర్లు చెపుతూనన్ను రక్షించి పుణ్యం కట్టుకున్నాడు ప్రభాకర్.

రాత్రి డాబా మీద పడుకోటానికి పిల్లల్ని తీసుకు వెళ్ళాడు అతను.

శాంతి చాపతెచ్చుకొని క్రిందవేసుకొని పడుకుంది. అంటే, ఇంక అనుమానం లేదు. ఆమెకు నిజం తెల్సిపోయింది!

ఎంతోసేపు మంచంమీద అలా కూర్చోలేక పోయాను. "శాంతీ!"

ఆమె పలకలేదు. మళ్ళీ పిలిచాను. ఊకొట్టింది. కాని, నావైపు తిరగలేదు. ఇ[illegible]కు తప్పలేదు. క్రిందకు దిగివెళ్ళాను.

చాప మీద ఆమె పక్కనే కూర్చున్నాను. ఆమె కదల్లేదు. ముఖంమీద చేయి అడ్డంగా పెట్టుకొని అలాగే పడుకుంది.

"చేసిన తప్పుని ఒప్పుకొనే అవకాశం యివ్వవా?"

శాంతి తన ముఖం మీద చేయితీసి నావైపు చూసింది. ఆమెకళ్ళు తడితడిగావున్నాయి. తనలో పడుతున్న వేదనని ఆమె అదిరేముక్కు చెపుతోంది.

"....క్షణికమయిన బలహీనతకి లొంగి

'అర్క' పూల సేవ!

స్వామి లంబోదరా
నీ వాహనం పెద్ద తిండి దొంగ
నీకేమి పెట్టగలం?
ఈసారి విభవలో
పిట్ట తిండి కూడా గిట్టదు.

వినాయకా, శివ బాలకా
ఏడాదికోసారి వస్తావు
సారీ చెప్తే పోతావు
కానీ కొందరు
ఏటిపొడుగునా ఉన్నారు

ఏళ్ళ తరబడిగా
దోచుకు తింటున్నారు
నాయకులమంటున్నారు
సారీ చెప్పినా పోరు

మితిమీరుతున్నారు
అవినీతిని పెంచుతున్నారు
అర్థమైన గడ్డి తింటున్నారు.

అందుకని ఎండు గడ్డి, పచ్చి గడ్డి
దొరకడం లేదు. ఉండ్రాళ్ళు
సరిగా ఉడకటం లేదు.

* * * * * *


అధిక వర్షాలవల్ల
ఆషాఢంలో చెరువులు
ఎండిపోయి తామరపూలు
పంచకళ్యాగా పూచాయి

ఎంట్రీ పన్నూ, ఎక్సిట్ పన్నూ
పన్నెండుమకు బస్తీకి చేరాయి
ధరలు పుంజుకున్నాయి
పంటల్ని తగ్గించి సమర్పించాము
సరిపుచ్చుకోవయ్యా గణనాథ
మమ్మల్ని మన్నించవయ్యా
ఓబజ్జ గణపయ్యా నీ బంటు మేమయ్యా

* * * * * * *

విభవలో అర్క (జిల్లేడు) పూలసౌరభం
నీకెంతో వైభవం

-ఎం. ఎస్. ఎం.



గణాధిపతి
(ఫొటో : కె. మధు)

పోయాను...." అంటూ ఆ వేళ ఏం జరిగిందో అంతా చెప్పాను".... నీకు తెలియకుండా చాటుగా నా ఆనందాన్ని వెతుక్కోవాలని నేనెప్పుడూ అనుకోలేదు శాంతీ! అప్పటి కప్పుడు అనాలోచితంగా చేసిన పని.... ఇప్పుడు నిన్నిలా చూస్తానని ఊహించి వుంటే నేనాపని చేసుండేవాడ్ని కాదు. నువ్వు నమ్మినా నమ్మక పోయినా ఇదినిజం! నన్ను క్షమించమని అడగటంలేదు. నా తప్పు నొప్పుకుంటున్నాను".

నిజంగానే తప్పునొప్పు కోవటంలో ఒక సుఖం ఉంది. మనసులోని మాట పైకి చెప్పుకొనే సరికి గుండె తేలిక పడింది. శాంతివైపు అప్పుడు ధైర్యంగా చూడగలిగాను.

శాంతి ముఖం ఇప్పుడు ఎంతో ప్రశాంతంగా వుంది. అంటే, నన్ను క్షమించిందన్నమాట! ఆమె పైకి లేచింది. చీరచెంగుతో కళ్ళొత్తుకుని నా దగ్గరగా జరిగింది. "మీరిదంతా చెపుతుంటే పదిహేనేళ్ళ నాటి సంగతి గుర్తొస్తోంది" అని చిన్నగా నవ్వింది.

"ఏమిటి?"

"మన పెళ్ళి కాకముందు .... మీరు రమ్మంటే మీతో పాటు సినిమాకి వచ్చిన రోజు గుర్తొస్తోంది."

"నాకూ గుర్తొచ్చింది."

"కానీ, అప్పటికీ ఇప్పటికీ ఎంత తేడావుందో చూసారా!"

"ఏమిటి?"

"అప్పుడు మీ వెంట వచ్చింది ఎవరు? ఇవేళ వచ్చిందెవరు? ఇద్దరూ పెళ్ళి కాని ఆడపిల్లలే! కాని, అప్పుడు మీకు పెళ్ళికాలేదు. ఇప్పుడు అయింది. మీరూ ఆ అమ్మాయీ సినిమా చూసి బయిటకు వస్తుంటే ప్రభాకర్ ఒక్కడే చూసాడు. పిల్లలు చూసుంటే ఎంత అనర్థం జరిగేది? పిల్లల దృష్టిలో మీ విలువ తగ్గిపోతే నాక్కాదా ఆబాధ! పెళ్ళి కావల్సిన పిల్ల..... ఆ పిల్ల చేసిన పనికి మరెవరయినా పెడర్థాలు తీసి ఇంకెవరికయినా చేరవేస్తే?....'

ఉమెన్ ఆర్ వైజర్ దేన్ మెన్ బికాజ్ దే నో లెస్ అండ్ అండర్‌స్టాండ్ మోర్!

అన్నాడు జేమ్సు స్టీఫెన్స్. ఆయన మాటల్లో ఎంత నిజముంది? ఆడది తన కోసమేకాదు. ఇంకొకరి కోసం కూడా జీవిస్తుంది. మగవాడి కన్న ఎక్కువ బాధ్యతని తలకెత్తుకుంటుంది.

"....నేనింత దూరం ఆలోచించ లేదు శాంతీ! చాలా పొరపాటయింది. ఆ అమ్మాయికి చెడ్డపేరొస్తే నన్ను నేనెప్పటికీ క్షమించుకోలేను."

నా చేతిమీద తన చేయివేసి ప్రేమగా నిమిరింది శాంతి. "మిమ్మల్ని మీరు చిన్న బుచ్చుకుంటూ మాట్లాడితే నాకు తృప్తిగా వుంటుందనుకుంటున్నారా? మనం తొందరపడి చేసే పనులు ఒక్కోసారి ఎంతటి ప్రమాదాన్నయినా తెచ్చి పెడతాయని చెపుతున్నానేకాని ఇవేళ జరిగిందానికి బాధ్యతంతా మీదే కాదు. మీరు రమ్మనగానే ఆ అమ్మాయిమాత్రం మీవెంట ఎందుకు రావాలి! తన జాగ్రత్తలో తనువుండద్దూ?" "లేదు శాంతీ! ఆ బాధ్యతంతా నాదే! ఆ అమ్మాయి చాలా మంచిది. నా మీద మర్యాదఉంచి నా మాట కాదనలేకనే వచ్చింది".

"బలేవారే! పదిహేనేళ్ళ క్రితం మీరు రమ్మనగానే నేనూ వచ్చాను. మీ మాట కాదనలేకనే కదూ నేనూ వచ్చింది! అప్పుడు మీరు అమర్యాదగా ప్రవర్తించారని నేనన్నానా?" అని శాంతి కొంటిగా నవ్వింది.

ఆమె చిలిపి తనానికి నా గుండెల మీదనుంచి పెద్ద బరువు తీసేసినట్టయింది.

"ఈమాటు ఆమెకనిపిస్తే 'మెనీ థేంక్స్ మనోరమా!' అని చెపుతా!" అంది శాంతి నామెడ చుట్టూ చేతులు వేస్తూ.

"ఎందుకూ?"

"ఈ రసిక చక్రవర్తి మనస్సుకి పదిహేనేళ్ళు వయస్సు తగ్గించినందుకు!" శాంతిది ఎంతటి ఔన్నత్యం గల మనస్సు!

నిజంగానే చిన్నవాడి నయిపోయి ఆమె ఒడిలో కరిగి పోయాను.

'ఓ! ఉమన్! లౌలీ ఉమన్!
నేచర్ మేడ్ దీ టు టెంపర్ మాన్.
ఉయ్ హాడ్ బీట్స్ విత్అవుట్ యూ!'

–'ఓట్వే' అన్న మాటలు అప్పుడు నాకు గుర్తుకు వచ్చాయి! □

బైద్యనాథ్ ఆరోగ్య దీపిక

పాఠకుల ప్రశ్నలకి బైద్యనాథ్ ఆయుర్వేద భవన్ వైద్య ప్రముఖుని సమాధానాలు

డి. పురుషోత్తమ్, విశాపట్నం

ప్ర: ఏన్‌టీరియల్ మయోకార్డియల్ ఇన్‌ఫ్రాక్షన్ అనే గుండె జబ్బు, నిరుత్సాహము.

జ: మంచి వైద్యుని సంప్రదించటం మంచిది. బైద్యనాథ్ యాంతికీ రస 3 గ్రా. బైద్యనాథ్ హృదయార్ణవ రస 12 గ్రాములు కలిపి 30 మోతాదులు చేసి ఉదయం, సాయంత్రం లో నికి సేవిస్తూ బైద్యనాథ్ అర్జునారిష్ట బైద్యనాథ్ అశ్వగంధారిష్ట రెండూ కలిపి భోజనం తరువాత రోజుకు రెండుసార్లు సేవించండి. తేలిక ఆహారము విశ్రాంతి అవసరం.

యస్. కె. షరీఫ్ (45 సం.), విశాఖపట్నం

ప్ర: మెడ వెనుక నొప్పి, వళ్ళు నొప్పి, తల విసిరినట్లు ఉంటుంది.

జ: మీకు మలబద్ధకము ఉన్నదా. ఉన్నచో రాత్రి పరుండపోవునపుడు బైద్యనాథ్ కబ్జహర చూర్ణము 2 చెంచాలు గోరు వెచ్చని నీటితో సేవించండి. విరేచనము సాఫీగా అగును. బైద్యనాథ్ వాతరీనా 1 టాబిలెట్ బైద్యనాథ్ యోగరాజ గుగ్గులు 1 మాత్ర ఉదయం, సాయంత్రం వాడుతూ భోజనం తరువాత రోజుకు రెండుసార్లు బైద్యనాథ్ అశ్వగంధారిష్ట సేవించండి.

పి. రవిచంద్ర (25 సం.), హైదరాబాద్

ప్ర: చూస్త ప్రయోగము అలవాటు వలన, నరముల బలహీనత. వివాహము అయినది. సంతోషము లేదు. హార్మోనులు వాడినాను.

జ: బైద్యనాథ్ విటా- ఎక్స్ టాబిలెట్స్ 2, బైద్యనాథ్ చ్యవనప్రాశ స్పెషల్ 1 చెంచా ఉదయం, సాయంత్రం పాలతో సేవించండి. రాత్రి పరుండబోవునపుడు బైద్యనాథ్ శుక్రవల్లభ రస 1 మాత్ర పాలతో సేవించండి.

యం. వి. లక్ష్మి (30సం.లు), హైదరాబాదు

ప్ర : 8 సంవత్సరముల నుండి ప్రతిరోజు ఎప్పుడో ఒకప్పుడు 25 నుండి 30 వరకు తుమ్ములు, ముక్కు నుండి నీరు కారటం. ముక్కుకు వాసన తెలియదు.

జ : బైద్యనాథ్ లక్ష్మీవిలాసరస 1 మాత్ర, బైద్యనాథ్ చేషట్ (నారచయ) ప్రహరీ పిప్పలి – 1 మాత్ర చొప్పున ఉదయం సాయంత్రం బైద్యనాథ్ దశమూలారిష్టతో లో నికి వాడండి. బైద్యనాథ్ షడ్‌బిందు తేల్ రాత్రి పరుండబోవునపుడు లేక ఉదయం లేవగానే ముక్కులో రెండు చుక్కలు ప్రతి దినం వేయండి. తేలిక ఆహారము మంచిది. తినగానే నిద్రించ రాదు.

గంగన్న, ప్యాపిలి

ప్ర : నాలుక మందము, మాట్లాడినప్పుడు నత్తి వస్తుంది.

జ : బైద్యనాథ్ బ్రాహ్మీబటి బైద్యనాథ్ సరస్వతారిష్టతో ఉదయం సాయంత్రం ప్రతిరోజు రెండు సార్లు లో నికి వాడండి. ఉదయం తేనె, తులసి రసం కలిపి నాలుక మీద రుద్దండి. నత్తి తగ్గవచ్చు.

ఏ. యన్. రాజన్, సదాశివపేట

ప్ర : నా వెంట్రుకలు ఒక సంవత్సరము నుండి ఎరుపు రంగులో నికి మారుచున్నవి.

జ : ఎండిన ఉసిరిక పప్పు పొడి చేసి శీకాకాయి పొడిలో కలిపి తలకు రాసి స్నానం చేయండి. బైద్యనాథ్ మహాభృంగ రాజ తైలము తలనూనెగా వాడాలి.

యఫ్. యస్. ప్రకాశరావు, రామరాజు లంక

ప్ర : గుండెనొప్పి, కాళ్ళు లాగటం తగ్గాలంటే

జ : బైద్యనాథ్ చ్యవనప్రాశ స్పెషలు ఉదయం సాయంత్రం పాలతో తీసు కొంటూ బైద్యనాథ్ అర్జునారిష్ట భోజనం తరువాత రోజుకు రెండు సార్లు వాడండి. పొగత్రాగే అలవాటు ఉంటే మాని వేయటం మంచిది.

ప్ర : మూత్ర విసర్జనలో రక్తం పడకుండా ఉండా లంటే

జ : బైద్యనాథ్ చంద్రప్రభావటి 2 మాత్రలు, బైద్యనాథ్ చందనాసవతో ఉదయం సాయంత్రం రోజుకు రెండు సార్లు తీసుకుంటూ, వేడి చేసే పదార్థాలు తీసుకోకుండా ఉండాలి. ఒకసారి పరీక్ష చేయించటం మంచిది.

లక్ష్మి, అనంతపురం

ప్ర : నాకు కొన్ని సంవత్సరముల నుండి తెలుపు.....

జ : బైద్యనాథ్ లూకోనిల్ 2 మాత్రలు, బైద్యనాథ్ సుందరీ కల్ప ఫోర్టుతో ఉదయం సాయంత్రం కొన్ని రోజులు వాడండి. కారము, పులుపు, తగ్గించాలి.

కె. బి. సంజీవరావు, కందుకూరు

ప్ర : తేనుపులు, ఆకలిలేదు, నోరు చేదు, అప్పుడప్పుడు విరేచనాలు.

జ : తేలికగా జీర్ణమయే పదార్థములు తినాలి. బైద్యనాథ్ మహాశంఖవటి రెండు మాత్రలు చొప్పున ప్రతిరోజు మూడు సార్లు మజ్జిగతో సేవించండి. బైద్యనాథ్ సురక్తా స్ప్రాంగ్, రోజు రెండుసార్లు చొప్పున కొంతకాలము సేవించండి. బైద్యనాథ్ హజమ్. యల్‌టాబ్లెట్‌లు అప్పుడప్పుడు రోజు చప్పరించండి.

పి. అనంత్, నల్లగొండ

ప్ర : ముక్కులో దుర్మాంసము పెరుగుచున్నది.

జ : ముక్కు విషయం డాక్టరుకు చూపించండి. బలమునకు బైద్యనాథ్ చ్యవనప్రాశ ద్రాక్షాసవ తీసుకోండి. □

కూపన్

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

బైద్యనాథ్ ఆరోగ్య దీపిక

ప్రశ్న :..

....

....

పంపినవారి పేరు :

పూర్తి చిరునామా :

స్వస్తిక్ యూరియా ఇచ్చే వరం
సుఖ సంపదలిక రైతు పరం

అలలుగా తలలూచే పచ్చని పొలాలు.
సమృద్ధైన దిగుబడి – అన్నీ పచ్చని అనుభూతులు.
సాగుబడి భూములు అలాగే వున్నాయి.
దిగుబడి మాత్రం ద్విగుణీకృతం.
పొలాలకి చెమటోడ్చే కాయకష్టం చాలదు.
స్వస్తిక్ యూరియా వాడాలి. అదే సరైన పద్ధతి. అలాగే
పొందాలి ముందెన్నడూ లేని లాభాలు.

* మెరిసే తెల్లని గుండ్రని గుళికలు.
* నీటిలో పూర్తిగా కరుగుతుంది.
* పంటల పరిపూర్ణ పుష్టికి అధిక తమ నత్రజని.
* పూర్తిగా నత్రజని ఉపయుక్తం.
* ద్రవంతో క్రిమినాశిని గాని, కీటకనాశిని గాని కలిపి చల్లుకునే వీలు.
* దృఢమైన 50 కిలోల ప్యాకింగ్‌లో లభ్యం.

స్వస్తిక్
యూరియా
46% నత్రజనితో కూడినది



50 కి.గ్రా.ల బస్తా రైతుకు
లభించే ధర రూ. 108.70
స్థానిక పన్నులు అదనం.

Sobhagya–H

ది ఫర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్.
6-2-30/సి, లకడి-కా-పుల్, హైదరాబాద్-500 004. (ఆం.ప్ర.)

సీరియల్

రాజశిల్పులు - రమ్యహారాలు

హరికిషన్

(గత సంచిక తరువాయి)

ఆరు ముద్దులు, ఒక చెంప దెబ్బ:-

శ్రీవిద్య భోజనాలయిం తరవాత హేమలతకు కృతజ్ఞతలు చెప్పి వెళుతూ వరండాలో కూర్చున్న ఆదిత్యకు కాస్త వినిపించేటట్టుగా అన్నది. "ఎల్లుండి సాయంత్రం మనం బీచ్‌లో కల్సుకుని కబుర్లు చెప్పుకుందాం".

"ఓ. కే" అతని తియ్యని జవాబు.

ఆ దివ్యమైన ఎల్లుండి సాయంత్రం వచ్చింది. ఒకరి కోసం మరొకరు ఎదురు చూస్తూనే ఇద్దరూ ఒక చోట చేరారు. ఒకరికి ఎదురుగా మరొకరు. ఒకరు ముందుగా పలకరిస్తే, మరొకరు మాట్లాడాలని ఇద్దరూ మాట్లాడకుండా కూర్చున్నారు.

"పిలిచారు, వచ్చాను. మీరు హోస్టు, నేను గెస్ట్, చెప్పండి" అమెరికన్ గాగుల్స్, గోల్డు ఫ్రేమ్ తళతళ మెరిశాయి.

"అంతటి గౌరవానికి నేను అర్హురాల్ని కాదు. మీ అభిప్రాయాల్లో వ్యక్తిత్వంలో నాకెందుకో స్వచ్ఛత కనిపించలేదు. మనుష్యుల్ని ప్రలోభ పెట్టి, మీ స్వంత బాణీలో కొందర్ని మోసం చేస్తున్నారేమోనని నా అనుమానం. నా అభియోగానికి మీ సమాధానం."

సముద్రపు అలల వైపు చూస్తూ కూర్చున్నాడు. ఇసకను తీసుకుని వేళ్ళ సందుల్లో నుంచీ జల్లించినట్టు జారవిడుస్తున్నాడు. ఈ అభియోగానికి అతని మనస్సు అష్ట వంకర్లూ తిరిగింది.

"మీరు ఏకసంథాగ్రాహి కాదు, ఏక అభిప్రాయగ్రాహిగా మాట్లాడి దురభిప్రాయాన్ని పదిలపర్చుకునే జాణ. రివర్స్‌లో మాట్లాడితే అదే గొప్ప తెలివి అని సంతృప్తి చెందే మానసిక అర్భకురాలు" అన్నాడు. మాటలో స్పైట్ అండ్ స్పీకనెస్ ఉన్నది గాని కటుత్వంలేదు.

"నా సంగతి మీకూ, మీ సంగతి నాకూ తెలీక పోవచ్చు, కాని ఒక చిక్కులో ఇరుక్కున్న ఆడపిల్ల ఎవరినో ఒక వ్యక్తిని నమ్మకతప్పదు. కాని మీరు నమ్మ తగిన వ్యక్తి అని నా మనస్సుకు నేను నచ్చ చెప్పుకోవాలి కదా, అందుకనే రివర్స్‌లో మాట్లాడాను. మన అభిప్రాయాలు పరస్పరం మన మనస్సులో పదిలపర్చుకుందాం బి రెడీ" అన్నది. పరాయి యువకుడితో తన తాహతుకు మించి మాట్లాడుతున్నట్టు తనకు తెలిసినా, తనున్న పరిస్థితిలో ఒక తెగింపుకు రాక తప్పదనే నిర్ణయానికి వచ్చింది శ్రీవిద్య.

"ఐయామ్ రెడీ, ఫర్ కన్సల్టేషన్, నాట్ ఫర్ ఇన్సల్టేషన్, చెప్పండి, వాటీజ్ యువర్ ప్రాబ్లం".

అతని కళ్ళదాల్లో తన ముఖం కనిపిస్తున్నది.

తన ఇంటి పరిస్థితి చెప్పింది. అన్న జగదీష్ ఎట్లా వెళ్ళిందీ చెప్పింది.

"సో డిసీజ్ ది బయోడేటా ఆఫ్ శ్రీవిద్య ఎట్ హోం" తల వంచుకుని కళ్ళు తుడుచుకున్నది. వచ్చింది కన్నీరు కాదు, ఆశ, నిరాశలకు మధ్య చిక్కి ఆ ఉత్కంఠను కలిగించే పాస్‌బుక్ చరిత్ర తనను ఎక్కడికి లాక్కుపోతుందో ననే ఆందోళన వల్ల కలిగిన స్వీట్ క్వాటిడ్ భయం, ఆందోళన.

"మొన్న మీకొక ప్రాబ్లమ్ చెప్పాను. బీద పిల్లకు భాగ్యవంతుడయిన యువకుడు, బ్లాంక్ చెక్ సంతకం చేసి ఇస్తే ఆ పిల్ల ఆ చెక్కు మీద ఎంతకు రాసుకోవచ్చు అని. మీరూ జోక్‌గా కొన్ని అభిప్రాయాలు చెప్పారు. అజరామరమయిన ప్రేమ అయితే ఆ చెక్కుని తిప్పి పంపటమే మంచిదన్నారు".

"ఎస్, అన్నాను. అది మీ స్వంత విషయంలో జరిగిన సంఘటన అని నాకు తెలీదు. విమర్శ కాదు కాని, చిన్న సందేహం. ఆ యువకుడిని మీరు చూడకపోయినా అతను మిమ్మల్ని ప్రేమించిన యంగ్ ఛాప్ అయి వుండటంలో సందేహంలేదు. నేనడిగిన దానికి దాపరికం లేకుండా సమాధానం చెప్పండి".

పాస్ బుక్‌నీ, బ్లాంక్ చెక్‌నీ చూపించింది. ఉత్తరం చూపించలేదు.

జరిగిన కథ– 20: హేమంత్ ఎవరో తెలుసుకోవడానికి శ్రీవిద్య ప్రయత్నాలు మొదలు పెడుతుంది. త్యాగరాజు పేరుతో వచ్చిన ఆగంతకుడు సావిత్రిని మోసగించి పాతికవేలు తీసుకు పోతాడు. శ్రీవిద్యకు ఓ అజ్ఞాత వ్యక్తి ఆమె శరీరాన్ని వర్ణిస్తూ ఉత్తరం రాస్తాడు. హేమలత బంధువు ఆదిత్య వల్ల తన చెక్కు సమస్య తీరుతుందా అని ఆలోచిస్తుంది శ్రీవిద్య. సత్యభామ పెళ్ళికి సుముఖంగా లేకపోవడం మానసిక లోపమేమో అని గోపాలరావు గారు సైకియాట్రిస్టు దగ్గరికి తీసుకు వెళతారు. సైకియాట్రిస్టు సత్యభామను అభినందిస్తుంది.

"అత ను మిమ్మల్ని ప్రేమిస్తున్న విషయం యదార్థం. మీరు బీద ఇంటి కన్య కనక కట్నం ప్రమేయం లేకపోయినా పెళ్ళి ఖర్చులకయినా ఉంటుందని పాతిక వేలూ మీ ఎస్. బి. ఎకౌంటులో జమ చేశాడు. కనుక ప్రేమించడం, పెళ్ళి చేసుకోవాలనుకోవటం కరెక్ట్. మీకు ఈ పరిస్థితి ప్లస్ పాయింట్స్. ఇకపోతే మనిషి కనిపించకుండా డబ్బు రూపంలో మీ మనస్సులో, మస్తిష్కంలో ప్రవేశించి పరోక్షంగా ప్రేమిస్తున్నాడు కాబట్టి అతను బాగా వయస్సు మళ్ళిన రెండో పెళ్ళి వాడని నా అభిప్రాయం. ఓ యాభై ఏళ్ళ వాడిని మీరు చూస్తూ చూస్తూ ప్రేమించరు కద. డబ్బుతో మీ ప్రేమను కొన్నేశాడు. ఆ డబ్బుని మీరు విత్‌డ్రా చేశారు. కాబట్టి మీరు అతన్ని అంటే ఆ యాభై ఏళ్ళ వాడినీ పెళ్ళి చేసుకోవటానికి ధనం మీద ప్రమాణం చేసి వప్పుకున్నట్టే. అంటే ఇదొక పాలిష్‌డ్ టైపు కన్యాశుల్కం అన్నమాట. ఓ ముసలివాని ముద్దుల భార్య" అన్నాడతను.


శ్రీవిద్య గుండెల్లో బాంబు పేలింది. మనస్సులో రైళ్ళు ఢీకొన్నయ్యి.

నిర్విణ్ణురాలై కూర్చున్నది. సముద్రపు హోరు గాలిలో అస్పష్టమయిన భావాలు చెల్లాచెదురైపోయినయ్యి. మనస్సులో చీకటి ప్రవేశించింది. అతని వైపు చూస్తూ కూర్చున్నది.

"శ్రీవిద్యగారూ, బాధపడకండి. నా అభిప్రాయం చెప్పాను"

నాలుగయిదు నిమిషాలు గడిచాయి. కన్నీరు ఇసకలో ఇంకిపోతున్నది. అప్రయత్నంగానే చిరునవ్వుతో చూసింది.

"ఆదిత్యగారూ, అన్నీ తెలిసిన ఆడపిల్ల ఓణీ, ఆ పిల్ల శరీరాన్నీ అంటి పెట్టుకునే ఉంటుంది. ఏమీ తెలియని ఆడపిల్ల ఓణీ, చిరుగాలికే రెప రెపలాడుతూ చూసేవాళ్ళకు వెర్రెక్కిస్తుంది. నన్ను ప్రేమించినవాడు ముసలివాడు కాదు. మీ అంత అందగాడు, నన్ను సఖశిఖ పర్యంతం ప్రేమించే యంగ్, ఎనర్జిటిక్ పర్సన్. నేను మీ సహాయం కోరానని నాకు పిరికి మందు పోసి, నేను బేలగా బేజారైపోయి మతిని పోగొట్టుకుంటే, నన్ను అనుభవించాలనే ఉద్దేశ్యంతో ఉన్నారని నాకు తెల్సు. స్తబ్ధతగా ఉన్న నా మనస్సుకు మీ పిరికి మందు టానిక్‌లా పని చేసింది. ఇంక నా ప్రతాపం చూపిస్తాను. సరే, మరో అభిప్రాయం చెప్పండి" అన్నది విప్పారిన మనస్సుతో అతని మనోభావాన్ని తరచి చూస్తూ.



"మరో అభిప్రాయం అంటే".

"రివర్స్ గేర్" చెక్కునీ, పాస్ బుక్‌నీ బ్యాగ్‌లో పెట్టుకున్నది.

"నాకు మరో అభిప్రాయం లేదు, ఆ కనపడని వీరుడు నా అంత అందగాడు అన్నారు. అంటే నా పర్సనాలిటీని మీరు లైక్ చేస్తున్నట్లేగా".

"చెట్టుకు పూసిన ప్రతి పువ్వు కాయకాదు. అట్లాగే ప్రతి కాయ పండుగా పండదు. పండుగా మారిన తరవాత ఆ పండు చెట్టుని అంటి పెట్టుకుని ఉండదు".

"ఇక్కడికి నన్ను రమ్మని మీరే అన్నారు, ఎట్ యువర్ రిక్వెస్ట్ వచ్చాను. నేను అందంగా ఉన్నాను అని మీ రే అన్నారు. నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. నన్ను పెళ్ళి చేసుకోవటానికి మీ అభ్యంతరం?"


చెయ్యి పుచ్చుకోబోయాడు, అవతలకు జరిగి కూర్చున్నది.

"ఆదిత్యగారూ, ప్రేమ పది కాలాలపాటు నిలిచేదిగా ఉండాలి గాని, పది నిమిషాలు మాట్లాడితేనే అది ప్రేమ కాదు. మీరు నన్ను ప్రేమించానన్నారు. నన్ను మిమ్మల్ని పెళ్ళి చేసుకోమన్నారు. ప్రేమ + ప్రేమ = పెళ్ళిగాని, ప్రేమ + సున్నా = పెళ్ళి కాదు. వన్ వే ట్రాఫిక్ అన్నట్లు వన్ సైడెడ్ లవ్ ఎప్పుడూ కష్టాలనే ప్రసాదిస్తుంది. నాకు కాబోయే భర్త కొద్దిపాటి ఇన్‌కం టాక్స్ కడుతూ పెద్ద మొత్తాల్లో ఇన్‌కంటాక్స్ ఎగ్గొట్టే తెలివి తేటలుకలవాడై ఉండాలి. ఆ పని మీకు సాధ్యపడుతుందా" నెమ్మదిగా, తియ్యగా ప్రశ్నించింది. అతను విస్తుపోయాడు.

"శ్రీవిద్యా, మీరు చాలా తెలివైనవారు. మీకు కావల్సింది డబ్బు, మనిషి ఎటువంటి వాడయినా మీకు కావల్సింది డబ్బు, డబ్బు ఇస్తే ఎంతటి నీచానికయినా, ఛా, ఛా" విసుక్కుంటూ కోపంగా అన్నాడు. ఆ మాటతో చాలా ఆశ్చర్యంతో చూసింది శ్రీవిద్య.

"ప్లీజ్ విత్‌డ్రా యువర్ కామెంట్స్. నాకూ, నా వ్యక్తిత్వానికీ, నా అభిప్రాయాలకీ సాక్షీభూతంగా నిలిచిపోయేది అతను పంపించిన బ్లాంక్ చెక్. అతను ఎంతటివాడయినా, వయస్సు మళ్ళిన వాడయినా ఐ లైక్ హిం టు మచ్, అండ్ వెరీ మచ్, ఇక పోదాం పదండి" అని లేచి నిల్చున్నది.

సంజ చీకట్లు ముసురుకుంటున్నయ్యి. అలలు నురుగులు కక్కుతూ ఒడ్డుకి వచ్చి పెద్ద శబ్దం చేస్తూ ఢీకొని వెనక్కు వెళ్ళిపోతున్నయ్యి చెల్లాచెదురై. అతను కూడా లేచి నిల్చుని... శ్రీవిద్యను కౌగలించుకుని రెండు బుగ్గలూ, రెండు కళ్ళూ, ఒక నుదురూ, ఒక మెడాను పెదవులతో వెచ్చగా స్పృశించి ముద్దు పెట్టుకున్నాడు. ఆరు ముద్దులకు జవాబుగా ఒకే ఒక చెంప దెబ్బను బలంగా కొట్టింది శ్రీవిద్య. "దర్టీయాస్" కోపం, ఉక్రోషం, ఆవేదన, అభిమానం, అవమానం, అన్నీ ఒక్కసారి చుట్టుముట్టేసరికి బావురుమని పైట చెంగు నోటికి అడ్డం పెట్టుకుని, ఎవరయినా చూశారేమోననే సిగ్గు, అభిమానంతో



కుమిలిపోయి గబగబ నడుస్తూ వెళ్ళిపోయింది. అతను సముద్రపు ఒడ్డున అక్కడే కూర్చున్నాడు.

ఆ మర్నాడే ఆ బ్లాంక్ చెక్ మీద ఒక లక్ష ఒక్క రూపాయికి ఎమౌంట్ రాసి బ్యాంకులో కలక్షన్‌కు ప్రెజెంట్ చేసింది శ్రీవిద్య. రెండు, మూడు రోజుల్లో కలెక్షన్‌కు వెళ్ళి వస్తుందని చెప్పారు. ఈ జరిగిన విషయాలు ఎవరికీ చెప్పలేదు- రెండు రోజులకు ఒకసారి బ్యాంకుకు వెళ్ళి తెలుసుకునేది. వారం రోజులు గడిచాక చెక్కు తిరిగి వచ్చింది. ఆ చెక్కు ఇచ్చిన ఖాతాదారు ఎకౌంట్‌లో ఎమౌంట్ క్రెడిట్ బ్యాలెన్స్ లేదు. చెక్కుని తీసేసుకున్నది శ్రీవిద్య. ఆ చెక్కు ఇచ్చింది అనకాపల్లిలో ఒక బ్యాంకు మీద.

ఆ రోజు వచ్చిన ఉత్తరాన్నీ, చెక్కునీ, కవరునీ మరొకసారి చూసింది శ్రీవిద్య.

1) ఉత్తరంలో సంతకం ఎ. ఎ. బి. బి. సి. సి. డి. డి. హేమంత్

2) కవరు మీద ఫ్రం అడ్రస్ ఎ. బి. సి. డి. హేమంత్, విశాఖపట్నం.

3) చెక్కు మీద సంతకం ఎ. ఎ. బి. బి. సి. సి. డి. డి. హేమంత్ చెక్కుని ఇచ్చింది అనకాపల్లిలో ఒక బ్యాంకు మీద. చెక్కు తిరిగి వచ్చింది.

ఉత్తరాన్ని మరోసారిచదువుకున్నది. ఉత్తరంలో రాసిన పుట్టుమచ్చలు కరెక్ట్, ఇదెట్లా అతను చూసేడు. మంత్రతంత్రాలా, క్షుద్రవిద్యా, అతను మెజీషియనా?

పరీక్షలు పదిహేను రోజులే ఉన్నయ్యి. పరీక్షలు టైంటేబుల్ ప్రకారం పది రోజులు. అంటే మొత్తం ఈ ఇరవై అయిదు రోజులూ, ఈ వాతావరణం నుండే తప్పుకోవాలి. రుక్మిణీ కూడా ఈ సలహానే ఇచ్చింది.

పట్టుదలతో చదువుతూ పరీక్షలకు వెళ్ళింది. పరీక్షలు రాసింది. బాగానే జరిగినయ్యి. ఫస్ట్ క్లాస్ రావచ్చునే ఆశతోనే ఉన్నది. పరీక్షలు అయ్యాక మర్నాడు ఒక రోజున రుక్మిణీతో సినిమాకు వెళ్ళింది. ఒక రోజల్లా నిద్రపోయింది. ఒక పూట మళ్ళీ హేమలత కోరికమీద వాళ్ళింట్లో భోజనం చేసింది. అంటే దాదాపుగా ఈ నెల రోజులూ ఆ జరిగిపోయిన సంఘటనలు మీద మనస్సు మళ్ళించనేలేదు.

కాలేజీలో విమల కనిపిస్తూనే ఉన్నా ఇద్దరూ ఒకరినొకరు పలకరించుకోనే లేదు. విమల ఫిజికల్ స్ట్రేచర్‌లో కాస్త మార్పు. ముఖంలో ఏదో తృప్తి. నిండుదనం చూస్తున్నది శ్రీవిద్య. ఆ రోజు సాయంత్రం విమల ఇంటికి వెళ్ళింది శ్రీవిద్య.

"నువ్వొచ్చినందుకు హార్టీ వెల్‌కం, కమిన్" అని స్టైలిష్‌గా కాస్త వంగి చేతులు చాచి ఆహ్వానించింది విమల. కాస్త చూసీ చూడనట్లు చూసింది శ్రీవిద్య. కాస్త కండబట్టిన శరీరం, వొంపు సొంపుల్లో వయ్యారం.

"విమలా, చాలా చాలా ఖుషీగా, సంతోషంగా ఉంటున్నావు, పెళ్ళి సీన్లో ఎంటరవబోతున్నావా" కాస్త మెయిన్ హెడ్డింగ్ పెట్టింది. ఇక న్యూస్ ఇవ్వాల్సిన బాధ్యత విమలది. చాలా స్టైలిష్‌గా చూస్తూ కూర్చున్నది. పెదవి విప్పలేదు-

"మాట్లాడవేం, ఎవరా అదృష్టవంతుడు, అన్ని వివరాలు చెప్పాలి. సస్పెన్స్ ఎక్కువయితే, విసుగు తొంగి చూస్తుంది. పోనీ మీ అమ్మగార్ని అడగనా".

శ్రీవిద్య జడ పుచ్చుకుని గుంజింది విమల. "అమ్మని అడుగుతావా పిల్లా, చూడూ నా మీద నీకు కోపంగా ఉంటే నా వీపు మీద కొట్టు, కాని నా అనుభవం మీద దెబ్బతియ్యకు. కమాన్, డాబా మీదికి వెళదాం పద" అర్థం కాలేదు. గబగబ మెట్లెక్కి డాబా మీదికి వెళ్ళారిద్దరూ.

కాస్సేపు మాట్లాడుకున్నాక కిందికి వెళ్ళి రెండు చల్లని డ్రింకులు తెచ్చింది విమల. ఇద్దరూ తీసుకున్నారు.

"నేను. చెప్పబోయేది చాలా హాట్‌గా ఉంటుంది. అందుకే ఈ కూల్ డ్రింక్. కాస్త రిలాక్సవ్వు".

ఇద్దరూ పిట్టగోడకు వార్లబడి కూర్చున్నారు.

"శ్రీవిద్యా, స్థూలంగా ఆలోచిస్తే ప్రకృతీ, మానవుడూ, ప్రేరేపణ ఇవేసెక్సుకు మూల కారణం అయిన ఆధారాలు. అంగవైకల్యం ఉన్న వ్యక్తి అంటే అతని మీద అందరికీ సానుభూతే ఉంటుంది. ఏపుగా, ఆరోగ్యంగా ఎదిగిన ఆడపిల్లలకు

రచయిత జవాబులు



పవిత్ర, కొత్తగూడెం

ప్ర : నేటి సాహిత్యపు విలువలు దిగజారటానికి కారణం?

జ : స్పీడు, మనస్తత్వాల్లో మార్పు.

చప్పు నాగేశ్వరరావు, పాములవలస, విజయనగరం జిల్లా

ప్ర : హరికిషన్‌గారూ రచయితగా మీ జీవిత లక్ష్యం?

జ : సామాజిక పరిస్థితుల్లోని మంచి చెడ్డల్ని విమర్శనాత్మకంగా ప్రతిబింబింపచేస, ఓ పరిష్కార మార్గాన్ని సూచించటం.

శ్రీపాద ప్రియాంకశ్రీనివాస్, బొబ్బిలి

ప్ర : 'జీవన విహంగం' నవలలో 'లా' గురించి చక్కగా వివరించారుకదా? మీరు 'లా ప్రాక్టీస్ చేస్తున్నారా?

జ : లేదు. నవలకు అవసరమైన 'లా' పుస్తకాలు చదివాను. కృషి ఫలించింది.

శ్రీ కొత్తపల్లి శ్రీ వెంకట రమణ, సంధిపూడి

ప్ర . అసలు రచయితలు, రచయిత్రులూ ఏమి ఆశించి రచనలు చేస్తారు?

జ : పాఠకులకు ఓ మంచి సందేశాన్ని ఇవ్వాలనే ఆకాంక్ష, పేరు తెచ్చుకోవాలనే కోరిక, డబ్బు-

బి. గంగాధర్, అప్పనాపల్లి

ప్ర : (1) నెలకు పదివేల రూపాయలు జీతం తెచ్చుకునేవాడుకూడా రోడ్డు మీద ఒక్క రూపాయి కనపడితే తీసుకొంటాడు ఎందువల్ల?

(2) పసిపిల్లకు పాలిస్తూ రవిక పైకి తీసుకున్న భిక్షకురాలి గుండెల్లో సెక్స్‌ను చూసే మృగ స్వభావంగల ఈ మానవ (రాక్షస) సమాజంలో మార్పు వచ్చేది ఎప్పుడు?

జ : (1) ఆశతో డబ్బుని గౌరవించటం.

(2) మార్పు రావాలనే సూచనతో నే ఈ మాటలను ఈ సీరియల్‌లో రాయటం జరిగింది. మార్పు ఆశిద్దాం.

పాలడుగు సుస్మిత, ఏలూరు

ప్ర: విజ్ఞానపు వీధిలో విహరిస్తున్న ఈ నాగరిక రోజుల్లో స్త్రీకి మాత్రం గౌరవం, రక్షణ కరువై పోయింది. ఎంతటి మార్పు ఈ సమాజంలో వచ్చినా స్త్రీ పరిస్థితి మాత్రం మారదంటారా?

జ: నాగరికత పెరిగి, నీతి నియమాలకు రక్షణ లేనపుడు మానవుడికే రక్షణ కరువై పోయింది. స్త్రీలలో చైతన్యం వచ్చినా, వస్తున్నా ఆ చైతన్యం కూడా మరో పోకడలో పయనిస్తున్నది. దీనికి కారణం పురుషుడు, సమాజమే కాదు, స్త్రీలు కూడా కొంత కారణం. సగం మంది ఓటర్లు స్త్రీలే అయినప్పుడు ఎందరు స్త్రీలకు మంత్రి పదవులు లభిస్తున్నయ్యి?

బోలెం సత్యనారాయణ, చిన ఓగిరాల

ప్ర: అర్ధరాత్రి ఆడది ఒంటరిగా తిరిగిన నాడే మనకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లని మన పూర్వీకులు చెప్పారు. వారు చెప్పినట్లే ఆడది వంటరిగా తిరుగుతుంటే ఆమెపై లోకులు తిరుగుబోతని నింద వేస్తారు.

జ: నలభై, ఏభై ఏళ్ల నాటి స్త్రీల పరిస్థితిని బట్టి స్త్రీలు వంటింటికే అంకిత మైన ఆ రోజుల్లోని మాటలివి. ఆ మాటలు ఈ నాడు వర్తించవు. పట్టపగులు నడి వీధిలో మగవాడినే హత్య చేస్తుంటే అంత అర్థ రాత్రి పూట ఆడది తిరగటం శ్రేయస్కరం కాదు.

సోమన్ విజయనిర్మల, చిన ఓగిరాల

ప్ర: మొగుడు మంధుకొట్టి మంచం పక్కన పడిపోతే, అదే మంచాన్ని మరొకడితో పంచుకునే ఆడవాళ్ళు.....

జ: చాలా రాశారు. ఏ ఒక్క స్త్రీనో దృష్టిలో పెట్టుకుని ఇలాంటి ప్రశ్నలు అడక్కండి.

చలపాక ప్రకాష్, విజయవాడ

ప్ర: మారుతున్న వ్యవస్థపైమీ అభిప్రాయం?

జ: మార్పు మంచిదైతే అమలు పరుద్దాం... చెడ్డదైతే తరిమికొట్టే ధైర్యాన్ని అలవర్చుకుందాం.

జె. రామచంద్రరావు, అయిజ

ప్ర: ఉత్తమ ప్రశ్నల విషయంలో మీరు చాలా పక్షపాతం చూపిస్తున్నారని మా ఆఫీసులో నా తోటి ఉద్యోగస్థులు అంటూంటే విన్నాను.... కామెంట్ ప్లీజ్

జ: ఇంత చిన్న విషయంలో మీ ఆఫీసులో అంతపెద్ద కామెంట్ చేస్తున్నారంటే.... మీ మిడియం జోక్ అన్న మాట. ప్రశ్న మంచిదయితే కాశ్మీర్‌లో ఉన్నా బహుమతి వస్తుంది.

పి. వి. సుబ్బారెడ్డి, రామేశ్వరం (ప్రొద్దుటూరు)

ప్ర: చదువుకుంటే సంస్కారం ఉంటుందని అనుకోవటం ఎంత తెలివి తక్కువో, చదువు లేనంత మాత్రాన సంస్కారం ఉండదని అనుకోవటం అంతే తెలివి తక్కువ అవునా?

జ: మీరన్న మాట కొంతవరకూ నిజం. కాని చదువూ, సంస్కారం అన్నారు గాని, నిరక్షరాస్యత సంస్కారం అనలేదు. చదువు సంస్కారానికి వన్నె తెస్తుంది.

ఈ వారం ఉత్తమ ప్రశ్నగా ఏదీ ఎంపిక కాలేదు.

వక్షోజాలు చాలా చిన్నవిగా ఉన్నాయంటే అదీ ఒక రకమైన అంగవైకల్యమే. ఈ రకమైన అంగ వైకల్యానికి అవహేళనే తప్ప సానుభూతి లేదు. మానసికంగా నేను పడే బాధ వర్ణనాతీతం. కొన్నాళ్ళ క్రితం ఒక రోజున పార్క్‌లో ఒక యువకుడితో పరిచయం అయింది. అతనితో సంబంధం పెట్టుకున్నాను. ఆ అనుభూతి, పరిచయమూ, కలయిక, ట్రీట్‌మెంట్ చాలా థ్రిల్లింగ్‌గా ఉన్నది. జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్నాను. దట్సాల్'' అన్నది తలవంచుకున్నది.

''అతన్నే ప్రేమించి పెళ్ళి చేసుకుంటావా''.

''నో, నా అందాన్ని తీర్చిదిద్దేందుకుగాను అతన్ని ఎంగేజ్ చేసుకున్నాను. అంతే, నో పర్మనెంట్ అటాచ్‌మెంట్''.

''అయితే నీకు కాబోయే భర్తకు ద్రోహం చేస్తున్నట్లుగా, ఒకవేళ నువ్వు గర్భవతివి అయితే?'' ఆదుర్దాగా అడిగింది.

''అవన్నీ మన చేతిలోనే ఉన్నయ్యి. ప్రేమించటం, హృదయంలో చోటు. మనస్సు పారేసుకోవటం, ఇదంతా లేదు. ఇప్పుడు మనస్సు, శరీరమూ ప్రశాంతంగా ఉన్నయ్యి. నేను విశృంఖలత్వంగా తిరిగే కొందరు స్త్రీలకన్నా చాలా నయం. నేను చేస్తున్నది వ్యభిచారంకాదు, డబ్బు ప్రసక్తి లేదు. ప్రేమకలాపం లేదు. మెంటల్ రిలీఫ్. మరో కొద్ది మాసాల్లో మా సంబంధం రద్దవుతుంది. నా మనస్సులో నుంచీ, ఈ సంఘటనలన్నింటినీ చెరిపేస్తాను. ఏ ఒక్కటీ గుర్తుంచుకోను. కొన్ని మాసాల ఈ అనుభవంతో నూరేళ్ళ జీవితాన్నీ పవిత్రంగా, భర్తకు చేదోడుగా ఉండి, గడుపుతాను. నా ఈ అనుభవం ఒక ట్రీట్‌మెంట్, శీలమూ, పోగొట్టుకోవటం, పతనం, ఇదంతా నేను వప్పుకోను. మొదటి రాత్రి నా వంపుసొంపులు చూసి నా భర్త నన్ను ప్రేమానురాగాలతో ముంచెత్తాలి. నీ దృష్టిలో నేను పతితను కావచ్చు. నేను ఆ దృష్టితో ఎప్పుడూ ఆలోచించలేదు. నా శరీరానికి ఇదొక చికిత్స'' అన్నది విమల.

అతని అడ్రస్ చెప్పి ''వీలయితే అతన్ని చూడు, బాగుంటాడు. పేరు చక్రధర్'' అన్నది మళ్ళీ. కాసేపు కూర్చుని వెళ్ళింది శ్రీవిద్య.

(ఇంకా ఉంది)

షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు



–యన్. రామ్‌జీ, న్యూఢిల్లీ

"ఏం చేస్తున్నావు ఢుంబు?" అన్నాను.

"ఏమి లేదు బాస్ వచ్చిన వుత్తరాలు చూస్తున్నాను" అన్నాడు. దానిలో ఒక వుత్తరం ఇలావుంది : మీరు బ్రోకర్ పేర్లు అయితే ఇచ్చారు గాని, వారి అడ్రస్‌లు ఇవ్వలేదు. ఎందుకని?" చూడు ఢుంబు బ్రోకర్ పేర్లు ఇచ్చాను కాబట్టి, వారి అడ్రస్‌లను కేరాఫ్‌లో రాసి హైదరాబాద్ స్టాక్స్ ఎక్స్‌ఛేంజ్, బాంక్ స్ట్రీట్, హైదరాబాద్ అని వ్రాస్తే సరిపోతుంది. ఇదే విధంగా కేరాఫ్ మదరాసు స్టాక్ ఎక్స్‌ఛేంజ్, 11 సెకండ్ లైన్‌బీచ్, మదరాసు – 600001 అని వ్రాస్తే సరిపోతుంది. అంతకన్నా ఎక్కువ సమాచారం ఇవ్వటానికి అవకాశం లేదు. ఎందుకంటే నేను ఇచ్చిన పాండవులు ఎవ్వరూ కూడా కనీసం థాంక్స్ చెప్పలేదు నాకు వారి పేర్లు ఇచ్చినందుకు, కాని ఇంకా నలుగురైదుగురు తెలుగు వారు కూడా వున్నారు, వారు మాత్రం ఫోన్ చేసి మరి తిట్టారు. 'మేము మంచి బ్రోకర్లు కాదా?' అని. అందరి పేర్లు ఇవ్వటానికి అవకాశం లేకపోయింది. ఎందరో మహాను భావులు అందరికి నా నమస్కారాలు అని చెప్పటం తప్ప. ఇంక ఈ వారం మనం ప్రాస్పెక్టస్ గురించి తెలుసుకుందాము.

టరమ్స్ ఆఫ్ పేమెంట్ : ఎమౌంట్ పేయబుల్ పర్ ఈక్విటీ రు. 15/– అండ్ పర్ డిబెంచర్స్ రు. 120/– అంటే మనం మొత్తంలో సగభాగం ముందు కట్టాలి.


ఆథారిటీ ఫర్ ది ప్రజెంట్ ఇస్యూ : ది ప్రెజెంట్ ఇస్యూ హాజ్ బీన్ అప్రూవ్‌డ్. ఇది సాధార్ణంగా జరిగే సంగతి.

టరమ్స్ ఆఫ్ ఇస్యూ అండ్ ఆఫర్ ఫర్‌సేల్ : డిబెంచర్‌లని ఈక్విటీ షేర్లుగా మార్చి నప్పుడు, వాటిని అన్ని విధాలుగా ప్రస్తుతం ఉన్న మిగతా ఈక్విటీ షేర్లతో సమానంగా భావించటం జరుగుతుంది. అయితే మార్చిన ఈక్విటీ షేర్లకి డివిడెండ్ వాటి కాల పరిమితి ననుసరించి ఉంటుంది. కాబట్టి దరఖాస్తు దారు ఈక్విటీ షేర్లని కానీ, డిబెంచర్లని కానీ లేదా రెండూ కానీ తీసుకునే, స్వేచ్ఛ ఉన్నది.

గుడ్డిలో మెల్లలాగా వీరు పాపం నిర్బంధంగా డిబెంచర్లని మన మీద రుద్దటం లేదండి. పాపం మంచివాళ్ళు.

ప్రిన్సిపల్ టరమ్స్ ఆఫ్ డిబెంచర్స్ : అనే హెడ్డింగ్ మీద (1) వాల్యూలో ఎంత ఖరీదు అనేది. (2) కన్వర్షన్ : ఇది చాలా ముఖ్యం. ప్రతి డిబెంచర్‌లో మార్చుకోదగిన భాగం విలువ రు. 140/– అంటే మిగతా 100 రూపాయిల భాగం మార్చుకోడానికి వీలు లేనిది. ఇది అమ్మాలంటే కనీసం 20 శాతం నష్టపోవలసిందే. ఎందుకంటే వాటికి మార్కెట్‌లో సరైన గిరాకీ లేదు కాబట్టి. అలాంటి పూర్తిగా చెల్లించిన డిబెంచర్లు రు 10/– విలువగల 5 ఈక్విటీ షేర్లుగా మార్చబడతాయి. వాటిని రు. 18/– ప్రీమియం ఆరునెలల తరువాత పూర్తిగా చెల్లింపబడిన ఈక్విటీ షేర్లుగా పరిగణిస్తారు.

అంటే 28 (10+18 ప్రీమియం)×5 =140 రూపాయి షేర్లుగా మారిపోయినాయి. (3) ఇంట్రెస్ట్ : లో 14 శాతం వడ్డీ ఇస్తున్నట్లు వ్రాశారు. అది సాధారణ వడ్డీ 30 జూన్ 31 డిసెంబరులలో ఇస్తున్నట్లు వ్రాశారు. (4) రివ్యూ ఆఫ్ ఇంట్రెస్ట్ : గవర్నమెంట్ రూల్స్ ప్రకారం మారుస్తాము అని వుంటుంది. (5) రిడమ్‌షన్ : అంటే కంపెనీ వారు 7, 8, 9 సంవత్సరాలకు మరల కొంటామంటున్నారు. (6) సెక్యూరిటీ మార్జిన్ (7) రైట్స్ ఆఫ్ డిబెంచర్ హోల్డర్స్ : దీనిగురించి మీకు వివరించటం జరిగింది.



కాని మీ వద్ద ఈ ప్రాస్పెక్టస్ వుంటే మరల చదవటం వుత్తమం. ఈవిధంగా 12 సబ్‌కాలమ్స్ వుంటాయి. తరువాత బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్! దీనిలో ఛైర్మన్ మరియు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ ముఖ్యులు. ఎంత మంచి వ్యాపారం అయినా సరే సరైన వారి చేతులలో మాత్రం లాభాలలో నడుస్తుంది. కాని మానేజిమెంట్ బాగుండక పోతే ఎంతటి మంచి వ్యాపారం అయినా నష్టాలలో నడుస్తుంది. ఇది కీలకం లాటిది. దీనిలో వారి ఇతర కంపెనీలతో వున్న సంబంధం కూడా వ్రాయటం జరుగుతుంది.

తరువాత రిజిస్టర్డ్ ఆఫీసు అడ్రసు వుంటుంది. తరువాత ఫాక్టరీలు ఎక్కడవున్నవి వాటి అడ్రసు, తరువాత కంపెనీ సెక్రటరీ, ఆడిటర్స్, సొలిసిటర్స్, అడ్వొకేట్‌లు, మానేజర్ టు ది ఇస్యూ తదితర వివరాలు వాటితో పాటు అండర్ రైటర్స్ పేర్లు వుంటాయి. ఈ అండర్ రైటర్స్ అంటే, ఒక వేళ ఇస్యూ పూర్తిగా సబ్‌స్క్రయిబ్ కాకపోతే కొంత మేర వారు పూరించటానికి హామీ ఇవ్వటం. ఉదాహరణకు ఇస్యూలో యు. టి. ఐ. 79–20 లక్షలకు అండర్ రైటింగ్ వ్రాసింది. ఇక్కడ మనకు కావలసిన విషయం వస్తుంది. సాధార్ణంగా యు. టి. ఐ.లో మరియు బాంక్‌లలో చాలా అనుభవం వున్నవారు వుంటారు. వారి కంపెనీ యొక్క మంచి చెడ్డలను బాగా గమనిస్తే గాని ఈ అండర్ రైటింగ్ చెయ్యరు. కాబట్టి ఇటువంటి ఇస్యూలలో అండర్ రైటర్స్‌లో వీరు వుండి, ఎక్కువ భాగం వీరు అండర్ రైటింగ్ చేస్తేనే మనం మంచి ఇస్యూగా శ్రమ లేకుండా గుర్తించవచ్చు. తరువాత బ్రోకర్స్ చేసే అండర్ రైటింగ్ కూడా వుంటుంది.

తరువాత సంక్షిప్తంగా కంపెనీ చరిత్ర అని ఉన్నది. మీరు చదవండి. దీనివలన మనకు ఒక అవగాహన వస్తుంది. దీనిలోనే ఫైనాన్షియల్ హైలైట్స్ కూడా వుంటాయి. తరువాత పన్ను రాయితీల గూర్చి వుంటాయి. ఈ ఇస్యూకు 80. సి. సి. రాయితీ లేదు. ఎందుకంటే ఈ కంపెనీ ఇంతకు ముందు నుంచీ ఉన్న కంపెనీ అవ్వటం మూలంగా 80 సి. సి. రాయితీ అంటే! ఏదైన ఒక కంపెనీ క్రొత్తగా మొదలెట్టి ప్రజలకు వాటాలు ఇస్తే వాటికి 80 సి. సి. రాయితీని ప్రభుత్వం ఇస్తుంది. దీని మూలంగా ముఖ్యంగా వుద్యోగస్తులకు లాభదాయకం వీనిలో గరిష్ఠ పరిమితిలో సంవత్సరానికి 20 వేల వరకు పెట్టుబడి పెట్టవచ్చు. ఈ 20 వేలలో 10 వేల వరకు పూర్తిగా ఆదాయవు పన్ను రాయితీ వస్తుంది. తరువాత మిగతా చట్ట సంబంధమైన వివరాలు వుంటాయి. ఇన్ని రకాల సమాచారంలు కల్గిన ఈ ప్రాస్పెక్టస్‌ను గమనించి తర్వాత మనం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ■

నిర్మాణ కౌశలంలోని కొన్ని మరపురాని అందాలను కోరమాండల్ సిమెంట్‌తో శాశ్వతం చేయండి.



ఎన్నో రోజుల సునిశిత యోచన – చక్కని నమూనాను కొంగ్రొత్త పద్ధతిలో నిర్మించాలనే తపన – గంటలకొలదీ శ్రమ – చివరకు మీ కట్టడం రూపుదిద్దుకొని మీ ముందు నిలిచినపుడు కలిగే **అలౌకికానందం – అదే మీ జీవితంలో మరపురాని మధురానుభూతి.**

- మీ అంతరంగాన్ని బాగా అర్థం చేసికొని మీ అవసరాలకు సరిపడే విధంగా తయారుచేయబడినశక్తివంతమైన సిమెంట్.
- 'కోరమాండల్ సిమెంట్' – కోరమాండల్ ఫెర్టిలైజర్స్ వారి తయారీ.
- నాణ్యత కోసం, శక్తివంతంగా చేయడం కోసం, మన్నిక కోసం, ప్రతిచిన్న విషయాన్నీ వేయికన్నులతో పర్యవేక్షించి తయారుచేసిన సిమెంట్ – 'కోరమాండల్ సిమెంట్'.
- మా ఉత్పత్తి, కంప్యూటర్ల పర్యవేక్షణతో – నిరంతర పరీక్షలతో – నాణ్యతా నిబంధనలతో – ప్రతి అడుగుకీ ఎక్స్‌రేలతో – క్షుణ్ణంగా శోధింప బడుతుంది.
- నాణ్యత మా ధ్యేయం – ఇప్పుడే కాదు, ఎల్లప్పుడూ.

వ్యాపార విచారణలకు:

రిజిష్టర్డ్ ఆఫీసు:

కోరమాండల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్.

1-2-10, సర్దార్ పటేల్ రోడ్, సికింద్రాబాదు-500 003.
టెలిఫోన్: 842034/840116

ప్రాంతీయ ఆఫీసులు:

5వ ఫ్లోరు, డేర్ హౌస్ ఎనెక్స్, 44 మూర్ స్ట్రీట్,
మద్రాసు-600 001. టెలిఫోన్: **586322,580073**
4/5 క్వీన్స్ రోడ్, బెంగళూరు-560 001. టెలిఫోన్. 27764

Sistas/CFL/73/88 Tel-2



కోరమాండల్ సిమెంట్

శక్తివంతమైన సిమెంటే యుక్తివంతమైన పెట్టుబడి
కోరమాండల్ సిమెంటే వాడండి

వారధి

వడ్లమన్నాటి కుటుంబరావు

నేను పచ్చి స్వార్ధపరుణ్ణి అని చెప్పుకోటానికి నాకెలాంటి అభ్యంతరమూలేదు. అవును... ఎందుకుండాలి? ఆమాటకొస్తే..... ఈ రోజుల్లో ప్రతి వ్యవహారం.... 'నువ్వు నా కేమిస్తావ్? నీ పని సానుకూలం చెయ్యాలంటే' అనే ప్రాతిపదికమీదే జరుగుతోంది. అందువల్ల లాభం అంటూ లేకుండా నే నెలాంటి పనిలోకి దిగను.

చేసిన పాపం చెపితేపోతుందంటారు. నాలో విశేషమేమంటే.... అవతలివాళ్ళ అసహాయతను..... నిస్సహాయతను అవసరపు వత్తిడిని దృష్టిలో పెట్టుకుని వాళ్ళకి సాధ్యమైనంత ఎక్కువ నష్టాన్ని కలుగజేసి.... నాకు వీలైనంత లాభాన్ని కలిగించేదిగా వ్యవహారాన్ని మలుచుకుంటాను.

ఉదాహరణకి....

మా ఎదురింటాయన మనవడికి చాలా సుస్తీ చేసింది. వైద్యానికి ఆయనదగ్గరున్న డబ్బు చాలలేదు. కొడుకు ఏక్కడో దూరప్రాంతంలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆయన కోడలు.... తన కొడుకు పరిస్థితికి ఏడ్చి శోకాలుపెడుతున్నది.

నా సంగతి తెలిసుండి కూడా ఆయన సగంచచ్చి నన్ను అయిదు వందల రూపాయలు అప్పు అడిగాడు.

నేను యిస్తానన్నాను. ఆయన నమ్మలేనట్టు.... సూర్యుడు పడిమట ఉదయిస్తాడా అన్నట్టు... చూశాడు నాకేసి.

"ఇస్తానయ్యా! అయితే ఒక షరతు" అన్నాను.

ఏమిటన్నట్టు చూశాడు.

"మీ యింట్లో వున్న 'నేషనల్ పానోసానిక్ మోనో టేప్‌రికార్డర్' నా కిచ్చెయ్యాలి అచ్చంగా!" అన్నాను అదోలా నవ్వుతూ.

ఆయన నిర్ఘాంతపోయాడు. అయిదువందల రూపాయల అప్పుకోసం.... దాదాపు పన్నెండొందల రూపాయల ఖరీదుచేసే టేప్‌రికార్డర్ ధారాదత్తమా! అన్నట్టు దీనంగా ముఖంపెట్టాడు.

"మీ మనవడి ప్రాణం కన్నా బ్బడీ టేప్‌రికార్డర్ ఎక్కువటయ్యా?" అంటూ ఆయన మనసులోని సున్నితభాగంమీద సమ్మెటదెబ్బకొట్టాను.

అంతే! గెలుపు నాదే అయింది...హె!

మా పక్కింటాయన ఉద్యోగరీత్యా ఢిల్లీ వెళ్ళి అక్కడే సెటిలయిపోయాడు. పిత్రార్జితమైన అతని యింటిని అమ్మాలని చూస్తున్నాడని తెలిసి.... నేను ఆ యిల్లు మంచిది కాదని, రాత్రిపూట ఆ యింట్లో నుంచి వింతశబ్దాలు.... వికృతమైన ధ్వనులు వినిపిస్తుంటాయని..... యింతవరకూ ఆ యింట్లో అద్దెకి దిగినవాళ్ళు.... ఖాళీచేసి వెళ్ళేప్పుడు ఒకరు మైనస్‌గా వెడుతుంటారని పుకారులేవదీశాను. అంతేకాదు... ఆ యిల్లు కొంటానికెవరన్నా పార్టీ వస్తే.... కిరాయి మనుష్యులను పెట్టించి.... చాటుమాటుగా ఆ వికృతధ్వనులను చేయిస్తుండే వాడిని.

ఢిల్లీ నుంచి వచ్చిన యిల్లుగలాయన ఆయన చెవులను ఆయనే నమ్మలేనట్టుగా బెంబేలెత్తిపోయాడు. ఎలాగైనా తన యిల్లు అమ్మిపెట్టమని నన్ను ప్రాధేయపడ్డాడు.

"పాతికవేలు రెడీ కాష్ స్టడీగా నీ చేతిలో పెడతాను.. .. యిల్లు నాకు రిజిష్టర్ చెయ్యి!" అన్నాను దర్పంగా.

"అన్యాయం! లక్షన్నర ఖరీదుచేసే యిల్లు.... నీకు పాతికవేలకే యివ్వాలా?" అన్నాడు దాదాపు ఏడుస్తున్నట్టుగా.

"ఈ దెయ్యాల కొంపకి యింకోళ్ళయితే అదికూడా యివ్వరు! ఆపైన నీ యిష్టం" అన్నాను బెట్టుగా.... పట్టు సడలకుండా.

అంతే! ఆయన యిల్లు పాతికవేలకు నాకు గోవిందా హరీ! అయింది.

మా వీధిలో ఒక్క వితంతువుండేది. ఆమె కొడుకుని బి. టెక్. చదివించటానికి ఒక్కసారిగా చాలా డబ్బు అవసరమైంది. ఎంతో కొంత డబ్బయితే యిచ్చేవాళ్ళు చాలామంది వున్నారుగానీ..... ఒక్కసారిగా గడువులోపల ఆమె క్కావలసిన మొత్తాన్ని యివ్వగలిగిన వాణ్ణి నేనొక్కణ్ణే! ఆమె నిస్సహాయతని అదనుగా తీసుకుని ఆమె యిచ్చిన బంగారానికి అతి తక్కువ మొత్తాన్ని ముట్టజెప్పాను. తెలివంటే నాదేకదూ?!

నాకు బాగా పరిచయం వున్న ఒకాయన కూతురిపెళ్ళికని యిల్లు తాకట్టుపెట్టి కొంతపైకం అప్పు తీసుకోటానికిరాగా.... అతనికి హితోపదేశం చేసి.... "కూతురి పెళ్ళికన్నా యింకా దేనికయ్యా నువ్వు ఘనంగా ఖర్చుపెట్టగలిగేది?" అంటూ నచ్చజెప్పి.... అతని తీర్చగలిగిన ఆదాయంకన్నా చాలా ఎక్కువమొత్తం అప్పుగా ముట్టజెప్పాను. పాపం! అతను గడువులోపల ఆ అప్పు తీర్చలేక పోయాడు. ఇంకేముంది? ఆ భవనం.... ఆసాంతం.... నా సొంతం!

ఇలా నీటుగా చెప్పుకుంటూపోతే నా స్వార్థానికి గీటురాళ్ళనదగిన సంఘటనలు నా జీవితంలో ఎన్నో ఉన్నయ్!

ఇంతకీ అసలువిషయం ఏమిటంటే.... నా స్వార్థం.... నా జన్మహక్కు! కానీ పాపం మధుసూదనం. పూర్‌ఫెలో!

కానీ..... మధుసూదనం నా మిత్రుడు! "నీ కెందుకయ్యా మగడా....., మధుసూదనం ఎటుపోతే నీ కేమిటి?" అని అన్నారో మీ రొట్టె పిచ్చివాళ్ళన్న మాట!

దీనికో ముందుమాట!

ఉన్నట్టుండి ఓ అర్ధరాత్రి మీ పక్కింటివాడి సిరిఎత్తుకుంటుంది అనుకోండి! వెంటనే వాడు ఓ అందమైన బిల్డింగ్ కట్టేస్తాడు.

ఆధునికమైన సామగ్రి కొనుగోలుచేస్తాడు!

కారు మెయిన్‌టెయిన్‌చేస్తాడు!

సర్వభోగాలూ అనుభవిస్తాడు! అప్పుడు మీరు చూస్తూ వూరుకోగలరా? మనకెందుకులే అని...

మనసు అసూయతో నిండిపోదూ?

కళ్ళు ఈర్ష్యతో మండిపోవూ?

నా మనస్తత్వంకూడా ఈ కోవకు చెందిందే!

నా స్నేహితుడు మధుసూదనం గాడికి ఇంత మంచిపేరా? నన్నేమో అంతా ఛీకొడతారా? డామిట్..... డా..... మ్...... ఇట్!

మధుసూదనంగాడి జీవితాన్ని తరచిచూసి... వాడి జీవితంలోని చీకటి ద్వారాల్ని తెరిచివేసి.... వాడి లొసుగుల్ని బయటపెట్టి, వాడి ముఖంమీద జనంచేత పేడనీళ్ళు కొట్టించకపోతే.... నేను... మ.... ని.... షి.... నే..... కాను. హె! (ప్రస్తుతానికి నేను మనిషినేకదూ?).

మంచిపనులకు నా మనస్సురాదు గానీ... యిలాంటి చెడ్డపనులకు మాత్రం అది వురుకులు పరుగులు తీస్తుంటూంది.... చిత్రం!

నా వేటలో మొదటగా మధుసూదనం ఉద్యోగం యిప్పించిన కుర్రవాడి దగ్గరకెళ్ళి... "మధుసూదనంగాడికి ఎంత లంచం యిచ్చావ్?" అని బెదిరించాను.

"మా ఆర్థికపరిస్థితికి జాలిపడి ఆ మధుసూదనం బాబుగారు.... ఈ ఉద్యోగం యిప్పించారు. ఆయన



మా యింటి దేముడు. యిది నిజం!" అన్నాడు వాడు. నేను పదేపదే బెదిరించినా కూడా. లాభంలేకపోయే సరికి తోకముడిచాను అక్కడినుంచి.

సొంతయిల్లు కట్టుకున్న ఒకతనికి.... మధుసూదనం చాలా డబ్బు సాయంచేశాడని తెలుసుకుని.... అతనిదగ్గర కెళ్ళి వాలాను. అతని భార్య అందంగా వుంటుందని.... ఆమెను మధుసూదనం పక్కన పడుకోపెట్టి వుంటాడని వూహించి బ్లాక్‌మెయిల్ చేద్దామనుకున్నాను. ఆరూపేణా ఆ అందాన్ని నేనుకూడా ఆస్వాదించుదామనుకున్నా.

రాక్షసిబొగ్గులాంటి అతని ధర్మపత్నిని చూసి మూర్ఛవచ్చినంతపనయ్యింది నాకు. "వడ్డీలేని అప్పు యిచ్చి నా కొంపని నిలబెట్టాడు ఆ మధుసూదనం బాబు! దేవుడంటూ ఎక్కడో లేడు. ఆయనలోనే వున్నాడని" చేతులు జోడించాడు అతను.

నేను మూతి బిగించి కోపంగా అక్కడి నుంచి వెళ్ళిపోయాను.... హతాశుడనై.

కృత్రిమమైన కాళ్ళు అమర్చేందుకు ఆర్థిక సహాయంచేశాడని ఒకడు. ఆగిపోయే కూతురి పెళ్ళికి ధనసాయం చేశాడని ఒకడు... అప్పులపాలై కుటుంబం యావత్తూ ఆత్మహత్యకు పాలుపడి పోతుంటే.... ఆదుకున్నాడని ఒకడు... అతన్ని... అదే.... మధుసూదనాన్ని దేముడు అంటూ పొగుడుతుంటే.... నేను లోలోపలే భగ్గుమని మండిపోయాను.

ఎలాంటి వ్యసనాలూలేని మధుసూదనం.... ప్రతిఫలాపేక్షలేకుండా.... యిలాంటి మంచిపనులెందుకు చేస్తున్నట్టు?

కీర్తి కండూతికా?

పిచ్చిసన్నాసి!

అవి కండువాపెట్టి ముఖం తుడుచుకోటానికి కూడా పనికిరావు.

ఒకవేళ ఉత్తరోత్తరా రాజకీయ నాయకుడవుదామనే దురుద్దేశంగాని వుందా? 'అప్పనంగా లక్షలు సంపాయించాలంటే ఇంతకుమించిన ఆయుధమేముంది మన ప్రజాస్వామ్య దేశంలో....!' అనుకున్నాను.

వాళ్ళూ.... వీళ్ళూ అనుకుంటుండగా విన్నాను. మధుసూదనం.... రాజకీయాలకు బహుదూరం అని.

మరైతే ఎందు కీ నిస్వార్థసేవ? ఎవర్ని ఉద్ధరించటానికి?

సమాధానం రాక.... రాబట్టలేక నా కడుపుబ్బిపోతోంది!

ఇక లాభంలేదు..... ఈ ప్రసవవేదన నేను భరించలేను... ఎవర్నో ఎందుకూ? మధుసూదనాన్నే డైరెక్టుగా అడిగేస్తేపోలా? అనుకున్నాడు.

వెంటనే అతని యింటిముంగిటవాలాను.

"ఇదుగో మధుసూదనం నీ వరస నా కేమీ నచ్చలేదు. ఇలాగనక నువ్వు చెయ్యటం మానకపోతే

వారధి

నీకు చెప్పేగతిసీ" అంటూ రెండుమూడు పర్యాయాలు మందలించాను. కానీ... మధుసూదనం నవ్వి వూరుకున్నాడు. ఆ నవ్వుతో నన్ను వెర్రివాణ్ణిగా చేస్తున్నాడో..., లేక తను వెర్రివాడన్న విషయం నేను గ్రహించాననుకుని సిగ్గుపడుతున్నాడో నాకసలు అర్థంకాలేదు.

కానీ... కొన్ని రోజులకు నన్ను ఒక్కకుదుపుకుదిపి వేసి.... మొదలంటా నరికివేసిన ఘోరసంఘటన ఒకటి జరిగింది.

మధుసూదనం కొడుకు చాలా బావుంటాడు.

మా అమ్మాయి ఒకమాదిరిగా వుంటుంది.

ఎలా కలిసిందో ఏమో? ఈ యిద్దరికీ జతకుదిరింది.

ఈ విషయం... మా అమ్మాయి భోళుక్కున వాష్‌బేసిన్‌లో కక్కుకునే వరకూ నాకు తెలియనేలేదు. దాన్ని చావచితక్కొట్టానేగానీ.... అది నెల తప్పిందన్న తప్పిదాన్ని తప్పించలేనుకదా!

మధుసూదనం కొడుకు దగ్గరకువెళ్ళి నిలదీసి అడిగితే "మీ అమ్మాయికి నెల నేనే తప్పించానని రుజువేమిటి?" అన్నాడు వెటకారంగా.

'ఒరి వుండాకోర్!' అనుకున్నాను వుండుమీద కారంజల్లినంతకోపంగా!

ఇక నాకు మధుసూదనమే గతిఅయ్యాడు.

అతనికాళ్ళు పట్టుకుంటాను. అడిగినంత కట్నం యిస్తాను. అంతగా కావాలంటే నా అక్రమార్జితమైన యావదాస్తీ రాసి యిచ్చేస్తాను. నా కూతురి జీవితం బాగుపడటంకన్నా నా కింకేం కావాలి? అనుకున్నాను.

గుడ్ల నీరుకక్కుకుంటూ.... నా దీనగాథను మధుసూదనానికి విన్నవించుకున్నాను. సాయం చెయ్యమని ప్రాధేయపడ్డాను. ఇవి చేతులు కావు కాళ్ళనుకోమని వేడుకున్నాను.

అతను ఒప్పుకుంటాడో లేదోనని బిక్కుబిక్కుమంటూ అతని నిర్ణయానికై ఎదురు చూస్తున్నాను ఆశగా..... ఆతృతగా.... భయంగా!

కానీ ఆ... శ్చ... ర్యం! నా ముందే వాళ్ళబ్బాయిని గట్టిగా కూకలేశాడు. "ఒక కన్నెపిల్ల గొంతు కొయ్యటానికి సిగ్గులేదట్రా నీకు.... కట్టు.... ఆ అమ్మాయి మెళ్ళో మంగళసూత్రం" అన్నాడు ఆజ్ఞాపిస్తూ.

ఈసారి నేను మరింత ఆశ్చర్యపోయాను. నేనిదే అడిగితే అవమానపరచిన మధుసూదనం పుత్రరత్నం కిక్కురుమనకుండా ఒప్పుకున్నాడు. నీతిముందు అవినీతి తలవంచడమంటే యిదేనేమో?!

ఆ క్షణంలో మధుసూదనం పాదాల దగ్గర తల భళ్ళున పగలకొట్టుకోవాలనిపించింది నాకు. నా కన్నీటితో అతని పాదాలకు అభిషేకం చెయ్యాలనిపించింది.

అతనికి పదేపదే కృతజ్ఞతలు చెప్పుకుని నా యావదాస్థినీ.... అమ్మాయికి పసుపుకుంకుమ కిందయిచ్చేసి.... అతని కొడుకుతో మా అమ్మాయి పెళ్ళి వైభవంగాగా జరిపించాను.

ఇప్పుడు నేను బికారిగా మారిపోయినా.... కెంతో ఆత్మసంతృప్తిగావుంది.


ఒకరోజు తీరికగా కూర్చున్నప్పుడు మధుసూదనాన్ని అడిగాను... నిష్కామ ంగా మీరు చేసే సాయాలకు అర్థమేమిటని?

వేదాంతిలా ఎటో చూస్తూ అస్పష్టంగా గొణిగాడు మధుసూదనం.

"ఈ సిరిసంపదలు అశాశ్వతాలు. ఇవి మనతోటి రావు. పార్థివశరీరం కట్టెలా బిగుసుక పోయినప్పుడు... మనం చేసిన మంచిపనులే పుణ్యరూపంలో.... మన సూక్ష్మశరీరంతో పాటు ప్రయాణంచేస్తూ వస్తాయట... అని మహామహులు ఎన్నోచోట్ల ఉదహరించారు."

మధుసూదనం మనిషికాదు.... లౌకిక.... అలౌకిక లోకాలకు వారధిలాంటి మహోన్నత వ్యక్తి అనిపించింది నాకు. □

అమృతాంజన్ గ్రైప్ వాటర్



పాప ఆరోగ్యానికి,
సంతోషానికి దివ్యామృతం

అజీర్ణం, వాయువు, కలతనిద్ర, వాంతులు, విరేచనాలవంటి బాధలు వెంటనే తగ్గిపోతాయి. ఆకలి, జీర్ణశక్తి బాగా వుంటాయి. పాపాయి ఆరోగ్యం బాగుపడుతుంది.

అమృతాంజన్ లిమిటెడ్
42-45, లజ్ చర్చ్ రోడ్డు,
మద్రాసు 600 004

Amrutanjan Limited

753-TG.

ఫాలాక్షుని డైరీ

తాయ్‌లాండ్‌లో ఎలుకల ఆహారం!


తాయ్‌లాండ్‌లో ఎలుకలను దోరగా వేయించుకుని ఉప్పు కారం జల్లుకు తింటారట ఒంకాయి బజ్జిలా! యాక్కురాలీ! తప్పు అలా అనరాదు! దానిరుచి దానిదేకదా!

విమానం రద్దయింది – ప్రయాణం వీల్లేదు

పారిస్ నుంచి గత సెప్టెంబరులో భారతదేశం వచ్చిన వో డచ్ దంపతులు తమ తిరుగు ప్రయాణం టిక్కెట్లు కూడా "పాన్ ఏయ్" విమానసంస్థలో కొనుకున్నారట. మొన్న ఫిబ్రవరి ఒకటవ తేదీ నుంచి ఢిల్లీ నుంచి పారిస్ వెళ్ళే విమానం ఆ సంస్థది రద్దుకావడవల్ల ఆ దంపతులు తిరిగి ఫ్రాంక్‌ఫర్డ్ వరకే వెళ్ళే వీలుకుదురుతుందని ఆ సంస్థ ప్రకటించిందట. బాబోయే మావద్ద తిరిగెళ్ళేంత డబ్బులేదు. టిక్కెట్లు కొనేసుకున్నామన్న ధీమాతో డబ్బంతా ఖర్చుచేసేశాం అని గోలపెట్టారట. కానీ, నెదర్‌లాండ్స్ కాన్సు లేటుగానీ, "పానేయ్" విమాన సంస్థగానీ, మరెవరూగానీ వీరి గోడు వినలేదట. వారేంచేయాలో తోచనిస్థితిలో వుండిపోయారటిండియాలో.

ప్రమాదవశాత్తు పేలిన ఆటోమేటిక్ తుపాకి

మద్రాసులోని పెద్ద పోలీస్‌స్టేషన్‌లోని కాఫలా పోలీసులు 29 ఏళ్ళ రవిచంద్రన్, 27 ఏళ్ళ సూసై మాణిక్యం అనే యిద్దరికి కొత్తరకం ఆటోమేటిక్



తుపాకులు యిచ్చారట. అవి ధరించి కాపలా కాస్తున్న సూసైమాణిక్యం తన బూటుకు కట్టిన బూటు లేసు సరిచేసుకోవడానికి వంగాడట. ఆ వత్తిడిని ఆటోమేటిక్ తుపాకి ఎగిరి గంతేసిందట. దాంట్లోంచో గుండు రయ్యిన దూసుకువచ్చి, ఎదురు నిల్చునివున్న రవిచంద్రన్ పొట్టలో దూసుకుపోయిందట. అతడు విషమ స్థితిలో ఆసుపత్రిలో వున్నాడట!

ప్రపంచ వింతల్లో వింత!

అమెరికాకు చెందిన డాలిన్ అనే ఆమెకు పుట్టిన కూతురు ఆలీసన్‌కు నాలుగో నెలలోనే ముట్లు ప్రారంభమయ్యాయట. ఏమిటీ వింత అని డాలిన్, ఆమె భర్త కలసి తమ కూతుర్ని కేప్‌టౌన్‌లోని కొయిట్ బికూర్ ఆసుపత్రికి తీసుకు వెళ్ళి పరీక్ష చేయిస్తే ఆమెలోని అవయవాలు పరిస్థితికి అనుకూలంగా వున్నాయని, యిది ప్రపంచ వింతే అయినా ఆ పిల్ల అసందర్భంగా ముట్టవటం లేదని తేలిందట. ఆ పిల్లకు ఐదో ఏడు వచ్చేసరికల్లా ఆమె శరీరం పరిపూర్ణ స్త్రీ శరీర తత్వాన్ని పొందిందట. 120 సెంటీ మీటర్ల ఎత్తు పెగిన యీ పాప పరిపూర్ణ స్త్రీత్వాన్ని తన అయిదో ఏటనే పొందడం ప్రపంచంలో వింతలలో కల్లా వింతట. ◻




ఈ కాలం పిల్లలు....

కె. నాగేశ్వరి

పదారు వన్నె పసిడి బంగారంలాగే ఆ వయసూ మెరిపిస్తూ, జిగేల్‌జిగేల్‌మనే నూతన యవ్వనాన్ని అంకురింపచేస్తుంటుంది. చిత్రమేమంటే సహజమైన నునుపు, మెరుపు, అందం, ఎంతటి అనాకారివారిలోనైనా చోటుచేసుకునేట్టు చేసేది యవ్వనం. ఏ మానసికరుగ్మత వయసుకుమించి వున్న పిల్లలు తప్ప మిగతావారు దుస్తులు ధరించడం, శరీరపోషణ, ముఖకవళికల అందం, వీటిని పెంచుకోడానికే చూస్తారు. శారీరకమైన లోపాలు, వంశ పారంపర్యంగా వచ్చే యితర బలహీనతలవల్ల కొందరు వయసుకు తగినట్టు ఎదగరు. అలాగే కొంచెం చీకూచింతా తక్కువుండే మనస్తత్వం సహజంగా అబ్బేపిల్లలు, తల్లి తండ్రుల యితర కులాలు, లేక దూరపు బంధుత్వాలు, మొదలైన ఎడమైన సంబంధాలతో వుంటే వారికి పుట్టిన పిల్లలు కూడా వయసుకు మించి ఏపుగా వుంటారు. ఇంక అంగవైకల్యంగల వారి సంగతి సానుభూతిపడాల్సిందే!

ఇలా సన్నగా, నీరసంగా జీవకళలేని పిల్లలూ, మానసికంగా పసితనం వీడక ఈడుకుమించి వున్నవారూ నేరస్థులలా కనబడతారు కొందరి దృష్టిలో. అందులో కొందరు పెద్దవాళ్ళకు యింగితంవుండదు. వాళ్ళ బాల్యంలో అంటే కుటుంబనియంత్రణ లేని వెనుకటి తరంలో కొంచెం సదుపాయాలు తక్కువుండేవి. అవన్నీ తవ్వుకోడం నడివయసులో అవివేకమని అనుకోరు. "నేను చిన్నప్పుడు దబ్బపండులా వున్నాను. మళ్ళీ యిప్పటిలా, కేక్స్, బిస్కట్స్, ఐస్‌క్రీమ్ మొదలైనవి ఎరగం" అంటారు.


అదే నోటితో "మళ్ళీ, మరీ అలా అర్భనా కారపు రూపేమిటి? కాస్త బలమైనవి తిని తగలడండి" అంటారు. జిహ్వాచాపల్యం విషయంలో ఏ ఒక్కరికి యింకొకరితో పొందదు. ఇక్కడ నియంతృత్వం కుంచదికాదు. ఎవరికేది సహిస్తే అది తింటారు. సన్నగావున్న పిల్లలను అలా తీసిపారేయకూడదు. ఆ పిల్లలు కూడా సాటివారితో పోల్చుకుని తమనితాము కించపర్చుకోకూడదు. కొందరు పిల్లలని తీవ్రంగా హింసించి తినిపిస్తారు. పిల్లలు తినలేక మానలేక నరకయాతనపడకూడదు. బలం చేకూర్చేవాటిలో వారికిష్టమైనవాటిని ఎన్నుకోవాలి. నెయ్యి యిష్టంలేనివారు వెన్న రాసిన బ్రెడ్ మొదలైనవి తినవచ్చు. పాలు యిష్టంలేనివారు మీగడతో కూడిన పెరుగు ఉత్తదైనా తినొచ్చు. ముందు మానసికమైన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. ఈర్ష్య, అసూయ, ద్వేషం, పగ మొదలైనవి యివ్వన జీవితంలో ప్రవేశించకూడదు. నిష్కల్మషమైన మనసు, మంచిని స్వీకరించే యోచన, కార్యదీక్ష, సమయస్ఫూర్తి యివన్నీ అలవాటు చేసుకోవాలి. శుభ్రంగా యిష్టమైనది తిని, చక్కగా చదువుకోవాలి. మంచి పుస్తకాలు చదవడం, ఆటలు ఆడడం, ఒక గంట రెండుగంటలు చేస్తే మానసికంగా ఉల్లాసంగా వుంటుంది. ఆ ఉల్లాసమే కొంతబలాన్నిస్తుంది. హుషారుగా వుండాల్సిన యవ్వన జీవితంలో మితిమీరి ఆలోచనకూడా వుండకూడదు. మన కెంతవరకు అవసరమో ఆ విషయాల్లోనే జోక్యం చేసుకోవాలి. అనవసర విషయాల్లో తలదూర్చి యిరుకున పడటం, చిక్కులు కొనితెచ్చుకోడం ఒకటి రెండు సార్లు చేసినా, తిన్న దెబ్బతో పొందిన అనుభవంతో దూరంగా వుండటం నేర్చుకోవాలి. ఇలా కొన్ని కొన్నిటివలన సన్నటివారిని చూసి "ఈనుపుపిల్ల", "టి. బి. పేషెంటు", "స్కెలిటన్" మొదలైన




బిరుదులు ప్రసాదించరు. ఆడపిల్లనైతే "మల్లితీగలా వుంది".. "జాజిమొగ్గలావుంది" అని ముచ్చటపడతారు. మగపిల్లాడ్నయితే చక్కగా, సన్నగా, పొడవుగా, సాజూగ్గా చూడముచ్చటగా వున్నాడు అంటారు. హీరోలా వున్నాడు అంటారు.

అలాగే బొద్దుగా ఉన్నవారు అస్తమానం ఒంటిని చూసుకుని బాధపడి పోకూడదు. కొందరు, అందులో ఆడపిల్లలు పదమూడేళ్ళు దాటాక చాలామంది నోటిలో ఈ బొద్దుతనం వల్ల పడతారు. "ఓణీ వేసుకో అమ్మాయ్" అనో, వొంగి నడువమ్మా" అనో, "మరీ ఎదిగిపోయింది కొంప లంటుకుంటు న్నట్టు" అనో విమర్శకు గురి అవుతారు. అలా పుట్టడం, పెరగటం ఏదో చెయ్యరాని నేరం అన్నట్టు ఒంగి ఒంగి గూని తెచ్చుకున్న వారెందరో ఉన్నారు

అలాగని ఆడపిల్లలు బోర విడుచుకుని నడిచినా వికారంగా ఉంటుంది. సాధారణంగా ఇలా బోర విడిచి నడిచేవారు అరుదుగా ఉంటారు. ఇలా వొంగి గూని తెచ్చుకున్న వారి సంఖ్య మాత్రం ఎక్కువ. పాతికేళ్ల క్రితం ఆడపిల్లలకు పుష్పవతి అవకుండా ఓణీ వేయించే వారు. ఆ రోజుల్లో చదువుకునే అమ్మాయిలు పుష్పవతి అయిన వరకూ ఓణీలు వేసుకోడానికి ఇష్టపడే వారు కారు. గత పది పదిహేనేళ్ళుగా పుష్పవతి అయి సంవత్సరాలు గడిచినా వోణీ వేసుకోకపోడం ఫాషన్ అయింది. పంజాబి డ్రస్సులు అపద్బాంధవుల్లా వచ్చి కొందరిని ఒడ్డున వేస్తున్నాయి. ఆ రోజులకీ ఈ రోజులకీ కూడా ఏపడి అయిన ఆడపిల్లలు ఒక విధంగా శాపగ్రస్తులనే చెప్పాలి. వారి శరీరం గురించి వాళ్ళే నిర్వికారంగా ఉన్నా ఇంటా బైటా మరవనివ్వరు. ఇలా ఏపడివారు ముఖ్యంగా వక్ష స్థలం 30 అంగుళాలు మించి 35 వరకూ పెరిగిన వారు కొంచెం జాగ్రత్తగా దుస్తులు ధరిస్తే చాలు. పెరగని వక్ష స్థలానికి ఎన్ని క్రీములు వ్రాసినా ప్రయోజన మెంత శూన్యమో, ఇలా ఎత్తయిన వక్ష స్థలం వారు దాచుకోడం, తగ్గించుకోడం అంతకంటే కష్ట మైనది. ముఖ్యంగా వీర్లు లోనెక్ జాకెట్లు ధరించ కూడదు. ట్రాన్స్‌పరెంట్ బ్లవుజ్ వేసుకుంటే బాగుండదు. పాడింగ్, స్పాంజ్ మొదలగు ఎక్స్‌ట్రా ఆకర్షణ లున్న బ్రాలు ధరించ కూడదు. వేసుకునే డ్రస్సుకు పేపలు తీస్తే చాలు. చుడీదార్పై చున్నీ వేసుకోవాలి. పదిహేనేళ్లకు వోణీలు వేసుకోవాలి. మరుగున పడిన ఫుల్‌వాయిల్, హాఫ్‌వాయిల్ వోణీలైతే వీరికి మంచివి. పల్చటి అమెరికన్ జార్జెట్, షిఫాన్ వోణీలు వేసుకున్నా వేసుకోనట్లే లెక్క. పద్ధెనిమిది వచ్చాక గంజి పెట్టిన కాటన్ చీరలు కడితే ఆపాక వారి బొమ్మలా నిండుగా ఉంటారు. నిండు గోదావరి లాటి స్త్రీత్వం వీరిలో ప్రస్ఫుటంగా గోచరిస్తుంది. అది తెలుసుకోకుండా గూని తెచ్చుకోడం, నడుం వొంచుకోడం, మెలికలు తిరగడం, పదేపదే దాచినా దాగని వొంపుల్ని చూసి ఏడ్చుకోడం అవివేకం. ప్రస్తుతం, పోచంపల్లి, గద్వాల, టెరీకాటన్ మొదలైన దలసరి వస్త్రాలతో చుడీదార్స్ వస్తున్నాయి. అవి వేసుకుని చూసుకుంటే తాము ఏపుగా గున్నమావి చెట్టులా ఉన్నామని బాధపడరు. వీరు చేసేది ఇంకో మూర్ఖమైన పనుంది. అది డైటింగ్. ఈ డైటింగ్ గురించీ, మగ పిల్లలు చేసే శరీరపు అదుపు గురించీ వచ్చే వ్యాసాలలో ప్రస్తావించు కొందాం



నిత్యనూతన సీరియల్



జరిగినకథ- 56: రంగారావు దొరసానిని వివాహం చేసుకుంటాడు. దేవదాసి ప్రతి రోజూ దేవాలయానికి పోయి స్వామిని సేవిస్తూ ఉంటుంది. అరుంధతి ఆరోగ్యం చెడిపోతుంది. సుబ్బన్నపేటలో నాగరికత పెరుగుతుంది. గణాచారి దేవాలయంలో నివసిస్తూ ఉంటుంది. సుసానీ ఇంగ్లాండ్ వెళ్ళిన తరువాత బియాట్రిసి అనే ఫ్రెంచి వనితను రంగారావు తీసుకువస్తాడు. రంగారావు వ్యాధిగ్రస్తుడు అవుతాడు. ఇంగ్లాండ్ నుండి తిరిగి వచ్చిన సుసానీ శ్రీ బియాట్రిస్ వ్యవహారం తెలుసుకుంది. హరప్పనాయుడు కోటకు అధికారి అవుతాడు.

(గత సంచిక తరువాయి)

సాయంకాలమున కుమారస్వామి వచ్చెను. వచ్చి వాలిని కన్నులతో, నోటితో బెదరించెను వాలి కట్టివేసిన స్తంభమునుండి లాగుకొనుచు కాళ్ళమీద ఎగురుచు పళ్ళికిలించుచు, కిచకిచలాడెను. కుమారస్వామి సన్నటి గడ్డిపరక ఒకడు పుచ్చుకొని. "రామాయణ పతాకా ప్రతి నాయకుని" కొట్టబోయెను. వాడు సుడులు తిరిగి, గిలగిలలాడి, పాతిపోయి, కుప్పించి, ఎగసి, గగ్గోలు పెట్టెను. లోపల నుండి మంగమ్మ "ఎవరది" అనుచు బయటికి వచ్చెను. వచ్చి కుమారస్వామిని చూచుచునే "రోజు రోజుకు మతి పిల్లవాడవై పోవుచున్నాడవు! ఏ తలకు పూసినవాడయ్యా నీకుద్యోగ మిచ్చినది" అనెను.

కుమార : ఊరందరికి నా ఉద్యోగపు సంగతియే పట్టినది. "దరిద్రుడు తలగడిగిన వడగండ్లవాన" అని రాక రాక నాకొక ఉద్యోగము వచ్చినది. దానిని చెడగొట్టుట ఎట్లాయని ఊరిలోని చుప్పనాతులందరును విచారించుచున్నారు.

మంగ : ఉద్యోగము లేకపోయిన బ్రతుకలేవా?

కుమార : ఇంక బ్రతుకుట ఎట్లు? అత్త గారి పని అయిపోయినది, అప్పున కాస్తికి సరిపోయినది మిగిలిన ఆస్తి యేమియులేదు. ఇల్లును, పది యెకరములును కూతురు పేర నున్నవి. అది నాకెందుకు? మా బావమరదిపేర వ్రాసెదను. నాకుతిండికేది? ఈ ఉద్యోగము నిల్చునను నమ్మకము నాకులేదు.

మంగమ్మ : ఎందుచేత?

కుమార : ఎందుచేతనా? దరారావుగారి వద్ద చదువుకొన్న దోషముచేత.

మంగమ్మ : నీవుకూడ ఉపన్యాసములు దంచుచుంటివా యేమి?

కుమార : ఆవు చేనిలో మేసిన దూడ గట్టున మేయునా? సరే కాని, నేడు మనోహరులకు కోపము వచ్చినదేమి?

మంగమ్మ : వారికి కాఫీ చల్లారినదట. వారు ప్రత్యక్షముగా నోరదిగి వారము రోజులైనదాయెను! వచ్చి, బెడ్ టీ లేదు. కాఫీ చల్లారిపోయినది– కుమారస్వామి వాలి గొలుసూడదీసి లోనికి తీసికొని పోయెను. పిల్లలు కొట్టవచ్చినపుడు పాముల వాండ్ర కోతి పాముల దాని వెనుకకు పోయినట్లు వాలి మంగమ్మ చాటునకు పోయెను.

కుమార : ఈ వెధవకు నేను బాబునని తెలియదు. నన్ను చూచిన భయపడునేమి?

మంగమ్మ ; ఔనౌను. నీవు సవతితండ్రివి కాదూ?

కుమార : నేటి కాలమున సవతితల్లు లెక్కువ. పురాణకాలమున సవతితండ్రు లెక్కువ. వాలి సుగ్రీవులు, కేసరివాయువులు, యమవాయ్వింద్రాశ్వినులు – వీరు జంటలు. పూర్వము, నా యుద్దేశ్యము దేశమంతయు ఆడమళయాళము. ఆస్తి స్త్రీలది, వారెంతమంది భర్తలనైనను జేసికొనవచ్చును.

మంగమ్మ : మరి ఉద్యోగము పోవునందు వేమి? పరిశోధన భాగములోనే చేరినావు. నీకు డాక్టరేటు వచ్చును.

కుమార : ఈ కాలములో చదువు సంధ్య లక్కఱలేదు. ఇప్పుడు మన తెలుగు ఎం. ఏ. లిందరుండిరా? రేపు మనము కాబోవు పరీక్షలో వారికి పద్యమిచ్చి అర్థము చెప్పుమన్నచో చేతగాదు. ఒకాయన అంతస్థములు, నూష్మముల వెనుక గూడ అఱసున్నను వేసినాడు. మరి ఒకాయన ఏళలము లనగా వరిపొలాలని అర్థము చెప్పినాడు, నిజమైన అర్థము చెప్పినచో తానే అగునేమో అని. మరియొకడు పిల్లలర్థ మడుగగా అది రేపు చెప్పెదననును. ప్రతిదియు పరిశోధనయే. దేశములో ఉపజ్ఞ చంపుటకు పరిశోధనమని వెంద్రుకలు లెక్క పెట్టుట యొకటు ప్రారంభమైనది.

మంగమ్మ : నీ వన్నమాట నిజమే! తాటిపట్టె కింత యెదురు దేకినచో నుద్యోగములు నిలువవు. పైగా నసభ్యపు మాటలు కూడనా?

కుమార : వెంద్రుకలసహ్యముటమ్మా!

కుమారస్వామి సంగీతముతో పద్యము చదువ నారంభించెను. "ఈ వేంద్రుకలు పట్టి యీడ్చిన యా చేయి తొలుతగా బోరిలో దుస్ససేను తను పెంత పెంతలు తునియలై చెదరి రూపరియున్న గని యుడుకాఱు గాక యలుపాల బొనుపడునట్టి చిచ్చేయిది!" ఈ పద్యము.

మంగ : ఈ సంగీత మాపి కాఫీ కాచెదవా?

కుమార : పాలున్నవా?

మంగమ్మ : ఆఁ!

కుమార : చెంగల్రావు కాచరాదా?

మంగమ్మ : వాడు రాజబంధువు. సుషేణుడు. వాలి సుషేణు లిద్దరు నారగించువారే కాని సేవచేయువారు కారు.

కుమార : ఎద్దువలె కుక్కను పెంచి రెడ్డి తానే మొఱిగెనని. అడుదానవు నీవుండగ నేనుకాచుట యెందుకు?

మంగమ్మ : నేను కుక్కను, నీవు రెడ్డివియునా!

కుమార : (నవ్వి) మీ యింటిలో పెంపుడు కోతి యున్నది. పిల్లలను బెంచుచున్నావు, చెంగల్రావు అదివరాహమున్నాడు. లోకములో దొరసాను లందరును కుక్కలను పెంచుచుండగా మీకు లేకపోవుట యేమి! మీరు రైలు ఖర్చులిచ్చినచో బెంగుళూరుపోయి మంచి కుక్కను కొని తెచ్చెదను. మన డి. ఎం. ఓ. తెచ్చినాడు. దాని ఖరీదు అరువందల రూపాయలట. మనము పదునారు వందలు పెట్టి తెత్తము.

మంగమ్మ : నీకు డబ్బు మీది ఆశ యింకను పోలేదు.


కుమార : మీరు కంటికి కనిపించుచున్నంత సేపు పోదు. డెబ్బది వేలేమి చేసెదరు? నేనీ యుద్యోగము మానివేసెదను గాని, నాకా మేడయు పదివేలును వ్రాసి యీయరాదా?

మంగమ్మ : చాలునా! యింకొక పదివే లిచ్చెదను. తీసి కొనుము!

కుమార : రామేశ్వరముగారు బ్రతికి వచ్చినచో తీసికొందును.

మంగమ్మ : ఏమి!

కుమార : వాడు నన్ను దయ్యమై పీకుకొని తినినచో?



మంగమ్మ : వాడు వచ్చి నన్ను పీకుకొని తినునుగాని, నిన్నేమియు చేయదు. – ఇంతలో వాలి మంగమ్మ బుజము మీద నెక్కెను.

కుమార : కోతి మీద కోతి!

మంగ : అదేమిటి?

కుమా : కన్నడములో మంగయనగా కోతి.

మంగ : నీవు – నీవు పదివేలకు, మేదకు చెడెదవు.

కుమా : ఇరువది వేలంటివి కదమ్మా! మాటలలోనే రెండు మాటలా? అయిననూ యీకంత కోపమెందుకు! మనస్సు నిజముగా కోతి వంటిది. ఆదిశంకరు లిట్లే యన్నారు కదా!

"సదా మోహాటవ్యాం చరతి, యువతీనాం కుచగిరౌ
నట, త్యాశాశాఖా స్వటతి, ఝుడితి స్వైర మభితః
[illegible] భిక్షో! మే! హృదయకపిమత్యంతచపలం,
దృఢం భక్త్యా బద్ధ్వా శివ! భవ దధీనం కురు విభో"

మంగమ్మ కన్నీళ్ళు కార్చెను. కుమారస్వామి "ఏమి కన్నీరు పెట్టుకొందురు" రనియెను. మంగమ్మ తలమీద కూర్చున్న యీ పాడు కోతి కన్నులలో ఏదియో దులిపినది.

కుమార : సరే. యీ బొమ్మ యెవరిదమ్మో?

మంగమ్మ జవాబు చెప్పకుండుట చేత కుమారస్వామి అటు వంకచూచెను. ఆమె బలవంతముగా కోతిని దించి, కుర్చీలో కూర్చున్నది. మొగము నందొక విషాద రేఖ తోచెను. కుమారస్వామి లోనికి పోయి స్టౌ వెలిగించి కాఫీకాచెను. కాఫీ కాచుచుండగా వాలి పోయి ప్రక్కన కూర్చుండెను.

కుమారస్వామి "వెధవా! పో! త్రేతాయుగపు ముండకొడుకవు నీకు కాఫీ ఎందుకు" అనెను. వాలి, "రామాయణములో వాల్మీకి వ్రాయలేదుగాని, పరిశోధన చేసినచో నా విషయమును తెలియును. లంకలో టీ ప్లాంటేషన్సు పూర్వ ముండెడివి. లేకపోయిన రాక్షసు లెందుకున్నారు?" అన్నట్లు కిచకిచలాడి కుమారస్వామి నంటుకొని కూర్చుండెను. చెంగల్రావు వచ్చెను.

కుమార : "ఏమోయి! మూడవ అవతారము, ఈవాలిని కొంచె మవతలకు తీయుము. ఏడవ యవతారమునకు మూడవ అవతారమునకు సంబంధము కలిపెదము."

వాలి కుమారస్వామిని వదలలేదు. కాఫీయైనది. మంగమ్మను "కాఫీయైనది, లోనికి దయచేయు"డని కుమారస్వామి పిలిచెను. ఇరువురును గాఫీ తాగుచుండిరి. వాలి భాగము వాలికిచ్చిరి. వాలి చరచర త్రాగివేసి మంగమ్మ కాఫీకై ఎగబడెను.

కుమార : వీడన్నింటికి ఇంతే. సుగ్రీవుని భార్యకై ఎగబడెను. ఇప్పుడు మీ కాఫీకై ఎగబడుచున్నాడు.

మంగమ్మ : రుమ వానిదైన తరువాత నామె కాఫీ మీద మాత్రము వాని కధికారము లేదా?

కుమార : అవునుగాని, ఆ బల్లమీద ఫోటో గ్రాఫెవరిది.

మంగమ్మ : నీవు కాఫీ చాల చక్కగా కాచెదవు.

కుమార : నేను కాఫీ కాచుటకు, మీరు నాటకము లాడుటకు.

మంగ : నేడప్పుడే పాఠశాల యైనదా?

కుమార : మా ఈట్సునునకు బదులు మిరైనను ప్రిన్సిపాలై తిరికాదు, వాడేదో పాపము, పనియున్నప్పుడే రమ్మనుచున్నాడు. అందుకనియే

అదువాంధ్ర కధికార మీయరాదన్నారు. ట్రియినింగుస్కూలు నధ్యక్షురాలు చూడలేదా? ఉపాధ్యాయుల ప్రాణములు కొరికితినుచున్నది.

మంగమ్మ : అమె బ్రహ్మచారిణి యటకదా!

కుమార : అస్ఖలిత శబ్దము వదలితిరేమి? అది యట్టిపెట్టుకొన్నారు కాబోలు!

మంగమ్మ : ఇంక చాలులే! వెళ్ళు.

కుమార : ఆ బొమ్మ యెవరిది?

మంగ : రేపు చెప్పెదను.

కుమార : రేపు గురువు కర్కాటము లోనికి వచ్చునా.

మంగ : అయన పేరు "జోస్యులు" కుమారస్వామి "ఓహో! అనెను.

శరదృతువు వచ్చి, వర్షము మొలిపించిన పచ్చగడ్డి కన్నెలకు తలలో పూవులు పుట్టినను. కళాశాలలో వివేకానందస్వామి వ్రాసిన "పూర్వ పాశ్చాత్యము" అన్న గ్రంథము పాఠము చెప్పుచు కుమారస్వామి పాశ్చాత్య నాగరికతా పద్ధతులు, వివేకానందస్వామి గ్రంథము నందు తిరస్కరించిన వానిని, విస్తరించి వ్యాఖ్యానము చేయుచుండెను. క్రైస్తవ విద్యార్థులందరును, దామందఱము దొరల మనుకొనుచుందురు. వారికి హిందూదేశమునం దభిమానముండదు. వారి అభిమానములు, హూణదేశము – పాశ్చాత్య నాగరికత – వాని యందే ఉండును. అందుచే వారి కందరికి కోపము వచ్చి వారు క్లాసులో నుండి లేచిపోయిరి. కుమారస్వామి ఉపాధ్యాయుడిగా వచ్చిన యైదు నెలల నుండియు పాశ్చాత్య పద్ధతులను నిత్యము విమర్శించుటయే అతని పని. భారతీయ మార్గములను సమర్థించుట అతని పని క్రైస్తవ మతము నేమియు అనడు. "ఆ మతమును గురించి మీ యభిప్రాయమే" మని విద్యార్థు లడుగుదురు. అతడు "నాకా సంగతి తెలియ"దనును. కాని అతడు క్రైస్తవ మతమును నిందించుచుండెనని క్రైస్తవ విద్యార్థులు పోయి

వేయి పడగలు

ఈట్సనుతో చెప్పిరి. కుమార స్వామి "పాఠము చెప్పుచుండగా, క్రైస్తవ విద్యార్థులందరును గది వదలి పోయి" రని ఈట్సనుతో చెప్పెను. అతడు విషయమంతయు తెలిసికొని "వారిమతమునకు వ్యతిరేకముగా నున్నప్పుడు వారు లేచిపోవుట యుక్తమే"అనెను. కుమారస్వామి మనసులో అనుకొనెను. "అవును యుక్తమే, మా మతమునకు వ్యతిరేకముగానున్న మీ చదువు చదువుట, మీ కళాశాలలో చేరుట మాకును యుక్తమే. ఔను, వారి దేమి తప్పున్నది! వారు కాలేజి కొనినదే మతవ్యాప్తి చేయుటకు. మేమందరము భారతీయులము. మాకు ఉద్యోగములు కావలయును గనుక చదువు కొఱకు వచ్చితిమి, మాలో హిందువు డెవడు? మేము ధరించు దుస్తులన్నియు పాశ్చాత్యములు. మా భావములన్నియు పాశ్చాత్యములు – అందఱము వారివలెనేయైనాము. మాకు దురభిమానమెందుకు? విశ్వవిద్యాలయము ప్రిన్సిపాలు చెప్పిన మాట మీద నిర్ణయించును. మేము పొట్టచేతితో పుచ్చుకొని వచ్చిన వారము. సామర్థ్యము లేనప్పుడు పరాభవములను సహించుశక్తియైన ఉండ వలయును.

ఉపన్యాసకుల గదిలో కుమారస్వామి కూర్చుండెను. క్రిస్మమస్ సెలవులు వచ్చుచుండెను. పరీక్షలైనవి. సెలవులలో పేపర్లు దిద్దవలయును. ఒక యుపన్యాసకుడన్నాడు కదా! కళాశాలలోని పరీక్షాపత్రములు దిద్దినందుకు కూడ డబ్బిచ్చినచో బాగుండును. విశ్వవిద్యాలయ పరీక్షలకే యిత్తురు" అని.

కుమార : దురాశ కంతేమిటి? నవనిధులు తినేవానికి మేరుపర్వత మంతయు మేయవలెనని పించును. విశ్వవిద్యాలయ పరీక్షలకు మాత్రము ధన మెందు కీయవలయును? విద్యార్థులు నూటికి తొంబది యైదుగురు ధనహీనులు. తిండిలేనివారు. నేను విద్యార్థిగా ఉన్నప్పటి కష్టములు నాకు తెలియును. లోకములో దమ్మిడి దొరుకుటలేదు. దొడ్లమ్మి తోటలమ్మి పిత్రీయమైన యాస్తి అమ్ముకొని, పెండ్లము మెడలో నగలమ్మి, వారములు చేసుకొని, వారిని వీరిని యాచించి డబ్బు తెచ్చి జీతములు కట్టుచున్నారు. ఈ చదువులతో ప్రతిసంసారము "గృహస్థుల ఖాండ శుద్ధి రస్తు"గా నున్నది. ఆర్థిక దుస్థితి అని ఉపాధ్యాయుల జీతములలో విరుగగోయుచున్నారు. విద్యార్థుల నుండి ఎక్కువ జీతములేల పుచ్చుకొనరు? రాబడి అంతకంతకు వృద్ధి చేసుకొనుచు వ్యయము తగ్గించి ఏమి చేసెదరు? నలుబధి రూపాయలు, ముప్పది రూపాయలు పరీక్ష రుసుము తీసికొను చుండిరి, పత్రికలు దిద్దు వారందరు ఎచటనో ఒక చోట ఉపాధ్యాయులే కదా! వారికి సెలవులలో వారి జీతములు ముట్టుచున్నవికదా! సెలవులలో వారేమి పనిచేయుచున్నారు? పరీక్షాపత్రములు దిద్ది నందుకు వారికి డబ్బేల యీయవలెను? ఒక రూపాయ కాగితముతో జరిగిపోవు పరీక్షకు నలుబది రూకలు రుసుమా? ఛీఫ్ సూపరింటిండెంటుకుపది. తక్కిన వారికి నాలుగు. పత్రములు దిద్దినవారికి రెండు మూడు దొడ్డి సంభావన. ఆస్తులమ్మి, పెండ్లము నగలు పుస్తెతో నమ్మి, యింటిలో గడ్డికఱచి వాడు తెచ్చిన డబ్బు నెలకు రెండు మూడు వందల జీతములు తెచ్చు ప్రభువు లేల తినవలయును. అసలింత జీతము లెందుకు? నూరురూకల కన్న జీత మెక్కువ తెచ్చినవాడు దేశద్రోహి అని చెప్పవచ్చును. గాంధిగారదియే చెప్పెను. స్వరాజ్యము వచ్చిన తరువాత ఐదు వందలు దాటి ఎవ్వని జీతముండదట! మనకు నాల్గువందల జీతము వచ్చినది కదా అనికాదు సంతోషము! వచ్చిన మార్గమెట్టిదని.

తక్కిన ఉపాధ్యాయులందరికి కోపము వచ్చెను. సెలవు లిచ్చిరి. సెలవులలో కుమారస్వామి ధర్మారావు వద్దకు పోయెను. "ఏమండీ! మా యింటివైపే చూచుట మానివేసితి" రనెను.

ధర్మారావు : మీ రుద్యోగస్థులు. మునుపటివలె మీతో మాట్లాడవచ్చునో, రాదో అని వచ్చుటలేదు.

కుమారస్వామి : కన్నులు చూడండి. కనుబొమ్మల కిందనున్నవా?

ధర్మా : నెత్తిమీద మొలుచు కన్నులివికావు. పెద్దపులి వేసగాని కున్నట్లు వేఱే యుండును. వాని పైని తలపాగ ఉండును, కనుక మనకవి కనబడవు. ఆ కన్నులు నీకు లేనట్లే ఉన్నవి!

కుమార : తలపాగ నంటుకొనియుండు నేమో! ఇప్పుడు తలపాగ లేదుకదా!

ధర్మా : మీ కాలేజి విశేషము లేమి,

కుమార : ఏమున్నవి? ధర్మారావుగారు కళాశాలలో ఆంధ్రోపన్యాసకులుగా పనికిరారు.

ధర్మా : అదేమిటి? నే నచ్చట నుపాధ్యాయుడను కాను కదా!

కుమార : ఛాయాపటమే పనికిరానప్పుడు మాతృక అసలు పనికిరాదు.

ధర్మా : ఏమైనది? కథ చెప్పుము.

కుమార : మన అభిప్రాయము లేమియు అచటి పనికిరావు. ఆ కళాశాలలో నియమమనగా వారి సిద్ధాంతముల కనువర్తించి యుండుట. ఇంగ్లీషు వారి నేమియు అనరాదు. వారి ఆచారములు మంచివి కావనరాదు. ఏమాట కామాటయే. వారి మతమును గురించియు నేనేమియు ప్రస్తావించ లేదు. అయినప్పటికి నన్ను చూచిన వారికి ద్వేషముగా ఉన్నది. సరేకాని, వారు మాటి మాటికి "దేవుడొక్కడే. మీకింతమంది దైవము లేమిటి?" అనుచుందురు దాని కేమి చెప్పవలయును.

ధర్మా : దేవుడన్న శబ్దము నిత్యైకవచనము. దేవుడొకడే అని ఆశబ్దమే చెప్పుచున్నదికదా? దేవుడొకడే.

కుమార : నేనట్లు చెప్పినచో వారర్థము చేసికొనలేరు. అసలు వారికి మీరు చెప్పు శబ్దసిద్ధాంతము తెలియదు.

ధర్మా : ఆ సిద్ధాంతము నేను చెప్పలేదు. మనలో నిదివరకే ఉన్నది. అర్థము లేకుండ శబ్దములేదు. కనుక తత్త్వము శబ్దార్థము తదర్థము సరి నిర్ణయించినచో తికమకలుండవు. హూణభాషలో విస్పష్టమైన అర్థము కల శబ్దములు పరమార్థ విషయమును బోధించునవి లేవు. శబ్దవ్యుత్పత్తికి ప్రయోగము నందలి దాని అర్థమునకు పొసకదు.

కుమార : సరియే. మనకనేకదైవము లుండిరికదా! ఇంతమంది దైవములకు బొసగుటయెట్లు? వీరిని సమసించుట యెట్లు?

ధర్మా : నీకీమాత్రము తెలియదా?

కుమార : మీరు నాకు చెప్పినది తెలుగు. ఈ సంగతు లెప్పుడైన చెప్పితిరా?

ధర్మా : నీవిప్పుడే కదా నన్నడుగుచుంటివి? నీకు సర్వవేళల మంగమ్మ కొలువుతో నే సరిపోయెను.

కుమార : మంగమ్మగారు పూర్వ మాపాపము చేసిన మాట నిజమేమో! కాని, యిప్పుడామె చాల మంచిదండీ! ఆమె ప్రతి యేకాదశి ఉపవాస ముండును, మడికట్టుకొని కాని భోజనము చేయదు. యాచనకు లేదని ఆమె నోటరాదు.

ధర్మా : యాచకులెవరైన వత్తురా యేమి?


కుమార : ఇప్పుడు కుండలులే వచ్చుచుండిరి.

ధర్మా : అనగా?

కుమార : కుండలి యనగా పాములోక్కటే కాదుకదా! కుండలములు ధరించిన బ్రాహ్మణులు కూడను. ఆమె నిత్యము స్నానము చేసి జపము చేసికొనిన గాని భోజనము చేయదు.

ధర్మా : గూడెములో క్రతువు చేసినట్లున్నది.

కుమార : మీరు గాంధీగారి యంత్య మోద్యమము



568కి.మీ. పరుగు!

నిర్విరామంగా ఎక్కువ దూరం పరిగెత్తిన వ్యక్తి స్వీడన్‌కి చెందిన బెర్టిల్ జర్నాకెర్. 1980లో ఈయన 352.9 మైళ్ళు (568 కి. మీ) దూరాన్ని 121 గం. 54 ని.లలో పరిగెత్తాడు.

నొప్పుకొనరేమి? మీరు చాలా పూర్వాచార పరాయణులు. పంచముల సంగతి ఒప్పుకొనక పోవుట బాగుగాలేదు.

ధర్మా : నేనే మొప్పుకొనలేదు? వాంఛ్రందఱను గూడెములలో గుడిసెలలో బ్రతుకుచుండగా దేశోద్ధారకులను వారి కిండ్లు కట్టి పెట్ట వద్దంటినా? వారి వీధులు, ఇండ్లు పరిశుభ్రముగా నుండునట్లు చేయవలదంటినా? వారికి నూతులు, బావులు త్రవ్వించి పెట్టు దాత యుండెనేని వలదంటినా? ప్రతిదినము స్నానము, పరిశుభ్రమైన వస్త్రములు తాల్చుట, కూటి కమర్చి పెట్టుట – ఇవి వారికి వలదనలేదు. మొదట నివి సమకూర్చి పెట్టుము ఎవడును దానికి దమ్మిడీ చేపడు. దేవాలయ ములలోనికి వారిని రానిత్తు మందురు, వ్యయము లేనిపనిగదా! ఊరిమీదూరు పడినను కరణము మీద కాసు పడదు. చెడిన, దేవాలయము లోని దేవుడు చెడుగాక, మనకేమి?

కుమార : దేవాలయములోని దేవుడెందుకు చెడును?

ధర్మా : నాది వాదన కాదందువు గాని యొక మాట అడిగెదను. పరపురుష సంగమము వలన భార్యను పరిత్యజించుట ఎందులకు? ఆమె ఏరీతిగా అపవిత్ర యైనది? దానికి సమాధానము నీ మనస్సులో, నీతత్త్వ ములో నున్నది. అట్లే ఆ ప్రత్యక్ష విషయములను గూర్చి ప్రశ్నించరాదు. అవి యథాస్థితికముగ అంగీకరించ దగినవి.

కుమార : దేవాలయముల లోని పూజారులు బ్రాహ్మణులు. వీరికున్న యెక్కువ గుణములేమి, పంచములకున్న తక్కువ గుణము లేమి?

ధర్మా : ఆ ప్రశ్న మఱల వర్ణమును గూర్చి వచ్చిన ప్రశ్న. వర్ణము కల్పితమా, సహజమా అని. పశువులందావులు, బఱ్ఱెలు, మేకల వలె,

వేయి పడగలు

బ్రాహ్మణులు, తదితర వర్ణములవారు భిన్న మైన వర్ణము కలవారా యను ప్రశ్న. ఈ ప్రశ్న వెనుక నొక అర్థమున్నది. ఆవు చురుకైన జంతువు. బఱ్ఱె మందమైన జంతువు: మోటారు పోవుచుండగా బఱ్ఱెలగుంపు చూడు, చచ్చినను కదలదు. సూక్ష్మముగా యోచించుము. దాని ప్రకృతిలో ఆ మాంద్యము దాని రక్తమందున్నది. ద్రవ్యమును బట్టియే గుణము వచ్చినది. గుణమును బట్టియే ద్రవ్యము వచ్చినది. వానికి రెంటికి అవినాభావ సంబంధమున్నది. బ్రాహ్మణుని చూచినంతనే బ్రాహ్మణుడని తెలియుచున్నది. తునివైపు క్షత్రియులను చూడుము, వెంటనే క్షత్రియు, డని తెలియును. వారు ధరించు దుస్తుల వలన, తక్కిన లక్షణములవలన గ్రహింతు మందువేని అదికాదు. ఇప్పుడు సర్వజనులకు ఒక్కటియే దుస్తులై పోయినవి వాని భేదము కనుపించుటలేదా? ఆ భేదము కొన్ని చోట్ల లేదు. క్రైస్తవుడు క్రైస్తవ వలె కనిపించుచున్నాడు, అది భేదమే అది వర్ణమే. కాదని యెవ్వడు అనడు తెలిసిన వాడు. అందఱు మొక్కటి అను సిద్ధాంతము పశువులన్నియు ఒక్కటియే అను సిద్ధాంతము వంటిది ఆవుపేడతో ఇల్లలుకు కొందువు. గేదె పేడ గజ్జికి వేసి కట్టెదవు. గోవు పంచితము గోడలకు చల్లుము, వృశ్చికాదులు నశించుట ప్రత్యక్షమైన విషయయము. బఱ్ఱెకీ గౌరవము లేదు ఈ భేదము ప్రత్యక్షమే! దాని తత్త్వజ్ఞానము సూక్ష్మదర్శికే తెలియును. అట్లే భిన్న వర్ణములందు భేదము లున్నవి.

కుమార: ముఖ లక్షణములు, ఉనికి తీరు, దుస్తులు, నడక తీరు వీని యందు భేదములుండవచ్చును. అది ప్రధాన విషయమున భేదమెట్లగును?

ధర్మా: ప్రధాన విషయమనగా?

కుమార: అందరమును మనుష్యుల మగుటలో!

ధర్మా: అందరమును మనుష్యులము కామని మేమనలేదు?

కుమార: అనకపోయినచో భేదము లేదు.

ధర్మా: భేదములు ఎడిగా చూపించుచుంటిమి కదా!

కుమార: నేననునది మీరు సరిగా గ్రహించలేదు.

ధర్మా: నీకు ప్రశ్న వేయుట చేత గాలేదు. నీ ప్రశ్న యిది. ఆత్మలో భేదమేమున్నదని.


కుమార: అవును. ఆత్మలో భేదమున్నది.

ధర్మా: ఆత్మలో భేదము లేదు. జీవునిలో



స్కేటింగ్ విజేతలు

రష్యాకి చెందిన స్కేటింగ్ క్రీడాకారులు ఐరినా రోడ్నినా, అలెక్సాండర్ జైత్సేలు 1972 వరకు ఆరు ప్రపంచ, ఏడు అయిరోపా, రెండు ఒలింపిక్ టైటిల్స్‌ని గెలుచుకున్నారు.



వరుసగా 35 విజయాలు

1980లో బ్యోరన్ బోర్గ్ వింబుల్‌డన్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌ని గెలిచినప్పుడు అంత వరకూ అయన వరుసగా 35 పోటీలలో గెలిచి రికార్డు సృష్టించాడు.

భేదమున్నది. జలము సర్వసాగర మహా నదీనద తటాక కుల్యాపల్వముల యందున్నదంతయు నొక్కటియే దానియందున్న ద్రవ్యత్వగుణము తజ్జల స్వరూపము సామాణ్య లక్షణములు. వాని న్నింటికి భేదములేల యున్నవి? ఉపాధి ఆశ్రయించి యున్నవి. ఉపాధిగ భ్రాంతి చేత జలమే సాగరమగుచున్నది. జలమే చిన్న పడిమయు నగుచున్నది. ఉపాధిగతమగుట చేత వాని. శక్తులును మారుచున్నవి. మహా నదిలో - కృష్ణలో - అనేక పట్టణ మాలిన్యయిలు కడుగబడుచున్నవి. సాగర సంగమము వద్ద కూడ మాలిన్య శంకలేదు. తటాకముపై రేవున పశువులు పడినచో క్రింది రేవు నీరు పానీయము కాదు. చూచితివా? భేదము కల్పించిన దెవరు? జలమే. తాను తన యున్న భిన్న ప్రదేశముల నాశ్రయించి భేదము తెచ్చుకొన్నది. అట్లే ఆత్మయు భిన్నోపాధిగతమై, భిన్నత్వము తెచ్చుకొన్నది. తదుపాధి గత గుణ దోష సంక్రాంతి చేత జీవుడు భిన్నుడగుచున్నాడు.

కుమార: సరస్తటాక సాగరాది భేదము దృశ్యమానమగుతున్నవి. మానవుల యందలి భేదములు దృశ్యమానమగుట లేదు.

ధర్మా: ఎందుకు లేదు? వివేకవంతుడు, చదువుకొనిన వాడు సర్వాధికారము చేయుచున్నాడు. అవివేకి, చదువుకొననివాడు పాలింపబడుతున్నాడు. ఆ అధికారిలో ఎన్ని భేదములు. ఈ పాలింపబడు వాని యందెన్ని భేదములు!

కుమార: ఇవి అన్నియు మనుష్య కల్పితములు.

ధర్మా: పొరపాటచటనే ఉన్నది. ఉపాధి యాదృచ్ఛికమా, నియతమా? నీవలె వాదించు వారు యాదృచ్ఛిక మందురు. నేను నియతమందును. రష్యా చూడుము. సర్వ భేదములను నాశనము చేసినది. భేదములు లేవా? మంత్రులు లేరా? సేనా నాయకులు లేరా? వైద్యులు లేరా? ఉన్నారు. కాని, వారు భేదములు పాటించరని నీవనవచ్చును.

ఎందుకు పాటించరు? తాను మంత్రిత్వ మాచరించుయందు పాటించరా? తన అధికారేతర విషయములందు సర్వ దేశీయుల యందును, సామాన్య భావము; అధికార విషయమున విశేష భావము; భేదమేమైనది? అట్లే మనుష్యులందరు యందును సామాన్య భావము; భిన్న వర్ణముల వారి భిన్న ధర్మముల యందు విశేష భావము నీకు ధనము కనపడినంత ప్రత్యక్షముగా దివ్యము కనిపించదు. దాని యందలి భేదములు నీవు సరిగా నూహించక కృతకము లనుకొందువు. అదియు నీ దోషము కాదు. నెత్తి మీద బిడ్డమ్మ గూర్చుండి యట్లనిపించు చున్నది. ఇదివరకు భేదములున్నవని తీసి కొత్త మార్గం అవలంబింతువు. కొంచెం జాగ్రత్తగా చూడుము. మరల భేదములే ఏర్పడుచున్నవి. ఎన్నికల సంగతి విచారించుము. వర్ణములు పోయి పక్షము లేర్పడినవి. అతివాదులు, మితవాదులు, స్వతంత్రులు, ఆ భేదముల కన్న నీ భేదమే ఎక్కువ ప్రాణసంకటము, వేడిలో తెలియదు. కాఫీ హోటళ్ళ తిండి చూడలేదా? దాని సొగసు చల్లారిన తరువాత! ఇది భోజ్యముగానైనమున్నది. అది వమనమే.

కుమార: ఇంత మంది దైవములుండుట ఏలనో చెప్పలేదు.

ధర్మా: అది యింకొకసారి.

• కుమార: దేవుడొకడే నంటిరి కదా?

ధర్మా: అది నేననలేదు. మీ క్రైస్తవోపాధ్యాయు లన్నారు కాబోలు!

కుమార: మీరును నొక్కడే నంటిరి కదా!


ధర్మారావు: "దేవుడు, దేవుడని సామాన్యోక్తి అది విశేష జ్ఞానము కాదు. వారనుకొన్న దేవుడుండుటకు వీలు లేదు. దేవుడు పుంలింగము. అనగా మూర్తి యుండవలె. మూర్తి అనగానే ద్రవ్యము. ద్రవ్యమునకు గుణము. ద్రవ్య గుణాకారము లన్నియు నశ్వరములు. ద్రవ్య గుణాకృతాత్మదైనచో నా దేవుడు నశించి పోవును.

కుమార: మరి దేవుడనగానేమి?

ధర్మా: నాకేమి తెలియును? దేవుడన్న వారికి దెలియవలయును.

కుమార: అట్లైనచో ద్రవ్య గుణాకారములు మనము చూచుచున్నవి. నశించును. పది యాకృతులు నశించును. వాని యందేకాకృతి ఒకటి అనుస్యూతమై ఉన్నది. అది నిత్యమందము. అట్టి నిత్యమైన ద్రవ్య గుణాకారములు గలవాడు భగవంతుడు.

ధర్మా: దీనినే మహా భాష్యమున శబ్దార్థ నిర్ణయము చేయుటకు బతంజలులు చెప్పిరి. కూటస్థములు, అవిచాలులైన వస్తువులలో ననుస్యూతమయిన "ప్రమ" శబ్దార్థమ. విశిష్టాద్వైతుల సిద్ధాంతము కూడ కొంతవరకు విధియే కాని ద్రవ్య గుణాకారములు నశించును. ఇవి జన్యములా? జనకములా? జనక పదార్థ మొక్కటే. ఉండవలెను. దేవుడొక్కడే అనుచున్నావు కదా! అందుచే ప్రధానమైనదొక్కటే వస్తువు. అది ద్రవ్య గుణాదులు కాదు. ద్రవ్య గుణాదులకంత పరమోచ్చ వైభవము లేదు గనుక. అది ద్రవ్య గుణాది భిన్నమైన వస్తువై ఉండవలెను. దేవుడు కాదు దానినే మనవారు బ్రహ్మమనిరి. ఈ తత్వమెవరికి? దేవుడు దేవుడని చంకలు కొట్టుకొను వారికి జిజ్ఞాస లేదు. మతము లేదు. వారు వీరి నభినయింతురు. (ఇంకా ఉంది)



బాలరంజని-గుంటూరు జేసీస్ సంయుక్తంగా నిర్వహించిన బాలల అందాల పోటీల సందర్భంగా క్రిక్కిరిసిన సభా ప్రాంగణం

బాలల అందాల పోటీలు

(90 వ పేజీ తరువాయి)

వారి సతీమణి, శ్రీమతి ఉషా గోనెల ఆంధ్రపత్రిక అసిస్టెంట్ ఎడిటర్ డాక్టర్ గుమ్మనూరు రమేష్‌బాబు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక యాక్టింగ్ ఎడిటర్ శ్రీ మతుకుమల్లి మాధవరావు, మోడల్ బాట్లింగ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ లక్ష్మణస్వామి ప్రసంగించారు.

అతిథులకు ప్రాజెక్ట్ డైరెక్టర్ గంధం కృష్ణ మొమెంటోలు అందించి సత్కరించగా కార్యదర్శి ఎర్రం సాంబిరెడ్డి తన నివేదికలో సంస్థ కార్యకలాపాలు వివరించారు.

ఇలాంటి ఆరోగ్యకరమైన విజ్ఞాన వంతమైన పోటీలు ఆంధ్రపత్రికతో కల్సి ముందు ముందు మరెన్నో నిర్వహిస్తామని ఉధ్యక్షులు శ్రీ వి. సి. ఆర్. రెడ్డి ప్రకటించారు.

చిన్నారి బాల బాలికలకు వినోదంకై కేంద్ర క్షేత్ర ప్రచార శాఖాధికారి శ్రీ రాపూరి వెంకటేశ్వర్లు నేతృత్వంలో ఫిలింషో జరిగింది.

ఈ పోటీల్లో జడ్జీలుగా వ్యవహరించిన డాక్టర్ జోత్స్న, డాక్టర్ కిషోర్, డాక్టర్ డి. కృష్ణారెడ్డి, డాక్టర్ పేరిరెడ్డి గార్లను, కిరీటాలను నూతన రూపురేకలతో దిద్ది ఆకర్షణీయంగా తయారు చేసిన శ్రీ ప్రసాదార్యే (తెనాలి) మోడల్ బాట్లింగ్ కంపెనీసేల్స్ ఎగ్జిక్యూటివ్ శ్రీ ఎం. వి. జగన్నాధ్‌లను ఈ సందర్భంగా సత్కరించారు.

ముఖ్య అతిధులకు "మోడల్ బాట్లింగ్ కంపెనీ" జ్ఞాపికలను అంద జేసింది.

శ్రీ నిమ్మరాజు వందన సమర్పణ చేశారు.

—చలపతిరావు

ప్రభుత్వం ఎవరికి ప్రతినిధిగా ఉన్నట్టు? తమకేమీ పాత్ర లేనప్పుడు జెనీవా ఒప్పందాన్నయినా, ఆ మాటకు వస్తే, మరే ఒప్పందాన్నయినా అఫ్ఘన్‌లు ఎందుకు పట్టించుకోవాలి? ఆ ఒప్పందం ప్రధానంగా అమెరికన్‌లు, రష్యన్‌లు కలసి చేసిన వ్యవహారం. వాళ్ళు ఎంత శక్తివంతులైనప్పటికీ, అఫ్ఘనిస్తాన్‌లాంటి దేశపు భవిష్యత్తును నిర్ణయించడానికి వాళ్ళు ఎవరు?

అఫ్ఘన్ మిత్రులకు నేను ఇవ్వగల సలహా ఏమంటే, రష్యన్ సైన్యాలు ఎంతమంది అఫ్ఘన్‌లను చంపి వేశాయో. జెనీవా ఒప్పందాన్ని అన్ని ముక్కలుగా చించి నజీబుల్లా ముఖం మీద పారవేయండి. అఫ్ఘన్ నేల మీది నుంచి చిట్టచివరి రష్యన్

న్యూఢిల్లీ లేఖ

(4 వ పేజీ తరువాయి)

సైనికుడు వెళ్ళిపోయే దాకా మాత్రమే కాదు, చిట్ట చివరికి కె. జి. బి. ఏజెంటు వెళ్ళిపోయే దాకా గట్టి పోరాటాన్ని కొనసాగించండి. జెనీవాను మరిచిపొండి. అక్కడ బోఫోర్స్ వాళ్ళు వాళ్ళ మిత్రులు తమ తప్పుడు సంపాదనను దాచుకుంటారు. మీ భారత వామపక్ష స్నేహితుల్ని మరిచిపొండి. సోవియట్ దుర్మార్గులకు, మీ సొంత దుర్మార్గులకు వ్యతిరేకంగా మీరు చేసిన సుదీర్ఘ పోరాటంలో వీళ్ళు మీకు ఏమీ సాయం చెయ్యలేరు. వాళ్ళ వ్యాసాల్లో ఒక్కసారయినా మిమ్మల్ని ప్రస్తావించలేదు. ఎల్లప్పుడూ బబ్రక్ కర్మల్‌లను, నజీబుల్లాలను పొగడుతూ వచ్చారు. భారత ప్రభుత్వాన్ని, కాంగ్రెసు రాజకీయ నాయకులను కూడా మరిచిపొండి. వాళ్ళు అన్ని సమయాలలోనూ కాబూల్‌లోని కీలుబొమ్మ ప్రభుత్వాన్ని సమర్ధిస్తూ వచ్చారు. వాళ్ళు తోలుబొమ్మలాటను ఒక కళగా అభివృద్ధి చేసి మాస్కోలోని భారతీయ ఉత్సవాలలో గౌరవ స్థానం కూడా కల్పించారు.

అఫ్ఘన్ తిరుగుబాటుదారులకు పాకిస్తాన్ నుంచి సహాయం అందుతున్నదా, అమెరికన్ల నుంచి సహాయం అందుతున్నదా అనేది నేను పెద్దగా పట్టించుకోను. ఎందుకంటే నాకు అవసరమైన దల్లా అఫ్ఘన్‌లు ఏమి చేస్తున్నారన్నదే గాని, పాకిస్తానీలు ఏమి చేస్తున్నారు, అమెరికన్లు ఏమి చేస్తున్నారు అన్నది కాదు.

అఫ్ఘనిస్తాన్ ఒక సర్వసత్తాక రాజ్యంగా ఉన్నన్ని రోజులు, అఫ్ఘన్‌లు సర్వసత్తాక అధికారం గల ప్రజలుగా ఉండదలుచుకున్నాళ్ళు నేను వాళ్ళను సమర్ధిస్తాను. వాళ్ళు తిరగబడకుండా లొంగిపోయి ఉంటే నేను వాళ్ళను మళ్ళీ రెండోసారి చూసేవాణ్ణి కాను. క్రెమ్లిన్‌కు వ్యతిరేకంగా చెక్‌లు, హంగేరియన్‌లు చేసిన పోరాటంలో వాళ్ళను సమర్ధించినట్టుగానే అఫ్ఘన్‌లను కూడా గత ఎనిమిది, తొమ్మిది సంవత్సరాలుగా వాళ్ళు చేస్తున్న పోరాటంలో సమర్ధిస్తున్నాను. ఒక భారతీయుడిగా, మనలాగ స్వేచ్ఛగా ఉండాలని వాంఛించే ఇతర ప్రజల కోసం నేను చేయగల సాయం ఈ సమర్ధనే. మనం కూడా ఒకప్పుడు ముజాహిదీన్‌లుగా ఉన్నాం. మనం కూడా ఒక స్వంత పవిత్ర యుద్ధం చేపట్టాం. మనం కూడా విదేశీ కర్కోటకుల మీద పోరాటం చేశాం. మనకు కూడా మన బబ్రక్ కర్మల్‌లు, నజీబుల్లాలు ఉన్నారనుకోండి. రణదివేలు, నంబూద్రిపాద్‌లు, డాంగేలు, పి. సి. జోషీలు, వామపక్షవాదులమని పిలుచుకుంటూ మార్క్సిస్టు కుతర్కాన్ని, అబద్ధాలను ప్రచారం చేసేవాళ్ళున్నారు. దీనంతటికీ ఎట్లా ప్రతిస్పందిస్తామో మనకు ఖచ్చితంగా తెలుసు.

అజర్‌బైజాన్‌లో, ఉజ్బెకిస్తాన్‌లలో వలెనే అఫ్ఘనిస్తాన్‌లో కూడా రష్యన్లు చేయవలసిన పనేమీ లేదు. ఇవన్నీ ఆసియన్ దేశాలు, మన స్వంత దేశాలు. ఇక్కడ ఉండే హక్కు వాళ్ళకు లేదు. ఈ సంగతి మిఖయీల్ గోర్బచేవ్ గుర్తించాడు. కాని యాభై ఏళ్ళు వెనకబడి ఉండే మన వామపక్షవాదులు మాత్రం గుర్తించటం లేదు. ఇంత కంటే అజ్ఞానుల సమూహాన్ని మీరు చూడలేరు. వీళ్ళే 1942 లో గాంధీజీని, సుభాష్‌చంద్ర బోస్‌ను దుర్భాషలాడారు చర్చిల్ అండ్ కంపెనీ నుంచి అందిన కొన్ని వేల రూపాయల కోసం! ఇటువంటి మనుషులు అఫ్ఘన్ దేశభక్తులు తర్వాత చెయవలసినదేమిటో చెపుతారా?



దూరదర్శనం

లత

గుల్‌దస్తా

గురువారం గుల్‌దస్తా సార్– భయం లేదు. అది ప్రస్తుతపు సంస్కృతి. ఒక మధ్య వయసు ఆంటీ మోడల్ అవాలని అష్టకష్టాలూ పడుతూ ఉంటుంది. అదలా ఉంచి పక్కింటి పింకీగుంట బాయ్ ఫ్రెండ్‌తో తిరుగుతున్నదని ప్రచారం చేయటం వలన సదరు పింకీ శాంతి ఆంటీ భర్తనీ – బాయ్‌ఫ్రెండ్ శాంతి ఆంటీనీ కాస్త టికిల్ చేస్తారు. ఆ చెత్త అలా ఉంచండి హిందూ కుటుంబాలలో తలాక్ అని మూడు సార్లంటే వివాహ బంధం అయిపోతుందా? న్యాయవాదులూ ఆలోచించండి! ఇది ఎంత అసందర్భంగా ఉందో? హాస్యం ఏమి లేదు. టి. వి. ప్రకటనలని అనుకరించటం తప్పు. టి. వి. ఆ విధంగా అన్‌పాప్యులర్ అవుతోంది.

యస్వీ రంగారావు

శనివారం నాడు మహానటుడు యస్వీ రంగారావు గారి మీద కార్యక్రమం ఇచ్చారు. ఏనౌన్సరు మాత్రం మహానాధుడు అంది. మళ్ళీ ప్రముఖ నటుడు అంది. పాపం తెలుగు రాని ఏనౌన్సర్లు– ప్రముఖ నటులు సత్యనారాయణగారి వ్యాఖ్యానంతో ఒకసారి ఘటోత్కచునీ– ఇద్దరి హీరోల తండ్రిగా సంసారి గానూ, రావణుని ఆర్భాటంతోనూ– కీచకుని శృంగారంతోనూ– తాంత్ర పాపయ్య శౌర్యంతోనూ తిరిగీ ఒక్కసారి ఆ మహానటుని చూసి టి. వి. ప్రేక్షకులు ధన్యులైనారు – జకార్తా ఫిలిం ఫెస్టివల్‌లో ఆయన కీచక పాత్రని అన్నిదేశాలూ అభినందించారు– రంగారావుగార్ని విడిగా చూస్తే చాలా సౌమ్యంగా ఉండేవారు– సాహసం చేసిన డింభకుడికి ఇన్స్పిరేషను నాయుడుగారు.

చాంద్ సితారే

ఆదివారం చాంద్– సితారే–కి వృద్ధ నటి కామినీ కౌశల్ రచనా దర్శకత్వం. పిల్లలు జంతువుల మీద అభిమానంగా ఉంటారని అందరికీ తెలుసు – అదేదో చెత్త చెత్తగా తీసింది ఆవిడ.

ద ప్రిన్సెస్ నెవర్ లాఫ్స్– ఫెయిరీటేల్స్‌లో ఇది ఒక కథ– ఒక పెంకి ప్రిన్సెస్ చాలా సీరియస్ టైప్ విసిగిస్తున్న మాస్టార్ని విసిరికొట్టి ఇక చదువొద్దు అని డిక్లేర్ చేస్తుంది. నా కూతుర్ని నవ్విస్తే వాడికి కూతుర్నీ రాజ్యాన్నీ ఇస్తానంటాడు రాజు. ఒక పందుల కాపరి నవ్విస్తాడు. రాజు కూతుర్ని ఇస్తాడు.

ఆదివారం నాలుగు పిల్లల నాటకాలు –హీమాన్. కామినీ కౌశల్ గారి చాంద్‌సితారే – ఫెయిరీ టేల్స్ – మరో పిల్ల డిటెక్టివ్‌ల అటవిక సంచారం లాంటివి. ఫెయిరీ టేల్స్ ఏదో ఫరవాలేదుగాని మిగతావి అట్టర్ ఫెయిల్యూర్ చెత్త ఇస్తున్నారు ఆదివారం. కాకపోతే రెండు సినిమాలు ఇస్తారు అదొకటే ఆనందం. అవీ ఒకప్పుడు బాగుంటాయి.

హిమాలయ దర్శనం

శనివారం నాడు అశేష భారత ప్రజలూ టి. వీ. ద్వారా చూసి ధన్యులయినారు – ఇది డాక్యుమెంటరీ కాదు సీరియల్ నాటిక. హిమాలయ పాదపంలో ఉన్న అడవులకి కూడా మైదాన ప్రదేశాల్లో ఉండే అడవులకి పట్టిన గతే పట్టినట్లుంది. కథ ఏముంది కాని ఆ హిమాలయపు సెలయేళ్ల మధ్య మంచం లాటిది వేసుకుని ఆఫీసరు కూర్చోటం చాలా బాగుంది– కథలో భారతీయుడైన వాడు ఇంగ్లీషు వాడిని మోసం చేసినట్లు చూపించటం నాకు నచ్చలేదు కాని ఈ సీరియల్ అయే లోపల హిమాలయ సౌందర్యాలు మనం చూడవచ్చును – ఆ చల్లదనం కళ్ళకు కనిపించింది. నాకు రాజీవ్‌గాంధి కన్న కాస్త ఎక్కువ తప్పులే వస్తాయి హిందీలో – అయినా టైటిల్సు చదివి వచ్చే వారం ఈ టెస్టు ఎవరిదో చెపుతాను.

కదువాసచ్

ఈ సీరీస్‌లో ఈవారం ఔరత్ అనే నాటిక – ఇదొకటే కాస్త పిల్లల కార్యక్రమం కాదుగాని– మొదట్లో ఒక ఇల్లాలు నొప్పులు పడటం నుంచి అర్ధ పిల్లల నాటిక ఆడపిల్ల ఒద్దని తల్లి నొప్పులు పడుతూ ఏడుస్తుంది. ఆడపిల్ల ఒంటరిగా వెడుతుంటే రేప్ జరుగుతుంది. పిల్లల్ని పెంచలేక ఆపరేషన్ చేసుకున్న స్త్రీ – తప్పక వ్యభిచారం చేసే స్త్రీ – వీళ్ళందరి వెనుకా ఒక రకం కథలు కాక పోయినా ఏరకం స్త్రీలకు ఆరకం కథలున్నాయి. వ్యభిచారంలో దిగిన అమ్మాయిని మొగవాడే అమ్ముతాడు. అన్నిటికీ కారణం మొగవాడేనా? వాడి ఖర్మ కాల. వాడంత ధూర్తుడా? అయితే మొగపిల్లల్ని కనకూడదని ఆడది నిర్ణయించుకోవాలి గాని ఆడపిల్లల్ని ఎందుకు వద్దంటుంది?

'హక్కే బక్కే'లో ఒక దృశ్యం



హైదరాబాద్ నోట్‌బుక్

తిరుమల రామచంద్ర

తెలుగు సంస్కృతి ఆవిష్కరణ

తెలుగు విశ్వ విద్యాలయం తలపెట్టిన విజ్ఞాన సర్వస్వ పునర్నిర్మాణ ప్రణాళికలో 'తెలుగుదేశము- చరిత్ర, సంస్కృతి మూడు సంపుటాలలో రెండవదైన తెలుగు సంస్కృతి సంపుటాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నందమూరి తారకరామారావు మే 18వ తేదీ ఉదయం జూబిలీహాలులో ఆవిష్కరించారు. తెలుగు విజ్ఞాన సర్వస్వ రచనకు ఆద్యులైన కొమర్రాజు వెంకట లక్ష్మణరావుగారి 11!వ జయంతి సందర్భంగానూ, 1913లో తెలుగు విజ్ఞాన సర్వస్వ ప్రారంభ మయినందున దాని వజ్రోత్సవ సందర్భంగాను ఈ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ, కొమర్రాజు వెంకట లక్ష్మణరావుగారి సేవను ముక్త కంఠంతో ప్రశంసించారు. ఆయన తెలుగువారి అవగాహన గవాక్షాలు తెరిచి, విశ్వ విజ్ఞాన జ్యోతులతో నింపి, తెలుగువారిని ఆధునికత వైపు నడిపించిన భగీరథుడని, విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి, విజ్ఞాన సర్వస్వ నిర్మాణ ప్రణాళిక ఆయన తెలుగు వారికిచ్చిన వరప్రసాదాలని, చరిత్ర పరిశోధనాసక్తి, నిష్పాక్షిక వివేచన ప్రాచీనాధునిక జ్ఞాన విజ్ఞానాలు సమన్వయం ఆయన పెట్టిన ఒరవడి అని ముఖ్యమంత్రి కీర్తించారు. ఆయన 1913లో విజ్ఞాన సర్వస్వ రచన ప్రారంభించారని, నేటికి ఆ ప్రారంభోత్సవానికి వజ్రోత్సవమని, ఈ సందర్భంలో తెలుగు విశ్వ విద్యాలయం విజ్ఞాన సర్వస్వ కేంద్రం ఈ తెలుగు సంస్కృతి సంపుటాన్ని ప్రచురించడం, దానిని తాము ఆవిష్కరించే భాగ్యం పొందడం సంతోషదాయకమని ముఖ్యమంత్రి అన్నారు. ఆధునికాభివృద్ధికి అనుగుణంగా తెలుగు భాషా సాహిత్యాలలో పరిశోధన కొనసాగించడం, తెలుగు సంస్కృతి ప్రచురణ విస్తరణలు తెలుగు విశ్వవిద్యాలయ ప్రధాన లక్ష్యద్వయమని తెలుగు విశ్వవిద్యాలయా కులాధిపతిగా ముఖ్యమంత్రి వివరించారు. పిదప ముఖ్యమంత్రి తెలుగు సంస్కృతి సంపుటం ఆవిష్కరించి తొలి ప్రతిని డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డిగారికి అందజేశారు. విజ్ఞాన సర్వస్వాన్ని 1947లో ప్రారంభించి 13 సంపుటాలు పూర్తి చేసి తెలుగు విశ్వవిద్యాలయంలో లీనమైన తెలుగు భాషా సమితికి డాక్టర్ గోపాలరెడ్డి గౌరవాధ్యక్షులు. పిదప ముఖ్యమంత్రి తెలుగు సంస్కృతి సంపుటం సంపాదకులు డాక్టర్ బిరుదురాజురామరాజు, డాక్టర్ పుల్లా పరబ్రహ్మ శాస్త్రిగార్లకు, సంగ్రాహకులు శ్రీయుతులు చీమకుర్తి శేషగిరిరావు, యార్లగడ్డ ఆంజనేయులు గార్లకు, కొమర్రాజు లక్ష్మణరావుగారి మనుమడు శ్రీ కె. వి. లక్ష్మణరావుకు తెలుగు విశ్వవిద్యాలయం జ్ఞాపికలు బహూకరించారు. ఆవిష్కరణోత్సవ సభకు అధ్యక్షత వహించిన తెలుగు విశ్వవిద్యాలయం కులపతి డాక్టర్ తూమాటి దొణప్ప ప్రారంభంలో అందరికీ స్వాగతం చెబుతూ, విశ్వవిద్యాలయం లక్ష్యాలను వివరించారు. కృష్ణాజిల్లా కూచిపూడిలో ఉన్న కూచిపూడి నృత్య సంస్థ శ్రీసిద్ధేంద్రయోగి కళాక్షేత్రం, రాజమండ్రిలోని గౌతమీ గ్రంథాలయం, త్వరలో తెలుగు విశ్వవిద్యాలయానికి అనుబంధ సంస్థలు కానున్నవని ప్రకటించగా, సభ్యులు హర్షధ్వానాలు చేశారు. తెలుగు విశ్వవిద్యాలయం కుల సచివులు శ్రీ ప్రసాదరావు ధన్యవాదాలతో ఆవిష్కరణోత్సవం సమాప్తమైంది. ప్రారంభంలో విజ్ఞాన సర్వస్వ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ ముదిగొండ వీరభద్రశాస్త్రి విజ్ఞాన సర్వస్వ లక్ష్యాలను వివరించారు.

మహా రాజశ్రీకి సన్మానం

బెర్ ట్రాండ్ రస్సెల్ గొప్ప రచయిత, గణితశాస్త్రజ్ఞుడు, వైజ్ఞానికుడు, తత్త్వవేత్త. ప్రపంచ సామరస్య శాంతులకోసం పాటుపడిన మహనీయుడు. భారతదేశం పట్ల బ్రిటిష్ వారి విధానాలకు నిరసనగా, సర్ మొదలయిన బ్రిటిష్ బిరుదులను వదులుకొన్న ధీరుడు. అతని సిద్ధాంత ప్రచారాల కోసం మిత్రులు మహారాజశ్రీ రస్సెల్ సంఘం స్థాపించి చాలా కాలంగా పాటు పడుతున్నారు. ఆయనకు యువకళావాహిని వంటి సంస్థలూ సహకరిస్తున్నాయి. రస్సెల్ 116వ జయంతి సందర్భంగా యువ కళావాహిని మే 19న ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ ఎం. చెన్నారెడ్డి 'కాస్మిక్ కంప్యూటర్ స్పీక్స్' అనే గ్రంథాన్ని ఆవిష్కరిస్తూ, అగ్రరాజ్యాలయిన సోవియట్ యూనియన్, అమెరికాలకు పరమాణుశక్తి మారణాయుధాల పోటీని అదుపు చేయడంలో అత్యధికమైన బాధ్యత ఉన్నదని అన్నారు. ప్రపంచంలో శాంతి రక్షణకు, మానవజాతి సంక్షేమానికి ఆధునిక దేశాలన్నీ రస్సెల్ ఆలోచనా సరళిని, తత్త్వాన్ని అలవరచుకోవాలని ఆయన సూచించారు. ఈ గ్రంథాన్ని మహారాజశ్రీ పలువురు మేధావులు చేసిన రస్సెల్ స్మారక ప్రసంగాల భాగాలతో సమకూర్చారు. సభకు అధ్యక్షత వహించిన రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం కులపతి డాక్టర్ సి. నారాయణరెడ్డి తమ ప్రసంగంలో అణ్వస్త్రాలకు వ్యతిరేకంగా పోరాటం, ప్రారంభించిన బెరట్రాండ్ రస్సెల్ జీవిత విశేషాలను, రచనలను యువకులు స్వాయత్తం చేసుకోవాలని సూచించారు. ప్రొఫెసర్ ఆర్. వి. చంద్రశేఖరరావు, యువకళావాహిని అధ్యక్షుడు శ్రీ నాగేశ్వరరావు ప్రసంగించారు. వాస్తుశిల్పి శ్రీ బి. ఎన్. రెడ్డి మహారాజశ్రీని నూతన వస్త్రాలతో, శాలువతో సత్కరించారు. మహారాజశ్రీ కృతజ్ఞత తెలుపుతూ, రస్సెల్ ఆలోచనా మార్గం తప్ప మరొకటి ప్రపంచాన్ని పరమాణు యుద్ధం నుంచి రక్షింప జాలదన్నారు.

మే 19న బెర్‌ట్రాండ్ రస్సెల్ 116వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటయిన సభలో వాస్తుశిల్పి శ్రీ బి. యన్. రెడ్డి మహారాజశ్రీని సన్మానించారు.




సుందరయ్య సంస్మరణ

మార్క్సిస్ట్ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య తృతీయ వర్ధంతి సభలో ప్రజాశక్తి సంపాదకులు శ్రీ మోటూరి హనుమంతరావు ప్రసంగిస్తూ, శ్రీ సుందరయ్య ఆదర్శాలకు తమ పార్టీ కార్యకర్తలు అంకితం కావాలని అభ్యర్థించారు. కేవలం మార్క్సిజం, లెనినిజంల ద్వారానే దేశం అభివృద్ధి చెందగలదని, కాంగ్రెస్ పరిపాలనలో దేశం ఎన్నటికీనీ బాగుపడదని ఆయన నొక్కి చెప్పారు. మార్క్సిస్టు కమ్యూనిస్టుపార్టీ నగర కార్యదర్శి శ్రీ రఘుపాల్ ప్రారంభంలో స్వాగతం చెప్పారు. శ్రీయుతులు మోటూరి ఉదయం, రఘునాథ్‌రెడ్డి, బుద్ధరాజు రామం, పర్సా సత్యనారాయణ, వెంకటాచారి, రామకోటేశ్వరరావు ప్రసంగించారు.

ఉపశ్రుతి:

శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావుగారు పోషకులయిన బ్రిటిష్ విజ్ఞాన సర్వస్వం దాదాపు 30 పునర్ముద్రణలు, శ్రీ కొమర్రాజు లక్ష్మణరావుగారు ప్రారంభించిన మహారాష్ట్ర విజ్ఞాన సర్వస్వం దాదాపు పది ముద్రణలు, 1947లో తెలుగు విజ్ఞాన సర్వస్వంతోనే ప్రారంభమైన తమిళ్ విజ్ఞాన సర్వసం- తమిళ కలై కలంజియం మూడు నాలుగు పునర్ముద్రణలు పొందిందని విన్నాను. మరి తెలుగు విజ్ఞాన సర్వస్వం మొదటి పదహారు సంపుటాలు ఇంకా పూర్తి కాలేదే! కారణమేమిటండీ?- అని అడిగారు నన్ను ఒకరు ఒక సభలో. స్లో అండ్ స్టడీ విన్సుది రేస- అనేది వారి పాలిసీ కామోసు! అన్నారు నాపక్కన ఉన్నవారు. □


ఎ. ఆనంద్


కర్తార్‌సింగ్


గీత్‌సేఠీ


ఖజన్‌సింగ్

క్రికెట్ అంటే వ్యామోహం ఇతర క్రీడలంటే నిర్లక్ష్యము ఎందుకు?

ఒక్కొక్క ఆట అంటే కొందరికి అభిమానం. తాము అభిమానించే ఆట యందు ఆసక్తి చూపటంలో తప్పు లేదు. కాని దానివలన యితర ఆటల్లోని ప్రతిభావంతులను గుర్తించక అవమానించటం సరికాదు. క్రికెట్ అంటే వెర్రి వ్యామోహం ఎంతో కనిపిస్తూంది. క్రికెట్ వ్యామోహము వలన ప్రజలు, పత్రికలు మన దేశంలో యితర ప్రతిభా వంతులకు, ప్రపంచ విజేతలకు సహితం సరియైన ప్రశంసలు అందించక అవమాన పరుస్తూన్నారు. అఖండ విజయాలు సాధించి ప్రపంచ క్రీడారంగములో భారత దేశానికి ఎంతో గౌరవం కూర్చిన వారిని కనీసం మనం అభినందించక పోవటం మనల్ని మనమే అవమానించు కొన్నట్లు అవుతూంది. ఇదే పరిస్థితి కొనసాగితే యితర క్రీడల పరిస్థితి ఏమవుతుంది?


మన దేశీయ క్రీడలు కబాడీ, కో-కో, బాల్ బాడ్మింటన్‌లు ఆడటం అవమానముగా మనము భావిస్తున్నాము. విశ్వనాధ్ ఆనంద్ గ్రాండ్ మాష్టర్ చెస్ టైటిల్ గెల్చి స్వదేశము తిరిగి వచ్చినప్పుడు ఘన స్వాగతం లభించ లేదు. మారుతీ, స్టాండర్డ్ 2000 కారులు బహుమతిగా యివ్వబడ లేదు. గ్రాండ్ మాష్టర్ టైటిల్ గెల్చిన ప్రథమ భారతీయ్యుడు ఆనంద్. జి. ముత్తుస్వామి, యం. ఎ. మాణిక్యాలు కామన్‌వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ టైటిల్స్ గెల్చినప్పుడు కనీస ప్రచారము కూడా దక్కలేదు. మన మల్లయోధులు కర్తార్‌సింగ్, ఖజాన్‌సింగ్ మన పక్కనే వచ్చి కూర్చున్నా గుర్తించ గల స్థితిలో మనము లేము. బిలియడ్స్‌లో ప్రపంచ కిరీటం కైవసం చేసుకున్న గీత్‌సేఠీ, మైకెలిఫెరైరా, స్క్వాష్‌లు మెహర్‌వాన్ దారూవాలా, టి. టి.లో కమలేష్ మెహతా, సైకిలింగ్‌లో మాక్స్‌వెల్ ట్రైవర్ సాధించిన విజయాలు మనలో ఎంత మందికి తెలుసు. పత్రికలు ఎంతవరకు ప్రచారము చేసాయి?

క్రికెట్ రంజీట్రాఫీ జట్టులో సభ్యత్వము లభించగానే అనేక విధాలుగా కొనియాడే మనం విశ్వ విజేతలను గుర్తించక పోవడం అన్యాయం కాదా? ఇక మన భారత క్రికెట్ జట్టు సాధించిన విజయాలు ఏమిటి? రిలయన్స్ కప్ పోటీలో ఓటమి. అంతకు ముందు ఒకసారి వరల్డ్ కప్ గెలుపు. షార్జాకప్ రెండుసార్లు గెల్చాము.


మన దేశ జట్టుకు ఎంపిక కాబడిన హాకీ, ఫుట్‌బాల్, కుస్తీ, ఈత, బాక్సింగ్, ఎథలిటిక్స్ క్రీడాకారులకు శిక్షణ సమయములలో కనీస సౌకర్యములు ఉండవు. గుర్రాలశాలలు లాంటి పెద్ద గదులలో వారిని ఉంచుతారు. రోజుకు 30-40 రూపాయలు మించకుండా ఆహారము యిస్తారు. పోటీలకు వెళ్ళువరకు కనీస దుస్తులు లభించవు. అదే క్రికెట్ ఆటగానికి అయితే అయిదు నక్షత్రాల విలాస హోటళ్ళలో నివాసం, కావలసినంత పుష్టికరమైన విందు భోజనం ప్రతిపూటా లభిస్తాయి. పోటీలలో ఆడితే ఆధాయం, పత్రికలలో, టి. వి.లలో ప్రకటనల వలన ఎంతో లాభం చేకూరుతాయి.

1954 ఆసియా క్రీడోత్సవాలు మినహాయించి మన దేశం ఈతలో పతకాలు సాధించ గలమని ఆశ లేదు. జపాన్, చైనా వారితో పోటీపడ గల సమర్థత మనలో లేదు. ఖజాన్‌సింగ్ 1986 సియోల్ ఆసియా క్రీడలలో రజిత పతకముతో తృప్తి చెందక ఎంతో కృషి చేసి

మాక్స్‌వెల్ ట్రివర్


జి. ముత్తుస్వామి


కమలేష్ మెహతా


మెహర్‌వాన్ దారూవాలా


అవీ-ఇవీ-అన్నీ



కుమారి పల్లవి కెనడా పర్యటన

స్థానిక మేరీస్ స్టెల్లా కాలేజీ విద్యార్థిని కుమారి ముక్కామళ్ల పల్లవి మూడు నెలలపాటు కెనడా పర్యటనకై జూలై 29న ఢిల్లీ నుండి బయలుదేరి వెళ్ళింది.

బి. ఎ. ఫైనల్ చదువుతోన్న కుమారి పల్లవి ఇండియా-కెనడా యువజన బృందాల మార్పిడి పథకంక్రింద ఉత్తమ ఎన్. సి. సి. కేడెట్ హోదాలో భారత యువజన బృందంతో ఈ కెనడా పర్యటనలో పాల్గొంటున్నది.

స్వదేశం చేరిన తరువాత కుమారి పల్లవి కెనడా యువజన బృందంతో కలసి మరో మూడు నెలలు కర్నాటక, హరియానా రాష్ట్రాలు పర్యటిస్తుంది.

రచనల పోటీ

నెల్లూరు సోషియలాజికల్ స్టూడెంట్స్ క్లబ్ 4వ వార్షికోత్సవ సందర్భంగా విద్యార్థులు, 27 సం. వయసు లోపు ఉన్న విద్యావంతుల కోసం తెలుగు, ఇంగ్లీషు భాషలలో కథలు, కవితలు, కార్టూన్‌లు, జోకుల పోటీలని నిర్వహిస్తున్నది. వివరాలకి: కార్యదర్శి, సోషియలాజికల్ స్టూడెంట్స్ క్లబ్, ఎ. కె. నగర్, నెల్లూరు– 524004 అనే చిరునామాకి రాయవచ్చు.

మినీ కథల పోటీ

శ్రీ ముట్నూరి కృష్ణరాయ సాహితీపీఠం (విశాఖపట్నం) వారు మినీ కథల పోటీ నిర్వహిస్తున్నారు. రచనలు మూడు అరఠావులకి మించనివిగా, తెలుగు వాతావరణాన్ని, సంస్కృతిని ప్రతిబింబించేవిగా ఉండాలి. కాపీ రచనలు, అనువాదాలు పంపకూడదు. మొదటి బహుమతి రు. 116/-, రెండవ బహుమతి రు. 58/- లతోపాటు ప్రశంసా పత్రాలని అందజేస్తారు. మరో రెండు కన్సొలేషన్ బహుమతులు ఉంటాయి. రచనలని శ్రీ కొంకేపూడి, ప్రధాన కార్యదర్శి, శ్రీ ముట్నూరి కృష్ణరాయ సాహితీ పీఠం, 2-4ఎ-6, ఎం. వి. పి. కాలనీ, విశాఖపట్నం- 530017 అనే చిరునామాకి 31-10-88 లోగా పంపవచ్చుని నిర్వాహకులు తెలియజేస్తున్నారు.

శ్రీ విశ్వనాథ సాహిత్య పీఠము ఉత్తమ సాహిత్య విమర్శల పోటీ

కాకినాడలో శ్రీ విశ్వనాథ సాహిత్య పీఠం ఆధ్వర్యాన విశ్వనాథ వారి 'మా స్వామి'– 'ఆంధ్ర ప్రశస్తి', అనే అంశంపై ఉత్తమ సాహిత్య విమర్శల ఎనిమిదవ పోటీని నిర్వహిస్తున్నది. ఉత్తమ సాహిత్య విమర్శకునకు రు. 1116/– నగదు బహుమతి దుశ్శాలువా, మొమెంటో లతో లభిస్తుంది. ఇంతకు ముందు ప్రచురించని, అరఠావు సైజులో 300 పేజీలకు తక్కువకాని వ్యాసాలు రెండు ప్రతులు శ్రీ పేరాల భరతశర్మ, శ్రీ విశ్వనాథ సాహిత్య పీఠము, 24-8-5/2, లింగధారిపేట, రాజ్యలక్ష్మి థియేటర్ ఎదుట, విజయనగరం – 531202 అనే చిరునామాకు రిజిస్టర్డు పోస్టులో కాని, స్వయంగా కానీ 1989 ఫిబ్రవరి ఒకటవ తేదీలోగా పంపాలి.

వెంకట్ అవార్డు కార్టూన్ల పోటీ

యువ వ్యంగ్య చిత్రకారుడు కీ. శే. 'వెంకట్' పేరిట అవార్డుల బహూకరణకై వ్యంగ్య చిత్రలేఖనంలో పదవ పోటీని హైదరాబాదులోని సాధన సమితివారు ప్రకటిస్తున్నారు. విజేతలకు ఉచిత రీతిన రొక్కం బహుమతులు అందజేస్తారు.

ప్రవేశ రుసుం లేదు. ప్రతి పోటీదారు ఏ విషయంమీదనైనా మూడు కార్టూన్ల వరకు పంపవచ్చు. అవి ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించటానికి అనువుగా 9x12 అంగుళాల సైజులో వుండాలి. పోటీదారు ఎగ్జిబిషన్ కోసం తమ్మ ఫోటో కూడా పంపవచ్చు.

కార్టూన్లతో పాటు అవి స్వీయ కల్పనలైనట్లు వాటిని ఇతరత్రా ఉపయోగించనట్లు ప్రకటిస్తూ హామీ పత్రాన్ని జత పరచాలి.

ఈ పోటీకి కార్టూన్లను 1988 సెప్టెంబరు 10వ తేదీ వరకు 'కార్యదర్శి, సాధన సమితి' 1-1-336/20. వివేకనగర్, చిక్కడపల్లి, హైదరాబాదు-500020' చిరునామాకు పంపవచ్చు. ◘

ఆసియా ఛాంపియన్ షిప్‌లో కాంస్య పతకము గెల్చాడు.

మొదటిసారిగా ఒలింపిక్ క్రీడలలో టేబుల్ టెన్నీసులో భారత దేశం ఆడే అర్హత పొందుటకు కమలేష్ మెహతా కారణము అనవచ్చును. జోర్గన్‌పర్సల్ (స్వీడన్), పీటర్ గ్విలిడ్స్ (ప. జర్మనీ) కరల్‌సన్ (స్వీడన్) లియాంగ్ జియలింగ్ (చైనా) మొ. పోటి ఆటగాళ్ళను ఓడించిన ఘనత కమలేష్ మెహతాకు ఉన్నది.

24 ఏళ్ళ బొంబాయి వాసి మెహర్‌వాన్ దారూవాలా స్క్వాష్ ఆటలో భారత దేశం కీర్తిని ప్రకాశింప చేసాడు.

హైదరాబాద్ నివాసి, ఆంగ్లోయిండియన్ మాక్స్‌వెల్ ట్రెవర్ సైకిలింగ్‌లో అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడు.

క్రికెట్ అంటే వ్యామోహం

జి. ముత్తుస్వామి 56 కిలోల విభాగం, యం. వి. మాణిక్యాలు 52 కిలోల విభాగములో కామన్‌వెల్త్ వెయిట్ లిఫ్టింగ్‌లో స్వర్ణపతక విజేతలు.

విల్సన్‌జోన్స్, మైకేల్ ఫెరైరా, గీత్‌సేఠీ ప్రపంచ బిలియర్డ్స్ ఛాంపియన్ షిప్ విజేతలు.

కర్తార్‌సింగ్, ఖజాన్ సింగ్ మన అగ్రగామి మల్లయోధులు అంతర్జాతీయ పోటీలలో విజేతలు.

విశ్వనాథ్ ఆనంద్ 18వ ఏట చదరంగంలో గ్రాండ్ మాస్టర్ సాధించిన ప్రప్రథమ భారతీయుడు.

అలాగే మన కబాడీ, కో–కో, బాల్‌బాడ్మింటన్ జట్లు వివిధ ఆసియా దేశాల్లో ఆడి ప్రశంసలు పొందుటయేగాక ఆ దేశాల్లో మన దేశీయ క్రీడా ప్రచారము చేసారు.


మరి వీరందరి గురించి మన క్రీడాభిమానులు ఎందుకు ఆలోచించరు? ప్రశంసించరు? క్రికెట్ ఒక్కటే ఆట కాదు. అధిక అభిమానము క్రికెట్‌పై చూపటమే యితర క్రీడలను నిర్లక్ష్యము చేయుటకు కారణము అవుతోంది. ఇది మన క్రీడాభివృద్ధికి మంచిది కాదు.

పి.టి. ఉష సాధించిన విజయాలను అందరూ ప్రశంసించారు. కాని ఆమెకు క్రికెట్ ఆటగాళ్ళకు లభించిన ఆదరణ, ప్రోత్సాహంలో నాల్గవ వంతు కూడా అందలేదు. మరి మన యితర ఆటగాళ్ళు విజయాలు సాధించలేదని బాధపడటం ఎందుకు? మన క్రీడాభిమానులు, పత్రికలు, వ్యాపార సంస్థలు ఆలోచించి అన్ని క్రీడలకు సమాన ప్రోత్సాహం అందించాలి.


–ముకరమ్

Printed and Published for Nageswara Rao Estates Private Ltd., by S. Nageswara Rao, at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada - 520 003. Acting Editor : M. Madhava Rao, Chief Editor : S. Radhakrishna.
Phones : Business : 61247, 61248, 75569 Editorial : 75667

నా ప్రపంచమే తలక్రిందులై పోయేది...



నేను న్యూ ఇండియాతో పంపుసెట్టు భీమా చేయించి వుండకపోతే



నా పంపుసెట్టు దొంగలెత్తుకొని పోయారు, కాని పని మాత్రం ఆగి పోలేదు ఎందుకంటే, న్యూ ఇండియా సహాయంతో కొత్త పంపుసెట్టు కొని పెట్టేసుకొన్నా

రైతుకు అతడి పంపుసెట్టు ఎంత విలువైనదో, అతడికీ, అతడి కుటుంబం వారికి బాగా తెలుసు. కాని అ పంపుసెట్టు కాలిపోతే, విరిగిపోతే. పాడైపోతే లేదా దొంగలెత్తుకు పోతే? అలాంటప్పుడు న్యూ ఇండియా ఎష్యురెన్స్ ఒక మంచి నేస్తంలా మీకు అధారంగా నిలుస్తుంది.

న్యూ ఇండియా ఎష్యురెన్స్ వారి పంపుసెట్టు భీమా

పంపు మోటారు యొక్క హార్స్ పవర్‌ను బట్టి, ఒక ఏడాదిలో 50 రూపాయల నుంచి 190 రూపాయల దాకా చెల్లిస్తే చాలు. దేశమంతటా న్యూ ఇండియా ఎష్యురెన్స్ వారివి దాదాపు 1000 కార్యాలయాలు వున్నాయి. ఎక్కువ వివరాలకోసం నేటే మీ ఏజెంట్‌ను కలవండి, లేదా మీకు దగ్గరలోని కార్యాలయానికి విచ్చేయండి.

న్యూ ఇండియా ఎష్యురెన్స్

జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అనుబంధ సంస్థ

పంపుసెట్టు భీమా–నష్టాలలో మీకు నమ్మకమైన ఆధారం!

R K SWAMY/NIA/3573/TEL

వారఫలం

9–9–1988 శుక్రవారం మొదలు 15–9–1988 గురువారం వరకు

★ **మేషం** : రచయితలకు, పత్రికాధిపతులకు, పత్రికా వ్యాసంగాన సతమతమయ్యే వారికి అనుకూల కాలం. కళారంగాన ప్రసిద్ధి ఏర్పడుట నిశ్చయం. అప్పులు ఊరక వసూలవుతాయా! కాళ్ళు అరుగ తిరగాలి. ఈ వారం ఆ ప్రయత్నాలు సానుకూలమే. స్త్రీలకు: వృత్తి పెంపునకు, వాహన సేకరణకు అనుకూలం.

★ **వృషభం** : శుభదాయక వారం. కళారంగాన సదవకాశాలున్నాయి. మీరు రచయితలా, యత్నించండి. చలన చిత్ర రంగానుభం గలదా! కృషి చేయండి. అనుకూల సమయమే. ఆదాయమున్నది. రాజకీయ రంగలంపటంతో పొత్తు పెట్టుకోకండి. స్త్రీలకు: ఉద్యోగ వృత్తులు అనుకూలం, ధనలబ్ధికి ఆస్కారం.

★ **మిధునం** : గత కొన్ని వారాలుగా 'వారఫలం' గ్రహించిన విధంగా లేదను కోకండి. మీకు క్రమాభివృద్ధి నందగల గ్రహచారం వృద్ధి నొందుచున్నది. వ్యాపారం ప్రారంభించండి. వ్యవసాయ రంగాభివృద్ధి తలపెట్టండి. ఇంట శుభ ప్రస్తావనలుంటాయి. 14, 15 తా. లందు బంధు మిత్ర సమాగమం ధనాభివృద్ధి.

★ **కర్కాటకం** : శుభదాయక వారం. మీ క్షేమాన్ని ఆశించిన వారు, మేలు కోరిన వారు, ధనం చేకూర్చగలిగిన వారు, మీ వ్యాపారాన్ని వృద్ధి నందించ గలిగిన వారు తటస్థ పడుతారు. గ్రహించి ఆకట్టుకో యత్నించండి. వారమంతా మేలే. కృషిలోపం చేయకండి. 10, 11 తా. లందు స్త్రీలకు యత్న కార్యసిద్ధి, అధిక లాభం.

★ **సింహం** : సభా గౌరవ మున్నది. ప్రజా రంగాన ప్రసిద్ధి యున్నది. రాజకీయాలందు అనుకూల మున్నది. పత్రికా రంగాన ప్రసిద్ధి యున్నది. ముందుగా యిలాటి విషయాలు తెలిసి కొనుట లాభమున్నది. స్త్రీల మూలకంగా ఆనందమే కాక, సహాయమున్నది. 14, 15 తా.లందు శుభ ప్రస్తావనలుంటాయి.

★ **కన్య** : క్షేమదాయకమైన సమయం. మీ వ్యాపారం సానుకూల మగుటకు ఆక్షేపణ లేదు. కుల గోత్ర ప్రశక్తి ఆశింపక నలుగురతో సమానంగా ఉండుటకు ఈ వారం యత్నించండి. చలన చిత్ర రంగాన ప్రసిద్ధి ఏర్పడుతుంది, గ్రహించండి. స్త్రీలకు: వలసినంత ఆదాయమున్నది. పంపిణీ దారులకు మేలైన వారం.

★ **తుల** : ఏది ఏమైనా మీరు రాజకీయాలందు చేసే పన్నాగం సానుకూల మవుతుంది. ఇంట శుభం జరిగే అవకాశమున్నది. సభా మర్యాదయున్నది. అప్రయత్న ధనలబ్ధి యత్న కార్యసిద్ధి. స్త్రీలకు: ఉద్యోగంలో అనుకూల మార్పు, శుభ కార్యాను కూలత.

★ **వృశ్చికం** : అప్పులిచ్చి యిబ్బంది పడుతారు. అనవసర వ్యక్తులతో ఏదో రకమైన యిబ్బందులకు గురి అవుతారు. రాజకీయాలందు అనుకూలత గలవారం. సుఖశాంతులున్నాయి. శుభ సమయమైనా, అధిక వ్యయం ఉండుటవలన బాధపడక తప్పదు. స్త్రీలకు: ఒకానొక వ్యవహారమందు మీ ఆశయం సిద్ధిస్తుంది, గ్రహించాలి.


★ **ధనుస్సు** : దూర ప్రాంతాల నుండి బంధు మిత్రులు రానున్నారు. ఆదాయమున్నది. అధికారమందు వృద్ధి యున్నది. సభా మర్యాదయున్నది. అభిమానించే వారుంటారు. మీ శక్తి సామర్థ్యాలు వికసింపనున్నవి. స్త్రీలకు: ధన కనక వస్తువాహనావకాశమున్నది. గ్రహించాలి.

★ **మకరం** : సభా మర్యాదయున్నది. పత్రికా గౌరవమున్నది. కళారంగానుకూలత యున్నది. చలన చిత్ర రంగానుకూలత యున్నది. రాజకీయాలందు అనుకూలత యున్నది. స్త్రీలకు: కుటుంబ వృద్ధి, సుఖశాంతులు, వా హన సౌఖ్యానుకూలతకు ఆస్కారం.

★ **కుంభం** : అనేక విధముల మేలైన వారం. సభా రంగాన అభివృద్ధి చేకూరగల వారం. మాటకు విలువ పెంపొందించుట గమనింప గలరు. సభా మర్యాద యున్నది. ఆదాయమందు అభివృద్ధి యున్నది. స్త్రీలకు: సభా గౌరవం. ఆదాయమందు వృద్ధి, ప్రయాణానుకూలత, గమనించాలి.

★ **మీనం**: సభా గౌరవమున్నది. రాజకీయంగా మేలున్నది. వృత్తి యందు అనుకూల మున్నది. విద్యా విషయంగా పెంపున్నది. ఆరోగ్యమందు వృద్ధి యున్నది. దీర్ఘ రోగులకు మేలైన సమయం. స్త్రీలకు : వృత్తి యందు వృద్ధి, చేసిన యత్నం ధన విషయంగా కలసి రావటం జరుగుతుంది. కళారంగాభివృద్ధి కొందరకు గ్రహించాలి.

–విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రి





అపార్థం

ఎమ్. హారా

"అదీ సంగతి" అంటూ గుబక్కున ఆగి కాఫీగ్లాసు అందుకున్నాడు ఆదిశేషయ్య.

"నిజంగానా అన్నయ్యా?" అనుమానంగా దీర్ఘంతీసింది జానకమ్మ.

"దీంట్లో ఎటువంటి తిరకాసులేదు. పార్వతికి ఉద్యోగం వూడింది. శివుడు సమ్మెలో వున్నాడు. జీతపురాళ్ళు సరిగ్గా వస్తేనే ఈ బ్రతుకులు తెల్లారడం అంతంతమాత్రంగా వున్న కరువు రోజులు. ఆ రాళ్ళు కూడా లేకపోతే ఇక పస్తులేగతిమరి. అందులో హైదరాబాద్‌లో కాపురమంటే మాటలా? నీళ్ళతో కడుపునింపుకుందామనుకున్నా పైసలు కావాలి" అని ఎత్తిపొడుస్తూ కాఫీ చప్పరించసాగాడు.

"వాళ్ళెంత పస్తులున్నా నీకేం లోటు చేయలేదుగా" బావమరిది వ్యంగం భరించలేక కోపంగా విసుక్కున్నాడు గరుడాచలం.

"ఏమాట కామాట చెప్పుకోవాలి. నాకేం తక్కువ చేయలేదు నీ కొడుకూ కోడలు. రాకరాక హైదరాబాద్ వచ్చాననని, బంగాళదుంపల వేపుడూ, కొబ్బరి పచ్చడీ, పప్పుపులుసు, గెడ్డపెరుగుతో నాకు కమ్మటి భోజనంపెట్టారు. మరి వాళ్ళేమో తోటకూర పులుసు నంజుకుంటూ ఒకే ఒక చపాతి తిని మజ్జిగతేట తాగి 'బ్రేవ్'మని తేన్చారు. వాళ్ళ నటనకి నా కళ్ళల్లో నీళ్ళుతిరిగాయి. నోటమాటరాలేదంటే నమ్ము బావా!"

"నమ్మక చస్తానా? పీకలదాకా మెక్కిన నీకు గొంతు పెగిలివుండదు. అయినా వాడేం పరాయివాడా? నీ మేనల్లుడేగా.... మేఘింకా చావలేదని, పంతాలకిపోయి పస్తులుండటం మంచిదికాదని, వాడిని మందలించలేదా" కసిరినట్లు విసుక్కున్నాడు గరుడాచలం.

"వాడికి నచ్చచెప్పే ఓపిక నా కెక్కడుంది? ఆ రోజు పగలంతా హైకోర్ట్పనిచూసుకుని ఉసూరుమంటూ శివుడి కొంపకి చేరేసరికి చీకటిపడింది. తీరా యింట్లోకి పోయిచూద్దునుగదా –" గబుక్కున ఆగి వక్కపొడి అందుకున్నాడు ఆదిశేషయ్య.

"ఇల్లంతా బోసిగావుందా?" చురుగ్గా అన్న జానకమ్మ మనస్సేదో కీడు శంకిస్తున్నది.

"లేదు. కొనడానికి బోలెడంత ధరపలికే, టి. వీ, ఫ్రిజ్, వి. సి. ఆర్, టు – యిన్ – వన్, ఎయిర్‌కూలర్ వగైరాలు అమ్మకానికి పెడితే తూకానికి కొంటామంటారు. కొనబోతే కొరివి, అమ్మబోతే అడవని వూరికే అన్నారా? అందుకే ఆ ఇల్లు నిండుగా, షోగ్గావుంది. శివ పార్వతులు మాత్రం చింతాకు ముఖాలతో వోల్టేజి తగ్గిన దీపాల్లా డిమ్ముగావున్నారు. నన్ను చూడగానే ముఖాలకి నవ్వు పులుముకుని ఆప్యాయత వొలకపోశారు. మాటల సందర్భంలో వాళ్ళిద్దరికీ ఉద్యోగాలు లేవని, ఆర్థిక యిబ్బందుల్లోవున్నట్లు పసిగట్టాను. వాళ్ళూ గుట్టుగానే వున్నారు. కాసేపు అదీ ఇదీ మాట్లాడి, ఇప్పుడేవస్తానంటూ, సంచీ తీసుకుని, బయట కెళ్ళాడు శివుడు." అంటూ ఒక్కక్షణం ఆగి బిగ్గరగా శబ్దంచేస్తూ వక్కపొడినమలసాగాడు.

"అతిథి దేవో భవః అని ఏడ్చే దేశంలో పుట్టినవారికి ఇటువంటి తిప్పలు తప్పవుమరి. తాను అసలు తిన్నా, తినకపోయినా తద్దినాలు తప్పవుగా" గడుసుగానే ఈసడించాడు గరుడాచలం.

"మా కోడలు కలుపుగోలుతనంగా వుంటుందా? మనలో కలిసిపోతుందా?" కుతూహలంగా అడిగింది జానకమ్మ.

గరుడాచలం, జానకమ్మల ఏకైకసంతానమే శివుడు. ఆ మేనల్లుడికి తన కూతుర్నిచ్చి అంటగట్టాలని శతవిధాల ప్రయత్నించి విఫలుడైనాడు ఆదిశేషయ్య. కేవలం అధిక కట్నంకోసం పరాయి సంబంధాల కెగబడ్డాడు

అపార్థం

గరుడాచలం.

హైదరాబాద్‌లో ఉద్యోగం వెలగబెడుతున్న శివుడు, పక్కింటి పార్వతిని ప్రేమించి పెళ్ళికి సిద్ధపడ్డాడు. ఆ కులాంతర, వర్ణాంతరవివాహానికి ససేమిరా అంగీకరించలేదు అతని తల్లి దండ్రులు. పైగా శాపనార్థాలు పెట్టారు. చస్తామని బెదిరించారు. అయినాపెద్దల ఆశిస్సులు లేకుండానే పెళ్ళిచేసుకున్నాడు శివుడు.

తమ మాట వినలేదని అలిగి కొడుకు యింటి గడపతొక్కలేదు గరుడాచలం, జానకమ్మ. పంతం బట్టిన శివుడు కూడా పెళ్ళయి పది నెలలుదాటినా తల్లి దండ్రుల దగ్గరకిరాలేదు.

"మీ కోడలు బహుగడుసు. ఇల్లుగడవడం కష్టంగావుందని నోటితో చెప్పలేదుగాని, గాస్ స్టౌవ్‌పై కునుకుదీస్తున్న పిల్లినితరిమింది. బాబయ్యగారూ.... వి. సి. ఆర్..లో ఇంగ్లీషు మూవీ మూగగా చూస్తారా? టి. వి. కథకి కాళ్ళు కదుపుతారా? రేడియోపాటకి తలూపుతారా? టేపరికార్డర్ సంస్కృత శ్లోకాలకి కునుకు దీస్తారా అంటూ గొప్పలకి పోయిందిగాని, తినడానికి యింట్లో ఏమిలేవని చెప్పలేదు. పైగా హాలీవుడ్ సినీ టాపిక్‌తో నన్ను వూదరగొట్టేసింది. అంతలో సరుకుల మూటతో వచ్చాడుశివుడు. వాడుమాత్రం తక్కువతిన్నాడా? మావయ్యా.... ఈ అయిల్ పెయింట్స్, పార్వతి వేసిందన్నాడేగాని, పోపు వేయడానికి యింట్లో నూనెలేదని చెప్పలేదు. ఈ డోర్‌కర్టెన్ పార్వతి అల్లిందన్నాడుగాని, పచ్చిమంచినీళ్ళతో కడుపునింపుకుంటున్నామని చెప్పలేదు. చివరికి ఎలాగైతేనేం నా వొక్కడికి దండిగా వడ్డించి, వాళ్ళేమో గుటకలుమింగారు".

అలాగే చెప్పిదే చెబుతూ, నా కూతుర్ని కాదన్నందుకు మీ అబ్బాయికి తిండే కరువయిందని, దెప్పిపొడుస్తూ తన అక్కసునంతా తీర్చుకుని వెళ్ళిపోయాడు ఆదిశేషయ్య.

ప్రశ్న గుర్తుల్లా మిగిలారు గరుడాచలం, జానకమ్మ. కొడుకు కడుపుకాలిపోతున్నదని వినగానే తల్లి పేగు తట్టుకోలేకపోయింది. చేజేతులా వంశాంకురాన్ని బలిచేయడానికి తండ్రిమనసు వెనకాడింది.

పూర్వపు పట్టుదలలకీ, పట్టింపులకి స్వస్తిపలికారా దంపతులు. కొడుకుతో రాజీకి సిద్ధపడ్డారు. కోడల్ని ఆదరించాలని నిశ్చయించుకున్నారు.

ఇక ఆలశ్యంచేయలేదు. ఆర్థికంగా అనారోగ్యవంతుడైన కొడుకుని ఆదుకోవాలని హైదరాబాద్‌కి వచ్చారు గరుడాచలం, జానకమ్మ.

ఆనందాశ్రువులతో తల్లి దండ్రుల్ని ఇంట్లోకి ఆహ్వానించాడు శివుడు. అత్తమావల కాళ్ళపైపడి 'ఇన్నాళ్ళకి మాపై దయకలిగిందాని' కళ్ళు తుడుచుకుంది పార్వతి.

"నేనేం కసాయినికాదు. కార్చుముక్క రాస్తే ఎం. ఓ. చేసేవాడిని. మీకీ కన్నీళ్ళు తప్పేవి. నేను సంపాదించేదీ, బ్రతికేది మీకోసమే...." అన్నాడు గరుడాచలం పశ్చాతాపంతో.

తండ్రిమాటలకి తెల్లబోయిన శివుడి పొట్ట నిమురుతూ "కడుపునిండా తిని ఎన్నాళ్ళయిందిరా? నీ కిష్టమని సున్నుండలు తెచ్చాను. మొహమాట పడకురా అంతా మావయ్య చెప్పాడు" అంటూ ఆదిశేషయ్య వాగుడు వివరించింది జానకమ్మ.

అసలువిషయం అర్థమయిన శివుడు మందహాసవదనంతో అన్నాడు.

"పార్వతి లాంగ్‌లీవ్‌లో వుంది. నేను నాలుగు రోజులు సమ్మెలోవున్నాను. అయినా డబ్బుకీ, తిండికి మాకేం లోటులేదు. మాపర్సనాలిటీ చూస్తున్నారుగా? గత పదినెలలుగా బాగా తినితిని దున్నపోతుల్లా బలిశాం. బాగా వొళ్ళుచేశాం. మా శరీరాన్ని మేమే మోసుకోలేని దుస్థితికి వచ్చాం. ఇక లాభంలేదని, సన్నగా, ట్రిమ్‌గా తయారుకావడానికి డైటింగ్‌చేస్తున్నాం. నోరు కుట్టేసుకుని అర్థాకలితో వుంటున్నాం. ఆ రోజు మావయ్య వచ్చేటైంకి, ఎక్సర్‌సైజస్ చేసి మేం బాగా అలిసివున్నాం. మమ్మల్ని అపార్థంచేసుకున్నాడు మావయ్య. అసలు విషయం తెలిస్తే మావయ్య అటలుపట్టిస్తాడని, ఆకలి లేదంటూ చపాతి తిన్నాం. మేం కష్టాల్లో వున్నామని ఆయన అపోహపడ్డాడు. అంతా మనమంచికే జరిగింది. ఆయన పుణ్యమాని మనం కలుసుకున్నాం. ఇక శుభంమరి". □



సుమలత సమాధానాలు

ఎం. అంజయ్య, కోరాపుట్

ప్ర: ఏమండోయ్, శతచిత్ర సుందరిగారూ! నేనొక చిత్రాన్ని నిర్మించి, దానికి మిమ్మల్ని డైరెక్టర్‌గా చేయాలని అనుకుంటున్నాను. మీకు "స్టార్ట్... కట్" అనడం తెలుసా?

జ: ఎప్పుడనాలో కూడా తెలుసు.

జీనత్‌బేగం, మాంచిర్యాల

ప్ర: నిజం చేదుగా ఉంటుందంటారు. ఐతే, దాని విలువ ఎంత?

జ: కిలో ఆరు రూపాయలు. ఆ ధరకు ఇక్కడ కాకరకాయలు అమ్ముతున్నారు.

ఎం. గోపాలయ్య, నాయుడుపేట

ప్ర: ఇదేం అన్యాయమండీ. మా ఊరి ఆస్పత్రిలో డాక్టరుంటే మందులుండవు. మందులుంటే డాక్టరుండడు.

జ: మీ ఊళ్ళోని రోగులు చాలా అదృష్టవంతులన్నమాట!

కె. రేణుక, ధార్వాడ

ప్ర: సినిమాలలో నిరుపేదలు కష్టపడుతున్నట్టు చూపిస్తే, నా హృదయం ద్రవించిపోతుంది. కాని, రోడ్డులో ఎవరైనా బిచ్చగాళ్ళు కనిపిస్తే నా మనసు అంతగా చలించదు. కారణమేమిటి?

జ: సినిమాలలోని నిరుపేదల వల్ల మీ పర్సుకు ప్రమాదం ఉండదు గనుక.

జె. శ్యామల, శ్రీహరికోట

ప్ర: లతగారూ! నాలాంటి పాఠకుల చిలిపి ప్రశ్నలకు సైతం మీరిచ్చే చమత్కార పూరితమైన జవాబులు చదువుతూంటే నేనెక్కడో అంతరిక్షంలో తేలిపోతున్నట్లుండుటకు కారణమేమి?

జ: అవును మరి. మీరుంటున్నది రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపే ప్రదేశంలో నాయె!

జాస్తి విఠల్, యద్దనపూడి

ప్ర: మీ ఇంటి వెనుక తవ్వుతూంటే, లంకెబిందెలు కనిపించాయనుకోండి. అప్పుడు మీరెలాంటి అనుభూతి పొందుతారు?

జ: లంకెబిందెల సంగతి ఎవరికి కావాలి. తవ్విన చోట/నీళ్ళు పడ్డాయో- లేదో చూస్తాను. మద్రాసులో మంచినీటి ఎద్దడి అలా ఉంది మరి.

ఎం. మీర్‌హసన్, హన్మకొండ

ప్ర: సుమగారూ! సినిమా అనేది కళా? వినోదమా?, వ్యాపారమా?

జ: విమర్శకులకు కళ. ప్రేక్షకులకు వినోదం. నిర్మాతలకు వ్యాపారం.

కె. రాజశేఖర్, మణిపూర్

ప్ర: సినిమాకు సంబంధించిన విషయాల గురించే కాక మరేవేవో విషయాల గురించి కూడా పాఠకులు (రాళ్ళు) మిమ్మల్ని ఎందుకు ప్రశ్నించెదరు?

జ: ఎలాంటి ప్రశ్నకైనా నేను తగిన జవాబు ఇవ్వగలనన్న దృఢ విశ్వాసం వారికి ఉండడం వల్లనేమో!

నిమ్మల సత్యానంద్, పాలకొల్లు

ప్ర: మన చలన చిత్రములలో దుఃఖపు సన్నివేశములలో ఏడుస్తూ పాడుదురు. అది కూడా కళయేనా?

జ: శోక కళ.

అడ్డూరి మల్లయ్య, బుడంపాడు

ప్ర: సినిమా పరిశ్రమలో చేరిన తారలు కొందరు చెడిపోతురని మా బ్రదర్ నాతో వాదిస్తూంటాడు. నేను కాదంటాను. దీన్నిబట్టి మీరేమంటారు?

జ: మీకూ, మీ బ్రదర్‌కూ అభిప్రాయభేదాలున్నాయని.

బండి నారాయణస్వామి, టిక్కలి

ప్ర: నేనసలు అట్టే పత్రికలు చూడను. ఇటీవల ఒక రోజు ఆంధ్ర సచిత్ర వారపత్రిక చూశాను. మీ జవాబులూ చదివాను. మీరు కూడా జవాబుల్లో బాగా జోక్ చేస్తారల్లే ఉందే?

జ: మీరు కూడా బాగా ఎంజాయ్ చేస్తారల్లే ఉందే!

సి. రామలింగయ్య, విజయవాడ

ప్ర: మంత్రులు ఒక ఊరిలో చెప్పిన మాటను పక్క ఊరికి వెళ్ళేలోగానే మరచిపోతుంటారేమిటండీ?

జ: ఇంకా నయం. ఆ ఊళ్ళోనే మరిచారు కాదు. అంతవరకు సంతోషించాల్సిందే. □

కూపన్

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

సుమలత సమాధానాలు


ప్రశ్న..

....

....

పంపినవారి పేరు...

పూర్తి చిరునామా...



నాకు నచ్చిన జోక్‌లు – బ్రహ్మానందం

"దయచేసి మీ పవిత్రమైన ఓటును నాకే వెయ్యాలి సుమండీ!"

"క్షమించాలి, సార్! ఇది వరకే ఇంకో పార్టీవారికి సపోర్ట్ చేస్తానని ప్రామిస్ చేశా."

"హి... హి... హి... మీ పిచ్చిగాని, రాజకీయాలలో ప్రామిస్ ఏమిటండీ నా బొంద. మీరు దయచేసి తప్పకుండా నన్నే ఆదరించి తీరాలి ఏమంటారు?"

"అలాగే... ప్రామిస్!"

★ ★ ★

"అగ్ని ప్రమాదానికి గురైన ఆ రచయిత్రి ఇంట్లో మంటలార్పడానికి ఫైర్ సర్వీస్ వారికి రెండు గంటలు పైగా పట్టిందట!"

"అలాగా! ఏమున్నాయట ఆమె ఇంట్లో?"

"తిరిగొచ్చిన రచనలు!"

★ ★ ★

నిర్మాత : "ఏమిటండీ, కవిగారూ! హీరోయిన్ తండ్రికి 'కరివేపాకు' అనే ఊతపదం పెట్టారు? హీరో తల్లి 'ఉల్లి మల్లి అవుతుందా' అంటుంది పదేపదే! 'నా నెత్తిన మిరియాలు నూరకు' అంటాడు హీరో తండ్రి? హాస్య నటుడు ప్రతి డైలాగ్‌లో నూ 'జీలకర్ర' అంటూంటాడు? నాకేం బోధపడడంలేదు!"

రచయిత : "మీరే కదండి చెప్పారు– డైలాగ్‌లలో బాగా మసాలా ఉండాలని?"

★ ★ ★

"ఏడాది క్రితం ఆ అమ్మాయి నిన్ను 'ట్యూబ్‌లైట్' అంటే, ఇప్పుడు బాధపడుతున్నావేమిట్రా?"

"దాని అర్థం ఇప్పుడేగా నాకు బోధపడింది?"

★ ★ ★

"అది సరే– మీ కారును కనీసం నలుగురైనా కలిసి దొంగిలించి ఉండాలని అంత కరెక్ట్‌గా ఎలా చెప్పగల్గుతున్నారు?"

"నలుగురైనా తోస్తేగాని, అది ముందుకు కదలదండి."

★ ★ ★

"శ్యామలను సోమూ, వెంకట్ పెళ్ళి చేసుకోడానికి కుతూహల పడుతున్నారు. వాళ్ళిద్దరిలో ఆమె భర్త అయ్యే అదృష్టవంతుడెవడురా?"

"ఆమె భర్త అయ్యేది వెంకట్ కావొచ్చు. ఐతే అదృష్టవంతుడు సోము."

★ ★ ★

"ఏమిట్రా అలా దిక్కులు చూస్తున్నావ్?"

"నాకేం పాలు పోకుండా ఉందిరా. నిన్న రాత్రి మా మేనేజర్ అత్తగారు గటుక్కుమన్నారు. ఫోన్‌లో ఆయన విచారంలో భాగం పంచుకుంటున్నానని చెప్పాలో, లేక– ఆయన ఆనందంలో పాలు పంచుకుంటున్నానని చెప్పాలో తెలిసేద్వక అఘోరిస్తున్నానురా."

★ ★ ★

"హవ్వ! అలా చూడండి. మన అమ్మాయి ఏ కుర్రకుంక వెనకాల స్కూటర్‌లో కూర్చుని వస్తోంది. వెంటనే వెళ్ళి మీరా కుర్ర వెధవకు ఘాటుగా ఒక వార్నింగ్ ఇచ్చి రండి"

"అలాగే."

"ఏమని వార్నింగ్ ఇస్తారు?"

"హెల్మెట్ లేకుండా అమ్మాయిని స్కూటర్‌లో కూర్చోబెట్టుకోవద్దని."

"రామ రామ... నా ఖర్మ కొద్దీ దొరకారండి మీరు.

సేకరణ : జి. వి. జి



నాకు నచ్చిన జోక్‌లు

— శ్రీలక్ష్మి

"అయ్యా, నా కేదైనా పని ఇప్పించండి"

"ఇక్కడేపని లేదు పోవయ్యా!"

"పోనీ- మీ తోటలో పనికిరాని ముళ్ళ పొదలను నరికే పని అయినా ఇప్పించి, పుణ్యం కట్టుకోండి."

"ఆ అనుభవం నీకుందా? ఇదివరకు ఎక్కడ పని చేశావ్?"

"రాజస్థాన్ ఎడారిలో"

"ఆ ఎడారిలో ముళ్ళపొదలుంటా యేమిటీ?"

"ఇప్పుడెందుకుంటాయ్— అంతా నేను నరికేస్తే?"

★ ★ ★

"అయ్యా! ధర్మం సెయ్యండి బాబూ! నాలుగు రోజులుగా కడుపు మలమల మాడిపోతోంది"

"పో-పో... ఇది ఆస్పత్రి"

"ఐతే అజీర్ణంగా ఉంది. రెండు మాత్రలిచ్చి పుణ్యం కట్టుకో బాబూ!"

★ ★ ★

"మా ఇంట్లో తాతల కాలంనాటి బేడ కాసు ఉంటే, దాన్ని ఉదయం మా చంటాడు కాస్తా మింగేశాడు"

"అరే! వెంటనే ఏ డాక్టర్ దగ్గరికైనా తీసుకెళ్ళి ఆ నాణేన్ని బయటకు తీయించకపోయారా?"

"ఏం ప్రయోజనం? ఆ బేడ ఇప్పుడు చెల్లదుకదా?"

★ ★ ★

"మర్యాదగా ఇనప్పెట్టి బీగాలు ఇస్తారా— లేకపోతే పక్కింట్లో చేసినట్లు చేయనా?"

"వద్దు బాబూ! ఇవిగో బీగాలు... ఇంతకీ పక్కింట్లో ఏం చేశావు?"

"వాళ్ళు పోలీసులకు ఫోన్ చేస్తామని బెదిరించేసరికి ఇలా పారిపోయివచ్చా."

★ ★ ★

"ఏమిటి బాబూ రెండు ముళ్ళే వేశావు?"

"ముప్పైవేలు కట్నమిస్తానని ఇరవైవేలే ఇచ్చారు. మిగతా పదివేలు ఇచ్చినప్పుడు ఆ మూడో ముడి వేస్తాలెండి"

★ ★ ★

"ఏమిటోయ్, నీ చేతి గోళ్ళను ఎవరు తీస్తారు!"

"మా ఆవిడ"

"మా ఇంట్లో నా గోళ్ళు నేనే తీసుకోవాలి. నువ్వెంత అదృష్టవంతుడివిరా!"

"మరేమో-పాత్రలకు గిన్నెలకు గీతలు పడతాయని మా ఆవిడ భయం"

★ ★ ★

"మీవాడి ప్రవర్తన మంచిదనడానికి ఋజువేమిటి?"

"సత్ప్రవర్తనవల్లే వాడి శిక్షాకాలం తగ్గించబడి, ముందుగా బయట కొచ్చాడు"

★ ★ ★

"నువ్వు రాసిన లవ్ లెటర్ మా అమ్మ కళ్ళబడింది మోహన్"

"గుడ్‌గాడ్! ఏమంది మీ అమ్మ?"

"నీ దస్తూరీ బావుందట. తను చిత్తుగా రాసిన సీరియల్ నవలను నువ్వు ఫేర్ చేస్తావేమో కనుక్కోమంది"

★ ★ ★

"ఏమిటండీ మరీనూ - ఈ కుక్క ఖరీదు ఎనిమిదొందలా?"

"ఇది ఎంత విశ్వాసం గలదో మీకే తెలుస్తుంది"

"ఎంత విశ్వాసం గల దేమిటి?"

"ఇంతవరకు దీనిని కనీసం పది మందికైనా అమ్మి ఉంటాను. మళ్ళీ నా దగ్గరికే తిరిగొచ్చేసింది!"


-సేకరణ : జి. వి. జి.

నోటి దుర్వాసన పారద్రోలండి. దంతక్షయాన్ని ఎదుర్కోండి.




కోల్గేట్ రక్షణ చక్రాన్ని పొందండి!

నోటి దుర్వాసన మిమ్మల్ని నలుగురిలో ఇబ్బంది పెట్టేస్తుంది. మీ నోటి శ్వాస శుభ్రంగా, తాజాగా, మీ పళ్లు దృఢంగా, ఆరోగ్యంగా వుంచుకోడానికై క్రమం తప్పక కోల్గేట్‌తో బ్రష్ చేసుకోండి. కోల్గేట్ రక్షణ చక్రం చేసేది అదే మరి!



కోల్గేట్‌లోని అద్వితీయమైన శక్తిగల నురగ లోపలికి చొచ్చుకొనిపోయి, దుర్వాసన కల్గించే ఆహారకణాలను, దంతక్షయాన్ని కల్గించే సూక్ష్మక్రిములను తొలగిస్తుంది.



మీ పళ్ల సందుల్లో ఇరుక్కుపోయిన ఆహారకణాల్లో దుర్వాసన, దంతక్షయం కల్గించే సూక్ష్మజీవులు పెరుగుతాయి.



క్రమం తప్పకుండా కోల్గేట్‌తో పళ్లు బ్రష్ చేసుకోవడంతో మీరు శుభ్రమైన తాజా శ్వాస, దృఢమైన, ఆరోగ్యమైన పళ్లు, పొందగలరు.

Rediffusion/CP/5707 e TL



"ఓ భార్య కథ"లో జయసుధ

సినిమా విశేషాలు

తిరుపతిలో వసంత ఆర్ట్స్ ప్రొడక్షన్స్ ద్వితీయ చిత్రం

వరకట్నం విషయంలో ఒక యువతి దారుణమైన చిత్రహింసలతో చనిపోతుంది ఈ కేసు దర్యాప్తులో రాజకీయ జోక్యం మూలంగా స్థానిక పోలీసులు విఫలం కావడం, ఆ తర్వాత సి బి ఐ దర్యాప్తు సాగించి, దోషులను పట్టుకుని తీవ్రంగా శిక్షించడం ప్రధానాంశం 'ఒరు సి బి ఐ డైరీ కురుప్పు' అనే మళయాళ చిత్రం మాతృక రాజకీయ మధ్యవర్తిగా అల్లు రామలింగయ్య ఒక విశిష్టమైన పాత్రను నిర్వహిస్తున్నారు జూలై 20 నుంచి ఆగస్టు 15 వరకు తిరుపతి పరిసరాలలో షూటింగ్ పూర్తి చేసుకుంది అన్నారు వసంత ఆర్ట్స్ ప్రొడక్షన్స్ అధినేత డాక్టర్ వెంకటేశ్వరరావు ఈయన నిర్మిస్తున్న పై చిత్రంలో డాక్టర్ రాజశేఖర్, సీత, సత్యనారాయణ, దేవదాసు కనకాల, నారాయణరావు, చలసాని కృష్ణారావు సాక్షి రంగారావు, అరుణ్ కుమర్ ప్రభృత నటవర్గం. సత్యమూర్తి సంభాషణలు, లోకసింగ్ ఛాయ, చంటి శిల్పం, వెళ్ళస్వామి కూర్పుతో రవిరాజా పినిశెట్టి స్క్రీన్ ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహిస్తున్నారు.

గాంధీ జయంతి నాడు "నవభారతం"

"జీవితంలో జరిగిన అనుకోని సంఘటనలతో ముగ్గురు నిరుద్యోగ యువకులు తమకు తామే ఉద్యోగాలు కల్పించుకుని, ఒక గ్రామంలో ని ప్రెసిడెంట్ అరాచకత్వాన్ని ఆ గ్రామీణుల సాయంతో అరికట్టి, ఆ గ్రామాభ్యుదయానికి తోడ్పడుతారు. ఇది ప్రధానాంశం. పూర్తిగా ఒంగోలుకు దగ్గరున్న ధేనుమకొండ గ్రామంలో చిత్రీకరించాం," అన్నారు ముత్యాల సుబ్బయ్య. ఈయన స్క్రీన్ ప్లే, దర్శకత్వంలో పోకూరి బాబురావు సమర్పించే ఈతరం ఫిలింస్ వారి పై చిత్రంలో డాక్టర్ రాజశేఖర్, నరేష్, శుభలేఖ సుధాకర్, నూతన్ ప్రసాద్, రాఘవ, రాళ్ళపల్లి, పి. ఎల్. నారాయణ, సంజీవి, వాసు, సాయికుమార్, చలపతిరావు, నర్రా, వేలు, కల్పన, జీవిత, కె. విజయ, నిర్మల, ప్రియాంక, చంద్రిక, శ్రీకర్, ఏచూరి, గరగ, ప్రతాప్, జీవిత నటించారు. మరుధూరి రాజా కథ, మాటలు రాశారు. చక్రవర్తి సంగీతం, ఆర్. రామారావు ఛాయ, సోమనాథ్ శిల్పం, శివసుబ్రహ్మణ్యం – ప్రమీల నృత్యాలు, సాంబశివరావు సాహసాలు, యోగి సంయుక్త దర్శకత్వంతో చి. సుబ్బారావు ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్. పోకూరి వెంకటేశ్వరరావు నిర్మాత.

చూశావురా! చచ్చీ చెడి సినిమా చూడ్డానికి వస్తే - ఆటలు లేవంట!





"ఆగస్ట్ 15 రాత్రి"లో రంజని , శరత్‌బాబు

చిరంజీవితో సుబ్బరామిరెడ్డి సమర్పణలో మహేశ్వరి, పరమేశ్వరి ప్రొడక్షన్స్ చిత్రం

మొత్తం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతుంది నవంబర్ కల్లా పూర్తవుతుంది పోలీసు అధికారిగా, మరో పక్క రౌడీగా చిరంజీవి నటిస్తున్నారు, అన్నారు ప్రముఖ పారిశ్రామికవేత్త, కళాబంధు టి సుబ్బరామిరెడ్డి ఈయన సమర్పించే మహేశ్వరి – పరమేశ్వరి వారి తాజా చిత్రంలో శారద భానుప్రియ, రాధ, రావు గోపాలరావు, సత్యనారాయణ, గుమ్మడి అల్లు రామలింగయ్య నూతన్‌ప్రసాద్, సుధాకర్, హరిప్రసాద్ ప్రభృత నటవర్గం పరుచూరి సోదరులు కథ, సంభాషణలు సమకూర్చారు బప్పీలహరి సంగీతం, ఒస్ గోపాల్‌రెడ్డి ఛాయ, భాస్కరరాజు శిల్పం, తార నృత్యాలు, విజయన్ సాహసాలతో పద్మనాభం ప్రొడక్షన్ కంట్రోలర్ నవంబర్‌లో చిత్రీకరణ ముగుస్తుంది బి గోపాల్ దర్శకత్వంలో పి శశిభూషణ్, జగన్మోహన్ నిర్మాతలు జనవరి విడుదల

"ప్రజా తీర్పు"లో రాజా ఓర్పు

ఆ కొట్టుముందు 'స్టాకు లేదు' అన్న బోర్డు వ్రేలాడుతోంది మంగళగిరి (నర్రా) గోడౌన్ తాళం వేసి వెనక్కు తిరుగుతూ, ఎరువులై పోయాయి స్టాకు లేదు అన్నాడు అక్కడ నిలుచోనున్న రైతులతో

'మాకెవ్వరికీ ఎరువు లివ్వకుండానే స్టాకు లేదనడం అన్యాయం! అన్యాయం! అన్నాడొకరైతు

"నిన్నొచ్చారయ్. ఇవాళ అయిపోయాయ్." అన్నాడు మంగళగిరి.

రాజా (రాజశేఖర్) ట్రాక్టర్ దిగివస్తూ," మంగళగిరి! ఈ ఊళ్ళో ఎవరూ తీసుకోకుండానే ఎరువులై పోయాయా? మరి , వీళ్ళ సంగతేమిటి?" అన్నాడు.

"నన్నడిగితే నేనేం చెప్పనూ? ఒంగోలులో రైతులు ఆత్మహత్య చేసుకున్నారట. అంతకంటే నేనేం చెప్పలేను".

"మంగళగిరీ! నీలాంటి దళారీలు చేసే మోసాలకు రైతు ఆత్మహత్య చేసుకునే రోజులు పోయాయ్. హలం పట్టిన ఈ చేతులకి కలం పట్టడం కూడా తెలుసు. రైతుకు జరుగుతున్న అన్యాయాన్ని పది మందికి తెలియపర్చి, న్యాయం కోసం పోరాడతాం. అంతవరకూ రాకుండా మర్యాదగా గోడౌన్ తెరిచి ఎరువు లిస్తావా, లేదా?"

"ఉంటే కదా పంచడానికి? కావాలంటే స్టాకు లేదు– అన్న బోర్డు చూడు!"


"రేపు రాబోయే కోటా ఈ రోజే అమ్మినట్టు రశీదులు పుట్టించగల దొంగనక్కవి. మర్యాదగా పంచుతావా – లేదా?"

"లేదంటూంటే? ఏమిటీ దౌర్జన్యం?"

"ఇక నిన్నడిగి ప్రయోజనం లేదు!" అంటూ రాజా గోడౌన్ తాళం పగలగొట్టి, రైతులందరికీ ఎరువులు పంచాడు. మంగళగిరి లబోదిబో మని మొత్తుకుంటూంటే, అతన్ని ఇద్దరు రైతులు దూరంగా లాక్కెళ్ళారు. రాజాకు డబ్బు చెల్లించి, రైతులందరూ ఎరువులు తీసుకెళ్ళారు.

బండారు భాస్కరరాజా నిర్మించే వాసు ప్రొడక్షన్స్ "ప్రజా తీర్పు" చిత్రానికి పోతునేని కృష్ణ దర్శకుడు.

"రక్తాభిషేకం"లో బాలకృష్ణ



ఆంధ్రప్రతిక ప్రచురణ పిల్లల మాస పత్రిక బాలరంజని, గుంటూరు జేసీస్ సంయుక్త నిర్వహణలో గుంటూరు ఫ్యాన్సీ మర్చంట్ అసోసియేషన్ కళ్యాణ మండపంలో ఇటీవల అంటే ఆగస్టు 7వ తేదీ సాయంత్రం ఆహ్లాదకర వాతావరణంలో బాలల అందాల పోటీలు గుంటూరు చరిత్రలోనే రికార్డ్ సృష్టించినట్లుగా కన్నుల పండువుగా జరిగాయి.

సుమారు ఐదు గంటల పాటు జరిగిన ఈ పోటీలలో రికార్డు స్థాయిలో 350 మంది 6 ఏళ్ళలోపు బాల బాలికలు అత్యుత్సాహంగా పాల్గొన్నారు. వారితో పాటు వచ్చిన తల్లి తండ్రులు, మిత్రులతో సభా ప్రాంగణం క్రిక్కిరిసి పోయింది.

బాల రంజని విజేతలు

పోటీలనంతరం జేసీస్ అధ్యక్షలూ, హోటల్ విజయకృష్ణా ఇంటర్నేషనల్ మేనేజింగ్ డైరెక్టరూ అయిన శ్రీ పి. సి. ఆర్. రెడ్డి అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రధానోత్సవ సభలో స్థానిక మార్నింగ్‌స్టార్ పబ్లిక్ స్కూలుకు చెందిన ఫస్ట్ క్లాస్ విద్యార్థిని చి. దీపిక, అలాగే సెయింట్ ఇగ్నేషియస్ ఇంగ్లీషు మీడియం స్కూలుకు చెందిన ఎల్. కె. జి. విద్యార్థి చి. పి. వి. శ్రీకాంత్‌లు విజేతలుగా నిల్చి "బాలరంజని కిరీటాలు" అందుకున్నారు.





ముఖ్య అతిథి జాయింట్ కలెక్టర్ శ్రీ ఆర్. ఎం. గోనెల చి. శ్రీకాంత్‌ను "మాస్టర్ లిటిల్ బాలరంజని" టైటిల్‌తోను, శ్రీమతి ఉషా గోనెల చి. దీపికను మిస్ లిటిల్ బాలరంజని" టైటిల్‌తోను సత్కరించి కిరీటాలు ధరింప చేశారు. ఆ సమయంలో సభా ప్రాంగణం హర్షధ్వానాలతో మార్మోగింది విజేతలిద్దరినీ పూలమాలలతో ముంచెత్తారు.

సభా కార్యక్రమ విశేషాలు

శ్రీ పి. సి. ఆర్. రెడ్డి అధ్యక్షతన జరిగిన సభకు తొలుత కార్యదర్శి ఎర్రం సాంబిరెడ్డి స్వాగతం పల్కగా ప్రాజెక్ట్ డైరెక్టర్ గంధం కృష్ణ అతిథులను పరిచయం చేశారు.

అందమే ముఖ్యంగాదు. ఆరోగ్యం కూడ అందంతో పాటు అత్యవసరమని నేటి పోటీలు ఋజువు చేసాయని వక్తలు తమ ప్రసంగాల్లో పేర్కొన్నారు. తల్లితండ్రులు తమ పిల్లల ఆరోగ్యం పట్ల తగిన శ్రద్ధాసక్తులు చూపాలన్నారు.

సభలో జాయింట్ కలెక్టర్ శ్రీ ఆర్. ఎం. గోనెల,

(74 వ పేజీ చూడండి)


హృదయాలను రంజింపజేసే వస్త్రాల నిలయం
గార్డెన్, విమల్,
కరిష్మా, విచిత్ర,
బాంబేడయింగ్,
సరిత, గాంధిటెక్స్
వినయ్, అరవింద్,
కటావ్ వారి
ప్రఖ్యాత మిల్లువస్త్రాలు
మరియు ప్రఖ్యాతిగాంచిన అన్నిరకముల పట్టు వస్త్రాలు
శ్రీ కనక మహాలక్ష్మి సిల్క్స్
జగదాంబ సెంటర్, విశాఖపట్నం.